

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 248

బుధవారం 22-5-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




మళ్లీ నంబర్‌వన్ జోడీగా...

బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటిన సాత్విక్–చిరాగ్ ద్వయం - 12లో



డిజిటల్ ఎకానమీ పరుగులు

ఏటా 2.8 శాతం వృద్ధి.. కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వెల్లడి - 13లో



అది మోసగాళ్ల 'కూటమి'

విపక్షాల 'ఇండియా' కూటమిని మోసగాళ్ల కూటమిగా అభివర్ణించిన ప్రధాని మోదీ.. ఆ కూటమి నేతలు అవినీతిపరులని అన్నారు.

వివరాలు 6లో ▸



మోదీజీ.. ఇక చాలు

విద్వేష ప్రసంగాలతో విషం చిమ్ముతున్న మోదీ ప్రజాజీవితం నుంచి నిష్క్రమించడం మేలని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే అన్నారు.

వివరాలు 6లో ▸



విజయానికి చేరువలో 'ఇండియా'

ఒక్కో దశ పోలింగ్ పూర్తవుతున్న కొద్దీ ఇండియా కూటమి విజయానికి చేరువ వుతోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు.

వివరాలు 6లో ▸



విమానంలో భారీ కుదుపులు

లండన్ నుంచి సింగపూర్‌కు బయల్దేరిన విమానం మార్గమధ్యంలో భారీ కుదుపులకు లోనవడంతో వృద్ధుడు మరణించాడు.

వివరాలు 6లో ▸

అంతకు మించి అరాచకం!

ఓట్ల లెక్కింపు రోజు విధ్వంసానికి పచ్చ ముఠాల ప్లాన్

పోలింగ్ రోజు హింసకు మించి భయోత్పాతం సృష్టించే పన్నాగం

- కుట్రలపై పోలీసు శాఖను అప్రమత్తం చేసిన నిఘావర్గాలు
- రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు
- ఆ 3 జిల్లాలపై ప్రత్యేకంగా కన్ను
- గూండాలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు.. అంతా టీడీపీ మూకలే
- స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత
- రెడ్‌జోన్ల ఏర్పాటు.. నిషేధాజ్ఞలు విధింపు.. డ్రోన్ కెమెరాల వినియోగం నిషిద్ధం



సాక్షి, అమరావతి: ఎన్నికల హింసకు తెగబడ్డ పచ్చ ముఠాలు ఈ కుట్రలకు పదును పెడుతుండటం పోలీసు శాఖకు సవాల్‌గా మారింది. పోలింగ్ సందర్భంగా యథేచ్ఛగా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన టీడీపీ రౌడీ మూకలు ఓట్ల లెక్కింపు రోజు మరింత బరి తెగించేందుకు పథకం రూపొందించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇప్పటివరకు పోలీసులు అరెస్ట్ చేసిన వారితోపాటు అదుపులోకి తీసుకున్న వారిలో 75% మంది టీడీపీకి చెందిన వారే కావడం ఆ పార్టీ అధినేత చంద్రబాబు

మిగతా 13వ పేజీలో ▶

కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టం

ఓట్ల లెక్కింపు చేపట్టే కౌంటింగ్ కేంద్రాల వద్ద కూడా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్ని కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే అంశంపై ఈసీ ఇంకా తుది నిర్ణయానికి రాలేదు. రాష్ట్రంలో 33 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. లెక్కింపు త్వరగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాలను పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఈసీకి ప్రతిపాదించారు. పోలింగ్ సందర్భంగా హింసాత్మక ఘటనలు జరిగిన పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో ఓట్ల లెక్కింపు రోజు విజయోత్సవ ర్యాలీలను నిషేధించారు. ఓట్ల లెక్కింపు ముగిసిన తరువాత 15 రోజుల వరకు 25 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రంలోనే కొనసాగనున్నాయి.

వైఎస్సార్ జిల్లా పులివెందులలో నిర్మించిన వైద్య కళాశాల



మరో ఐదు మెడికల్ కాలేజీలు

కొత్తవి ఈ ఏడాదే ప్రారంభం..

అనుమతుల కోసం వైద్య శాఖ దరఖాస్తు

- త్వరలో ఎన్ఎంసీ తనిఖీలు
- ఒక్కో చోట 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి
- రూ.8,480 కోట్లతో కొత్తగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శ్రీకారం
- ఇప్పటికే ఐదు ప్రారంభం.. వచ్చే ఏడాది మరో 7 కొత్త మెడికల్ కాలేజీలు సిద్ధం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా మరో ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు 2024–25 విద్యా సంవత్సరంలో ప్రారంభం కానున్నాయి. ఈ దిశగా సీఎం జగన్ ప్రభుత్వం చేపట్టిన కసరత్తు తుది దశకు చేరుకుంది. పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లెలో కొత్తగా వైద్య కళాశాలలను ప్రారంభించి ఒక్కో చోట 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా రాబట్టేలా వైద్య శాఖ కసరత్తు చేస్తోంది. ఈమేరకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) త్వరలో ఐదు చోట్ల ఇన్‌స్పెక్షన్ నిర్వహించే అవకాశం ఉన్నట్లు వైద్య శాఖ వర్గాలు తెలిపాయి. తనిఖీలు పూర్తయిన అనంతరం ఆయా కళాశాలలకు

మిగతా 2వ పేజీలో ▶



కోల్‌కతాకే 'ఫైనల్' సత్తా

'ప్లే ఆఫ్స్' దశ వరకు తగిన ప్రదర్శన చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఇంకో అవకాశం కోసం ఎదురుచూడకుండా ఐపీఎల్ 17వ సీజన్‌లో నేరుగా ఫైనల్‌కు అర్హత సంపాదించింది. తొలి క్వాలిఫయర్‌లో కేకేఆర్ 8 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించింది. 12 లో



బాబు, లోకేశ్ పర్యటనల్లో

గోప్యమెందుకు?

- చంద్రబాబు ఏ దేశంలో ఉన్నాడో ఎల్లో మీడియాలో నైనా చెప్పొచ్చు కదా?
- ఏ కోర్టు అనుమతితో ఆయన విదేశాలకు వెళ్లాడు?
- అమెరికా రాలేదని ఆయన సొంత సామాజిక వర్గమే చెబుతోంది
- మంత్రి బొత్స సత్యనారాయణ

13 లో



'రాయదుర్గం'లో ఎన్ఐఏ సోదాలు !

- అనంతపురం జిల్లా రాయదుర్గంలోని ఉర్దూ పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ సాహెబ్ నివాసంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సోదాలు నిర్వహించింది. మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటల నుంచి 9 గంటల వరకు నాగులబావివీధిలోని అబ్దుల్ సాహెబ్ ఇంట్లో విచారణ చేశారు. అబ్దుల్ సాహెబ్ కుమారుడు సుహేల్‌ను అదుపులోకి తీసుకున్నారు.

14 లో



దారి మళ్లనున్న తుపాను!

ఆంధ్రప్రదేశ్‌కు ముప్పు లేనట్టే

బంగ్లాదేశ్ వైపు పయనించే అవకాశం

రాష్ట్రంలో మళ్లీ పెరగనున్న ఉష్ణోగ్రతలు

వచ్చే 3 రోజులు అక్కడక్కడ వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను దారిమళ్లి, రాష్ట్రం నుంచి దూరంగా వెళ్లనుంది. ఈ తుపాను ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం చూపుతుందని తొలుత భావించారు. అయితే తాజా వాతావరణ పరిస్థితులనుబట్టి అది బంగ్లాదేశ్ వైపు వెళ్తుందని తేలింది. దీంతో రాష్ట్రానికి తుపాను ముప్పు తప్పనుంది. ఈనెల 22న (బుధవారం) నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. అది 24 నాటికి వాయుగుండంగా, ఆపై తుపానుగాను బలపడుతుందని వాతావరణ సంస్థలు అంచనా వేశాయి. తొలుత వాయుగుండం వాయవ్య బంగాళాఖాతం వైపు పయనిస్తూ తుపానుగా మారితే దాని ప్రభావం కోస్తాంధ్ర, ముఖ్యంగా ఉత్తరాంధ్ర పైన ఉంటుందని పేర్కొన్నాయి. అయితే ఐఎండీ తాజా అంచనాల ప్రకారం .. అల్పపీడనం దిశ మార్చుకుని ఈశాన్య దిశగా కదులుతూ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారుతుంది. ఆ తర్వాత మరింత బలపడి అదే దిశలో బంగ్లాదేశ్ వైపు వెళ్తుంది. దీని ఫలితంగా ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. ఆంధ్రప్రదేశ్ తీరానికి మధ్య

మిగతా 14వ పేజీలో ▶

ఆక్వాలో అగ్రగామిగా ఏపీ

దేశ సగటుకు మించి ఏపీలో ఆక్వా దిగుబడులు

దేశ సగటు హెక్టార్‌కు 7.5 టన్నులు



- ఆంధ్రప్రదేశ్‌లో 8.8 టన్నులు.. ఒడిశాలో 4.1 టన్నులే
- దేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో 76 శాతం ఏపీలోనే
- రాష్ట్రంలో 71,900 హెక్టార్ల విస్తీర్ణంలో ఆక్వా ఉత్పత్తుల సాగు
- రాష్ట్రంలో రొయ్యల ఉత్పత్తి అత్యధికంగా 6,34,672 టన్నులు
- ఆక్వా ఉత్పత్తులు ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి ఏపీ, ఒడిశాల్లో అవకాశం
- అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక

2 లో



ఇక సులభంగా సేంద్రీయ ధ్రువీకరణ

- ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం కృషి
- ఆర్గానిక్ సర్టిఫికేషన్ జారీకి మార్గం సుగమం.. 3 ఏళ్ల క్రితం ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ఏర్పాటు
- ఇప్పటికే ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ జారీకి రాష్ట్రానికి క్యూసీఐ అనుమతి
- ఖరీఫ్ నుండి గ్యాప్ సర్టిఫికేషన్ జారీ చేస్తున్న ప్రభుత్వం
- మద్దతు ధరకు 3 రెట్లు ధర పొందుతున్న రైతులు
- తాజాగా ఆర్గానిక్ సర్టిఫికేషన్ జారీకి అథారిటీకి 'ఎపెడా' లైసెన్స్
- సేంద్రీయ ఉత్పత్తుల సాగు, ఎగుమతుల ప్రోత్సాహానికి దోహదం

2 లో

ఇదండీ సంగతి



అయితే ఆయన ఓటు కూడా మనకే వేస్తారు!!

అడవి బిడ్డల ఆనందం

బాగుపడుతున్న గిరిజన బతుకులు.. పెరుగుతున్న జీవన ప్రమాణాలు

ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలతో నిశ్చింత.. పోడు భూముల సాగుతో పోషణ

ఆదుకుంటున్న రైతు భరోసా

నల్ల మిరియాలు, కొండ చీపుర్లు లాంటి అటవీ ఉత్పత్తులకు ఊతమిస్తే మరింత మేలు

గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి: అడవిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజన తెగలు ప్రగతి బాటలో పురోగమిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాల జారీ, దేశంలో తొలిసారిగా ఏజన్సీ రైతులకు రైతు భరోసా లాంటి విప్లవాత్మక కార్యక్రమాలు గిరిజనాభివృద్ధికి ఊతమిస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, అటవీ సంపదతో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రెండు గిరిజన జిల్లాలను ఏర్పాటు చేసింది. అడవితో ముడిపడిన గిరిజనుల జీవితం అక్కడి నుంచే అభివృద్ధి చెందేలా బాటలు వేసింది. అటవీ ఉత్పత్తుల సేకరణతోపాటు వ్యవసాయం, పోడు భూముల సాగును ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తోంది. గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ తాజాగా నిర్వహించిన అధ్యయనంలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే నేతృత్వంలో

మిగతా 2వ పేజీలో ▶



అందరి కన్నూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లపైనే..

- 2019 ఎన్నికల్లో మొత్తం పోలైన ఈ ఓట్లలో ఐదో వంతు చెల్లనివే
- అప్పట్లో 2.95 లక్షల పోస్టల్ ఓట్లు నమోదైతే అందులో 56,545 చెల్లని ఓట్లు
- ఈసారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా 4.44 లక్షల మంది ఓటు
- అందులో చాలాచోట్ల గెజిటెడ్ అధికారి సంతకం లేకుండా ఓట్లు వేసినట్లు అనుమానాలు
- దీంతో చెల్లని ఖాతాలోకి ఎన్ని వెళ్తాయోనని రాజకీయ వర్గాల్లో చర్చ

14 లో

క్లుప్తంగా...

నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.203 కోట్లు విడుదల

ఆరోగ్యశ్రీ సీఈవో డాక్టర్ లక్ష్మీషా

సాక్షి, అమరావతి: ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.203 కోట్లు బిల్లు చెల్లింపులు చేపట్టినట్లు ఆరోగ్యశ్రీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) డాక్టర్ లక్ష్మీషా మంగళవారం తెలిపారు. మిగతా బిల్లుల చెల్లింపులు వీలైనంత త్వరగా చేపడతామన్నారు. ఆసుపత్రుల యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పథకం కింద పేద, మధ్య తరగతి రోగులకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.

గవర్నర్‌కు గుంటూరులో ఘనస్వాగతం


బొకేతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్

లక్ష్మీపురం: ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం గుంటూరు రైల్వేస్టేషన్‌కు విచ్చేశారు. గవర్నర్‌కు కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, రైల్వే డివిజన్ ఏఆర్ఎం సైమన్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డివిజన్ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు గవర్నర్ అభివాదం చేశారు. సాయంత్రం 5.20 గంటలకు శబరి ఎక్స్‌ప్రెస్‌లో గవర్నర్ నెల్లూరు బయల్దేరి వెళ్లారు.

కొండపి పొగాకు వేలంలో రికార్డు ధర

కిలో గరిష్ట ధర రూ.318


వేలంలో పాల్గొన్న వ్యాపారులు

కొండపి (సింగరాయకొండ): ప్రకాశం జిల్లా కొండపి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం రికార్డు ధర పలికింది. కిలో గరిష్ట ధర రూ.318 వచ్చింది. ఈ సీజన్‌లో పొగాకు వేలం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు అత్యధిక ధర ఇదే. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.257.97 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ ప్రకటించారు. అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకళ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 965 బేళ్లు వేలానికి తీసుకొని రాగా, 918 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 47 బేళ్లను తిరస్కరించారు. వేలంలో 23 మంది వ్యాపారులు పాల్గొన్నారు. పొగాకు గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని, అలాంటి బేళ్లకు వేలంలో అధిక ధరలు పొందవచ్చని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ రైతులకు సూచించారు.

కౌన్సిల్, కమిషన్ పదాలు వాడొద్దు

ప్రభుత్వేతర సంస్థలు/సంఘాలకు పౌరసరఫరాల శాఖ ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వేతర సంస్థలు/సంఘాలు తమ సంస్థ పేర్లలో కౌన్సిల్, కమిషన్ పదాలను ఉపయోగించడం చట్టవిరుద్ధమని పౌరసరఫరాల శాఖ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ హెచ్.అరుణ్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలు కౌన్సిల్, కమిషన్ పేర్లు పెట్టుకున్నట్టు తమకు ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. వాటిని వెంటనే తొలగించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2019 వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం జాతీయ, రాష్ట్ర, జిల్లా వివాదాల పరిష్కార కమిషన్‌లను వినియోగదారుల రక్షణ కోసం ప్రభుత్వ సంస్థలు మాత్రమే ఏర్పాటు చేయాలని సూచిస్తోందన్నారు. 1956 కంపెనీ చట్టం, ఇతర చట్టం పరిధిలో నమోదు చేసిన వినియోగదారుల సంఘం ప్రభుత్వ సంస్థగా పరిగణించడానికి వీలులేదన్నారు.

క్యాట్ ఉత్తర్వులను రద్దు చేయండి

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

సాక్షి, అమరావతి: కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఉత్తర్వులను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అవినీతి ఆరోపణలపై సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ గతంలో తాము ఉత్తర్వులు జారీ చేశామని, వీటిని రద్దు చేస్తూ క్యాట్ తీర్పు ఇచ్చిందని సర్కారు ఆ పిటిషన్‌లో పేర్కొంది. క్యాట్ ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ వ్యాజ్యాన్ని మంగళవారం దాఖలు చేశారు. వేసవి సెలవుల్లో అత్యవసరంగా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై హైకోర్టు ఈ నెల 23న విచారించనుంది. వెంకటేశ్వరరావు సస్పెన్షన్ రద్దు విషయంలో క్యాట్ పొరపాటు చేసిందని ప్రభుత్వం తన పిటిషన్లో పేర్కొంది.

ఇక సులభంగా సేంద్రీయ ధ్రువీకరణ

ఫలించిన రాష్ట్ర ప్రభుత్వం కృషి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సేంద్రీయ ఉత్పత్తుల నాణ్యత పెంచి, అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లడానికి ఐదేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలించింది. సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణకు పొరుగు రాష్ట్రాలపై ఆధారపడకుండా, రైతులకు వ్యయప్రయాసలను తొలగిస్తూ ఇకపై రాష్ట్రంలోనే ధ్రువీకరణ సర్టిఫికెట్ పొందొచ్చు. ఈ సర్టిఫికెట్ జారీకి సేంద్రీయ ధ్రువీకరణకు వ్యవసాయం, ఆహారశుద్ధి ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి అథారిటీ (ఎపెడా) ఏపీ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీకి అనుమతినిచ్చింది. ఫలితంగా సేంద్రీయ పంట ఉత్పత్తులకు రైతులు గిట్టుబాటు ధర పొందడంతో పాటు ఆ ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయి.

సర్టిఫికేషన్ ఉంటే 'ఏపీ'కి తిరుగే లేదు

ఏపెడా లెక్కల ప్రకారం సేంద్రీయ సాగులో మన దేశం 8వ స్థానంలో, ఉత్పత్తిదారుల సంఖ్యలో మొదటి స్థానంలో ఉంది. దేశంలో 1.07 కోట్ల ఎకరాల్లో సేంద్రీయ పంటలు సాగవుతున్నాయి. వాటిలో 65.73 లక్షల ఎకరాలు వాస్తవ సాగు ప్రాంతం కాగా, 41.51 లక్షల ఎకరాలు అటవీ ప్రాంతం. ధ్రువీకరించిన సేంద్రీయ ఆహార ఉత్పత్తులు 3.50 మిలియన్ మెట్రిక్ టన్నులు. వాటిలో రూ.7078 కోట్ల విలువైన 9 లక్షల టన్నుల ఆహార ఉత్పత్తులు ఇండియన్ ఆర్గానిక్ సర్టిఫికేషన్‌తో విదేశాలకు ఎగుమతవుతున్నాయి. పలు రకాల ఆహార, ఉద్యాన పంటలతో పాటు ఆక్వా ఉత్పత్తుల దిగుబడుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.

ధ్రువీకరణ ఇలా..

- సీజన్‌వారీగా ఇప్పటికే సాగయ్యే వ్యవసాయ, ఉద్యాన పంటలు (ఫీల్డ్ క్రాప్స్)కు 2 ఏళ్లు, పండ్ల తోటలకు మూడేళ్ల పాటు సాగు పద్ధతులను పరిశీలించిన తర్వాత ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఇస్తారు
- ఇప్పటికే గ్యాప్ సర్టిఫికేషన్‌తో పాటు వివిధ ఏజెన్సీల ద్వారా ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందే పంట ఉత్పత్తులకు రిజిస్ట్రేషన్ చేసుకుంటే నిర్దేశిత కాలపరిమితిలో ప్రమాణాలు పాటిస్తే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందే అవకాశం ఉంది
- సేంద్రీయ వ్యవసాయం కోసం తప్పనిసరిగా భూమిని మార్చాలి
- సేంద్రీయ పద్ధతుల్లోనే సాగు చెయ్యాలి
- ఇన్‌పుట్స్ అన్నీ సహజంగానే ఉండాలి
- కలుపు మొక్కల నివారణతో సహా తెగుళ్లు, వ్యాధులను సహజ పద్ధతుల్లో మాత్రమే నియంత్రించాలి
- 25 ఎకరాల లోపు సన్న, చిన్నకారు రైతులతో పాటు 25 ఎకరాలకు పైబడిన పెద్ద రైతులతో 25 నుంచి 500 మంది సభ్యులతో కూడిన రైతు సమూహాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రాసెసర్స్, రిటైలర్స్, ఎగుమతిదారులు ఎవరైనా సేంద్రీయ సాగు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు
- దశలవారీగా తనిఖీలు, పరీక్షల అనంతరం సర్టిఫికేషన్ ఇస్తారు
- వ్యవసాయ, ఉద్యాన పంట ఉత్పత్తులతో పాటు సమీప భవిష్యత్తులో అటవీ సేకరణలు, ఏపి కల్చర్, ఆక్వా కల్చర్, సముద్రపు నాచు, జల మొక్కలు, పుట్ట గొడుగుల ఉత్పత్తి, పశువుల ఉత్పత్తుల ప్రాసెసింగ్ అండ్ హ్యాండలింగ్, జంతువుల ఫీడ్ ప్రాసెసింగ్‌కు ఆర్గానిక్ సర్టిఫికేషన్ చేస్తారు.

అయితే రాష్ట్రంలోని ఉత్పత్తులకు సర్టిఫికేషన్ లేకపోవడం ఎగుమతులకు ప్రధాన సమస్యగా మారింది. దీంతో విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఆక్వా ఉత్పత్తులు, ఉద్యాన పంటలకు క్రాప్ సర్టిఫికేషన్ చేసుకునే రైతులు చాలా తక్కువ మంది ఉన్నారు.

మూడేళ్లలోనే ఏపీకి గుర్తింపు

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో 8.50 లక్షల ఎకరాలు సాగవుతున్నప్పటికీ, ఎపెడా లెక్కల ప్రకారం పూర్తిగా సేంద్రీయ పద్ధతుల్లో సాగయ్యే విస్తీర్ణం 60 వేల ఎకరాలే. దిగుబడులు 20వేల టన్నులు వస్తున్నాయి. బెంగుళూరుకు చెందిన ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ నిర్వహించిన సర్వేలో సర్టిఫికేషన్‌పై ఏపీ నుంచి ఏటా కేవలం రూ.130 కోట్ల ఎగుమతులే జరుగుతున్నాయి. నిర్దిష్టమైన పాలసీ, సర్టిఫికేషన్ సిస్టమ్ ఉంటే రూ.2 వేల కోట్లకు పైగా జరుగుతుందని అంచనా వేసింది. జాతీయ సేంద్రీయ ఉత్పత్తుల కార్యక్రమం (ఎన్‌పీఓపీ) కింద దేశంలో 37 సేంద్రీయ ధ్రువీకరణ సంస్థలున్నాయి. వాటిలో ఏపీ, తెలంగాణాతో పాటు 14 రాష్ట్ర ప్రభుత్వ, 23 ప్రైవేటు ఏజెన్సీలకు గుర్తింపు ఉంది. మూడేళ్లలోనే ఏపీకి ఈ గుర్తింపు లభించింది.

ప్రత్యేకంగా ఆర్గానిక్ సర్టిఫికేషన్ విభాగం

సేంద్రీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా సేంద్రీయ విధానాన్ని తీసుకొచ్చారు. ఎన్‌పీఓపీ నిర్దేశించిన అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సేంద్రీయ ఆహార ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేసి ధ్రువీకరించేందుకు ఏపీ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ (ఏపీఎస్ఎస్‌సీఏ)కి అనుబంధంగా 2021–22లో ఏపీ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ (ఏపీఎస్ఓసీఏ)ని ఏర్పాటు చేశారు. క్వాలిటీ మేనేజర్ పర్యవేక్షణలో జోన్‌కి ఒకరు చొప్పున ఇద్దరు ఎవాల్యుయేటర్స్, జోన్‌కి ఇద్దరు చొప్పున నలుగురు ఇన్‌స్పెక్టర్స్/ఆడిటర్స్‌ను నియమించారు. ఈ విభాగం ద్వారా తొలి దశలో పొలం బడులు, తోటబడుల ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్న రైతులకు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (గ్యాప్) సర్టిఫికేషన్, రెండో దశలో సేంద్రీయ సాగు పద్ధతుల్లో పండించే ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ జారీ చేయాలని సంకల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అవగాహన ఒప్పందం మేరకు క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) ఏపీ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీకి ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ జారీకి లైసెన్సు జారీ చేసింది. పొలం బడులు, తోట బడులు ప్రామాణికంగా 2023 ఖరీఫ్ సీజన్ నుంచి గ్యాప్ సర్టిఫికేషన్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సర్టిఫికెట్‌తో రైతులు మద్దతు ధరకంటే 2, 3 రెట్ల ఎక్కువ ఆదాయాన్ని పొందగలుగుతున్నారు.


ఇటీవల గ్యాప్ సర్టిఫికేషన్ జారీ కోసం అరటి పంటను పరిశీలిస్తున్న ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్‌అథారిటీ నిపుణుల బృందం

సర్టిఫికేషన్‌తో రైతుకు మేలు



సేంద్రీయ ధ్రువీకరణకు ఏపీ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ ఎపెడా గుర్తింపునిచ్చింది. 2027 వరకు లైసెన్సు జారీ చేసింది. ఆ తర్వాత మూడేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలి. ఈ గుర్తింపు ద్వారా నాణ్యమైన ఆహార ఉత్పత్తులకు ఉత్పత్తిదారుడి నుంచి వినియోగదారుని వరకు భరోసా లభిస్తుంది. రసాయన అవశేషాల్లేని ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను వినియోగదారులు పొందే వీలు కలుగుతుంది. మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపడడం, ఎగుమతులు పెరగడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. మొక్కలు, జంతువుల్లో జీవ వైవిధ్యతను కాపాడేందుకు సేంద్రీయ వ్యవసాయ సుస్థిరత, పర్యావరణ హితమైన ఆహార ఉత్పత్తుల సాగును ప్రోత్సహించేందుకు దోహదం చేస్తుంది.

–ఎ.త్రివిక్రమరెడ్డి, డైరెక్టర్, ఏపీ స్టేట్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ

మరో ఐదు మెడికల్ కాలేజీలు

▶ మొదటి పేజీ తరువాయి

అనుమతులు మంజురు కానున్నాయి. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లాగా చేయడంతో పాటు అన్ని జిల్లాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను పేదలకు అందుబాటులోకి తెస్తూ 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు సీఎం జగన్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 2023–24లో నంద్యాల, మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం, విజయనగరం వైద్య కళాశాలలను ఇప్పటికే ప్రారంభించారు. ఒక్కో చోట 150 చొప్పున మొత్తం 750 ఎంబీబీఎస్ సీట్లను అదనంగా అందుబాటులోకి తెచ్చారు.

ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా

ఐదు చోట్ల ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా వైద్య కళాశాలలు, బోధనాస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారు. వైద్య కళాశాలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 3,530 పోస్టులను మంజూరు చేశారు. అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, పాథాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఎస్పీఎం, జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్స్ విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు నర్సింగ్, మెడికల్, నాన్ మెడికల్, అడ్మినిస్ట్రేషన్ పోస్టులను మంజూరు చేసి భర్తీ కూడా చేపట్టారు. ఈ కళాశాలలన్నీ మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఉన్నందున పోస్టులన్నీ భర్తీ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భవిష్యత్తులో ప్రారంభించే 7 వైద్య కళాశాలలకు ఈ తరహా ఇబ్బందులు తలెత్తకుండా ఫ్యాకల్టీకి అదనపు ప్రోత్సాహకాలు కల్పించారు. పాడేరు, మార్కాపురం, పార్వతీపురం, పిడుగురాళ్ల, పెనుకొండ కాలేజీల్లో ఫ్యాకల్టీకి బేసిక్‌పై 50 శాతం ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. మైదాన ప్రాంతాల్లోని పులివెందుల, మదనపల్లె, ఆదోని, అమలాపురం, బాపట్ల, పాలకొండ, నర్సీపట్నం కళాశాలల్లో బేసిక్‌పై 30 శాతం ప్రోత్సాహకాన్ని అందించనున్నారు.

రూ.8,480 కోట్లతో మెడికల్ కాలేజీలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నాడు–నేడు ద్వారా రూ.16 వేల కోట్లతో వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసింది. ఇందులో రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గతేడాది ఐదు కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించింది. ఈ ఏడాది మరో ఐదు ప్రారంభం కానున్నాయి. మిగిలిన ఏడు వచ్చే ఏడాది ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. ఈమేరకు ఏడు చోట్ల ప్రభుత్వాస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేసేందుకు వీలుగా పడకల సంఖ్య పెంచుతూ వైద్య శాఖ నిర్ణయం తీసుకుంది.

అడవి బిడ్డల ఆనందం

▶ మొదటి పేజీ తరువాయి

ఇ.రవీంద్రబాబు, జి.చిన్నబాబు, నాగరాజు చిక్కాల రూపొందించిన నివేదికను గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుడు జె.వెంకట మురళి ఆవిష్కరించారు. గిరిజన యువత, కళాకారులు, నాయకులు, అధికారులతో సహా పలువురిని భాగస్వాములను చేశారు. ఆర్వోఎఫ్ఆర్, పీసా, 1 ఆఫ్ 70 చట్టాలు, గిరిజన జీవనోపాధి, సంప్రదాయ కళారూపాలు, అభివృద్ధి ప్రాంతాలను పరిశీలించడంతోపాటు గిరిజనులకు సంబంధించిన పలు పుస్తకాలను అధ్యయనం చేశారు.

సాగు.. నైపుణ్యాభివృద్ధి.. మార్కెటింగ్

పాడేరు, రంపచోడవరం, సీతంపేట సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలో 16 గ్రామాల్లో అధ్యయనం నిర్వహించి నివేదిక రూపొందించారు. సాగు, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ ద్వారా గిరిజనులకు మరింత మేలు చేయవచ్చని నివేదిక సూచించింది. పంటల సాగులో మెళకువలతోపాటు నైపుణ్యాభివృద్ధి చర్యల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొంది. నల్ల మిరియాలు, మిర్చి, కొండ చీపుర్లు లాంటి అటవీ ఉత్పత్తులు, సాగును ప్రోత్సహించడం ద్వారా గిరిజనుల జీవన ప్రమాణాలను పెంపొందించవచ్చని సూచించింది. ప్రధానంగా అత్యంత బలహీన గిరిజన సమూహాలైన (పీవీటీజీ) మూకదొర, భగత, కొండ దొర, సవర, కొండ రెడ్డి తెగల ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి ఆదాయం లభించేలా కొండ చీపుర్లు, గడ్డి పెంపకం, మార్కెటింగ్ నైపుణ్యాలపై శిక్షణ, అవగాహన కల్పించాలని నిర్దేశించింది. కాఫీ తోటల్లో అంతర పంటలుగా నల్ల మిరియాల సాగును ప్రోత్సహించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచవచ్చు. దీంతోపాటు మిర్చి రకాల సాగుపై అవగాహన పెంచడం, అధిక దిగుబడులు సాధించేలా పరిజ్ఞానాన్ని అందించడం, మంచి ధర దక్కేలా మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవడం ద్వారా గిరిజనులకు మరింత ఊతం ఇచ్చినట్టు అవుతుందని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అధ్యయనంలో పేర్కొంది.

అడవి బిడ్డలకు అండగా సీఎం జగన్

- గిరిజనులకు ముఖ్యమంత్రి జగన్ కొండంత అండగా నిలిచారు. నవరత్నాల సంక్షేమ పథకాలను అందించి ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు భూమిపై హక్కులు కల్పించి సాగుకు ఊతమిచ్చారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో గిరిజన కుటుంబాలకు ఏకంగా 3.22 లక్షల ఎకరాలను అటవీ హక్కుల చట్టం (ఆర్వోఎఫ్ఆర్) ప్రకారం పట్టాలు అందించడం దేశంలోనే రికార్డు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీకి దివంగత వైఎస్సార్ శ్రీకారం చుట్టగా సీఎం జగన్ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలతోపాటు డీకేటీ పట్టాలు పంపిణీ చేసి ఆ భూములను సాగులోకి తెచ్చేందుకు ఉపాధి హామీతో చేయూతనందించారు.
- దేశంలోనే తొలిసారిగా సీఎం జగన్ వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా 3,40,043 మంది గిరిజన రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నారు. 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, బిందు, తుంపర సేద్యం పరికరాలు సమకూర్చారు. అల్లూరి జిల్లాలో 2,58,021 ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్న దాదాపు 2,46,139 మంది గిరిజన రైతులకు అన్ని విధాలా అండగా నిలిచారు. కాఫీ తోటల సాగుకు సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, పెట్టుబడి సాయం, రుణాలు, యంత్రాలు లాంటివి అందించారు. అంతర పంటగా మిరియాల సాగుకు అవసరమైన పరికరాలు అందించారు. గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా అటవీ ఫలసాయం, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర దక్కేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అటవీ ఫలసాయం, వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ ధరల కంటే అధికంగా జీసీసీ చెల్లిస్తోంది. శ్రీశైలం, చిత్తూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గిరిజనుల ద్వారా సేకరిస్తున్న తేనెను రాజమహేంద్రవరం, చిత్తూరులోని జీసీసీ తేనె శుద్ధి కర్మాగారాల్లో శుద్ధి చేసి 'గిరిజన్' బ్రాండ్‌తో మార్కెటింగ్ చేస్తున్నారు. గిరిజన రైతులకు వ్యవసాయం, కాఫీ సాగుకు జీసీసీ రుణాలు అందచేస్తోంది.

అమెరికాలో తెలుగు మహిళకు అరుదైన గౌరవం

- కాలిఫోర్నియాలో శాక్రమెంటో సుపీరియర్ కోర్టు జడ్జిగా జయ నియామకం
- స్వస్థలం కృష్ణాజిల్లా మచిలీపట్నం


ప్రమాణస్వీకారం చేస్తున్న న్యాయమూర్తి బి.జయ

చిలకలపూడి (మచిలీపట్నం): అమెరికాలో తెలుగు మహిళకు అరుదైన గౌరవం దక్కింది. కాలిఫోర్నియాలోని శాక్రమెంటో సుపీరియర్ కోర్టు జడ్జిగా కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన జయ బాడిగ నియమితులయ్యారు. 2022 నుంచి ఆమె కోర్టు కమిషనర్‌గా పనిచేసి ఫ్యామిలీ లా నిపుణురాలిగా పేరొందారు. కుటుంబ న్యాయ సలహాల రంగంలో పలువురికి మార్గదర్శకురాలిగా వ్యవహరించారు. ఏపీలోని విజయవాడలో ఆమె జన్మించారు. 1991–94 మధ్య ఆమె హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీలో సైకాలజీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులతో బీఏ పూర్తి చేశారు. అనంతరం అమెరికాలోని బోస్టన్ విశ్వవిద్యాలయంలో రిలేషన్స్ అండ్ ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. శాంటాక్లారా వర్సిటీ నుంచి లా పట్టాను పొందారు. కాలిఫోర్నియాలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ కేర్ సర్వీసెస్ అటార్నీగా, గవర్నర్ కార్యాలయం అత్యవసర సేవల విభాగంలో పనిచేశారు. జయ బాడిగ మంగళవారం న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె తండ్రి బాడిగ రామకృష్ణ 2004–09 వరకు మచిలీపట్నం ఎంపీ (కాంగ్రెస్)గా పనిచేశారు.

గర్వకారణంగా ఉంది



నాతో పాటు మా కుటుంబ సభ్యులందరికీ గర్వకారణంగా ఉంది. అంతేకాకుండా తెలుగు వారందరు గర్వపడేలా నా కుమార్తె జయ ఘనకీర్తి సాధించటం ఎంతో సంతోషంగా ఉంది. ఆమె ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నారు. తెలుగువారందరు గర్వించే విధంగా పనిచేస్తానని జయ చెప్పింది.

– బాడిగ రామకృష్ణ, మాజీ ఎంపీ

ఈసీ అనుమతితో 'ఉపాధి' పనులు చేపట్టండి

సీఎస్ డా.కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశాలు

సాక్షి, అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం అనుమతితో ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ, స్వచ్ఛ భారత మిషన్ అనుసంధానంతో పెద్దఎత్తున వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణకు ప్రస్తుతం మంచి అనువైన సీజన్ అయినందున పెద్ద ఎత్తున ఉపాధి పనులు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో లక్షకు పైగా వ్యక్తిగత మరుగు దొడ్లను మంజూరు చేశామని, ఈ నేపథ్యంలో ఉపాధి హామీ, స్వచ్ఛ భారత్ మిషన్ అనుసంధానంతో వాటికి సోక్ పిట్లను నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉపాధి హామీ పనుల్లో వాటర్ కన్జర్వేషన్ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు సంబంధించి ఎలాంటి సమస్య లేదని వివరించారు. ఉపాధి హామీ పనులు, తాగునీటి సరఫరాపై ఆశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ రూ.951 కోట్లతో ఉపాధిహామీ, స్వచ్ఛ భారత్ మిషన్ అనుసంధానంతో వ్యక్తిగత మరుగుదొడ్లకు సోక్ పిట్ల నిర్మాణాన్ని పెద్దఎత్తున చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. తీవ్ర నీటిఎద్దడి గల ఆవాసాలకు ట్యాంకులు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కె.కన్నబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగులను 62 ఏళ్ల వరకు కొనసాగించాలి

సాక్షి అమరావతి: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)లో పనిచేస్తున్న ఉద్యోగులు 62 ఏళ్ల వరకు ఉద్యోగంలో కొనసాగవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమ పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన ఉద్యోగుల్లో ఎవరైనా 60 ఏళ్లకే పదవీ విరమణ చేసి ఉంటే వారిని పునర్నియమించాలని ఆదేశించింది. వారికి వేతన బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల తీర్పునిచ్చారు. 62 ఏళ్ల పదవీ విరమణ వయస్సును తమకూ వర్తింపచేయాలని కోరుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో పనిచేస్తున్న పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన న్యాయమూర్తి ఇటీవల తీర్పు వెలువరించారు.

ఆక్వాలో అగ్రగామిగా ఏపీ

దేశ సగటుకు మించి ఏపీలో ఆక్వా దిగుబడులు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సహకారం, ప్రోత్సాహకాలు, రాయితీలతో రాష్ట్రంలో ఆక్వా రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో మత్స్య ఉత్పత్తులు పెరగడమే కాకుండా, ఈ రంగంలో ప్రాసెసింగ్ యూనిట్లు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. తద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలూ పెరుగుతున్నాయి. ఆక్వా రంగంలో దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రం నిలుస్తోంది. రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తుల దిగుబడి దేశ సగటు దిగుబడిని మించి ఉంది. దేశ సగటు దిగుబడి హెక్టార్‌కు 7.5 టన్నులు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 8.8 టన్నులు ఉంది. ఒడిశా రాష్ట్రంలో ఇది 4.1 శాతమే ఉంది. దేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో 76 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తోంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ లోతైన అధ్యయనం చేసి వెల్లడించిన వివరాలివి. కొరియా ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ సహకారంతో చేసిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడైనట్లు అంతర్జాతీయ కార్మిక సంస్థ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో ఆక్వా రంగంలో అవకాశాలు, సవాళ్లను మ్యాపింగ్ చేయడం, ఈ రంగంలో ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలను, ఎంఎస్ఎంఈల పని తీరును మెరుగుపరచడం ద్వారా ఉద్యోగావకాశాల మెరుగుకు ఈ అధ్యయనం చేసినట్లు నివేదిక పేర్కొంది. భారత దేశంలో రొయ్యల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలది ఆధిపత్యమని తెలిపింది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 71,900 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో ఆక్వా ఉత్పత్తులు సాగవుతున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో అత్యధికంగా 6,34,672 టన్నుల రొయ్యలు ఉత్పత్తవుతున్నట్లు వెల్లడించింది. ఒడిశాలో 10,600 హెక్టార్లలో ఆక్వా ఉత్పత్తుల సాగు ఉండగా 43,677 మెట్రిక్ టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నట్లు తెలిపింది. ప్రస్తుతం 91 శాతం ప్రాసెస్ చేయని చేప ఉత్పత్తులనే విక్రయిస్తున్నారని, ఆక్వా ఉత్పత్తులు ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి ఏపీలో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. ఆహార ప్రాసెసింగ్ ద్వారా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ మెరుగుపడుతుందని పేర్కొంది. ఎక్కువ పోషక విలువలు గల రొయ్యల ప్రాసెస్డ్ ఉత్పత్తులకు దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఎక్కువగా ఉందని చెప్పింది. ఉత్పత్తి సమయంలో రసాయనాల వినియోగం తగ్గించడంతో పాటు ప్రాసెసింగ్ చేసిన ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోందని నివేదిక పేర్కొంది. ఎగుమతి చేసే ఆక్వా ఉత్తులకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 19,894 సంస్థలు ఉన్నాయని, 105 ప్రీ ప్రాసెసింగ్ ప్లాంట్లు, 99 ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయని, 74 మంది మాన్యుఫ్యాక్చర్ ఎగుమతిదారులతో పాటు 69 మర్చంట్ వ్యాపారులు ఉన్నారని నివేదిక తెలిపింది. రొయ్యల ప్రాసెసర్ల శ్రామిక శక్తిలో 70–80 శాతం మంది మహిళలు ఉన్నట్లు అంచనా వేసింది.

ఏపీ ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఆక్వా రంగంలో ఈ వృద్ధి సాధ్యమైందని అంతర్జాతీయ కార్మిక సంస్థ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2020–25 ఆహార ప్రాసెసింగ్ విధానాన్ని ప్రకటించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోందని, అలాగే మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా ఎక్కువ మందికి స్థానికంగా ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టిందని వివరించింది. పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండ్ కేంద్రాలను అభివృద్ధి ద్వారా ఆక్వాకు పెద్ద ఎత్తున చేయూతనిస్తోందని తెలిపింది. ఆక్వాలో ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో అత్యధిక అవకాశాలున్నాయని పేర్కొంది.

అల్లర్లకు పాల్పడ్డవారిపై కేసులేవి?

పోలీసులపై 'సిట్' అసంతృప్తి

- టీడీపీ నేత చదలవాడ ఆస్పత్రిలో మారణాయుధాలు
- అయినా కేసు నమోదు చేయని పోలీసులు
- ఈ విషయాన్ని నివేదికలో పేర్కొన్న 'సిట్'
- దీంతో స్పీడ్ పెంచిన పోలీసులు
- నరసరావుపేటలో పలువురు టీడీపీ నేతల అరెస్ట్



పోలింగ్ రోజు నరసరావుపేటలో కర్రలు, రాళ్లతో టీడీపీ మూకలు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: ఎన్నికల నేపథ్యంలో జరిగిన అల్లర్లపై విచారణకు ఎన్నికల సంఘం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) డీజీపీకి సోమవారం సమర్పించిన నివేదికతో పల్నాడులో హీట్ పెరిగింది. ఈ నివేదికలో ఏముందోనన్న భయం అటు పోలీసులు, ఇటు టీడీపీ నేతల్లో నెలకొంది. అల్లర్లకు కారణమైన వారిపై కేసుల నమోదు సరిగా జరగలేదన్న అభిప్రాయానికి సిట్ వచ్చిందని సమాచారం. అప్పటి పోలీసు ఉన్నతాధికారుల ఒత్తిడి వల్లో, స్టేషన్ హౌస్ ఆఫీసర్ల నిర్లక్ష్యం వల్లో అల్లర్లకు కారణమైన వారిపై పూర్తిస్థాయిలో కేసులు నమోదు కాలేదు. మాచవరం మండలం కొత్త గణేషునిపాడులో ఎస్సీ, ఎస్టీలు, ముప్పాళ్ల మండలం తొండపిలో ముస్లింలు.. టీడీపీ నాయకుల దాడులతో గ్రామాలు వదలి వెళ్లారు. అయితే అక్కడ టీడీపీ నేతలపై కేసుల నమోదు పూర్తిస్థాయిలో జరగలేదు. పైగా గ్రామం నుంచి ప్రాణభయంతో పారిపోయిన బాధితులపైనే కేసులు పెట్టారు. వీటన్నింటిపైనా ఎన్నికల సంఘానికి సిట్ నివేదిక సమర్పించినట్టు తెలుస్తోంది. పోలీసుల తీరుపై సిట్ అధికారులకు తగిన ఆధారాలతో మంత్రి అంబటి రాంబాబు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు సిట్ నివేదికతో బాధ్యులైన పోలీసులపై చర్యలుంటాయని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి.

అరవింద్‌బాబుపై చర్యలేవి?

ఎన్నికల్లో ఓటమి తప్పదని ముందే భావించి అల్లర్లను సృష్టించేందుకు టీడీపీ నరసరావుపేట అభ్యర్థి చదలవాడ అరవింద్‌బాబు ఇతర ప్రాంతాల నుంచి గూండాలు, బౌన్సర్లను తెప్పించి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై పోలింగ్ రోజున దాడికి పాల్పడ్డారు. అక్కడ ఉన్న కార్లను పగలగొట్టి ఇంటిని ధ్వంసం చేశారు. అడ్డువచ్చిన ఎమ్మెల్యే మామ కంజుల కోటిరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై నరసరావుపేట టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ.. ఇంతవరకు చదలవాడను అరెస్ట్ చేయలేదు. ఎమ్మెల్యే ఇంటిపై దాడికి సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను పరిశీలించిన సిట్ బృందం హింసాత్మక ఘటనకు నాయకత్వం వహించింది అరవింద్‌బాబేనని గుర్తించినట్టు సమాచారం. కాగా పోలింగ్ మరుసటి రోజు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు హౌజ్ అరెస్ట్ చేయడానికి అరవింద్‌బాబు ఆస్పత్రికి పోలీసులు వెళ్లిన సమయంలో అక్కడ పెట్రోల్ బాంబులు, రాడ్లు, కర్రలు, గాజు సీసాలు వంటి మారణాయుధాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. ఈ విషయంపై వైఎస్సార్‌సీపీ లీగల్ విభాగం సభ్యులు సిట్ బృందానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎందుకు చదలవాడపై కేసు నమోదు చేయలేదని సిట్ బృందం టూటౌన్ పోలీసులను ప్రశ్నించి అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. సిట్ నివేదికలో ఈ విషయంపై ప్రస్తావన ఉండవచ్చని పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నాయి.

కొనసాగుతున్న అరెస్టులు

సిట్ బృందం.. కేసుల నమోదుతోపాటు అరెస్టులలో స్థానిక పోలీసుల నిర్లక్ష్యంపై గట్టిగా స్పందించినట్టు తెలుస్తోంది. దీంతో జిల్లాలో అరెస్టులపై పోలీసులు దృష్టిసారించారు. నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటిపై దాడి కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులు బెంగళూరు నుంచి శ్రీశైలం వెళ్తుండగా వారి సెల్‌ఫోన్ల సిగ్నల్స్ ఆధారంగా సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. పమిడిపాడుకు చెందిన టీడీపీ నేత లాం కోటేశ్వరరావుతోపాటు మరో నలుగురిని నరసరావుపేట టూటౌన్ పోలీసులకు అప్పగించారు. ఇవే కాకుండా పల్నాడు జిల్లాలో మరిన్ని అరెస్టులు ఉంటాయన్న సమాచారంతో కేసుల్లో ఉన్న టీడీపీ నేతలు అజ్ఞాతంలోకి వెళ్లారు. పోలింగ్ రోజు, తరువాత జరిగిన అల్లర్లలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా మొత్తం 146 కేసులు నమోదు చేయగా, అందులో సుమారు 1,500 మంది నిందితుల పేర్లు ఉన్నట్టు సమాచారం. సిట్ బృందం ఆదేశాల మేరకు మరికొన్ని కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. గొడవలకు సంబంధించిన వీడియోలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. వీటి ఆధారంగా మరికొంతమందిని గుర్తించి అరెస్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలు చురుగ్గా పనిచేస్తున్నాయి.

జీవ వైవిధ్య తామేలు

- సముద్ర పర్యావరణ పరిరక్షణలో తాబేళ్ల కీలకపాత్ర
- పదేళ్లుగా తాబేళ్ల పిల్లలను వదులుతున్న అటవీశాఖ
- ఈ ఏడాది 40,500 తాబేళ్లు వదిలిపెట్టిన అధికారులు
- తీరం వెంబడి 10 తాబేళ్ల పిల్లల హేచరీలు



కోవూరు: జీవ వైవిధ్యంలో తా'మేలు' పాత్ర అనిర్వచనీయం. పర్యావరణ పరిరక్షణను కాపాడడంతో పాటు సముద్ర జలాలను శుద్ధి చేయడంతో తాబేళ్లు బహుముఖ పాత్రలు పోషిస్తున్నాయి. 'ఆలివ్‌రిడ్లీ' తాబేళ్లు సముద్ర జలాల్లోని పాచి, మొక్కలు, వివిధ రకాల వ్యర్థ పదార్థాలను తింటూ సముద్ర జలాలు కలుషితం కాకుండా చేస్తాయి. సముద్ర జలరాసులను అంతరించి పోకుండా కాపాడుతాయి. సముద్రంలో ఆక్సిజన్ స్థాయిలు పెంచేందుకు తాబేళ్లు ఎంతగానో దోహదపడుతాయి. అడ్డదిడ్డంగా పెరిగే సీ గ్రాస్‌ను తాబేళ్ల తినడం వల్ల సీ గ్రాస్ బెడ్ ఏర్పడుతుంది. దీంతో సముద్రంలో ఉన్న జీవ రాశులు ఆ బెడ్‌పై గుడ్లును పెట్టి సంతానోత్పత్తిని పెంచి సముద్ర జలాలను శుద్ధి చేయడంతో పాటు మత్స్య సంపద వృద్ధికి తోడ్పడుతాయి. ఈ ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు డైనోసార్స్ కన్నా అతి ప్రాచీనమైనవని. ఇవి మానవుడు పుట్టక మునుపు నుంచే భూమిపై ఉన్నాయని చెబుతున్నారు.

సముద్రం కోతకు గురికాకుండా..

తాబేళ్లు గుడ్లు పెట్టే సమయంలో ఒక రకమైన జెల్ విడుదల చేస్తాయి. ఆ జెల్ భూమిలో బంకలా అతుక్కుపోయి తీర ప్రాంతం కోతకు గురి కాకుండా నివారిస్తోంది. ఏడాదికి ఒక్కో తాబేలు నుంచి 3 నుంచి 5 కిలోల జెల్ విడుదల చేస్తోంది. తాబేలు శ్వాస తక్కువగా తీసుకోవడం వల్ల ఆలివ్‌రిడ్లీ రకం తాబేళ్లు 300 నుంచి 400 ఏళ్ల వరకు జీవించగలుగుతాయి. సముద్ర జలాలను శుద్ధి కావడంతో తీర ప్రాంతంలో నివశించే ప్రజలకు సముద్రపు గాలి సోకడం వల్ల అంటువ్యాధులు రాకుండా కాపాడుతాయని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతారు.

జిల్లా సముద్ర తీరంలో 10 హేచరీలు

జిల్లా సముద్ర తీరం వెంబడి 10 ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. వన్యప్రాణి విభాగం తాబేళ్ల సంరక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. 2012 నుంచి జిల్లాలో 11 గ్రామాల వద్ద సముద్రతీరంలో ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు అటవీశాఖ శ్రీకారం చుట్టింది. గడిచిన ఐదేళ్లలో 1.95 లక్షల గుడ్లను సేకరించి అందులో నుంచి తాబేళ్ల పిల్లలను ఉత్పత్తి చేసి సముద్రంలోకి వదిలి పెట్టినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 10 హేచరీల ద్వారా తీరంలో తాబేళ్ల పెంపకం చేపడుతున్నామన్నారు.

ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల ప్రయాణం.. విభిన్నం

ఆలివ్‌రిడ్లీ తాబేలు ఎక్కడ అయితే జన్మిస్తోందో, అక్కడ నుంచి వేల కిలో మీటర్లు ప్రయాణం చేస్తోంది. ఈ ప్రయాణం ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం, అరేబియా మహా సముద్రం, హిందూ మహా సముద్రం, బంగాళాఖాతం మీదుగా ప్రయాణం చేసి ఈ తాబేలుకు 15 ఏళ్ల వయస్సు వచ్చేంత వరకు ప్రయాణం సాగిస్తోంది. అక్కడ నుంచి వేల కిలో మీటర్లు దాటి ఎక్కడ పుట్టిందో అక్కడికే చేరుకుంటుంది. అక్కడ గుడ్లు ఉత్పత్తి చేసి ప్రయాణం మొదలుపెడుతోంది. ఏడాది తర్వాత ఇదే సీజన్‌లో జిల్లాలోని తీర ప్రాంతానికి వచ్చి మళ్లీ తన ఉత్పత్తిని ప్రారంభిస్తోంది. వీటిలో ఒక రకం జీవిత కాలం 60 నుంచి 300 ఏళ్లు, మరో రకం 60 నుంచి 400 ఏళ్ల వరకు జీవించగలుగుతోంది. ఇది పుట్టుకతోనే మంచి తెలివితేటలతో జన్మిస్తోంది. ఏ జీవి అయిన పుట్టినప్పుడు నీళ్లను చూసి భయపడుతోంది. కానీ ఈ తాబేలు పుట్టిన కొన్ని గంటల్లోనే సముద్రానికి ఎదురెళ్లుతోంది. ఈ తాబేలు మత్స్యకారులకు కల్పతరువుగా చెప్పవచ్చు.

సముద్ర తాబేళ్ల పెంపకం ఎలా

అలసట లేని ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు కేవలం సంతానోత్పత్తి కోసమే వేల కి.మీ. ప్రయాణించి సముద్ర తీరానికి చేరుకుని ఏటా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో సహజ సిద్ధంగానే గుడ్లు పెడుతాయి. ఈ గుడ్లను అటవీశాఖ వారు నక్కలు, అడవి పందుల బారిన పడకుండా పలు జాగ్రత్తలు తీసుకుని పునరుత్పత్తి కేంద్రాలకు తరలిస్తారు. ప్రస్తుతం 6 వేల గుడ్లును సురక్షితమైన హేచరీలకు తరలించినట్లు తెలుస్తోంది. తాబేళ్ళ పునరుత్పత్తికి ఏ ప్రాంతం అనుకూలంగా ఉంటుందో అటవీశాఖ వన్యప్రాణి విభాగం అధికారులు ముందుగా గుర్తిస్తారు. ఆ ప్రాంతంలో మినీ హెచరీలు ఏర్పాటు చేసి అందులో 2 నుంచి 3 అడుగుల సైజు గుంతలు తవ్వి గుడ్లును పొదుగుతారు. గుంతల్లో పొదిగిన గ్రుడ్డు నుంచి పిల్లలు బయటకు రావాలంటే 45 రోజుల నుంచి 60 రోజుల వరకు సమయం పడుతుంది. డిసెంబర్ నుంచి జూన్ వరకు ఉత్పత్తి కేంద్రాల ద్వారా తాబేళ్ళను అభివద్ధి చేస్తారు. అందుకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా సహకరిస్తున్నాయి.

తాబేళ్లను వేటాడి చంపినా, వాటిని తిన్నా నేరమే

తాబేళ్లను వేటాడి చంపినా, వాటి గుడ్లను తిన్నా వన్యప్రాణి పరిరక్షణ చట్టం 1972 కింద నేరంగా పరిగణిస్తారు. 3 నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా కూడా విధిస్తారు. భారత ప్రభుత్వం ఈ తాబేళ్ల భద్రతను చట్టం పరిధిలో షెడ్యూల్–1లో చేర్చింది.

ఆలివ్‌రిడ్లీ తాబేళ్ల ప్రత్యేకత

ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు సుమారు 45 కిలోల బరువు, మూడు అడుగుల పొడవు ఒకటిన్నర అడుగుల వెడల్పు ఉంటుంది. పుట్టిన పిల్ల మూడు సెం.మీ. పొడవు, అర అంగులం వెడల్పు ఉంటుంది. ఆడ తాబేలు ఒడ్డుకు వచ్చి 60 నుంచి 150 వరకు గుడ్లు పెడుతుంది. మగ తాబేలు 25–30 డిగ్రీల ఉష్ణోగ్రత, ఆడ తాబేలు 30–32 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటేనే బయటకు వస్తాయి. ఆడ తాబేళ్ల పిల్లలు సముద్రంలోకి ఏ తీరం నుంచి వెళుతుందో అది పెద్దదై గుడ్లు పెట్టే సమయానికి అదే తీరానికి వచ్చి గుడ్లు పెట్టడం వీటి ప్రత్యేకమని అధికారులు చెబుతున్నారు. అవి గుడ్లు పెట్టే ప్రదేశాన్ని గుర్తించి ఆ ప్రదేశాల్లో ఎవరు సంచరించకుండా కర్రలు నాటి రక్షణ కల్పించడం ద్వారా మనం వాటిని పరి రక్షించవచ్చు. అయితే గత కొంతకాలంగా సముద్రంలో పెద్ద పెద్ద బోట్లు తిరగడం వల్ల వాటి తాకిడికి తాబేళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి.

సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధం

- జూలకంటి బ్రహ్మారెడ్డిది నీచ సంస్కృతి
- టీడీపీ అనుకూల గ్రామాల్లో మా ఏజెంట్లపై దాడి
- ఆ గ్రామాల్లోనే అలజడి సృష్టించారు
- పారిపోయి నియోజకవర్గానికి దూరంగా ఉండేది బ్రహ్మారెడ్డి
- నేను ఎక్కడికి పారిపోలేదు...
- ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలనే పోలీసుల సూచన మేరకు హైదరాబాద్ వచ్చా
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల: 'టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డిది నీచ సంస్కృతి. ఫ్యాక్షనిజమే అతని జీవితం..' అని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలింగ్ రోజు మాచర్ల నియోజకవర్గంలో జరిగిన గొడవలపై సిట్టింగ్ జడ్జితో విచారణకు తాను సిద్ధమని పిన్నెల్లి ప్రకటించారు. ఆయన మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 'టీడీపీ అభ్యర్థి బ్రహ్మారెడ్డి మాచర్ల నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలకు ఆజ్యం పోసి.. ఆయన మాత్రం నియోజకవర్గానికి దూరంగా ఉంటూ ప్రజలను పట్టించుకోవడం లేదు. అటువంటి వ్యక్తి నేను పారిపోయానని చెప్పటం హాస్యాస్పదంగా ఉంది. ఏడు మర్డర్ కేసుల్లో ఏ–1గా ఉన్న బ్రహ్మారెడ్డి నాపై చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మడం లేదు. నాపై పోటీ చేసి ఓడిపోయిన బ్రహ్మారెడ్డి గుంటూరుకు పారిపోయాడు. ఆ తర్వాత నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. ఎన్నికల ముందు బ్రహ్మారెడ్డిని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, చంద్రబాబు తీసుకొచ్చి పల్నాడులో ఫ్యాక్షన్‌కు ఆజ్యం పోశారు. కారెంపూడి మండలంలోని చింతపల్లి, ఒప్పిచర్ల, రెంటచింతల మండలంలో తుమ్మకోట, పాలవాయిగేటు గ్రామాల్లో కమ్మ సామాజికవర్గానికి చెందినవారు మా ఏజెంట్లను తరిమికొట్టి గొడవలు సృష్టించారు. కారెంపూడి సీఐ నారాయణస్వామి ద్వారా విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ గ్రామాల్లో గొడవలు జరుగుతాయని బందోబస్తు పెంచాలని హైకోర్టు నుంచి ముందుగానే ఆర్డర్ తీసుకొచ్చి ఎస్పీకి ఇచ్చినా పట్టించుకోలేదు. ఎన్నికల రోజు గొడవలు జరిగినా, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పోలీసుల సూచనల మేరకు హైదరాబాద్‌కు వచ్చాను. మర్డర్లు చేసి పారిపోయిన చరిత్ర నాకు లేదు. నేను ఎన్నడూ పారిపోలేదు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కమ్మ సామాజికవర్గాన్ని ఒకటి చేయటానికి ఎంతో కృషి చేస్తున్నారు. ఇప్పుడు కూడా బ్రహ్మారెడ్డి, శ్రీకృష్ణదేవరాయలు కలిసి గొడవలు చేశారు. టీడీపీని గెలిపించేందుకు సీఐ నారాయణస్వామి దాడులకు పాల్పడ్డారు. ఈ అల్లర్లపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు నేను సిద్ధంగా ఉన్నా. బ్రహ్మారెడ్డిలా నీచ రాజకీయాలు చేసి పారిపోయే చరిత్ర నాది కాదు. నేను ఎప్పుడూ ప్రజలకు వెన్నంటే ఉంటాను. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాను. మీ ప్రభుత్వంలో ఏం చేశారో చెప్పండి. చందాలు వసూలు చేసి ఇల్లు కట్టుకుని చందాల నాయకుడుగా మారిన బ్రహ్మారెడ్డి నన్ను విమర్శించడం సిగ్గుచేటు.' అని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు.

ఈవీఎంల ధ్వంసంపై ఈసీ సీరియస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల ధ్వంసం ఘటనలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణిస్తోందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాచర్ల నియోజకవర్గంలోని 202వ నంబర్ పోలింగ్ స్టేషన్‌తో పాటు ఏడు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ధ్వంసం అయ్యాయన్నారు. 202 పోలింగ్ స్టేషన్‌లో ఎమ్మెల్యే పి.రామకృష్ణారెడ్డి ఈవీఎంను ధ్వంసం చేసినట్టు వెబ్ కెమెరాలో రికార్డయిందని తెలిపారు. పల్నాడు జిల్లా ఎన్నికల అధికారులు అన్ని పోలింగ్ స్టేషన్ల వీడియో ఫుటేజీలను పోలీసులకు అందజేశారని పేర్కొన్నారు. ఈవీఎం ధ్వంసం కేసులో ఎమ్మెల్యే పి.రామకృష్ణారెడ్డిని నిందితుడిగా చేర్చారన్నారు.

తాడిపత్రిలో 'సిట్' రెండో దఫా విచారణ

- తాడిపత్రి రూరల్ పోలీస్టేషన్‌లో మకాం వేసిన 'సిట్' అధికారులు
- అల్లర్లలో పాల్గొన్న వారిని గుర్తిస్తున్న అధికారులు

తాడిపత్రి: అనంతపురం జిల్లా తాడిపత్రిలో పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన హింసాత్మక ఘటనలపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియమించిన 'సిట్' బృందం రెండో దఫా విచారణ చేపట్టింది. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు, గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ వి. భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాస్ తదితర అధికారులతో కూడిన బృందం ఇప్పటికే ఒకసారి తాడిపత్రిలో అల్లర్లు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. ఈ ఘర్షణలకు సంబంధించి నమోదైన కేసులు, దర్యాప్తు తీరుపై డీజీపీకి నివేదిక సైతం అందించారు. లోతైన విచారణ కోసం మంగళవారం మళ్లీ సిట్ తాడిపత్రికి వచ్చింది. రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో మకాం వేసి హింసాత్మక ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు నమోదైన కేసుల పూర్వాపరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. నిందితులుగా గుర్తించిన వారిని, అల్లర్లలో పాల్గొన్నప్పటికీ ఎఫ్ఐఆర్‌లో పేరు చేర్చని మరికొందరిని 'సిట్' బృందం గుర్తించినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే ఇంట్లో ఆస్తుల ధ్వంసం వీడియో పరిశీలన

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంట్లోకి అక్రమంగా చొరబడిన పోలీసులు ఆస్తులు ధ్వంసం చేసిన ఘటన గురించి ఎమ్మెల్యే సతీమణి రమాదేవి 'సిట్' అధికారులకు ఇప్పటికే తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలూ అందజేశారు. దీంతో మంగళవారం సిట్ బృందం సభ్యులు ఎమ్మెల్యే ఇంట్లో ఆస్తుల ధ్వంసం వీడియోను పరిశీలించారు. అలాగే హింసాత్మక ఘటనల వీడియోల ద్వారా నిందితులను గుర్తిస్తున్నారు. తాడిపత్రిలో చెలరేగిన అల్లర్లలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేయడంతోపాటు పూర్తి స్థాయిలో చార్జిషీటు దాఖలు చేసేలా సిట్ బృందం దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. రెండో దఫా తాడిపత్రికి వచ్చిన సిట్ బృందం మరో రెండు రోజుల పాటు ఇక్కడే మకాం వేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలుస్తోంది.

చంద్రబాబు ఎక్కడ? ఏమైపోయారు?

ఆయన ఏ దేశానికి పారిపోయాడనేది ఇప్పుడు పెద్ద క్వశ్చన్ మార్క్?

- రాష్ట్ర ప్రజలు, టీడీపీ నేతలకు కూడా ఆయనెక్కడ ఉన్నారో తెలియదు
- ఎల్లో మీడియాకూ చెప్పకుండా ఎక్కడికి వెళ్లినట్లు?
- దోచిన డబ్బు దాచుకోవడానికి దుబాయ్ వెళ్లారా?
- జూన్ 4న మరోసారి చరిత్ర సృష్టించబోతున్న సీఎం జగన్
- ఆరోజు సంబరాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలి
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఎక్కడికి వెళ్లారు, ఏమైపోయారోనన్న విషయం ఇప్పుడు రాష్ట్రంలో పెద్ద చర్చనీయాంశంగా మారిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ అన్నారు. ఆయన మంగళవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ఏ దేశానికి పారిపోయారనేది ఇప్పుడు పెద్ద క్వశ్చన్ మార్క్ అని చెప్పారు. ఆయన ఎక్కడ ఉన్నారో రాష్ట్ర ప్రజలకు, టీడీపీ నేతలకు కూడా తెలియదన్నారు. కనీసం ఎల్లో మీడియాకు కూడా చెప్పకుండా ఆయన ఎక్కడికి వెళ్లిపోయారని ప్రశ్నించారు. రామోజీ, రాధాకృష్ణలకు తెలియకుండా జంప్ అయిపోయారా.. అని అన్నారు. బాబు విదేశాలకు వెళ్లిపోవడంపై ఆయన్ని భుజాన పెట్టుకొని మోస్తున్న ఎల్లో మీడియాలో ఒక్కో దాంట్లో ఒక్కో విధంగా వార్తలు వచ్చాయని, అందుకే ప్రజల్లో అనుమానాలు బయల్దేరాయని తెలిపారు. ఆయన విదేశీ పర్యటనకు వెళ్లారని అంటున్నారని, ఏ దేశానికి వెళ్లారని ప్రశ్నించారు. దోచిన డబ్బులు దాచుకోవడానికి దుబాయ్ వెళ్లారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. దుబాయ్ వెళ్లారా? ఇటలీ వెళ్లారా? అమెరికా వెళ్లారా..? ప్రతిపక్ష నాయకుడు ఎక్కడికి వెళ్లారో రాష్ట్ర ప్రజలకి తెలియాలి కదా.. అని అన్నారు. చంద్రబాబే పారిపోయారని, తమ గతేమిటని టీడీపీ నేతలు జుట్టు పీక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. త్వరలో టీడీపీ అడ్రస్ గల్లంతవబోతోందని, అప్పుడు ఆ పార్టీ నేతల నోటికి తాళాలు పడతాయని తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి కుప్పకూలిపోతుందని తెలిపారు. కూటమి దత్తపుత్రుడు కూడా ఏమయ్యాడో, ఎక్కడికి వెళ్లిపోయాడో తెలియడంలేదని అన్నారు.

పారని కూటమి నేతల కుట్రలు

ఈ ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పార్టీల నేతలు అనేక కుట్రలు, కుతంత్రాలు పన్నారని, ప్రజల నిర్ణయం ముందు అవేమీ పారలేదని జోగి రమేశ్ వివరించారు. చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఫిర్యాదులతోనే ఎన్నికల కమిషన్ అధికారులను మార్చిందని, ఆ ప్రాంతాల్లోనే ఘర్షణలు జరిగాయని చెప్పారు. ఇప్పుడు కొత్తగా నియమితులైన అధికారులను సస్పెండ్ చేశారన్నారు. వ్యవస్థలను వాడుకొని, నిబద్ధతను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రజలు సీఎం వైఎస్ జగన్‌పైనే నమ్మకాన్ని ఉంచారని చెప్పారు. టీడీపీ, జనసేన ఎన్ని కుట్రలు పన్నినా, ఎంత విధ్వంసం సృష్టించినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. వైఎస్సార్‌సీపీ మంత్రులు, ఎమ్మెల్యేలపై 304, 307 కేసులు, ఎస్సీ, ఎస్టీ యాక్టులు పెట్టినా ధైర్యంగా ప్రజాక్షేత్రంలో నిలబడ్డామని చెప్పారు. జూన్ 4న సంబరాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలని చెప్పారు.

ప్రజలంతా సీఎం జగన్ వైపు నిలబడ్డారు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలువలు, విశ్వసనీయతకు మారు పేరని జోగి రమేశ్ తెలిపారు. ఏ దేశానికి వెళ్తున్నారో బహిరంగంగా చెప్పి వెళ్లిన నేత సీఎం జగన్ అని చెప్పారు. అందుకే ఈ ఎన్నికల్లోనూ రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ వైపే నిలబడ్డారని, విలువలు, విశ్వసనీయతకు పట్టం కట్టబోతున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మరోసారి రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించబోతున్నారని చెప్పారు.

ఇండియా కూటమిని గెలిపించండి

ఢిల్లీలో ఉన్న తెలుగు ప్రజలకు ఏపీ కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: దేశానికి ఎన్‌డీఏ ప్రభుత్వం చేసిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని ఢిల్లీలో నివసిస్తున్న తెలుగు ప్రజలు 'ఇండియా' కూటమికి ఓటు వేసి గెలిపించాలని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల రాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డితో కలిసి వీరు మీడియాతో మాట్లాడారు. గిడుగు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ, ప్రత్యేక హోదా ఇవ్వకుండా కాలయాపన చేస్తోన్న బీజేపీని ఓడించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఢిల్లీలో ఉన్న 7లక్షల మంది తెలుగు ప్రజలు ఇండియా కూటమి నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దేశానికి అభివృద్ధి జరుగుతుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు కన్నుమూత

- స్వగ్రామం దొమ్మేరులో నేడు అంత్యక్రియలు
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు
- వైఎస్సార్‌సీపీలో సీఈసీ సభ్యుడిగా బాధ్యతలు



కృష్ణబాబు (ఫైల్)

కొవ్వూరు: వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (71) మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో ఎన్టీ రామారావుపై అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చారు. వరుసగా 1983, 1985 (మధ్యంతర ఎన్నికలు), 1989, 1994, 2004లో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. పార్టీలు వేరైనప్పటికీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో కృష్ణబాబుకు అత్యంత సాన్నిహిత్యం ఉండేది. దీంతో ఆయన మరణానంతరం 2012లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీలో చేరారు. జిల్లా రాజకీయాల్లోనూ, గోపాలపురం, పోలవరం నియోజకవర్గాల్లో పునర్విభజన అనంతరం కొవ్వూరులోనూ కృష్ణబాబు రాజకీయంగా తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయన భార్య నాగమణి గతంలోనే మరణించారు. కృష్ణబాబుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ సలహాదారు, పార్టీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడిగా వ్యవహరిస్తున్న ఎస్.రాజీవ్‌కృష్ణ ఆయన అల్లుడు. కృష్ణబాబు మృతి పట్ల రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారితోపాటు పలువురు రాష్ట్ర, జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన స్వగ్రామమైన దొమ్మేరులో బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



> మనం తృష్ణ వల్ల ప్రేరేపించబడితే ఒక పని చేసేటప్పుడు, అది పూర్తయిన తరువాత చింతిస్తాం. అదే వివక్షణతో చేస్తే ఇక మనం చింతించాల్సిన పని ఉండదు.
> – బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 22 మే 2024

ఏం జరగనుంది?

ప్రపంచమంతటినీ ఒక్కసారి ఉలిక్కిపడేలా చేసిన ప్రమాదం... విన్న వెంటనే రకరకాల ఆలోచనలు, అనుమానాలు తలెత్తిన అనూహ్య ఘటన... ప్రతికూల వాతావరణంలో చిక్కుకోవడంతో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీమ్ రైసీ, విదేశాంగమంత్రి హుసేన్ అమీర్ అబ్దుల్లాహియన్‌లు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ వాయవ్య ఇరాన్‌లో ఆదివారం కుప్పకూలిందన్న వార్త పలు పాత, కొత్త విషయాలను ఏకకాలంలో స్ఫురణకు తెచ్చిన సంచలనం. అంతర్జాతీయ ఆంక్షలు, విమానాల నిర్వహణలో కష్టాల వల్ల ఇరాన్‌లో విమానయాన భద్రత దీర్ఘకాలంగా పెనుసవాలైంది. తాజా ఘటనతో ఆ సంగతి మళ్ళీ రుజువైంది. గగనయానంలో గతంలో పలువురు ప్రముఖుల దుర్మరణాల మొదలు రైసీ హయాంలో ఇరాన్ ప్రస్థానం, రానున్న కాలంలో వచ్చే మార్పుల వరకు అనేకం చర్చనీయాంశాలయ్యాయి.

ఇరాన్ – ఇరాక్ యుద్ధం నాటి నుంచి తన విపరీత వర్తనతో వార్తల్లో ఉన్న సంప్రదాయవాద మతబోధకుడు రైసీ దేశాధ్యక్షపదవిని చేపట్టింది 2021లోనే! ఆయన కన్నా ముందు మితవాది అయిన హసన్ రోహానీ ఎనిమిదేళ్ళు ఆ పదవిలో ఉన్నారు. చర్చల ద్వారా మార్పు తేవాలనీ, దేశాన్ని సుసంపన్నం చేయాలనీ భావించిన రోహానీకి పూర్తి భిన్నమైన వ్యక్తి రైసీ. కరడుగట్టిన ఛాందసం, హిజాబ్ ధారణ సహా సమాజంలో కఠిన నిబంధనల అమలు, వందలాది ఉరిశిక్షలతో అంతులేని అపకీర్తి సంపాదించుకున్నారు. నిజానికి, అమెరికా సహా ప్రపంచ దేశాలతో అణు ఒప్పందంపై 2015లో రోహానీ సంతకం చేశారు. కానీ, ఆనక అమెరికా అధ్యక్షపీఠమెక్కిన ట్రంప్ మాటతప్పి, 2018లో ఇరాన్‌పై మళ్ళీ ఆంక్షలు విధించేసరికి దేశంలో చెల్లని కాసయ్యారు.ఫలితంగా మితవాదుల్ని తోసిపుచ్చి, ఛాందసులు పట్టు బిగించారు. మానవ హక్కుల సంఘాలు సహా అందరూ వ్యతిరేకించడంతో అంతకు ముందు ఒకటికి రెండు సార్లు ఎన్నికల్లో నెగ్గలేకపోయినప్పటికీ, ఎట్టకేలకు 2021లో రైసీ పీఠమెక్కారు. దేశాధ్యక్షుడిగా ఆయన వ్యవహరించింది కొద్ది కాలమే! ఆయన హయాంలో పొరుగున ఉన్న అరబ్ దేశాలతో సంబంధాలను సాధారణ స్థితికి తీసుకొచ్చే ప్రయత్నం జరిగింది. అదే సమయంలో ఇజ్రాయెల్‌తో, పాశ్చాత్య ప్రపంచంతో ఘర్షణలు మరింత పెరిగాయి.

ప్రాణాలు తీసిన హెలికాప్టర్ చాలా పాతదంటున్నారు. పాశ్చాత్య దేశాల కఠిన ఆంక్షల కారణంగా కొత్త ఛాపర్లు, విమానాలను ఇరాన్ సమకూర్చుకోలేకపోయిందట. అమెరికా మాటెలా ఉన్నా... చైనా, రష్యాలతో సాయిలా ఫాయిలాగా ఉంటున్న దేశానికి, అందులోనూ అసంఖ్యాకంగా డ్రోన్లు సహా అపమిత ఆయుధ సంపత్తి గల దేశానికి పాత ప్రయాణ సాధనాలే గతి అయ్యాయంటే ఆశ్చర్యమే. ఏమైనా, ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలు హమాస్, హెజ్బుల్లా లాంటి వాటికి కొండంత అండగా నిలిచి రైసీ అక్షరాలా అమెరికాకు కంటిలో నలుసయ్యారు. అందుకే, హెలికాప్టర్ ప్రమాదంలో కుట్రకోణం ఉండవచ్చనే అనుమానాలు వినవచ్చాయి. ఇటీవలి పశ్చిమాసియా పరిణామాలు... ఆ అనుమానాలకు బలమిచ్చాయి. తమపై దాడి చేసిన హమాస్‌కు పెద్ద అండ ఇరాన్ గనక తెగబడి ఇజ్రాయెల్ గుట్టుగా హత్య చేయించి ఉండవచ్చనే పుకార్లు షికారు చేస్తున్నాయి. పైగా, గాజా చర్యల్లో ఇజ్రాయెల్‌ను బాహాటంగా సమర్థిస్తూ, దానితో వ్యూహాత్మక సహకారమున్న అజర్‌బైజాన్‌కు రైసీ వెళ్ళి వస్తున్నప్పుడే ఘటన జరగడం గమనార్హం. అయితే అనుమానాలకు తగిన ఆధారాలు కానీ, కనీసం ఇరాన్ నుంచి ఆరోపణలు కానీ... ఏవీ ఇప్పటి దాకా బయటకు రాలేదు. ఫలితంగా, దురదృష్టకర ప్రమాదంలోనే ఇరాన్ అధ్యక్షుడు దుర్మరణం పాలయ్యారని ప్రస్తుతానికి భావించాలి.

ప్రమాదంపై లోతుగా దర్యాప్తు జరిపి, నిజానిజాలను సమగ్రంగా బయటపెట్టాల్సిన బాధ్యత ఇరాన్‌దే! ఏమైనా, అమెరికా ఆంక్షలు, ఆర్థికరంగంలో ఇక్కట్లు, సమాజంలో అసంతృప్తి, నెత్తిన పశ్చిమాసియా కుంపటితో అస్తుబిస్తు అవుతున్న వేళ ఈ దుర్ఘటన ఆ దేశానికి అశనిపాతం. ఇక, ప్రస్తుతానికి దేశ ఉపాధ్యక్షుడికి తాత్కాలిక అధ్యక్ష హోదా ఇచ్చారు. యాభై రోజుల సంతాప దినాల తర్వాత ఇరాన్ కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఆ దేశంలో అధినాయకుడి (అలీ ఖమేనీ)దే ఆఖరు మాట. అయినా అధ్యక్ష పదవి సైతం కీలకమే! దేశీయ, ప్రాంతీయ అనిశ్చితులు ఎన్నో ఉన్నా, రైసీ దుర్మరణంతో ఇస్లామిక్ రిపబ్లిక్ ఇరాన్ రాజకీయాల్లో, విధానాల్లో అనూహ్యమైన మార్పులు వస్తాయనీ అనుకోలేం. హెలికాప్టర్ ప్రమాదఘటన ఇరాన్‌కు తీరని విషాదమే తప్ప, రాజకీయ సంక్షోభం కాదని విశ్లేషకులూ తేల్చేస్తున్నారు. అధినాయకుడైన ఖమేనీకి ఆశ్రితుడిగా, ఆయన మాటను ధిక్కరించే ఆలోచనైనా లేని అధ్యక్షుడిగా, ఎనభై అయిదేళ్ళ వయసు మీద పడ్డ ఆయనకు అరవయ్యో పడిలోని వారసుడిగా అందరూ భావించిన రైసీ హఠాన్మరణంతో ఒక అధ్యాయమైతే ముగిసింది. ఇరాన్ చరిత్రలో కొత్త అధ్యాయం ఏమిటి, వారసుడెవరన్నది చర్చ. ఈ వారసత్వ రాజకీయాల కొత్త కూర్పులో ఖమేనీ కుమారుడు సయ్యిద్ మొజ్తబా హుసేనీ పైకి వస్తారని ఓ అంచనా.

ఇస్లామిక్ ధర్మశాస్త్ర పాలన (వెలాయత్ ఎ ఫకీ) పేరిట మతాచార్యులకు పెద్ద అయిన షియా ధర్మశాస్త్రవేత్త అధినాయకుడిగా కొనసాగే పద్ధతి 1979లో ఇస్లామిక్ విప్లవం అనంతరం ఇరాన్‌లో వచ్చింది. అధినాయకుడు, ఆ తర్వాతే దేశాధ్యక్షుడు వగైరా అన్న విధానంపై విమర్శలు, చట్టబద్ధతపై ప్రశ్నలు, అధికారానికి అనేక సవాళ్ళు వచ్చినా ఇన్నేళ్ళుగా అది కొనసాగింది. 1989 నుంచి ఖమేనీ కనుసన్నల్లోనే ఇరాన్ నడిచింది. కానీ, మారుతున్న భౌగోళిక రాజకీయాలు, దీర్ఘకాలంగా అణిచిపెడుతున్నప్పటికీ పెరుగుతున్న అంతర్గత అసంతృప్తి లాంటివి ఈ ఇస్లామిక్ దేశం ముందున్న పెనుసవాళ్ళు. వాటిని అధినాయకత్వం ఎలా దీటుగా ఎదుర్కొంటుందో కచ్చితంగా ఆసక్తికరం.


గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, తిథి: శు.చతుర్దశి సా.5.56 వరకు తదుపరి పౌర్ణమి, నక్షత్రం: స్వాతి ఉ.7.16 వరకు, తదుపరి విశాఖ **వర్జ్యం:** ప.1.15 నుండి 2.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.31 నుండి 12.19 వరకు, **అమృతఘడియలు:** రా.11.28 నుండి 1.11 వరకు.

సూర్యోదయం: 5.30
సూర్యాస్తమయం: 6.22
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

ఎన్నికల నైతికత నెలకొనేనా?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఎన్నికల రంగంలో సాధారణంగా జరగాల్సిన నైతిక ప్రచారం... తమ పార్టీ గెలిస్తే ఏం చెయ్యబోతోందో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం. జగన్ తన పార్టీ బహిరంగ సభల్లో తను గత ఐదేండ్లు చేసిన పనులు, గెలిస్తే చెయ్యబోయే పనులు చెబుతూ తిరిగారు. అనైతిక భాషను ఎవరి మీదా వాడటం కనిపించలేదు. కానీ చంద్రబాబు గానీ, ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో మీటింగుల్లో పాల్గొన్న మోదీ గానీ ఆ నైతికతను పాటించలేదు. ఎదుటి నాయకుడిని నిందించే నైతికతను మాత్రమే పాటించారు. ఎన్నికల కమిషన్‌కు కూడా ఎన్నికల్లో ఏ చర్చ నీతివంతమైనది, ఏది కాదు అనే అంశంపై స్పష్టత లేదు. ఎన్నికల మొరాలిటీ, ప్రచారంలో వాడాల్సిన భాష మొదలగు అంశాలపై ఇంకా చాలా చర్చ జరగాల్సి ఉంది.

ప్రపంచంలో ఓటు ద్వారా ప్రజలు తమ పాలకులను ఎన్నుకోవడం మొదలైన దగ్గరి నుండి సమాజ నైతిక జీవనంలో గణనీయంగా మార్పు వచ్చింది. అంతకుముందు గుంపు నైతికతను మతం బోధించే ప్రయత్నం చేసింది. కానీ ఆ నైతికతకు జవాబుదారీతనం అనేది ఏమీ లేదు. రాజ్య వ్యవస్థలో రాజులు, నియంతలు ప్రజలకు జవాబుదారీగా లేరు. కండ బలం– అంటే నిర్మిత సైన్యబలం, ప్రజల మధ్య కల్పించిన భయ వాతావరణం రాజ్యాలను నడిపించాయి.

భారతదేశంలో మతం–కులం ఒకదానికొకటి అండగా ఉండటం వల్ల, మత వ్యవస్థ ఎన్నడూ ఇక్కడ సోషల్ మొరాలిటీ(సామాజిక నైతికత)ని ప్రజల మధ్య ప్రచారం చెయ్యలేదు. కులాధిపత్యాన్ని, మతాధిపత్యాన్ని తద్వారా కుల మొరాలిటీని ప్రజలమధ్య ప్రచారం చేసి, ఉత్పత్తి శక్తులకు విద్య, మానవ సమానత్వం అందకుండా చాలా జాగ్రత్తగా నీతి రహిత సమాజ నిర్మాణాన్ని దైవ సృష్టి నిర్మాణంగా కొనసాగించారు. ఈ విధమైన నీతి రహిత సమాజ జీవనాన్ని ఎలక్షన్ మొరాలిటీ (ఎన్నికల నైతికత) ద్వారా మార్చవచ్చు అని అంబేడ్కర్ భావించారు. ఆ మార్పునకు మూలం రాజ్యాంగం.

అయితే భారతదేశంలో 1952 నుండి చాలాకాలం కాంగ్రెస్, కమ్యూనిస్టు– సోషలిస్టుల మధ్య ఎన్నికల పోరాటం జరిగింది. కాంగ్రెస్ దేశంలో చాలా సులభంగా ఎన్నికల్లో గెలవడం వల్ల, కమ్యూనిస్టులు అసలు రాజ్యాంగం మీదనే నమ్మకం లేని ఎన్నికల పోరాటంలో ఉన్నందువల్ల ఎన్నికల మొరాలిటీపై అసలు చర్చ జరగలేదు. ఈ దశ అంతా కూడా ఉత్పత్తి కులాల్లో బాగా చదువుకున్న యువకులు ఎక్కువగా లేనందున ఎన్నికల మొరాలిటీపై పత్రికల్లో కూడా చర్చ జరగలేదు. కమ్యూనిస్టులలో సిద్ధాంత పట్టు ఉన్నప్పటికీ, శ్రమ జీవుల పట్ల ప్రేమ ఉన్నప్పటికీ ఎన్నికల ద్వారా రాజకీయ నైతికతనీ, సామాజిక నైతికతనీ సమాజంలో పెంచవచ్చని వారు భావించలేదు.

కాంగ్రెస్‌కు ప్రతిపక్షంగా ఆర్ఎస్ఎస్ పునాదిగా ఎదుగుతూ వచ్చిన జనసంఘ్/బీజేపీ ఎన్నికల వ్యవస్థను మతాధిపత్య రాజకీయంతో ముడెయ్యడం వల్ల దేశంలో కాంగ్రెస్, బీజేపీ నాయకత్వాల మధ్య ఎన్నికల మొరాలిటీపై చర్చ జరగలేదు. ఈ క్రమంలో విభిన్న రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఏర్పడ్డాయి. జాతీయ స్థాయి ఎన్నికల మొరాలిటీపై చర్చ చేసే అవకాశం వాటికి అంతగా లేదు. కానీ రాష్ట్రాల స్థాయిలో ఉత్పత్తి కులాల నుండి వచ్చిన ప్రాంతీయ పార్టీల నాయకులు ఎదిగాక, ఎన్నికల నైతికతపై కొంత చర్చ మొదలుపెట్టారు. అయితే ఈ ఎన్నికల మొరాలిటీ, ప్రచారంలో వాడాల్సిన భాష మొదలగు అంశాలపై ఇంకా చాలా చర్చ జరగాల్సి ఉంది. ఎన్నికల కమిషన్‌కు కూడా ఎన్నికల్లో ఏ చర్చ నీతివంతమైనది, ఏది కాదు అనే అంశంపై స్పష్టత లేదు.

2024 ఎన్నికల్లో నాయకులు ప్రచార సభలలో వాడిన భాషను



ఒక్కసారి చూద్దాం. చంద్రబాబు నాయుడు ఒక బహిరంగ సభలో జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి వాడిన 'నీ అమ్మ మొగుడు చేశాడా' లాంటి భాష ఏ ప్రజాస్వామ్య దేశంలో ఉపయోగించినా ఆయన్ని ఎన్నికల నుండి బహిష్కరించడమే కాక, తీవ్రమైన శిక్ష విధించే విలువలు ఉంటాయి. పాకిస్తాన్ వంటి అస్థిరమైన ప్రజాస్వామ్యంలో కూడా ఇటువంటి భాషను బహిరంగంగా వాడటాన్ని ప్రజల విలువలు ఒప్పుకోవు. కానీ ఇండియాలో ఇటువంటి భాష, దీని అనుసంధాన ప్రవర్తన ఎన్నికల రంగంలో మామూలుగా కనిపిస్తుంది.

జగన్ ఇటువంటి భాషను బహిరంగ సభల్లో ఎవరి మీదా వాడటం కనిపించలేదు. అదే చంద్రబాబు 'సైకో, సైకో' అంటూ జగన్‌ను తిట్టగా చూశాం. ఎన్నికల రంగంలో సాధారణంగా జరగాల్సిన నైతిక ప్రచారం... తమ పార్టీ గెలిస్తే ఏం చెయ్యబోతోందో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం. దీన్నే మనం మ్యానిఫెస్టో అంటాం. జగన్ తన పార్టీ బహిరంగ సభల్లో తను గత ఐదేండ్లు చేసిన పనులు, గెలిస్తే చెయ్యబోయే పనులు చెప్పుతూ తిరిగారు. కానీ చంద్రబాబు గానీ, ఆయనతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో మీటింగుల్లో పాల్గొన్న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గానీ ఆ నైతికతను పాటించలేదు. ఎదుటి నాయకుడిని నిందించే నైతికతను మాత్రమే పాటించారు.

ప్రధానమంత్రిగా మోదీ దేశ స్థాయిలో కూడా తన మ్యానిఫెస్టో గురించి గానీ, తను గత పదేండ్లుగా చేసిన పనుల గురించి గానీ చెప్పలేదు. రాహుల్ గాంధీ మీద 'శహజాదా' (యువరాజు) అనే పదజాలంతో నిరంతరం దాడి చేశారు. అంతకంటే ఘోరంగా ముస్లింలను ఉద్దేశించి 'ఎక్కువమంది పిల్లల్ని కనేవాళ్ళు' అనే పదజాలంతో దాడి చేయడం ఎన్నికల నైతికతకు పూర్తిగా భిన్నమైంది. ఈ దేశంలో ముస్లిమేతరులు, ముఖ్యంగా బీదవారు కూడా చాలామంది పిల్లల్ని కంటారు. ఆయనే స్వయంగా తన తల్లిదండ్రులకు ఆరుగురిలో ఒకరు. ఈ రచయిత తన తల్లిదండ్రులకు ఎనిమిది మంది పిల్లల్లో ఒకడు. ఈ భాష మతం ఎన్నుకొని పుట్టని పిల్లలపై దాడి చేస్తుంది. ఒక దేశ ప్రధానమంత్రి ఇలాంటి భాష వాడినప్పుడు అలా ఎక్కువ సంతానం ఉన్న అన్ని కుటుంబాల్లో, ముఖ్యంగా చిన్న పిల్లల్లో సైతం భయాందోళన మొదలవుతుంది. ఇది అటువంటి పిల్లలను జీవితాంతం భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఎన్నికల నైతికతలో పిల్లల్ని, అమాయకుల్ని భయభ్రాంతుల్ని చేసే భాష అసలుండకూడదు. కానీ దేశ ప్రధానమంత్రే బహిరంగ సభల్లో ఇలా మాట్లాడితే, ఆ భాషకు ఎన్నికల కమిషన్ నుండి కూడా చెక్ లేకపోతే దేశంలో ఎన్నికల వ్యవస్థ కొనసాగడం కష్టం. క్రమంగా ఈ దేశ రాజ్యాంగానికీ, ప్రజాస్వామ్యానికీ ప్రమాదం ఇటువంటి ధోరణుల నుండే వస్తుంది.

ఈ ఎన్నికల్లో రాజ్యాంగానికీ, రిజర్వేషన్లకూ ప్రమాదమున్నదనే ప్రచారాన్ని కాంగ్రెస్ పెద్ద ఎత్తున చేసింది. రాహుల్ గాంధీ ప్రతి బహిరంగ సభలో రాజ్యాంగాన్ని చూపిస్తూ బీజేపీ తిరిగి గెలిస్తే ప్రమాదముందని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అందుకు విరుగుడు రిజర్వేషన్లను కాపాడటం, పెంచడంలో ఉందని మొదటిసారి కాంగ్రెస్ ప్రచారం చేసింది. నిజంగానే ఆర్ఎస్ఎస్–బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని క్రమంగా రద్దు చేసే అవకాశముందా? ఈ రాజ్యాంగాన్ని 1950లో ఆమోదించినప్పుడు ఆర్ఎస్ఎస్ ఒక పక్క, ఆనాటి కమ్యూనిస్టులు మరో పక్క వ్యతిరేకించారు. ఈ రాజ్యాంగం భారతీయ సంస్కృతిని (అంటే బ్రాహ్మణీయ సంస్కృతిని) ప్రతిబింబించదనీ, అది పాశ్చాత్య సంస్కృతిని ప్రతిబింబిస్తుందనీ ఆర్ఎస్ఎస్ స్పష్టంగా చెప్పింది. కమ్యూనిస్టులేమో శ్రామికవర్గ నియంతృత్వ రాజ్యాంగం కావాలి, ఇటువంటి బూర్జువా రాజ్యాంగం వద్దని ప్రకటించారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్– బీజేపీ బయటకు చెప్పేది వారి అసలైన అభిప్రాయం కాదు. 400 పైన స్థానాల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని కొంతమంది ఎన్నికలకు ముందు ప్రకటించారు. ఈ రాజ్యాంగ రక్షణకు మోదీ గ్యారెంటీ లాంటి వ్యక్తిగత ప్రకటనలు పనికిరావు. వంద సంవత్సరాల నుండి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఏం చెబుతోంది అనేది లోతుగా చూడాలి.

ఈ మధ్యకాలంలో సనాతన ధర్మాన్ని కాపాడాలని ఆర్ఎస్ఎస్, బీజేపీల్లోని పై కులస్థులతోపాటు ఓబీసీ అయిన మోదీ కూడా చాలా సార్లు మాట్లాడారు. సనాతన ధర్మం అంటే ఇప్పుడు అందరూ అనుకునే హిందూయిజం కాదు. సనాతన ధర్మం ప్రధానంగా వర్ణ ధర్మం (కుల వ్యవస్థ) కలిగివుంది. ఆర్ఎస్ఎస్, బీజేపీల్లోని బీసీ, ఎస్సీలు... మళ్ళీ వర్ణ ధర్మం పాత పద్ధతిలో నెలకొల్పాలంటే ఈ రాజ్యాంగాన్ని రద్దు చెయ్యకుండా సనాతన ధర్మాన్ని తిరిగి స్థాపించడం సాధ్యం కాదు అని అర్థం చేసుకోవాలి. ఆ నిర్మాణాల్లో ఉన్న శూద్రులు, బీసీలు, ఎస్సీలు, ఆదివాసులు ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం లోతు చూడకపోతే తాము మునిగి దేశాన్ని కూడా ముంచే అవకాశముంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొత్త పీజీలు



కొత్త ట్రెండ్ మొదలైంది. వాట్సాప్ యూనివర్సిటీల్లో పట్టభద్రులైనవాళ్లలో చాలామంది ఇప్పుడు తమ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను పాడ్‌కాస్ట్ ఇన్‌స్టిట్యూట్ నుంచి చేస్తున్నారు.

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

సాంకేతిక తరంగాలు



నేను ఇప్పటివరకు సాంకేతిక పరిజ్ఞానంలో మూడు పెద్ద వేవ్స్ చూశాను. వాటి మధ్య విరామం సమంగా ఉండటం గమనార్హం. 1970ల మధ్యలో చిప్స్ రావడం, 1990ల చివర్లో వెబ్ రావడం, 2020ల మొదట్లో ఏఐ (కృత్రిమ మేధ) రావడం.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

నియంత్రణ ఉచితం!



ప్రో–ఛాయిస్ (మహిళల ఎంపిక పట్ల సానుకూలత) అంటే, కుటుంబాన్ని ప్రారంభించాలా, వద్దా? లేదా ఎప్పుడు ప్రారంభించాలి అనే విషయంలో మహిళలకు స్వేచ్ఛ ఉందని నమ్మడం. అందుకే మేము అత్యవసరాలతో సహా అన్ని సంతాన నిరోధకాలను (కాంట్రాసెప్టివ్స్) కెనడాలో ఉచితం చేయబోతున్నాం.

– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

అర్థంలేని ఆలోచన



సంతాన నిరోధక సాధనాలను విస్తారంగా అందుబాటులోకి తేవడం అనేది గొప్ప ఆలోచన. కానీ ఉచితంగా కాంట్రాసెప్టివ్స్ అందించడమే 'ప్రో–ఛాయిస్'గా ఉండటానికి గీటురాయి అనుకోవడం అర్థం పర్థం లేని విషయం.

– జొనాథన్ కే, సంపాదకుడు

దశాబ్దాల్లో ఎక్కువ!



ముంబయి కంటే కశ్మీర్‌లో 3 శాతం అధిక పోలింగ్ నమోదైంది. ముంబయిలో సుమారు 56 శాతం నమోదైతే, కశ్మీర్‌లోని బారాముల్లాలో 59 శాతం నమోదు కావడం అనేది దానికదే గొప్ప కథనం. నాలుగు దశాబ్దాల కాలంలో బారాముల్లాలో ఇదే అత్యధిక నమోదు. ఆర్టికల్ 370 రద్దే దీన్ని సాధ్యం చేసింది.

– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

ప్రకృతికి దూరం



మనుషులు తమ వ్యవహారాల్లో చాలా బిజీగా ఉండి ప్రకృతితో చాలావరకు సంబంధం కోల్పోయారు. తమ పరిసరాల పట్ల అవగాహనలో జంతువులే మనుషుల కన్నా మెరుగ్గా ఉన్నాయి. ఈ విషయం మనం జాగ్రత్తగా వాటి నుంచి గ్రహించి నేర్చుకోవాలి.

– ఫ్రాంక్ హూగెర్‌బీట్స్, పరిశోధకుడు

సమయపాలన తప్పా?



సమయపాలన అనేది ఇతరుల కాలానికి మనం ఇచ్చే గౌరవానికి సంకేతం అని నమ్మేలా నన్ను పెంచారు. దురదృష్టవశాత్తూ మీరు పంక్చువల్‌గా ఉండే వ్యక్తి అయితే, మీకు ఇంకే పనీ లేదని చాలామంది భావిస్తూ... ఉల్లాసంగా మీ సమయాన్ని ఉపేక్షిస్తుంటారు.

– నిస్తులా హెబ్బర్, జర్నలిస్ట్

నిబంధనల అమలులోనే అసలు చిక్కు!

సందర్భం



దినేశ్ సి. శర్మ

భారతీయ మసాలాలపై హాంకాంగ్ ఈమధ్యే నిషేధం విధించింది. మూడు బ్రాండ్లపై ఈ నిషేధం వేటు పడింది. సింగపూర్‌లోనూ ఇంకో భారతీయ మసాలా కంపెనీపై ఇలాంటి క్రమశిక్షణ చర్యలే తీసుకున్నారు. ఎథిలీన్ ఆక్సైడ్ అనే కేన్సర్ కారక రసాయనం పరిమితికి మించి ఉన్నట్లు తేలడంతో ఆ యా దేశాల నియంత్రణ సంస్థలు ఈ చర్యలకు పాల్పడ్డాయి. మాల్దీవులు చర్యలకు సిద్ధమవుతూండగా... అమెరికా, ఆస్ట్రేలియా ఆహార నియంత్రణ సంస్థలు కూడా మసాలాల్లో కలుషితాలపై నివేదికలను అధ్యయనం చేసే పనిలో ఉన్నాయి.

నిజానికి ఇలాంటి చర్యలు భారతీయ కంపెనీలకు కొత్తేమీ కాదు. అమెరికా చేరుతున్న భారతీయ ఉత్పత్తుల్లో ఏటా కొన్ని వందలు నాణ్యత ప్రమాణాల లేమి కారణంగా తిరస్కరణకు గురవుతూనే ఉంటాయి. ఆయుర్వేద మందులపై కూడా ఎఫ్‌డీఏ తరచూ హెచ్చరికలు జారీ చేస్తూంటుంది. సీసం వంటి ప్రమాదకర భారలోహాలు, పదార్థాలు పరిమితికి మించి ఉంటాయన్నది వీరు తరచూ వ్యక్తం చేసే అభ్యంతరం. చిన్న పిల్లల ఆహారం విషయంలో ఇటీవలే అంతర్జాతీయ కంపెనీ నెస్లే భారత్‌లో మాత్రమే అధిక చక్కెరలు వాడుతున్న విషయం బయటపడ్డ సంగతి తెలిసిందే.

ఇలాంటి ఘటనలు అన్నింటిలోనూ ఒక నిర్దిష్ట క్రమం కనిపిస్తుంది. కంపెనీ భారత్‌ది అయినా, విదేశీయులది అయినా సరే మా తప్పేమీ లేదని ప్రకటిస్తాయి. తయారు చేసిన దేశం లేదా ఎగుమతి చేస్తున్న దేశం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తున్నామని కూడా చెబుతాయి. భారతీయ నియంత్రణ సంస్థలు ఇచ్చే సమాధానం కూడా పద్ధతిగా ఉంటుంది. 'పరిస్థితిని అధ్యయనం చేస్తున్నాం' అనేసి చేతులు దులిపేసుకుంటాయి. విదేశీ సంస్థలు సమాచారం పంచుకోలేదన్న ఆరోపణ కూడా ఉంటుంది.

ఎగుమతి ప్రోత్సాహక వ్యవస్థలు, కంపెనీలు రెండూ తాము బాధితులమని వాదిస్తూంటాయి. భారతీయ ఎగుమతులను మాత్రమే పాశ్చాత్య దేశాలు అడ్డుకుంటున్నాయని వాపోతాయి కూడా. ఈ మొత్తం వ్యవహారంలో నిస్సహాయంగా మిగిలిపోయేదెవరూ అంటే... వినియోగదారుడు మాత్రమే. కొంచెం సద్దుమణిగిన తరువాత అంతా షరా మామూలుగానే నడిచిపోతూంటుంది.

కల్తీ, హానికారక, కాలుష్యాలతో కూడి ఆహార పదార్థాలు విదేశాలను చేరుతున్న విషయంలో అసలు సమస్య ఏమిటన్నది ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆహార నియంత్రణ వ్యవస్థ నిబంధనల్లోని లోటుపాట్లు సరి చేసే ప్రయత్నం జరగడం లేదు.

ఇంకో ముఖ్యమైన విషయం పరిశ్రమలను, ఎగుమతులను కాపాడుకోవాలనే నెపంతో ప్రభుత్వాలు చేసే ప్రయత్నాలు. తప్పు చేసినా వాటి ప్రభావం నుంచి తప్పించేందుకు ప్రయత్నించడం. ఈ క్రమంలోనే వీళ్లు ప్రజారోగ్యాన్నీ; వినియోగదారులు, పౌర సమాజ నిపుణుల అభిప్రాయాలనూ తోసిపుచ్చుతూంటారు.

వివాదాల్లో చిక్కుకున్న కంపెనీలు భారత్‌లోని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)' నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తున్నట్లు చెప్పుకుని ఎలాగోలా తప్పించుకుంటాయి. నెస్లే విషయంలో ఈమధ్య జరిగింది ఇదే. కాబట్టి... ఆహార రంగంలో ఎగుమతులకు సంబంధించి ప్రమాణాలను స్పష్టంగా నిర్వచించడం చాలా అవసరం. ఎఫ్ఎస్ఎస్ఏఐలో ఆహార ఉత్పత్తుల (పానీయాల నుంచి సముద్ర ఉత్పత్తుల వరకూ) ప్రమాణాలపై సమాచారం ఇచ్చేందుకు, నిర్దేశించేందుకు 26 శాస్త్రీయ కమిటీలు ఉన్నాయి. 2008లో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఏర్పాటు జరిగినప్పుడు ఏర్పాటైన ఈ ప్యానెల్స్‌లో భారతీయ, విదేశీ కంపెనీ ప్రతినిధులు ఉన్నారు. ఈ విషయంపై పెద్ద ఎత్తున దుమారం చెలరేగడంతో వీటి పునర్వ్యవస్థీకరణ జరిగినప్పటికీ ఆహార కంపెనీల ప్రతినిధుల పెత్తనమే ఇప్పటికీ కొనసాగుతోంది.



కొన్నేళ్ల తరువాత ఇది కూడా మారింది. ప్రస్తుతం ఈ ప్యానెళ్లలో ఎక్కువగా శాస్త్రవేత్తలు, రిటైర్ అయిన వాళ్లు ఉంటున్నారు. అయినప్పటికీ నిబంధనల రూపకల్పనలో పరిశ్రమల ప్రభావం లేదని కచ్చితంగా చెప్పే పరిస్థితి లేదు. ప్రస్తుతమున్న ప్యానెళ్ల కూర్పును మచ్చుకు తరచి చూస్తే చాలామందికి ఇప్పుడు, లేదంటే గతంలో... పరిశ్రమలతో ఏదో ఒక లింకు కచ్చితంగా కనిపిస్తుంది.

ఎఫ్ఎస్ఎస్ఏఐ ముందు ఈ ప్యానెళ్ల సభ్యుల పూర్వాపరాలను కచ్చితంగా బహిరంగపరచాలి. దీనివల్ల వినియోగదారుడికి తాను తినే ఆహారానికి సంబంధించి ఎవరు రూల్స్ తయారు చేస్తున్నారో స్పష్టంగా తెలుస్తుంది. అలాగే సీఐఐ, హిందుస్థాన్ లీవర్ వంటి సంస్థలతో ఎఫ్ఎస్ఎస్ఏఐ భాగస్వామ్యం వంటి ఏర్పాటు పలు సమస్యలకు దారి తీస్తున్న విషయాన్ని గుర్తించాలి. నిష్పాక్షిక, పారదర్శక సంస్థగా ప్రజల మద్దతు పొందే ప్రయత్నం చేయడం అవసరం, మేలు కూడా.

చాలా ఏళ్ల వినియోగదారు సమూహాలు, ఆరోగ్య నిపుణులు ఉప్పు, చక్కెర, కొవ్వులు అధికంగా ఉన్న ఆహార పదార్థాలపై ప్రత్యేకమైన లేబుల్ ఒకటి వేయాలని కోరుతున్నాయి. అయితే ఫుడ్ సేఫ్టీ అథారిటీ, పరిశ్రమ వర్గాలు రెండూ దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇంకోవైపు ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిశ్రమలు చేసే డిమాండ్లను నెరవేర్చడంలో చాలా చురుకుగానే ఉంటోంది. విటమిన్లు ఇతర పోషకాలను చేర్చిన ఆహారానికి ప్రత్యేకమైన లేబుల్ ఉండాలన్న పరిశ్రమ డిమాండ్‌ను ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆగమేఘాలపై ఒప్పేసుకోవడం ఒక ఉదాహరణ.

ఆహార పదార్థాల విషయంలో నియంత్రణ అధ్వాన్నంగా ఉంటే... పరిశ్రమ వర్గాల నిబంధనల పాలన కూడా అంతే తక్కువ అని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) స్వయంగా గుర్తించిన విషయాన్ని ఇక్కడ మనం గుర్తు చేసుకోవాలి. కాగ్ 2017 లోనే ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాలను నిర్దేశించేందుకు సమయ బద్ధమైన ప్రణాళిక ఏదీ పాటించడం లేదని విమర్శించింది. అసంపూర్తిగా ఉన్న సమాచారం ఆధారంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ కంపెనీలకు లైసెన్సులు ఇచ్చింది, ఆహార పదార్థాలను పరిశీలించే ల్యాబొరేటరీలు 72లో 56 ల్యాబ్స్‌కు తగిన అక్రిడిషన్ సర్టిఫికెట్లు కూడా లేనవి ఎత్తి చూపింది. పార్లమెంటరీ కమిటీ ఒకటి కూడా ఆహార పదార్థాలకు సంబంధించిన నియమ నిబంధనల రూపకల్పన విషయంలో మరింత పారదర్శకత తీసుకు రావాల్సిన అవసరాన్ని తన నివేదిక రూపంలో స్పష్టం చేసిన విషయం గమనార్హం. ఆహార పదార్థాల విషయంలో కొంత జాగరూకతతో వ్యవహరించాలన్నది ఇప్పటికైనా గుర్తిస్తే అది ప్రజారోగ్యానికి మంచి చేయగలదని అర్థం చేసుకోవాలి.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

ముఖ దోషం

జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి పనికొచ్చే ఎన్నో సాధనాలను భగవంతుడు మనిషి స్వాధీనంలో ఉంచాడు. కానీ దురదృష్టవశాత్తూ మనుషులు ఆ సాధనాలను వాడవలసినంత విరివిగా, తెలివిగా వాడుతున్నట్టు కనిపించదు!

అలాంటి సాధనాలలో మౌనం ఒకటి. మనిషిని తగులుకొని వేధించే సమస్యలలో ఎన్నింటినో నిర్మూలించగల దివ్యౌషధం మౌనం. అంతేకాదు, చాలా సమయాలలో అసలు సమస్యలు తలెత్తకుండానే నిరోధించగల 'వాక్సిన్' కూడా!

ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని సాధించిన వాళ్ళూ, సాధించగోరే వాళ్ళూ ఎక్కువగా మౌనాన్ని అవలంబిస్తూ ఉండడం మన దేశంలో అనాదిగా కనిపిస్తూ వస్తున్నదే. అలాంటి మహనీయులను మన సంప్రదాయం మార్గ దర్శకులు గానూ, గురువులు గానూ గుర్తించి గౌరవిస్తుంది.



జ్యోతిర్మయం

సార్వజనీన జీవితంలో, నాయకులకు మౌనం మహత్తరమైన గౌరవాన్ని ఆపాదించి పెడుతుందని అప్పుడెప్పుడో గాంధీగారు ఆచరణ పూర్వకంగా చూపారు. ఎన్నో రాజకీయ సమస్యల పరిష్కారానికి మౌనం రామబాణంలా పనిచేస్తుందని, నిన్న మొన్న మన పీవీ నరసింహారావుగారూ నిష్కర్షగా నిరూపణ చేశారు.

ఇందుకు విరుద్ధంగా, నిరర్థకమైన వాగ్వివాదాల వల్ల నిక్షేపంలా ఉన్న సంబంధాలలో తూట్లు పొడుచుకునే తొందరపాటు కూడా విశ్వవ్యాప్తంగా కనిపించే వ్యవహారమే. నోటిని అదుపులో ఉంచుకోలేకపోవడమనే 'ముఖ దోషం' వల్ల శుక, శారికలు (చిలుకలూ, గోరింకలు) పంజరంలో ఎలా చిక్కుకుంటాయో గమనించమంటాడు ఒక పూర్వ కవి. **ఆత్మనః ముఖ దోషేన బధ్యంతే శుక శారికాః!** పలుకు లేని చిలుకను పంజరంలో ఎవరు ఉంచుతారు? చిలకా గోరింకల లాంటి యువ దంపతులు కూడా మౌనపు గోటిమీటుతో పోయే సంఘర్షణలకు, మాటల గొడ్డళ్ళను ఒకరి మీద ఒకరు దూసుకుని, పండంటి కాపురాలను పాడు చేసుకోవడం ఆధునిక సమాజంలో అరుదు కాదు. వాక్కు అనే కత్తిని, మౌనం అనే ఒరలో ఎంత ఎక్కువసేపు ఉంచితే అంత క్షేమం.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

27న హజ్ యాత్ర ప్రారంభం

- వివరాలు వెల్లడించిన హజ్ కమిటీ సీఈఓ అబ్దుల్ ఖాదిర్

సాక్షి, అమరావతి: ఈనెల 27వ తేదీ నుంచి హజ్–2024 యాత్ర ప్రారంభమవుతుందని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) ఎల్.అబ్దుల్ ఖాదిర్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విజయవాడ ఎంబార్గేషన్ పాయింట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మూడు విమానాలు హజ్ యాత్రీకులను తీసుకుని వెళ్తాయని పేర్కొన్నారు. ఇందుకోసం గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేసరపల్లిలోని ఈద్గా జామ మసీదు వద్ద హజ్ వసతి క్యాంపు కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. హజ్ యాత్రీకులు వారి ప్రయాణ వివరాలను హజ్ వసతి క్యాంపు వద్ద తెలియజేయాలని ఇప్పటికే సమాచారం అందించామన్నారు. యాత్రకు సంబంధించి మరింత సమాచారం కోసం 1800 4257873 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. రాష్ట్ర హజ్ కమిటీ వెబ్‌సైట్ www.apstatehajcommittee.com ను కూడా సంప్రదించవచ్చని అబ్దుల్ ఖాదిర్ తెలిపారు.

విశాఖ జూలో లోయిస్ట్ మంకీస్ సందడి




నల్లని రంగు, పొడవైన తోక, గెడ్డం నుంచి చెవుల వరకు తెల్లని జుట్టు, ఎర్రని కళ్లు, సుమారు అడుగు పొడవున్న అరుదైన ఆఫ్రికన్ వానరాలు ఇందిరాగాంధీ జూ పార్కులో సందర్శకులను విశేషంగా అలరిస్తున్నాయి. రెండు నెలల కిందట కొందరు ఒడిశా నుంచి శ్రీకాకుళం మీదుగా ఒక జత ఆఫ్రికన్ జాతికి చెందిన కోతులను గుట్టుగా తరలిస్తుండగా శ్రీకాకుళం జిల్లా అటవీశాఖ అధికారులు పట్టుకుని విశాఖ జూ పార్కుకు అప్పగించారు. వాటిని క్వారెంటైన్‌లో 40 రోజులు ఉంచి వారం కిందటే ఎన్‌క్లోజర్‌లో విడిచిపెట్టారు.'లోయిస్ట్ మంకీస్'గా పిలిచే ఈ వానరాలు ఎన్‌క్లోజర్‌లో హుషారుగా ఇటు ఇటు తిరుగుతూ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో జూ పార్కు విద్యార్థులు, చిన్నారులతో కిటకిటలాడింది. –ఆరిలోవ (విశాఖ జిల్లా)

మలబార్ గ్రూప్‌నకు బాంబే హైకోర్టులో ఊరట

సాక్షి, హైదరాబాద్: మలబార్ గ్రూప్‌నకు బాంబే హైకోర్టు ఊరటనిచ్చింది. 77 వేల మంది నిరుపేద బాలికలకు విద్యా స్కాలర్‌షిప్‌లను అందించిన మలబార్ గ్రూప్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు వ్యతిరేకంగా సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లలో దుష్ప్రచారం చేస్తున్న పోస్ట్‌లను తొలగించాలని తీర్పును వెలువరించింది. మలబార్ గ్రూప్ పరువుకు నష్టం కలిగించే కంటెంట్‌ను వెంటనే తొలగించాలని, తదుపరి పరువు నష్టం కలిగించే స్టేట్‌మెంట్‌లను జారీ చేయకూడదని ప్రతివాదులను ఆదేశించింది. ఈమేరకు కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఒక నిర్దిష్ట కమ్యూనిటీకి చెందిన బాలికలకు అందించిన స్కాలర్‌షిప్‌లను క్యాప్చర్ చేసి ఫొటోగ్రాఫ్‌ను పబ్లిష్ చేయడాన్ని కోర్టు తప్పుబట్టింది. ఈ పోస్ట్ మలబార్ గ్రూప్ ప్రతిష్టను దెబ్బతీస్తోందని, ఇది సమాజంలో విభజనకు కారణమయ్యే ప్రమాదముందని కోర్టు నొక్కిచెప్పింది.

స్టీల్‌ప్లాంట్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా పురుషోత్తమన్

ఉక్కునగరం (విశాఖ జిల్లా): స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా బ్రెత్ వెయిట్ కంపెనీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సలీం పురుషోత్తమన్ ఎంపికయ్యారు. స్టీల్‌ప్లాంట్ పూర్వ డైరెక్టర్ ఎ.కె.సక్సేనా మోయిల్ ఎండీగా నియమితులు కావడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఆ పోస్టు ఇంటర్వ్యూకు అర్హత లభించకపోవడంతో స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్ట్స్ సీజీఎం ఇన్‌చార్జి డాక్టర్ వి.ఆర్.బాపారావు రాష్ట్ర హైకోర్టులో కేసు వేశారు. దాంతో అప్పట్లో ఆ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహించినప్పటికి ఫలితాలు వెల్లడించలేదు. ఉక్కు మంత్రిత్వశాఖ ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌ను సలహా కోరగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయమని సూచించింది. వారి సూచన మేరకు మంగళవారం జరిగిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) సమావేశంలో పురుషోత్తమన్‌ను ఎంపిక చేసినట్టు అధికారులు ధ్రువీకరించారు. అయితే హైకోర్టు తీర్పు మేరకు నియామక ప్రక్రియ పూర్తవుతుందని పీఈఎస్‌బీ వెబ్‌సైట్‌లో పేర్కొంది.

తిరుమలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమలకు చేరుకున్నారు. శ్రీ పద్మావతినగర్‌లోని రచన అతిథి గృహం వద్దకు చేరుకున్న రేవంత్ రెడ్డికి టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. రాత్రి తిరుమలలో బస చేసి బుధవారం ఉదయం విఐపీ విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకోనున్నారు.

ప్రకృతి హితం.. మన అభిమతం



- ప్రత్యేక క్లైమేట్ చేంజ్ సెల్‌ను రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వం
- 'లైఫ్ మిషన్'లో భాగంగా భూమి, పర్యావరణ పరిరక్షణ చర్యలు
- ఈఏబీపీ ద్వారా వాతావరణ సమస్యల పరిష్కారం
- డిస్కంలు, మున్సిపాలిటీలు, రవాణా సంస్థలకు భాగస్వామ్యం

నేడు అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం

సాక్షి, అమరావతి: భావితరాలకు స్వచ్ఛమైన భూమి, గాలి, నీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ సంస్థలు చేపట్టే పర్యావరణ హిత కార్యక్రమాల్లోను భాగమవుతోంది. పర్యావరణ హితం.. తమ అభిమతం.. అని చాటుతోంది. 'పుడమి సేవలో పరిశ్రమిస్తూ.. కాలుష్యాన్ని ప్రతిఘటిస్తూ.. పచ్చదనం పెంచుకుంటే.. ప్రకృతిని కాపాడుకుంటే.. మనిషికి అదే మనుగడ.. జీవకోటికదే తోడూ.. నీడ' అంటూ ఈ ప్రయత్నంలో 'భాగస్వామ్యం కండి' అనే నినాదాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ మే 22న అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. సకల జీవులకు నిలయమైన ఈ భూమిని రక్షించే ఉమ్మడి కార్యాచరణలో మన దేశంతోపాటు మన రాష్ట్రం సైతం పాలుపంచుకుంటోంది. ఈ పవిత్రయజ్ఞంలో భాగంగా 2028నాటికి పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం వ్యక్తిగత, సామూహిక చర్యలు తీసుకోవడానికి కనీసం ఒక బిలియన్ మంది భారతీయులు, ఇతర ప్రపంచ పౌరులను సమీకరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'మిషన్ లైఫ్' ప్రాజెక్టులో ఏపీ భాగమవుతోంది. దీనిద్వారా రానున్న నాలుగేళ్లలో 80శాతం గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలను పర్యావరణ అనుకూలమైనవిగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ బృహత్తర యజ్ఞానికి విశాఖపట్నం నుంచి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.

జీవుల మనుగడకు అనుకూల చర్యలు

ప్రకృతిలో ప్రతి ప్రాణి స్వేచ్ఛగా జీవించేందుకు అనువైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూమి, పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా క్లైమేట్ చేంజ్ సెల్(ఈఈఈ)ను రూపొందించింది. ఈ సెల్ వాతావరణ మార్పులపై జాతీయ కార్యాచరణ ప్రణాళికతో సమానంగా పర్యావరణ వ్యవస్థ ఆధారిత అప్రోచ్(ఈబీఏ) ద్వారా రాష్ట్రంలో వాతావరణ మార్పుల సమస్యలను పరిష్కరిస్తుంది. ఇందులో ఆయా రంగాల నిపుణులు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు, అర్బన్ డెవలప్‌మెంట్, రవాణా శాఖలతోపాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలకు భాగస్వామ్యం కల్పించింది. భూమి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం కోసం మిషన్ లైఫ్ ఎనర్జీ కన్జర్వేషన్, వాటర్ కన్జర్వేషన్, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, అడాప్షన్ ఆఫ్ సస్టెయినబుల్ ఫుడ్ సిస్టమ్స్, వేస్ట్ రిడక్షన్, హెల్తీ లైఫ్ స్టైల్స్, ఈ–వేస్ట్ తగ్గింపు అనే ఏడు విభాగాల్లో 75 కార్యక్రమాలను మన రాష్ట్రంలో అమలుచేస్తున్నారు. అదేవిధంగా కాలుష్యాన్ని తగ్గించడం కోసం స్థానికంగా లైఫ్ గ్రూపులను ఏర్పాటుచేశారు. సైకిల్ ర్యాలీలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లపై స్పెషల్ డ్రైవ్‌లు, సోషల్ మీడియాలో ప్రచారం, కమ్యూనిటీ వర్క్‌షాపులు, సెమినార్లు, క్విజ్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారు. కాలుష్య కారక వాహనాలను అరికట్టడం కోసం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లను చేపడుతున్నారు. పాఠశాలల్లో ఎనర్జీ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా భూమి పరిరక్షణ ఆవశ్యకతపై చైతన్యం తీసుకువస్తున్నారు.

విశాఖలో లైఫ్ మిషన్ అమలు

పర్యావరణ హిత జీవనశైలిని అనుసరించేలా ప్రజలను ప్రోత్సహించడమే లక్ష్యంగా మొదలైన లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ పథకం అమలుకు రాష్ట్రంలోని సముద్ర తీరప్రాంతంలో ఉన్న విశాఖ నగరం అనుకూలమని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) గుర్తించింది. దేశవ్యాప్తంగా 2028 నాటికి 5.15 లక్షల గ్రామాలు, 3,700 పట్టణ స్థానిక సంస్థల్లోని కోటి మంది ప్రజలను 'ప్రో ప్లానెట్ పీపుల్'గా మార్చాలనేది లైఫ్ మిషన్ లక్ష్యం. పుడమి, జీవ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ పథకాన్ని విశాఖలో అమలు చేయనున్నట్లు బీఈఈ ఇటీవల ప్రకటించింది. విశాఖతోపాటు విజయవాడ, కాకినాడ, కర్నూలు, తిరుపతి నగరాలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు బీఈఈ వెల్లడించింది. లైఫ్ మిషన్ అమలుకు బీఈఈ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దశలవారీ కార్యాచరణ రూపొందిస్తోంది.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ దంపతులు

తిరుమల: తిరుమల శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో ఆర్మీ కమాండర్ బి.సూరజ్ బర్రీ ఉన్నారు.

టీడీపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలి

- ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసిన టీడీపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు మంగళవారం వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ఓట్లను కొనుగోలు చేసేందుకు డబ్బులు పంచారు. ఇది మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు విరుద్ధం. కాబట్టి ఆయనపై చర్యలు తీసుకోవాలి' అని ఈసీకి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, గ్రీవెన్స్ సెల్ చైర్మన్ ఎ.నారాయణమూర్తి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తగిన ఆధారాలను కూడా అందజేశారు.

రేవ్ పార్టీపై సమగ్ర దర్యాప్తు

- పార్టీలో సినీనటి హేమ పాల్గొన్నారు..ఆమె రక్తనమూనాలు ల్యాబ్‌కు పంపించాం
- హేమ వీడియోపై విచారణ జరుపుతాం : బెంగళూరు పోలీస్ కమిషనర్ దయానంద్ వెల్లడి

బనశంకరి: బెంగళూరు నగర శివారులోని హెబ్బగోడిలో ఓ ఫాంహౌస్‌లో జరిగిన రేవ్‌పార్టీపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...రేవ్ పార్టీలో తెలుగు సినీనటి హేమ ఉన్నారు. సన్‌సెట్ టు సన్‌రైజ్ విక్టరీ అని ఈ రేవ్‌పార్టీకి పేరుపెట్టారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు పార్టీ నిర్వహించాలనుకున్నారు. పార్టీలో ఎండీఎంఏ పిల్స్, హైడ్రో గాంజా, కొకైన్ ఇతర మాదకద్రవ్యాలు విక్రయించారు. రేవ్‌పార్టీలో పాల్గొన్న వారి పేర్లలో హేమ పేరు వినబడగానే ఆమె జాగ్రత్త పడి, ఫాంహౌస్ ఖాళీ స్థలంలోకి వెళ్లి నేను ఆ పార్టీలో లేను, హైదరాబాద్‌లో ఫాంహౌస్‌లో ఉన్నాను అని చెప్పింది. ఆమె వీడియో గురించి కూడా దర్యాప్తు చేస్తున్నాం. పార్టీలో పాల్గొన్న వారందరికీ వైద్యపరీక్షలు చేపట్టాం, నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటాం. రేవ్‌పార్టీ జరిగిన స్థలం బెంగళూరు రూరల్‌లోని హెబ్బగోడి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో కేసును ఎలక్ట్రానిక్ సిటీ పీఎస్ నుంచి హెబ్బగోడి పీఎస్‌కు బదిలీ చేశాం.

డ్రగ్స్ విసిరేశారు

రేవ్‌పార్టీలో వందమందికి పైగా పాల్గొన్నారు. దాడి సమయంలో మాదక ద్రవ్యాలు లభించాయి. కొందరు దొరికిపోతామనే భయంతో స్విమ్మింగ్‌పూల్, టాయ్‌లెట్ తదితర స్థలాల్లోకి డ్రగ్స్ విసిరేశారు, వాటిని వెతకడానికి జాగిలాలను ఉపయోగించాం. రణధీర్, మహమ్మద్‌సిద్దికి, వాసు, అరుణ్‌కుమార్, నాగబాబులను అరెస్టు చేసి విచారిస్తున్నాం. ఈ పార్టీలో ప్రజాప్రతినిధులు పాల్గొనలేదన్నారు. పార్టీలో సిద్దిక్, రణధీర్, రాజ్‌బావ డ్రగ్స్ విక్రయించారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో సీసీబీ అధికారులు దాడి చేశారు. నటి హేమ కూడా పార్టీలో ఉంది. ఆమె రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాం. ప్రతి ఒక్కరిని విచారించి సీసీబీ వాంగ్మూలం సేకరిస్తుంది. అందరితో పాటు హేమకు కూడా నోటీసులు జారీ చేసి తదుపరి విచారణకు పిలుస్తాం' అని దయానంద్ తెలిపారు.

వసంతోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి (తిరుపతి జిల్లా): తిరుచానూరులో కొలువైన శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనుంది. వసంతోత్సవాలకు అవరోధాలు కలగకుండా సకల దేవతలను కోరుతూ మంగళవారం రాత్రి పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు అంకురార్పణ నిర్వహించారు. అమ్మవారిని వేకువనే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. యాగశాలలో సిద్ధంగా ఉంచిన నవ పాళికలలో పుట్టమన్ను నింపి, అందులో నవధాన్యాలు వేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టడంతో వసంతోత్సవాలు ప్రారంభమయ్యాయి. వసంతోత్సవాల సందర్భంగా రోజూ మధ్యాహ్నం 3 గంటలకు ఉద్యానవనంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం, రాత్రి 7.30 గంటలకు తిరువీధోత్సవం నిర్వహించనున్నారు.



ఉద్యానవనంలో పుట్టమన్ను సేకరిస్తున్న ఆలయ అర్చకులు, వేద పండితులు

రేపు స్వర్ణరథోత్సవం

వసంతోత్సవాల్లో రెండో రోజైన గురువారం ఉదయం 7.45 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై కొలువై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వసంతోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను ఆలయ అధికారులు రద్దు చేశారు. వసంతోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. స్నపన తిరుమంజనం జరిగే మండపం చుట్టూ చల్లదనం కోసం వట్టివేళ్లతో తెరలను ఏర్పాటు చేశారు. భక్తులను ఆకట్టుకునేలా రంగోళి, అమ్మవారి చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీలు, విద్యుత్ దీపాలంకరణతో ఉద్యానవనం నూతన శోభను సంతరించుకుంది. అంకురార్పణ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యదేవుని రథోత్సవం



అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైన రత్నగిరి వాసుడు శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ చరిత్రలోనే తొలిసారిగా 36 అడుగుల ఎత్తు కలిగిన నూతన టేకు రథంపై స్వామి, అమ్మవార్లను కొండ దిగువన మెయిన్ రోడ్డులో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఊరేగించనున్నారు. కల్యాణ మహోత్సవాల్లో ప్రతి రోజూ రాత్రి తొమ్మిది గంటల నుంచి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని వివిధ వాహనాల్లో ఊరేగించడం ఆనవాయితీ. అయినప్పటికీ భద్రతా ఏర్పాట్లతో పాటు ముందు జాగ్రత్తగా రథోత్సవాన్ని సాయంత్రం 5 గంటలకే ప్రారంభిస్తున్నారు. దీనికి విస్తృత ఏర్పాట్లు చేశామని దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా 200 మంది కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సత్యదేవుని ఉత్సవ వాహనాల్లో ఇప్పటి వరకూ సుమారు 20 అడుగుల ఎత్తు కలిగిన రావణబ్రహ్మ వాహనమే పెద్దది. ఈ ఏడాది 36 అడుగుల ఎత్తు, 14.6 అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవుతో రూ.1.04 కోట్లతో ఇటీవలే టేకు రథం తయారు చేయించారు.

చైనా గ్యాంగ్ చెరలో భారతీయులు

- ఒక్క ఏపీ నుంచే 150 మంది
- ఉద్యోగాల పేరుతో విదేశాలకు మానవ అక్రమ రవాణా
- బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్న చైనా గ్యాంగ్
- కంబోడియాలో భారతీయుల తిరుగుబాటు
- ఈ రాకెట్‌ను బయటపెట్టిన విశాఖ పోలీసులు
- తిరుగుబాటుదారులను అరెస్టు చేసిన అక్కడి పోలీసులు
- జైలులో ఉన్న వారిని తిరిగి తీసుకురావడానికి ప్రయత్నాలు
- బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు

విశాఖ సిటీ: విదేశీ ఉద్యోగాలంటూ కోటి ఆశలతో కంబోడియా వెళ్లిన భారతీయులు మోసపోయారు. కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగమని తీసుకువెళ్లి అక్కడ బలవంతంగా సైబర్ నేరాలు చేయిస్తున్న చైనా గ్యాంగ్‌పై సోమవారం తిరుగుబాటు చేసిన బాధితులు జైలుపాలయ్యారు. నిర్వాహకులు తమను చిత్రహింసలకు గురి చేస్తున్నారని కొంత మంది బాధితులు విశాఖ పోలీసులకు మంగళవారం వాట్సాప్‌తో పాటు 'ఎక్స్' ద్వారా వీడియో సందేశాలు పంపించారు. దీంతో బాధితులను తీసుకువచ్చేందుకు విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ విషయాన్ని బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ఉద్యోగాల పేరుతో విదేశాలకు మానవ అక్రమ రవాణా రాకెట్ గుట్టు విశాఖ పోలీసులు మూడు రోజుల కిందట బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు గాజువాక ప్రాంతానికి చెందిన ముగ్గురు ఏజెంట్లను అదుపులోకి తీసుకొని విచారించగా విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణా

విదేశాల్లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు అంటూ గాజువాకకు చెందిన చుట్టా రాజేష్ విజయ్‌కుమార్ సోషల్ మీడియాలో ప్రకటనలు ఇచ్చాడు. అది నిజమని నమ్మి విశాఖ నుంచే కాకుండా రాష్ట్రంలో సుమారు 150 మంది నిరుద్యోగులు రూ.1.5 లక్షలు చొప్పున చెల్లించారు. వారిని బ్యాంకాక్, సింగపూర్‌ల మీదుగా కంబోడియాకు పంపించారు. అక్కడ మరో గ్యాంగ్ బాధితులను రిసీవ్ చేసుకొని కంబోడియాలో పాయిపేట్ వీసా సెంటర్‌కు తీసుకెళ్లింది. ఓ నెలకు టూరిస్ట్ వీసా చేయించి ఆ గ్యాంగ్ చైనా ముఠాకు విక్రయించింది. నిరుద్యోగుల నైపుణ్యం ఆధారంగా వారిని రూ.2,500 నుంచి రూ.4వేల అమెరికన్ డాలర్లకు చైనా కంపెనీలకు అమ్మేశారు.

సైబర్ నేరాలు చేయాలంటూ బలవంతం

చైనా ముఠా నిరుద్యోగులకు టైపింగ్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పరీక్షించింది. తర్వాత టూరిస్ట్ వీసాను బిజినెస్ వీసాగా మార్చింది. కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం కోసం ఏడాది పాటు పనిచేసేలా అగ్రిమెంట్ రాయించుకుంది. మధ్యలో వెళ్లిపోతే 400 డాలర్లు చెల్లించాలని ఒప్పందం చేయించుకుని పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకుంది. ఒప్పందం అనంతరం వారిని కంబోడియాలోనే ఒక చీకటి గదిలో బంధించారు. ఫెడెక్స్, టాస్క్‌గేమ్స్, ట్రేడింగ్‌తో పాటు ఇతర సైబర్ నేరాలు చేయాలని బలవంతం చేశారు. అలా చేయని వారికి ఆహారం పెట్టకుండా చిత్ర హింసలకు గురి చేశారు. ఎలా చేయాలో వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. సైబర్ నేరాలు చేసిన వారికి వచ్చిన డబ్బులో ఒక శాతం కమీషన్‌గా ఇస్తూ.. 99 శాతం చైనా గ్యాంగ్ దోచుకొనేది. వీరు అక్కడ ఉత్సాహంగా పనిచేసేందుకు అదే కాంపౌండ్‌లో పలు రకాల ఎంటర్‌టైన్‌మెంట్లు పబ్, క్యాసినో గేమ్స్, మద్యపానం, జూదంతో పాటు వ్యభిచారం సదుపాయాలు కల్పించారు.

ఒక వ్యక్తి ఫిర్యాదుతో

అక్కడ పని చేసి చైనా వారి చెర నుంచి తప్పించుకున్న నగరానికి చెందిన బొత్స శంకర్ అనే వ్యక్తి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు సైబర్ నేరాలతో పాటు మానవ అక్రమ రవాణా వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకువచ్చారు. రాకెట్‌కు ప్రధాన ఏజెంట్ అయిన చుక్క రాజేష్‌తో పాటు అదే ప్రాంతానికి చెందిన సబ్ ఏజెంట్లు సబ్బవరపు కొండలరావు, మన్నేన జ్ఞానేశ్వరరావులను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అనేక వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. చైనా ముఠా చెరలో సుమారు 5 వేల మంది భారతీయులు ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే 150 మంది చైనా గ్యాంగ్ ఆధీనంలో ఉన్నట్లు గుర్తించారు.

బాధితుల తిరుగుబాటు.. అరెస్టు

కంబోడియాలో చైనా గ్యాంగ్ హింసలను భరించలేని బాధితులు అక్కడి పరిస్థితులను వివరిస్తూ విశాఖ పోలీసులకు వీడియోలు పంపించారు. అలాగే చైనా ముఠాకు వ్యతిరేకంగా మంగళవారం సుమారు 300 మంది బాధితులు కంబోడియాని సైబర్ క్రైమ్ ఫ్రాడ్ ఫ్యాక్టరీల హబ్ అయిన సిహనౌక్‌విల్‌లోని జిన్‌బీ కాంపౌండ్‌లో తిరుగుబాటు చేశారు. తమను వెంటనే భారత్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. అలాగే భారత అధికారులు కూడా తమ పరిస్థితిని గమనించి సహాయం అందించాలని అభ్యర్థించారు. దీనిపై విశాఖ సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ వ్యవహారాన్ని బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

ఏడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు

ఈ కేసుని లోతుగా దర్యాప్తు చేయాలని సీపీ రవిశంకర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జాయింట్ కమిషనర్ ఫకీరప్ప సారథ్యంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.భవానీ ప్రసాద్, సిబ్బందితో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మానవ అక్రమ రవాణా రాకెట్‌ను వెలికితీసేందుకు విస్తృతంగా పనిచేస్తున్నాయి. విశాఖకు చెందిన బాధితులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయం కోసం సైబర్ క్రైమ్ సీఐ 94906 17917, సీపీ వాట్సాప్ నెంబర్ 94933 36633, కంట్రోల్ రూమ్ నెంబర్ 0891–2565454 సంప్రదించాలని సీపీ సూచించారు.

తిరుపతి గంగమ్మ 'జన'జాతర





తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి చెల్లెలుగా భక్తకోటి పూజలందుకుంటున్న శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన తిరుపతి గ్రామదేవత గంగమ్మ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ఎన్నడూ లేని విధంగా వారం రోజుల పాటు జానపద వేషాలు, సాంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు, డప్పు వాయిద్యాల నడుమ జాతర సంబరం అంబరాన్నంటింది. జాతరలో ముఖ్యమైన, ఆఖరి ఘట్టమైన అమ్మవారి విశ్వరూప దర్శనం మంగళవారం అర్ధరాత్రి జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారం రోజుల పాటు వివిధ వేషాలతో అలసిన శక్తి స్వరూపిణికి సోమవారం అర్ధరాత్రి శాస్త్రోక్తంగా సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి అమ్మవారిని శాంతింపజేశారు. మంగళవారం వివిధ వేషాల మొక్కులతో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. మహిళలు పొంగళ్లు పెట్టి, పొర్లుదండాలతో అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు పోలీస్ అధికారులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. అమ్మవారి పూజా కార్యక్రమాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అలహాబాద్ టు అంబేడ్కర్‌నగర్...

యూపీలో రసవత్తర పోరు!

14 లోక్‌సభ స్థానాలకు 25న పోలింగ్

ఉత్తరప్రదేశ్ సుదీర్ఘ ఎన్నికల షెడ్యూల్‌లో ఇప్పటిదాకా ఐదు విడతలకు 53 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల జాతకాలు ఈవీఎంలలోకి చేరిపోయాయి. ఆరో విడతలో 14 స్థానాలకు ఈ నెల 25న పోలింగ్ జరగనుంది. వీటిలో 9 బీజేపీ సిట్టింగ్ స్థానాలు కాగా బీఎస్పీ 4, ఒకటి ఎస్పీ ఖాతాలో ఉన్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎస్పీ-కాంగ్రెస్, బీజేపీ నడుమ హోరాహోరీ సాగుతోంది. బీఎస్పీ ఒంటరి పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆరో విడతలో కీలక నియోజకవర్గాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

అలహాబాద్...
త్రివేణి సంగమంలో హోరాహోరీ

ఒకప్పుడు లాల్ బహదూర్ శాస్త్రి, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ వంటి ఉద్దండులైన ప్రధానులను దేశానికి అందించిన కాంగ్రెస్ కంచుకోట ఈ స్థానం. కానీ దాదాపు 4 దశాబ్దాలుగా పార్టీ ఇక్కడ గెలుపు ముఖం చూడలేదు. చివరిగా 1984లో బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ కాంగ్రెస్ నుంచి అలహాబాద్‌లో గెలుపొందారు. తర్వాత బీజేపీ అగ్రనేత మురళీ మనోహర్ జోషీ ఇక్కడ హ్యాట్రిక్ కొట్టారు. అనంతరం రెండుసార్లు సమాజ్‌వాదీ గెలిచినా తిరిగి కమలనాథులు పట్టుబిగించారు. 2016లో బీజేపీ గూటికి చేరిన యూపీసీసీ మాజీ చీఫ్ రీటా బహుగుణ జోషి గత ఎన్నికల్లో గెలిచారు. ఈసారి బీజేపీ ఆమెను పక్కనపెట్టి మాజీ గవర్నర్ కేసరీనాథ్ త్రిపాఠి కుమారుడు నీరజ్ త్రిపాఠికి టికెటిచ్చింది. ఇండియా కూటమి తరఫున ఎస్పీ సీనియర్ నేత కున్వర్ రియోతీ రమణ్ సింగ్ కుమారుడు ఉజ్వల్ రమణ్ సింగ్ కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. ఇక్కడ పూర్వ వైభవం కోసం ఎస్పీ దన్నుతో కాంగ్రెస్ తీవ్రంగా చెమటోడుస్తుండటంతో పోటీ రసవత్తరంగా మారింది.



ఉజ్వల్ రమణ్ సింగ్

సుల్తాన్‌పూర్... త్రిముఖ పోరు

గోమతి నదీ తీరంలో కొలువుదీరిన ఈ నియోజకవర్గం కూడా ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటే. తర్వాత కమలనాథులు పాగా వేశారు. బీజేపీ నుంచి 2014లో వరుణ్ గాంధీ గెలిచారు. 2019లో వరుణ్ పిలిభిత్‌కు మారగా ఇక్కడ ఆయన తల్లి మేనకా గాంధీ పోటీ చేశారు. కానీ బీఎస్పీ అభ్యర్థి చంద్రభద్ర సింగ్ ఆమెను ఓడించినంత పని చేశారు. కేవలం 14,500 ఓట్లతో మేనక గట్టెక్కారు. ఈసారి కూడా బీజేపీ నుంచి మేనకే రేసులో ఉన్నారు. ఇండియా కూటమి తరఫున ఎస్పీ అభ్యర్థి రామ్ భువల్ నిషాద్ బరిలో ఉన్నారు. ఇక బీఎస్పీ బలమైన ఓటు బ్యాంకున్న ఉద్రజ్ వర్మకు టికెటిచ్చింది. బీఎస్పీ ఇక్కడ 1999, 2004ల్లో విజయం సాధించింది. బీజేపీ, ఎస్పీ, బీఎస్పీ మధ్య త్రిముఖ పోరు ఉత్కంఠ రేపుతోంది.

అంబేడ్కర్‌నగర్...
బీఎస్పీకి ప్రతిష్టాత్మకం!

సోషలిస్ట్ దిగ్గజం రామ్ మనోహర్ లోహియా జన్మస్థలమిది. 2004 దాకా అక్బర్‌పూర్‌గా ఉండేది. బీఎస్పీ కంచుకోట అయిన ఈ స్థానం నుంచి పార్టీ చీఫ్ మాయవతి మూడుసార్లు గెలిచారు. 2008లో పునర్విభజన తర్వాత అంబేడ్కర్‌నగర్‌గా మారింది. గత ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి రితేశ్ పాండే గెలిచారు. ఇక్కడ దళిత, కుర్మి, బ్రాహ్మణ, ముస్లిం ఓటర్లు కీలకం. బీఎస్పీ సిట్టింగ్ ఎంపీ రితేశ్ పాండే ఈసారి బీజేపీలో చేరి ఆ పార్టీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. దాంతో బీఎస్పీ కవార్ హయత్ అన్సారీకి టికెటిచ్చింది. ఎస్పీ నుంచి లాల్జీ వర్మ బరిలో ఉన్నారు. త్రిముఖ పోరులో బీఎస్పీ ఎలా నెగ్గుకొస్తుందో చూడాలి.

ప్రతాప్‌గఢ్... కుర్మి, బ్రాహ్మణ ఓట్లు కీలకం

బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ సంగమ్ లాల్ గుప్తా, ఇండియా కూటమి నుంచి ఎస్పీ అభ్యర్థి ఎస్.పి.సింగ్ పటేల్ బరిలో ఉన్నారు. ఇక్కడ కుర్మి, బ్రాహ్మణ ఓట్లది కీలక పాత్ర. కుర్మి ఓటర్లు 11%, బ్రాహ్మణ ఓటర్లు 16 శాతం ఉంటారు. వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యే అయిన మాజీ మంత్రి రఘురాజ్ ప్రతాప్ సింగ్ (రాజా భయ్యా), సీనియర్ కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ కూడా ప్రభావం చూపుతారు. జనసత్తా దళ్ లోక్‌తాంత్రిక్ పేరుతో కొత్త పార్టీ పెట్టి తనతో పాటు మరో ఎమ్మెల్యేనూ గెలిపించుకున్న రాజా భయ్యా మద్దతు ఈసారి ఎవరికన్నది ఆసక్తికరం.

ఆజంగఢ్... ఎస్పీకి సవాల్

యూపీలో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఆజంగఢ్ ఒకటి. ఓటర్లలో 21 శాతం యాదవులు, 17 శాతం ముస్లింలు, 19 శాతం దళితులున్నారు. భూమిహార్, ఠాకూర్, బ్రాహ్మణ, కాయస్థ ఓటర్లూ ప్రభావం చూపుతారు. 2014లో ములాయం సింగ్ యాదవ్, 2019లో ఆయన తనయుడు అఖిలేశ్ యాదవ్ విక్టరీ కొట్టారు. గత ఎన్నికల్లో మోదీ వేవ్‌లో సైతం ఇక్కడ కాషాయ జెండా ఎగరలేదు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అఖిలేశ్ ఈ సీటును ఖాళీ చేయడంతో వచ్చిన ఉప ఎన్నికలో ప్రముఖ భోజ్‌పురీ నటుడు దినేశ్ లాల్ యాదవ్ నిరాహువా ఇక్కడ బీజేపీకి తొలి విజయం అందించారు. ఈసారీ ఆయనే బరిలో ఉన్నారు. ఎస్పీ నుంచి ధర్మేంద్ర యాదవ్, బీఎస్పీ నుంచి భీమ్ రాజ్‌భర్ బరిలో ఉన్నారు.

ఫూల్పూర్.. నెహ్రూ కోట

ప్రయాగ్‌రాజ్ జిల్లాలో చరిత్రాత్మక నియోజకవర్గమిది. తొలి ప్రధాని నెహ్రూ తొలి ఎన్నికల్లో విజయం సాధించిన స్థానం. ఇక్కడి నుంచి హ్యాట్రిక్ కొట్టారాయన. 1962 ఎన్నికల్లో సోషలిస్టు దిగ్గజం రామ్ మనోహర్ లోహియా గట్టి పోటీ ఇచ్చినా విజయం నెహ్రూనే వరించింది. ఆయన మరణానంతరం సోదరి విజయలక్ష్మీ పండింట్ ఇక్కడ గెలిచారు. 1975 ఎమర్జెన్సీతో ఫూల్పూర్‌లో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. 1971లో వీపీ సింగ్ చివరిసారిగా కాంగ్రెస్ నుంచి గెలిచారు. తర్వాత ఇప్పటిదాకా ఇక్కడ హస్తానికి ఛాన్సే లేకుండా పోయింది! ఏళ్లుగా ఇక్కడ సమాజ్‌వాదీ పాగా వేసింది. 2004లో మాఫియా డాన్ అతీఖ్ అహ్మద్ సమాజ్‌వాదీ తరఫున గెలుపొందడం విశేషం. 2014లో కేశవ్ ప్రసాద్ మౌర్య తొలిసారి ఇక్కడ కాషాయ జెండాను ఎగరేశారు. ఆయన రాష్ట్ర రాజకీయాల్లోకి మారడంతో వచ్చిన ఉప ఎన్నికలో మళ్లీ ఎస్పీ గెలిచింది. 2019లో బీజేపీ నేత కేసరీదేవి పటేల్ విజయం సాధించారు. ఈసారి బీజేపీ నుంచి ప్రవీణ్ పటేల్, ఎస్పీ నుంచి అమర్‌నాథ్ మౌర్య, బీఎస్పీ నుంచి జగన్నాథ్ పాల్ బరిలో ఉన్నారు. ముగ్గురూ తొలిసారి లోక్‌సభకు పోటీ చేస్తుండటం విశేషం!



అమర్‌నాథ్ మౌర్య

మోదీజీ.. ఇక చాలు

విద్వేష ప్రసంగాలతో విషం చిమ్ముతున్నారు

ప్రజా జీవితం నుంచి నిష్క్రమించండి

ఇంటర్వ్యూలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే హితవు

న్యూఢిల్లీ: విద్వేష ప్రసంగాలతో హిందూ, ముస్లింల మధ్య విషం చిమ్ముతున్న మోదీ ప్రజాజీవితం నుంచి నిష్క్రమించడం మేలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే హితవు పలికారు. విపక్షాల కూటమి అధికారంలోకి వస్తే మీ దగ్గర ఉన్న పాడిఆవులు, గేదెలను లాక్కుంటారని, మీ రిజర్వేషన్ కోటా తగ్గించి ముస్లింలకు 15 శాతం ఇస్తారని మోదీ రోజూ అబద్దాలు ప్రచారం చేస్తూ సమాజంలో చీలిక తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పీటీఐ ఇంటర్వ్యూ సందర్భంగా ఖర్గే వెల్లడించిన అభిప్రాయాలు, ప్రస్తావించిన అంశాలు ఆయన మాటల్లోనే..

ఆయనే వైదొలగుతానన్నారు

'హిందూ, ముస్లింల మధ్య ఘర్షణకు కారణమయ్యేలా మాట్లాడితే క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఇటీవల ప్రధాని మోదీ స్వయంగా చెప్పారు. మళ్లీ ఆయనే రోజూ హిందూ, ముస్లిం విద్వేష ప్రసంగాలు ఇస్తున్నారు. ఆయన మాటలకు ఆయనే కట్టుబడట్లేరు. తప్పులు ఒప్పుకోరు. క్షమాపణలు చెప్పరు. ఆయన ఎంతగా అబద్దాలడుతున్నారో తెలియాలంటే సొంత ప్రసంగాలు ఆయన ఒకసారి వింటే, చూస్తే మంచిది. ఎన్నికల ర్యాలీల్లో విష ప్రచారాన్ని దట్టించారు. ఇలా మాట్లాడే ఆయన ప్రజాజీవితానికి స్వస్తి పలకడమే అత్యుత్తమం''

అందుకే రాహుల్ ప్రేమ దుకాణాలు తెరుస్తానన్నారు

'' బీజేపీ నేతలు రాజ్యాంగం, ముస్లింల వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తే మోదీ ఏనాడైనా ఖండించారా? గిరిజనులపై మూత్ర విసర్జన ఘటనలను ఒక్కసారైనా తప్పుబట్టారా? కనీసం బీజేపీ నేతలను మందలిస్తూ హెచ్చరిక వ్యాఖ్యలు చేశారా?. తానొక్కడినే నేత అన్నట్లు వన్‌మ్యాన్ షో చేస్తున్నారు. మొత్తం దేశాన్ని ఒక్కడినే పాలిస్తానని ప్రకటించుకుంటున్నారు. ప్రచారసభల్లో విద్వేష వ్యాఖ్యానాలే చేస్తున్నారు. అందుకే విద్వేషం సమసిపోయేలా ప్రేమ దుకాణాలు తెరుస్తానని రాహుల్ గాంధీ అన్నారు''

అవి బుజ్జగింపు రాజకీయాలు కావు

''అన్యాయమైపోతున్న వారిని పట్టించుకుంటే దానిని బుజ్జగింపు రాజకీయాలు అనరు. మేమేం చేసినా బుజ్జగింపు రాజకీయాలు అంటే ఎలా? పేదలకు ఏదైనా ఇవ్వడం, స్కాలర్‌షిప్ అందించడం, ముస్లింలకు ప్రత్యేక పాఠశాలల ద్వారా విద్యనందిస్తే వాటిని బుజ్జగింపు రాజకీయాల గాటన కట్టొద్దు''

బీజేపీలో కూర్చున్న అవినీతి నేతల సంగతేంటి?

''అవినీతి నేతల్ని జూన్ 4 తర్వాత జైల్లో వేస్తామని మోదీ అన్నారు. మరి అవినీతి మరకలున్న చాలా మంది నేతలను బీజేపీ లాగేసుకుని ఒళ్లో కూర్చోబెట్టుకుంది. వారిలో కొందరిని ఎంపీలను చేసింది. మరి కొందరు ఏకంగా ముఖ్యమంత్రులు కూడా అయ్యారు. మరి వారి సంగతేంటి?''.

బీజేపీ మెజారిటీని కచ్చితంగా అడ్డుకుంటాం

''కాంగ్రెస్, విపక్షాల 'ఇండియా' కూటమి పట్ల ప్రజల్లో సానుకూల స్పందన చాలా పెరిగింది. కూటమి అనుకూల పవనాలు బలంగా వీస్తున్నాయి. ఈ బలంతో బీజేపీ మెజారిటీని ఖచ్చితంగా నిలువరిస్తాం. మా కూటమి ఎక్కువ సీట్లు గెలుస్తుంది''.

ప్రధాని స్థాయి వ్యక్తి ఇలా మాట్లాడొచ్చా?

''రామ మందిరం, హిందూ-ముస్లిం, ఇండియా-పాకిస్తాన్ అంశాలే దశాబ్దాలుగా చెబుతూ ప్రజల భావోద్వేగాలను ఓట్ల రూపంలో ఇన్నాళ్లూ ఒడిసిపట్టారు. ఇక ఆటలు సాగవని అర్థమైంది. అందుకే కొత్తగా కాంగ్రెస్ గెలిస్తే ఇంట్లో ఆవులు, గేదెలు తీసుకెళ్తుందని, ఆస్తులు స్వాధీనం చేసుకుంటుందని, మంగళసూత్రం తెంపుకుపోతుందని, భూములు లాక్కుంటారని ఇష్టమొచ్చినట్లు చెబుతున్నారు. అసలు ప్రధాని స్థాయి వ్యక్తి ఇలా మాట్లాడొచ్చా?''



'400' గొడవ మొదలెట్టిందే మీరు

"పార్లమెంట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీ కావాలని, 400 సీట్లు గెలవాలని అన్నది ఎవరు?. రిజర్వేషన్లపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదా? అసలు 400 సీట్ల గొడవ మొదలెట్టిందే మీరు. అర్హతలేని ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో రాజ్యాంగబద్ధ సంస్థలను నింపేద్దామని బీజేపీ భావిస్తోంది. రిజర్వేషన్లు తెగ్గోసేందుకు రాజ్యాంగంలో మార్పులకు బీజేపీ సాహసిస్తోంది. రాజ్యాంగం ప్రకారం పాలించట్లేదు. అనైతికంగా గతంలో మధ్యప్రదేశ్, కర్ణాటక, మణిపూర్, ఉత్తరాఖండ్, గోవాల్లో ప్రభుత్వాలను కూల్చేశారు" అని ఖర్గే ఆరోపించారు.

మోసగాళ్ల కూటమి

విపక్షాలపై ప్రధాని మోదీ విమర్శలు

మహారాజ్‌గంజ్/మోతిహారీ/ప్రయాగ్‌రాజ్: సార్వత్రిక సమరంలో విపక్షాల 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. మంగళవారం బిహార్‌లోని మహారాజ్‌గంజ్, పూర్వీ చంపారన్ నియోజకవర్గాల్లో, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఎన్నికల ప్రచారర్యాలీల్లో ప్రసంగించారు. ప్రసంగాల్లోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

విపక్షాల కూటమికి ఎదురుదెబ్బ తప్పదు

'' సనాతన ధర్మ వ్యతిరేక భావనలు ఆ కూటమిలో నిండిపోయాయి. అవినీతి, బుజ్జగింపు రాజకీయాల్లో మునిగిపోయిన విపక్షాల కూటమికి జూన్ 4న ఫలితాల సందర్భంగా పెద్ద ఎదురుదెబ్బ తగులుతుంది. వారసత్వంపై నాకు నమ్మకం లేదు. నాకు వారసులు అంటూ ఒకవేళ ఉంటే అది ప్రజలే. గతంలో ఆర్జేడీ-కాంగ్రెస్ ప్రభుత్వం బిహార్‌ను అస్తవ్యస్తంగా పాలించి తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ పుట్టిన నేలకు అపకీర్తి తెచ్చారు. 1990లలో బిహార్‌లో బెదిరింపు పన్ను వ్యవస్థ రాజ్యమేలింది. దీంతో పరిశ్రమలు, ఉపాధిలేక వేలాదిగా బిహారీలు వలస బాటపట్టారు. ఎన్డీఏ ప్రభుత్వాలు వలస సంస్కృతికి చరమగీతం పాడేందుకు ఎంతో కృషిచేశాయి. పంజాబ్, తెలంగాణ, తమిళనాడులో బిహార్ కూలీలపై స్థానిక కాంగ్రెస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే కాంగ్రెస్ రాజకుటుంబం మౌనంగా ఉండిపోయింది''

దశలు దాటే కొద్దీ దిగజారిపోయారు

''లోక్‌సభ ఎన్నికల తొలి దశలోనే విపక్షాల కూటమి డీలాపడింది. రెండో, మూడో, నాలుగో, ఐదో దశకొచ్చేసరికి మొత్తం నీరుగారిపోయారు. మిగిలిన రెండు దశల్లోనూ ఇదే వరస. జూన్ 4 వచ్చే ఫలితాలతో ఆ కూటమికి పెద్ద ఎదురుదెబ్బ తగలడం ఖాయం. అసలు ఆ కూటమికి ఒక రాజకీయ కూటమి లక్షణాలే ఉండవు. అందులోని అన్ని పార్టీల నేతలంతా కలిసి రూ.20 లక్షల కోట్ల కుంభకోణాలు చేశారు. వందశాతం మోసగాళ్ల కూటమి అది. కూటమికి మూడు పెద్ద అవలక్షణాలున్నాయి. అది మతతత్వ, కులతత్వ, వారసత్వ కూటమి''.



కోల్‌కతాలో బంగ్లాదేశ్ ఎంపీ అదృశ్యం

కోల్‌కతా: బంగ్లాదేశ్‌కు చెందిన అధికార అవామీ లీగ్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు అన్వరుల్ అజీం అనార్ కోల్‌కతాలో అదృశ్యమయ్యారు. చికిత్స కోసం ఈ నెల 12వ కోల్‌కతాకు వచ్చిన ఆయన నగరంలోని బారానగర్‌లోని తన స్నేహితుడి ఇంట్లో దిగారు. మే 13వ తేదీన బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. అయితే, ఎనిమిది రోజులుగా ఆయన ఫోన్ నుంచి కుటుంబసభ్యులకు మెసేజీలు మాత్రం వస్తున్నాయని, ఢిల్లీ వెళ్తున్నట్లుగా అందులో ఉందని కోల్‌కతాలోని బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషన్ అధికారి ఒకరు వెల్లడించారు. ఆయన ఏమయ్యారో తెలియడం లేదన్నారు. అన్వరుల్ అజీం స్నేహితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

దేశంలో కేపీ.1, కేపీ.2 కోవిడ్ వేరియంట్లు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ కేపీ.1 వేరియెంట్ కేసులు 34, కేపీ.2 వేరియంట్‌కు చెందిన 290 కేసులను గుర్తించినట్లు ఇండియన్ సార్స్‌కోవ్ 2 జెనోమిక్స్ కన్సార్టియం(ఇన్సాకాగ్) మంగళవారం తెలిపింది. ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇవి బయటపడ్డాయంది. మొత్తం 290 కేపీ.2 వేరియంట్‌కు సంబంధించిన కేసుల్లో మహారాష్ట్రలో అత్యధికంగా 148 నిర్ధారణ య్యాయని వివరించింది. మొత్తం 34 కేపీ.1 కేసులకుగాను పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 23 గుర్తించామని పేర్కొంది. ఇటీవల సింగపూర్‌లో వేగంగా పెద్ద సంఖ్యలో నమోదవుతున్న కోవిడ్ కేసులకు ఈ రెండు వేరియంట్లే కారణమని ఆ నివేదిక వివరించింది.

సిసోడియా బెయిల్‌కు హైకోర్టు 'నో'

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు హైకోర్టులో చుక్కెదురైంది. మద్యం కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, సీబీఐలు దాఖలు చేసిన కేసుల్లో సిసోడియా బెయిల్ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. తీవ్ర అధికార దుర్వినియోగం, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తించడం జరిగిందని పేర్కొంటూ జస్టిస్ స్వర్ణ కాంత శర్మ, ఆయనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించారు. కీలకమైన ఆధారాలను, ఎలక్ట్రానిక్ ఆధారాలను సిసోడియా ధ్వంసం చేసినట్లు ఆరోపణలున్నాయన్నారు.

సింగపూర్ విమానంలో భారీ కుదుపులు

ఒకరి మృతి • 30 మందికి గాయాలు

బ్యాంకాక్: లండన్ నుంచి సింగపూర్‌కు బయల్దేరిన సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానంలో మార్గమధ్యంలో భారీ కుదుపులకు లోనైంది. దీంతో విమానంలోని ప్రయాణికులు ఒక్కసారిగా సీలింగ్ తగిలి, చెల్లాచెదురుగా పడి గాయాలపాలయ్యారు. ఊహించని పరిణామంతో హతాశుడైన ఒక 73 ఏళ్ల ప్రయాణికుడు అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయారు. 30 మంది గాయపడ్డారు. వీరందరినీ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు. వీరిలో ఏడుగురికి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. బోయింగ్ 777 రకం ఎస్‌క్యూ321 విమానం మంగళవారం ఉదయం మయన్మార్ దగ్గర్లోని అండమాన్ సముద్ర జలాలపై ప్రయాణిస్తున్నపుడు ఈ ఘటన జరిగింది. విమానం బయల్దేరిన 10 గంటల తర్వాత జరిగిన ఈ ఘటన వివరాలను సింగపూర్ ఎయిర్‌లైన్స్, ప్రయాణికులు వెల్లడించారు. ఘటన తర్వాత విమానాన్ని దారి మళ్లించి దగ్గర్లోని బ్యాంకాక్‌లోని సువర్ణభూమి విమానాశ్రయంలో ల్యాండ్‌చేశారు. గాయపడని ప్రయాణికులను వేరే విమానాల్లో గమ్యస్థానమైన సింగపూర్‌కు పంపేశారు.

అసలేమైంది?

211 మంది ప్రయాణికులు, 18 సిబ్బందితో విమానం లండన్‌లోని హీత్రూ విమానాశ్రయం నుంచి బయల్దేరింది. ఎయిర్‌హోస్టెస్ ప్రయాణికులకు అల్పాహారం అందిస్తున్న సమయంలో విమానం 37,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తోంది. హఠాత్తుగా విమానం కుదుపులకు లోనైంది. మూడు నిమిషాల వ్యవధిలో ఆరువేల అడుగులు అంటే 37వేల అడుగుల ఎత్తు నుంచి 31వేల అడుగుల స్థాయికి పడిపోయింది. దీంతో విమానంలో బెల్ట్ పెట్టుకోని ప్రయాణికులంతా ఒక్క ఉదుటున గాల్లోకి లేచి సీలింగ్‌కు ఢీకొన్నారు. మూడు నిమిషాల పాటు విమానం అటూఇటూ ఊగుతూ కిందకు పడిపోతుండటంతో లోపలున్న వారంతా చెల్లా చెదు రుగా పడిపోయారు. అసలేం జరుగుతుందోనన్న భయం, ఆందోళనతో అస్వస్థతకు గురై 73 ఏళ్ల బ్రిటిష్ జాతీయుడు అక్కడికక్కడే మరణించారు. గుండెపోటు కారణంగా ఆయన మరణించి ఉంటారని వైద్యులు భావిస్తున్నారు. 31 వేల అడుగుల ఎత్తుకు చేరుకున్నాక విమానం మళ్లీ స్థిరత్వాన్ని సాధించింది. వెంటనే తేరుకున్న పైలట్లు 30 నిమిషాల్లోపే బ్యాంకాక్‌లోని సువర్ణభూమి ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ప్రయాణికుల్లో ఎక్కువ మంది బ్రిటన్, ఆస్ట్రేలియా, మలేసియా, సింగపూర్, న్యూజిలాండ్ దేశస్తులున్నారు. ముగ్గురు భారతీయులు కూడా ఉన్నారు.



భారీ కుదుపులతో విమానం లోపల పరిస్థితి ఇదీ.. (ఇన్‌సెట్)బ్యాంకాక్ ఎయిర్ పోర్టులో ల్యాండయిన విమానం

నిరసనలతో కంగారెత్తిస్తున్నారు..!

పంజాబ్, హరియాణాల్లో బీజేపీ అభ్యర్థుల ప్రచారాలను పదేపదే అడ్డుకుంటున్న రైతు సంఘాలు

సాక్షి, న్యూఢిల్లీ: పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత, ఉద్యమ నేతలపై కేసుల కొట్టివేత వంటి డిమాండ్లతో గడిచిన ఫిబ్రవరిలో పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో చేపట్టిన ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించిన రైతు సంఘాలు, ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్నాయి. బీజేపీ అభ్యర్థులు ప్రచారం చేసే ప్రతీ ప్రాంతానికి వెళ్లి వారిని అడ్డుకుంటున్నాయి. నల్లజెండాలతో బీజేపీ అభ్యర్థులకు స్వాగతం పలుకుతూ బీజేపీ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిస్తున్నాయి. ఈ నెల 25న హరియాణాలో, జూన్ ఒకటిన పంజాబ్‌లో ఎన్నికలు జరుగన్న నేపథ్యంలో రైతు సంఘాల నుంచి వ్యక్తమవుతున్న వ్యతిరేకత బీజేపీ నేతలను కంగారు పెట్టిస్తోంది.

అడుగడుగునా అడ్డంకులు..

పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో 67 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. ఇందులో అధికంగా రైతులే ఉన్నారు. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లో అకాలీదళ్‌తో పొత్తుతో బీజేపీ 13 సీట్లకు గానూ రెండు సీట్లలో గెలుపొందింది. ఆ పార్టీకి 9.7 శాతం ఓట్లు వచ్చాయి. అయితే రైతు ఉద్యమాల అనంతరం జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 117 సీట్లకు గానూ కేవలం రెండు సీట్లకు పరిమితమై 6.7 శాతం ఓట్లు మాత్రమే రాబట్టుకుంది. ఇక హరియాణాలో 2019 ఎన్నికల్లో పదికి పది సీట్లను గెలుచుకున్న బీజేపీ ప్రస్తుతం మాత్రం రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటోంది. భారతీయ కిసాన్ యూనియన్ (చారిణి), కీర్తి కిసాన్ యూనియన్, సంయుక్త కిసాన్ మోర్చా వంటి రైతు సంఘాలు బీజేపీకి నిద్రపట్టనీయడం లేదు. బీజేపీ అభ్యర్థులు ఎక్కడ ప్రచారానికి వెళితే అక్కడ ఈ సంఘాలు వారిని అడ్డుకుంటున్నాయి. అశోక్ తన్వర్ (సిర్సా), రంజిత్ చౌతాలా (హిసార్), అరవింద్ శర్మ (రోహ్తక్), మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ (కర్నాల్), మోహన్ లాల్ బడోలి (సోనిపట్), నవీన్ జిందాల్ (కురుక్షేత్ర)లకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. వీరు ఎక్కడ ప్రచారం నిర్వహించినా రైతు సంఘాలు నల్లజెండాలు, నినాదాలతో హోరెత్తిస్తున్నాయి. బీజేపీ అభ్యర్థుల ప్రచారాలకు ముందే ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించి బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిస్తున్నాయి. మరోవైపు రైతుల్లో ఎక్కువగా ఉన్న రాజ్‌పుత్ వర్గం సైతం బీజేపీకి వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొనడం కాషాయదళానికి తలనొప్పిగా మారింది.

మోదీకి నల్లజెండాలతో నిరసన: ఎస్‌కేఎం

చండీగఢ్: ఈనెల 23వ తేదీన పంజాబ్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నల్లజెండాలతో నిరసన తెలుపుతామని రైతు నేత బల్బీర్ సింగ్ రాజేవాల్ తెలిపారు. లూధియానాలో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. తమ నిరసన ప్రశాంతంగానే సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్నాయని రాజేవాల్ ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ మొదటిసారిగా ఈ నెల 23న పటియాలాలో, ఆ తర్వాత 24న గుర్దాస్‌పూర్, జలంధర్‌లలో జరిగే ర్యాలీల్లో పాల్గొంటారు.

విజయానికి చేరువలో 'ఇండియా' కూటమి

ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ/జంషెడ్‌పూర్: లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో దశ పోలింగ్ పూర్తవుతున్న కొద్దీ ప్రతిపక్ష ఇండియా కూటమి విజయానికి చేరువవుతోందని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. అదే సమయంలో, ప్రధాని మోదీ ప్రభుత్వం నిష్క్రమించడం ఖాయమని తేటతెల్లమవుతోందన్నారు. అనేక సర్వేలు ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయన్నారు. జూన్ 4 తర్వాత విజేతగా నిలిచే ఇండియా కూటమి సుస్థిర ప్రభుత్వాన్ని అందిస్తుందని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కేజ్రీవాల్ వర్చువల్‌గా మీడియాతో మాట్లాడారు. రాజధాని ఢిల్లీలో సోమవారం హోం మంత్రి అమిత్ షా, యూపీ సీఎం యోగి పాల్గొన్న ఎన్నికల ర్యాలీకి కనీసం 500 మంది కూడా హాజరవ్వలేదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. 'ఆప్ కార్యకర్తలను అమిత్ షా పాకిస్తానీలుగా పేర్కొన్నారు. ఢిల్లీ వాసులు 56 శాతం ఓట్లతో ఆప్‌ను 62 సీట్లలో గెలిపించారు. ఈ లెక్కన ఢిల్లీ ప్రజలంతా పాకిస్తానీలవుతారా? పంజాబ్ ప్రజలు అసెంబ్లీలోని 117 సీట్లకు గాను 92 సీట్లలో ఆప్‌ను గెలిపించారు. వాళ్లూ పాకిస్తానీలేనా? ఆప్ తరఫున అనేక మంది సర్పంచిలు, మేయర్లు, కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. అంతమాత్రాన పాకిస్తానీలవుతారా?' అని కేజ్రీవాల్ నిలదీశారు.

ఎలక్షన్ బీట్

ఎన్డీయేకు 310 సీట్లు వచ్చాయి: షా

ఒడిశా: ఐదు దశల లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ఇప్పటికే 310 సీట్లను కైవసం చేసుకుందని, మిగిలిన రెండు దశల తరువాత 400కు పైగా సీట్లు సాధిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఒడిశా ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పోటీలో ఉన్న సంబల్‌పూర్‌లో జరిగిన రెండు ఎన్నికల ర్యాలీల్లో షా మాట్లాడారు. ఒడిశా రాష్ట్రాన్ని 'బాబు' పాలన నుంచి విముక్తి చేయాలని, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించాలని ఆయన ఒడిశా ప్రజలను కోరారు. ఈసారి ఒడిశాలో కమలం వికసిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని అత్యధిక గనులు, ఖనిజ నిల్వలు కియోంజర్ జిల్లాలోనే ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలోని గిరిజనులకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు. సీఎం నవీన్‌పట్నాయక్ రాష్ట్రంలోని ఖనిజ వనరులను దోచుకుంటున్నారని, రాష్ట్రంలో పుష్కలమైన ఖనిజ సంపదలున్నా వాటిని కాపాడే ముఖ్యమంత్రి లేరని ఆవేదన వ్యక్తం చేశారు.

క్షమాపణలు కోరిన సంబిత్ పాత్ర

మూడు రోజుల ఉపవాస దీక్ష పాటిస్తానని ప్రకటన

భువనేశ్వర్: 'జగన్నాథ స్వామి ప్రధాని మోదీ భక్తుడు'అంటూ పొరపాటున వ్యాఖ్యానించి వివాదంలో చిక్కుకున్న పూరీ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి సంబిత్ పాత్ర క్షమాపణలు కోరారు. ఈ పాపానికి గాను మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఉపవాస దీక్ష పాటిస్తానని ప్రకటించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పూరీ జగన్నాథుడు ప్రధాని మోదీ భక్తుడు అంటూ చేసిన వ్యాఖ్య తీవ్ర విమర్శలకు కారణమైంది. ఆ వెంటనే సంబిత్ పాత్ర వివరణ ఇచ్చారు. ప్రధాని మోదీ జగన్నాథుని భక్తుడు అనబోయి పొరపాటున అలా అనేశానే తప్ప మరే ఉద్దేశం లేదని పేర్కొన్నారు. అనంతరం ఆయన 'ఎక్స్'లో.. ఈ తప్పునకు గాను శ్రీ జగన్నాథుని పాదాల వద్ద క్షమాపణలు కోరుతున్నాను. ఈ పాపానికి ప్రాయశ్చిత్తంగా మంగళవారం నుంచి మూడు రోజులపాటు ఉపవాస దీక్ష పాటిస్తాను'అని ప్రకటించారు.

జస్టిస్ అభిజిత్ ప్రచారంపై ఒక్కరోజు నిషేధం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ అభ్యర్థి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయపై ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 24 గంటల పాటు ఆయన ప్రచారం నిర్వహించకుండా నిషేధించింది. సీఎం మమతపై గంగోపాధ్యాయ చేసిన వ్యాఖ్యలను నీచమైన వ్యక్తిగత దాడిగా అభివర్ణించింది. అవి అనుచితంగా, అగౌరవ పరిచేవిధంగా ఉన్నాయని ఖండించింది. మహిళలను గౌరవించే సంప్రదాయం ఉన్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ఆ వ్యాఖ్యలు అపఖ్యాతిని తెచ్చిపెట్టాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. తమ్లుక్ బీజేపీ అభ్యర్థి అయిన గంగోపాధ్యాయ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 17న హల్దియాలో జరిగిన ర్యాలీలో మాట్లాడారు. 'బీజేపీ సందేశ్‌ఖాలీ అభ్యర్థి రేఖా పాత్రని రూ.2వేలకు కొనుగోలు చేశారని తృణమూల్ కాంగ్రెస్ చెబుతోంది. మరి సీఎం మమతా బెనర్జీ ఎంతకు అమ్ముడుపోయారు..? మీ రేటు రూ.10లక్షలా?'' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

మిథున్ చక్రవర్తి రోడ్ షోలో ఘర్షణలు

మిడ్నపూర్(పశ్చిమబెంగాల్): సీనియర్ నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి మంగళవారం పశ్చిమబెంగాల్‌లోని మిడ్నపూర్‌లో చేపట్టిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కొందరు దుండగులు ర్యాలీపైకి రాళ్లు రువ్వారని, ఘర్షణలకు పాల్పడ్డారని, సకాలంలో జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగిందని పోలీసులు తెలిపారు. మిథున్‌తో పాటు బీజేపీ అభ్యర్థి అగ్నిమిత్ర పాల్ సురక్షితంగా బయటపడ్డారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం : 22 : మే : 2024

మామిడి మజా



మంగళవారం బెంగళూరు హడ్సన్ కూడలిలోని హాప్‌కామ్స్‌లో మామిడి, పనస మేళా ఆరంభమైంది. మామిడి పండ్లను పరిశీలిస్తున్న మహిళలు

న్యూస్‌రీల్

దేవికి చందన శోభ



చందనం అలంకరణలో బనశంకరీదేవి

బనశంకరి: నగరంలోని బనశంకరీదేవి అమ్మవారు భక్తులకు చందనం అలంకరణలో దర్శనమిచ్చింది. మంగళవారం వేకువజామున అర్చకులు ఏ.చంద్రమోహన్ అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన చేపట్టి చందనం అలంకరణ గావించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

కారును ఢీకొన్న కంటైనర్

- తల్లీ కొడుకు మృత్యువాత



యశవంతపుర: కారు– కంటైనర్‌లు ఢీకొని తల్లీకొడుకు మృతి చెందిన ఘటన హాసన్ జిల్లా సకలేశపుర తాలూకాలో హైవే– 75లో మంగళవారం జరిగింది. దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకా పాణి మంగళూరు కు చెందిన షఫియా (48), కొడుకు షఫీక్ (21)లు మరణించారు. ఇన్నోవా కారులో వీరు పని మీద బెంగళూరుకు వెళ్లి మంగళూరుకు తిరిగి వెళ్తున్నారు. ఈ సమయంలో ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న పిల్లలతో పాటు ఆరుమందికి గాయాలయ్యాయి. వారిలో తల్లీ కొడుకు అక్కడికక్కడే చనిపోయారు. మిగతా నలుగురిని మంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సకలేశపుర గ్రామాంతర పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. ప్రమాదంతో ఇరువైపులా కిలోమీటర్ కొద్ది ట్రాఫిక్ నిలిచి పోయింది.

వర్షాలతో రోడ్లపై గుంతలు



బనశంకరి: బెంగళూరు నగరంలో కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో మళ్లీ రోడ్ల గుంతల సమస్య ఆరంభమైంది. నగర రోడ్లలో 5,670 గుంతలు ఏర్పడ్డాయని బీబీఎంపీ సమీక్షలో వెల్లడైంది. ఇందులో వార్డు రోడ్లలో సుమారు 5 వేల గోతులను గుర్తించారు. ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ రోడ్లలో 670 రోడ్డు గుంతలు ఉన్నాయని అధికారులు తెలిపారు. మంగళవారం పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ రోడ్డు గుంతలను పూడ్చడానికి తమ వద్ద తగిన మానవ వనరులు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేకంగా కోల్డ్ మిక్స్ తారు ఉపయోగించి ప్రముఖ రోడ్లలో మరమ్మతులు చేస్తామని చెప్పారు. ఇప్పటికే 5 వేల కోల్డ్‌మిక్స్ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోజు 3 వేల బ్యాగులను సిద్ధం చేస్తామని చెప్పారు.

యువకుని ముఖంపై మరిగే నీళ్లు

- యువతి తండ్రి దాష్టీకం



బాధితుడు, నిందితుడు, (ఇన్‌సెట్లో) ప్రేమికులు (ఫైల్)

యశవంతపుర: కూతురిని ప్రేమిస్తున్నాడన్న కోపంతో యువకునిపై ఓ వ్యక్తి వేడినీళ్లు పోశాడు. ఈ సంఘటన కొడగు జిల్లా మడికెరి గ్రామాంతర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనలో ప్రియుడు సుహేల్ ముఖం, గొంతుభాగంలో తీవ్రంగా కాలిపోయాయి. వివరాలు.. మడికెరి తాలూకా మదెనాడు గ్రామానికి చెందిన యువతిని గణపతివీధికి చెందిన సుహేల్ ప్రేమిస్తున్నాడు. ఇద్దరూ కలిసి తిరిగేవారు, ఈ సంగతి యువతి తల్లిదండ్రులకు తెలియడంతో పెద్ద రాద్ధాంతం చేశారు. ఇంటిలో తనను మందలించారని యువతి సుహేల్‌కు ఫోన్ చేసి చెప్పింది. దీనితో యువతిని చూడడానికి అతడు వెళ్లగా, యువతి తండ్రి సలసల మరిగే నీటిని అతని ముఖంపై పోశాడు. సుహేల్ ఆర్తనాదాలు చేయడంతో స్థానికులు అతన్ని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఎన్‌ఐఏ ఆకస్మిక దాడులు

- రామేశ్వరం కెఫె పేలుడు కేసు..
- బెంగళూరు, కోయంబత్తూరులో సోదాలు





దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన బెంగళూరు కెఫె విస్ఫోటం

బనశంకరి: బెంగళూరులో వైట్‌ఫీల్డ్‌లో రామేశ్వరం కెఫెలో బాంబుపేలుడు కేసుకు సంబంధించి మంగళవారం తెల్లవారుజామున ఐటీ సిటీలో నాలుగుచోట్ల, కోయంబత్తూరులో 11 చోట్ల ఎన్‌ఐఏ ఆకస్మిక దాడులు నిర్వహించింది. బెంగళూరులో కుమారస్వామి లేఔట్, బనశంకరిలో సోదాలు చేశారు. తమిళనాడులోని కోయంబత్తూరులో డాక్టరు జాఫర్ ఇక్బాల్, నయన్ సాదిక్ ఇళ్లలో గాలింపు సాగించారు. సోదాల్లో కీలక ఆధారాలను స్వాధీనం చేసుకుని, చుట్టుపక్కల వారినుంచి సమాచారం సేకరించారు. ఈ దాడుల్లో రామేశ్వరం కెఫె పేలుడు , మంగళూరు కుక్కర్‌బాంబు విస్ఫోటం ఘటనల ముఖ్య సమాచారం లభ్యమైనట్లు ఎన్‌ఐఏ వర్గాలు తెలిపాయి. అనంతపురం జిల్లాలోని రాయదుర్గంలోనూ రిటైర్డు హెడ్‌మాస్టర్ ఇంట్లో సోదాలు జరిపారు.

ఆ ఇద్దరూ ఇచ్చిన సమాచారంతో

మార్చి 1 తేదీ మధ్యాహ్నం 12.55 సమయంలో వైట్‌ఫీల్డ్ రామేశ్వరం కెఫెలో బాంబు పేలింది. ప్రధాన నిందితులైన మహమ్మద్ మతీన్ తాహా, ముసావిర్ హుసేన్‌ను 43 రోజుల తరువాత పశ్చిమ బెంగాల్‌లో ఎన్‌ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. విచారణలో వీరు ఇచ్చిన సమాచారం ఆధారంగా తాజాగా తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. ఎన్‌ఐఏ విచారణ సమయంలో బాంబర్ ముసావిర్, మతీన్ తాహా భయభ్రాంతులకు గురిచేసే నిజాలు చెప్పారు. రామేశ్వరం కెఫె పేలుడుకు ముందు వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోని ఐటీ ఎస్‌ఈజెడ్‌ను పేలుళ్లకు టార్గెట్‌గా చేసుకున్నామని తెలిపారు. ఐటీ బీటీ కంపెనీలు అధికంగా ఉండే ప్రాంతంలో పేలుళ్లకు పాల్పడితే ప్రపంచస్థాయిలో చర్చ జరుగుతుందని, తమకు ఉగ్రవాద సంస్థ ఐసిస్ స్వాగతం పలుకుతుందని ఈ కుట్ర చేసినట్లు చెప్పారు. పటిష్ట భద్రత ఉండడం వల్ల ఐటీ సంస్థల్లోకి ప్రవేశం లభించక చివరికి కెఫెలో బాంబు పేల్చినట్లు తెలిపారు. ఈ ఘటనలో 9 మంది గాయపడ్డారు.

చక్కెర ఫ్యాక్టరీ కార్మికులు వీధిపాలు



కలెక్టర్ వినతి చేస్తున్న కార్మికులు

యశవంతపుర: బెళగావి జిల్లా రామదుర్గ తాలూకా ఉదుపుడి గ్రామంలోని శివసాగర చక్కెర పరిశ్రమలో పని చేస్తున్న 380 మంది కార్మికులను యజమాన్యం ఒక్కసారిగా తొలగించింది. సుమారు 10 ఏళ్ల నుంచి వారు పని చేస్తుండగా, తొలగింపుతో వీధిన పడ్డారు. 2017లో శివసాగర చక్కెర పరిశ్రమ, ఆగ్రో ప్రొడక్ట్స్ సంస్థలో ఆర్థిక అక్రమాలు జరగడంతో యాజమన్యం బంద్ చేసింది. మూడేళ్ల నుంచి అరిహంత షుగర్ ఇండస్ట్రీస్ లీజుకు తీసుకుని ఫ్యాక్టరీని నడుపుతోంది. ఆ సంస్థ లీజు నుంచి తప్పుకుని మరొక సంస్థకు ఇచ్చేసినట్లు తెలిసింది. దీంతో నాలుగురోజుల కిందట కొత్త యాజమాన్యం 380 మంది కార్మికులను ఏకాఏకిన తొలగించారు. బాధిత కార్మికులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ న్యాయం చేయాలని మనవి చేశారు. తాము పర్మినెట్ కార్మికులు అని, తొలగించడానికి వీలు లేదని కార్మిక నాయకుడు బసవరాజ లింగారెడ్డి తెలిపారు. తమనే కొనసాగించాలని కలెక్టర్ నితేశ్ పాటిల్‌కు మనవి చేశారు.



మనోహరం: వర్షాల రాకతో బెంగళూరు కబ్బన్ ఉద్యానంలో వెల్లివిరిసిన పచ్చదనం

అన్నదాతకు ఘోర కష్టం



మృతుడు రాజు రామప్ప



కరువుతో రైతుల కుటుంబాలు నష్టాలపాలు (ఫైల్)

- అప్పు తీర్చాలని భార్య, కొడుకును తీసుకెళ్లిన వడ్డీవ్యాపారి
- ఆత్మహత్య చేసుకున్న బాధితుడు

యశవంతపుర: అప్పు చెల్లించలేదని రైతు భార్య, కొడుకును ఓ మహిళా వడ్డీవ్యాపారి తన వెంట తీసుకెళ్లిపోయింది, ఈ అవమానం తట్టుకోలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా ఇస్లాంపురలో జరిగింది. వివరాలు.. రాజు రామప్ప ఖేతగి (52) అనే రైతు సిద్దవ్వ బయ్యన్నవర అనే మహిళ నుంచి పంటల సాగుకోసం రూ.1.5 లక్షలను అప్పు తీసుకున్నాడు. వానలు లేక కరవు కారణంగా పంటలు నష్టపోయాడు. తక్షణం అప్పు తీర్చాలని ఆ మహిళ రాజును ఒత్తిడి చేయసాగింది. కొంతకాలం వేచి ఉండాలని ఆయన మొరపెట్టుకున్నాడు, దీంతో కోపం పట్టలేని సిద్దవ్వ రైతు భార్య, కొడుకును తన ఇంటికి తీసుకెళ్లి నిర్బంధించింది, రెండురోజుల పాటు వారికి అన్నం, నీళ్లు కూడా ఇవ్వలేదు.

పోలీసులకు ఫిర్యాదు చేసినా

వారిని విడిచి పెట్టాలని రైతు ప్రాధేయపడినా మహిళ కనికరించలేదు. దీంతో రైతు యమకనమరడి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు సిద్దవ్వపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇంక తనకు న్యాయం జరగదనే ఆవేదనతో రైతు రాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మహిళ దౌర్జన్యం, పోలీసుల అసమర్థతే రైతు ఆత్మహత్యకు కారణమని స్థానికులు ఆరోపించారు. కాంగ్రెస్ పరిపాలన అంటే ఇదేనా? అని రాష్ట్ర బీజేపీ నాయకులు ఈ దారుణంపై సోషల్ మీడియాలో మండిపడ్డారు.





నేలకూలిన స్మారకాలు

భారీ వర్షాలకు మంగళవారం రాత్రి హంపీలో విరూపాక్ష ఆలయ వీధిలో నేలకొరిగిన పురాతన మండపాలు

రెండు బైక్‌లు ఢీ, ఒకరు మృతి

మైసూరు: ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించాడు. ఈ ఘటన జిల్లాలోని హనూరు తాలూకా ఆర్‌ఎస్ దొడ్డి గ్రామం వద్ద జరిగింది. మణగళ్లి గ్రామానికి చెందిన రాచశెట్టి (50) హనూరు పట్టణంలో పెళ్లికి వెళ్లి గ్రామానికి తిరిగి వెళ్తున్నాడు. వివేకానంద పాఠశాల ఎదుట రాచశెట్టి బైక్‌ను వెనుక నుంచి వచ్చిన మరో బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. కిందపడిన రాచశెట్టి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి మరో బైకిస్టును అరెస్టు చేశారు.

నర్సుపై దాడి చేసి స్నాచింగ్

మైసూరు: ఇంటికి వెళుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. తాలూకాలోని హోసహుండి గ్రామానికి చెందిన నమిత మైసూరులోని ఓ ప్రైవేటు ఆయుర్వేద ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. పనులు ముగించుకుని తన స్కూటర్‌లో ఇంటికి తిరిగి వెళుతోంది. ఈ సమయంలో ఇద్దరు దుండగులు బైక్‌లో వెనుక నుంచి వచ్చి ఉత్తనహళ్లి సర్వీస్ రోడ్డువద్ద ఆమె స్కూటర్‌ను కాలితో తన్ని కిందపడేశారు. ఆమెను కొట్టి మెడలోని 50 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. దక్షిణ గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. గాయపడిన బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది.

పొలంలోకి కారు పల్టీలు



మండ్య: అతివేగంతో వెళ్తున్న కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన శ్రీరంగపట్టణ తాలూకా దొడ్డపాళ్య గ్రామంలో జరిగింది. మైసూరు మండి మొహల్లా ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ లోకేశ్ అరకెరె నుంచి మైసూరుకు వెళ్తున్నాడు. దొడ్డపాళ్య వద్ద బ్రేక్ పెడల్‌కు బదులుగా యాక్సిలేటర్ తొక్కడంతో ఒక్కసారిగా వేగంగా వెళ్లిన కారు పంట పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కారు డ్రైవర్, మేనేజర్ అందరూ క్షేమంగా బయటపడ్డారు.

రేవణ్ణ బెయిలు రద్దుకై హైకోర్టుకు సిట్

శివాజీనగర: మహిళ కిడ్నాప్, లైంగిక దాడుల కేసులో జేడీఎస్ మాజీ మంత్రి హెచ్.డీ.రేవణ్ణ ప్రజాప్రతినిధుల కోర్టులో బెయిలు పొందడం తెలిసిందే. ఆ బెయిలును రద్దు చేయాలని సిట్ హైకోర్టులో అర్జీ దాఖలు చేసింది. దీంతో ఈ కేసులో మళ్లీ కుతూహలం నెలకొంది. హైకోర్టులో వాదనలకు ఇరు వర్గాల వకీళ్లు సిద్ధమవుతున్నారు. మరోవైపు హొళెనరసిపురలో రేవణ్ణ ఇంటి వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. రేవణ్ణ బెయిలు తరువాత ఇక్కడికి వచ్చారు.

తమిళనాడుకు కావేరి నీరివ్వాలని ఆదేశం

శివాజీనగర: తమిళనాడుకు 2.5 టీఎంసీల కావేరి జలాలను విడుదల చేయాలని కావేరి నిర్వహణా ప్రాధికార కర్ణాటక సర్కారును ఆదేశించింది. తమకు తాగునీటికి, పంటల కోసం నీరు విడుదల చేయాలని తమిళనాడ ఢిల్లీలో ప్రాధికారను కోరింది. దీనిపై మంగళవారం ఇరు రాష్ట్రాల అధికారులు వాదనలను వినిపించారు. చివరకు తమిళనాడుకు 2.5 టీఎంసీ నీరు విడుదల చేయాలని ఆదేశించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న డ్యామ్‌లలో నీరు లేదని కర్ణాటక తెలిపినా ఫలితం లేదు.

సినీ నటి విద్య హత్య

- సుత్తితో బాదిన భర్త నందీశ్!
- మైసూరులో దుర్ఘటన
- కొంతకాలంగా కలహాల కాపురం



విషాదాంతమైన జీవితం



భర్త నందీశ్, పిల్లలతో విద్య (ఫైల్)





విద్య మృతదేహం

మైసూరు: రాష్ట్రంలో నిత్యం ఏదో ఒక చోట సంచలనాత్మక నేరాలు జరుగుతున్నాయి. ప్రత్యేకించి యువతులు, మహిళల హత్యలు కలకలం రేపుతున్నాయి. అదే కోవలో కుటుంబ కలహాలతో భర్త చేతిలో చిత్ర నటి, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విద్యా నందీశ్ దారుణహత్యకు గురయ్యారు. ఈ ఘటన మైసూరు జిల్లా బన్నూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.. ఆమెకు నందీశ్‌తో 2018లో వివాహం జరిగింది. కొంతకాలానికి గొడవలు మొదలై విడాకుల వరకూ వెళ్లారు. పెద్దల రాజీ పంచాయతీ, మంచి మాటల కారణంగా మళ్లీ ఒక్కటయ్యారు. అయినప్పటికీ గొడవలు మానలేదు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం విద్యా మైసూరులోని శ్రీరాంపురకు వెళ్లారు. రాత్రి భర్త నందీశ్‌తో గొడవ పడ్డారు. కోపంతో నందీశ్ సుత్తి తీసుకుని విద్యా తలపై బాదడంతో తీవ్ర గాయాలతో మృత్యువాత పడింది.

సినీ నటిగా పేరు

విద్యా సినిమా, రాజకీయాల్లో పేరు మోసిన ఒక సెలబ్రిటి. హీరో శివరాజ్‌కుమార్ నటించిన భజరంగి, చిరంజీవి సర్జా నటించిన అజిత్ చిత్రంలో స్నేహితురాలి పాత్రలో నటించారు. పలు సహాయక పాత్రలను కూడా పోషించారు. రాజకీయాల్లో కాంగ్రెస్ మైసూరు నగర ప్రధాన కార్యదర్శిగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆమె మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

పరారీలో భర్త

విషయం తెలిసి మైసూరు జిల్లా ఎస్పీ సీమా లాట్కర్, అదనపు ఎస్పీ నందిని తదితరులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. బన్నూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నందీశ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

డీసీఎం ఆలస్యం, సీఎంకు కోపం



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

శివాజీనగర: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఉగ్రవాద వ్యతిరేక దినం ప్రతిజ్ఞా కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య ఆగ్రహానికి లోనయ్యారు. మంగళవారం విధానసౌధలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉండగా, సీఎం చేరుకున్నారు. కానీ డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇంకా రాలేదు. డీకే వచ్చాక ప్రతిజ్ఞ చేద్దామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రజనీశ్ గోయల్ చెబుతుండగా ముఖ్యమంత్రి మండిపడ్డారు. డీకే రానీ, ముందు మీరు ఆరంభించండి అని సూచించారు. ఆ తరువాత సీఎం వ్యక్తిగత కార్యదర్శి వెంకటేశయ్య కూడా డీసీఎం వస్తున్నారంటా అని చెప్పగా సీఎంకు మళ్లీ కోపం వచ్చింది. వస్తే వస్తారు, రానివ్వండి అని కార్యక్రమం ఆరంభింపజేశారు. ప్రతిజ్ఞ తరువాత మంగళూరు పర్యటనకు వెళ్లాలని సీఎం త్వర త్వరగా హెచ్‌ఏఎల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. ఈ పరిణామాలు అటు అధికార వర్గాలతో పాటు కాంగ్రెస్‌లోనూ చర్చనీయాంశమయ్యాయి.

కెరెగోడులో జెండా కిరికిరి

- కొత్త జాతీయ పతాకం ఏర్పాటు
- భారీగా పోలీసు బందోబస్తు



జాతీయ జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

మండ్య: మండ్య జిల్లా కెరెగోడు గ్రామంలో మళ్లీ హనుమాన్ జెండా వివాదం రాజుకుంది. అర్జున స్తంభంపై జిల్లా పాలన యంత్రాంగం కొత్త జాతీయ జెండాను మంగళవారం ఎగురవేసింది. జనవరిలో చెలరేగిన హనుమధ్వజ వివాదం నేపథ్యంలో అప్పట్లో ఆ జెండాను తొలగించి మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేశారు. అయితే ఎండ, గాలివానలకు జెండా పాడైపోయింది. దాని స్థానంలో కొత్త జెండాను ఆవిష్కరించారు. పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య కలెక్టర్ హెచ్ ఎల్ నాగరాజు ధ్వజారోహణ చేశారు. గతంలో ఈ అర్జున స్తంభంపై జాతీయ జెండా ఎగురవేసినట్లు, అయితే గాలికి ఈ జెండా పాడైపోయిందని చెప్పారు. మున్ముందు కూడా ఈ స్తంభంపై జాతీయ జెండానే ఎగురుతుందని చెప్పారు.

హనుమ ధ్వజాన్ని ఎగరేస్తాం

ఈ చర్యలపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అతిపెద్ద ధ్వజ స్తంభానికి ఈ చిన్న జాతీయ జెండా సరిపోదని, పెద్ద జెండాను ఎగురవేయాలని కోరితే పట్టించుకోకుండా హుటాహుటిన కొత్త జెండా పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హనుమ ధ్వజ పోరాటాన్ని తామింకా ఆపలేదని, జూన్ 4 తర్వాత పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు,. అర్జున స్తంభంపై హనుమ పతాకాన్ని ఎగురవేసి తీరాలని చెప్పారు.

కేరళలో వర్షాలు, నదులకు ప్రవాహం

- కబిని డ్యాంకి ఇన్‌ఫ్లో



మంగళవారం కోలారులో జల్లులు

మైసూరు: కేరళ వయనాడులో భారీ వర్షాలు కురుస్తుండడంతో మైసూరు జిల్లాలోని నదులు, జలాశయాలకు ప్రవాహం మొదలైంది. కపిలా నదిలో ప్రవాహం హెచ్చింది. హెచ్‌డీ కోటె తాలూకాలో బీచనహళ్లిలోని కబిని డ్యాంకి 841 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. రాష్ట్రంలో ఏడాదిలో రెండు సార్లు నీటితో నిండే ఏకైక జలాశయం కబిని మాత్రమే. 84 అడుగుల సామర్థ్యం ఉన్న ఈ కబిని కరువు కారణంగా వట్టిపోయింది. కేరళలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో ఆరంభమైంది. ప్రస్తుతం జలాశయంలో 56.96 అడుగుల నీరు ఉంది. 300 క్యూసెక్కుల నీటిని బెంగళూరు, చామరాజనగర, మైసూరు జిల్లాల తాగు నీటి అవసరాల కోసం విడుదల చేస్తున్నారు. మరోవైపు మంగళవారం బెంగళూరు, కోలారు సహా పలు జిల్లాల్లో జల్లుల వర్షం కురిసింది.

వర్షంలో ఆటో బోల్తా, డ్రైవర్ మృతి

దొడ్డబళ్లాపురం: భారీ వర్షం కారణంగా ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతిచెందిన ఘటన చిక్కమగళూరులోని బణకల్– కొట్టిగెహార రోడ్డులో జరిగింది. మైలిమనె నివాసి ఆటోడ్రైవర్ రవి(35) కుండపోత వర్షంలో వెళ్తుండగా అదుపుతప్పిన ఆటో పల్టీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డ రవిని ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో మరణించాడు.

కోటి ఆశలతో ఖరీఫ్‌కు సన్నద్ధం


ఎరువుల పరిశీలనలో అధికారులు


ట్రాక్టర్ సాయంతో దుక్కి దున్నుతున్న దృశ్యం


పొలంలో పేడ ఎరువు చల్లుతున్న రైతు

- ముందస్తు వర్షాలతో అన్నదాతలకు ఊరట
- ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా నివేదిక
- తొలకరి వర్షంతో రైతన్నలకు పులకరింపు

సాక్షి,బళ్లారి: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు వల్ల రైతన్నలకు పెట్టిన పెట్టుబడులు రాక లక్షలాది రూపాయలు అప్పులు పాలు కావడంతో కోలుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి.వర్షాధారిత పంటలు కూడా పూర్తిగా నష్టపోయారు. తుంగభద్ర అయకట్టు కింద కూడా రైతులు తీవ్రంగా నష్టపోయారు. డ్యాంలోకి తగినంత నీరు రాకపోవడంతో వరి మినహా మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా నష్టాన్ని అందించాయి. వర్షాధారిత భూముల్లో జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో గత ఏడాది రైతన్నలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో ఈ ఏడాదైనా ఖరీఫ్‌లో గట్టెక్కుదామని కోటి ఆశలతో రైతులు ఆశల పల్లకీలో ఊరేగుతున్న నేపథ్యంలో వరుణుడు కనికరించాడు. మే రెండో వారం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి.

ఊపందుకున్న వర్షాలు

జూన్ నెలలో తొలకరి పలకరిస్తుందని ఊహిస్తున్న నేపథ్యంలో మే నెలలోనే వరుణుడు కరుణించడంతో వర్షాలు ఊపందుకున్నాయి. ఆది, సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. నగరంతో పాటు జిల్లాలోని అన్ని తాలూకాల్లో వర్షం పడటంతో రైతన్నలు దుక్కులు దున్నేందుకు సిద్ధం అవుతున్నారు. ముందుగానే వ్యవసాయ పనిముట్లను సిద్ధం చేసుకున్న రైతన్నలు తమ తమ పొలాల్లో ఎద్దులతో పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. జిల్లాలో వర్షాధారిత భూములతో పాటు తుంగభద్ర ఆయకట్టు భూములు కూడా విస్తారంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పంట సాగు చేసేందుకు రైతన్నలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో తుంగభద్ర ఆయకట్టు పరిధిలో బళ్లారి, కంప్లి, సిరుగుప్ప తాలూకాల్లో విస్తారంగా భూములు ఉన్నాయి.

తుంగభద్ర అయకట్టు సిద్ధం

వర్షాధారిత భూముల్లో సజ్జలు, వేరుశనగ, రాగి, జొన్న, కంది తదితర పంటలు సాగు చేస్తుండగా, తుంగభద్ర ఆయకట్టు కింద ప్రధానంగా వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ముందుగానే వరుణుడు కనికరించడంతో రైతన్నలు పంట పొలాలు సిద్ధం చేసుకోవాలని, అన్ని విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా సిద్ధం చేశామని వ్యవసాయాధికారి తిరుమలేశ్ సాక్షికి తెలిపారు. ముంగారు ఆశాజనంగా ఉంటుందని, రైతులు ధైర్యంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు. ముందుస్తు వర్షాలతో ముందుగా దుక్కులు దున్నేందుకు వీలవుతుందన్నారు. దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ దిశగా రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారం అందిస్తామన్నారు.

మేలైన విత్తనాలనే వాడాలి

మేలైన విత్తనాలను సాగు చేసుకోవాలని, నాసికరం విత్తనాలు కాని, మందులు కాని వాడకూడదన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలతో విత్తనాలు తీసుకోవాలన్నారు. రైతు కేంద్రాల్లో రైతులకు విత్తనాలు సిద్ధం చేశామన్నారు. ఎరువులను ఆయా ప్రైవేటు గుర్తింపు పొందిన డీలర్లతో కేంద్ర ప్రభుత్వం అందజేసిన సబ్సిడీ ధరలతో అందజేస్తారన్నారు. ఇప్పుడు ప్రస్తుతం కురిసిన వర్షాలకు దుక్కులు దున్నుకునేందుకు అనువుగా ఉంటుందన్నారు. ముందుగానే దుక్కులు దున్నితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కొన్ని ప్రైవేటు కంపెనీల నుంచి మోసపూరిత మందులు, విత్తనాలను కొనుగోలు చేసి నష్టపోకూడదన్నారు.

డీ సాలుండిలో కలుషిత నీరు సరఫరా


గ్రామంలో నీటి శాంపుల్స్ సేకరిస్తున్న వైద్యాధికారులు, పరిశీలిస్తున్న కలెక్టర్ కేవీ రాజేంద్ర


బాధితురాలిని పరామర్శిస్తున్న జీటీ దేవెగౌడ


గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ కేవీ రాజేంద్ర

- ఒకరి మృతి, 47 మందికి అస్వస్థత

మైసూరు: కలుషిత నీరు తాగి యువకుడు మృతి చెందగా 47 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మైసూరు తాలూకా డి.సాలుండి గ్రామంలో మంగళవారం జరిగింది. అస్వస్థతకు గురైన వారిలో నలుగురికి కలరా సోకిన లక్షణాలుకనిపించాయి. డి.సాలుండి గ్రామంలో తాగునీరు సరఫరా పైప్‌లో నీరు కలుషితమైంది. దీంతో ఆ నీటిని తాగిన 48 మందికి వాంతులు, విరేచనాలకు గురయ్యారు. బాధితులను వివిధ ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి కనకరాజు (20) అనే యువకుడు మృతిచెందాడు. మృతుడు వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేవాడు. చాలా పేదరికంలో ఉన్నాడు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిహారం అందివ్వాలని కుటుంబ సభ్యులు మనవి చేశారు.

గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్

కలుషిత నీరు తాగి ప్రజలు అస్వస్థతకు గురైనట్లు తెలియగానే జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా ఆరోగ్యాధికారి డాక్టర్ కుమారస్వామి, తాలూకా ఆరోగ్యాధికారి, తాలూకా పంచాయతీ కార్యనిర్వాహక అధికారి ఉన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోండి: సీఎం

సాలుండి గ్రామంలో కలుషిత నీరు తాగి యువకుడు మృతి చెందిన విషయంపై ముఖ్యమంత్రి సిద్ధరామ్య వెంటనే స్పందించారు. జిల్లాధికారితో మాట్లాడి వివరాలు తెలసుకున్నారు. నీటి కలుషితానికి కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చికిత్స పొందుతున్న వారికి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ఆరోగ్యాధికారి స్పందించి జిల్లాస్పత్రి, కేఆర్ ఆస్పత్రిలో చెరో 25 పడకలను బాధితుల చికిత్స కోసం కేటాయించారు.

ముడా ఇంజినీర్‌ను సస్పెండ్ చేయాలి: జీటీ దేవెగౌడ

సాలుండి గ్రామంలో కలుషిత నీరు తాగి యువకుడు మృతి చెందిన ఘటనపై జీటీ దేవెగౌడ మండిపడ్డారు. బాధితులను ఆయన పరిశీలించారు. అనంతరం ముడా కమిషనర్‌కు మొబైల్ ఫోన్‌లో కాల్ చేసి మాట్లాడారు. ముడా ఇంజినీర్ కేటీ రవిని బాధ్యుడిని చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ట్యాంక్ నిర్మించాలని తాను మూడేళ్లుగా ఇంజనీర్‌కు చెబుతూ వస్తున్నా పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ కోసం స్థలాలు ఇస్తూ వచ్చారని ఆరోపించారు.ప్రభుత్వం సెప్టిక్ ట్యాంక్‌కు అనుమతి ఇస్తే అందుకు కూడా పైప్ లైన్ లింక్ చేయలేదన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

- డీ.కే.శివకుమార్

శివాజీనగర: శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ముగిశాయని, త్వరలో జరిగే జరిగే జిల్లా, తాలూకా పంచాయితీ, బీబీఎంపీ ఎన్నికలకు సిద్ధం కావాలని కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం కేపీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ తాను ఈ పదవిలో ఎన్ని రోజులు ఉంటానో తెలియదు. తన అవధిలో పార్టీ పటిష్టతకు పునాది వేస్తానన్నారు. పని చేయనివారిని మార్చివేసి, కొత్తవారికి అవకాశం ఇస్తామన్నారు. బ్లాక్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు తటస్థంగా ఉన్న అందరి పదాధికారులను మార్చాలని కేపీసీసీ పరిపాలనా కార్యధ్యక్షుడు జే.పీ.చంద్రశేఖర్‌కు సూచించినట్లు తెలిపారు. 73,74వ సవరణ తీసుకు రావటం ద్వారా రాజీవ్ గాంధీ స్థానిక నాయకత్వం ఎదిగేందుకు పునాది వేశారని తెలిపారు. 1985లో యువజన కాంగ్రెస్‌కు చెందిన 40 మందితో పాటుగా మొత్తం 70 మంది యువకులకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజీవ్ గాంధీ టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఈశ్వర్ ఖండ్రె, మాజీ మంత్రులు హెచ్.ఎం.రేవణ్ణ, రాణి సతీశ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఐపీఎల్‌కు బెంగళూరు అడ్డా

- క్రికెటర్ షేన్ వాట్స్



కార్యక్రమంలో పాల్గొన్న షేన్ వాట్స్ తదితరులు

యశవంతపుర: ఐపీఎల్‌కు బెంగళూరు ప్రధాన కేంద్రమని క్రికెటర్, వ్యాఖ్యాత, రచయిత షేన్ వాట్స్ అన్నారు. యలహంక తాలూకా రాజానుకుంట సమీపంలోని ప్రెసిడెన్సీ వర్సిటీ అవరణలో ది విన్నర్స్ మైండ్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భారత క్రికెట్ జట్టులో అత్యంత అజేయమైన విజేత ఎవరని విద్యార్థులు ప్రశ్నించగా, విరాట్ కోహ్లీ అని సమాధానం ఇచ్చారు. గొప్ప ఆల్‌రౌండర్ మహేంద్రసింగ్ ధోని అని కొనియాడారు. ధోని విజయం సాధించడానికి అన్ని అర్హతలు కలిగి ఉన్నాడంటూ చెప్పారు. అనంతరం విద్యార్థులు, కాలేజీ సిబ్బందితో కలిసి క్రికెట్ ఆడారు. 2016లో ఐపీఎల్‌లో తన జట్టు ఓడిపోవడానికి కారణాలపై వారితో చర్చించారు. ఈ విషయంలో ఆర్‌సీబీ అభిమానులకు క్షమాపణలు చెప్పాడు. కాలేజీ యజమాన్యం షేన్‌వాట్స్‌ను ఘనంగా సన్మానించింది.

శతాయుషి మృతి


పాపేగౌడ(ఫైల్)

మండ్య: శ్రీరంగపట్టణ తాలూకా మజ్జిగెపుర గ్రామానికి చెందిన శతాయుషి పాపేగౌడ (113) వయోభారంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడికి మండ్య సెస్కాం విభాగంలో విశ్రాంత కార్యనిర్వాహక అధికారి శివేగౌడతో పాటు ఆరుగురు మగపిల్లలు, ఒక ఆడ పిల్ల సంతానం ఉన్నారు. పాపేగౌడ అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం మజ్జిగేపుర గ్రామంలో నిర్వహించారు.

ఎయిర్‌పోర్టు క్యాబ్ రుసుము రద్దు!

దొడ్డబళ్లాపురం: నగర కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో క్యాబ్, ట్యాక్సీలు ప్రవేశించడానికి రుసుము వసూలు చేస్తామని ప్రకటించిన ఎయిర్‌పోర్టు అథారిటీ తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కు తగ్గింది. ప్రయాణికులను పికప్ చేసుకోవడానికి వచ్చే క్యాబ్‌లపై 7 నిమిషాలకు రూ.150, అంతకు మించితే రూ.300 రుసుము చెల్లించాలని గత ఆదివారం ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం నాడు ఎయిర్‌పోర్టులో ధర్నా చేపట్టారు. దీంతో అథారిటీ రుసుమును నిలిపివేస్తున్నట్లు తెలిపింది.

జింకను రక్షించిన గ్రామస్తులు

దొడ్డబళ్లాపురం: గుండ్లుపేట తాలూకి మద్దూరు సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఓ జింక పిల్ల మంగళవారం గ్రామంలోకి చొరబడింది. వీధికుక్కలు దానిపై దాడిచేసి గాయపరిచాయి. గ్రామస్తులు కుక్కలను తరిమి జింకపిల్లను రక్షించారు. దానిని అటవీశాఖ అధికారులకు అప్పగించగా చికిత్స అనంతరం అడవిలో వదిలేశారు.


జింకపిల్లకు సపర్యలు చేస్తున్న గ్రామస్తులు

కోలారు వార్తలు...

రాష్ట్రంలో శాంతి భద్రతలు మృగ్యం

- మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడ


మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా నిబద్ధత ఉంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ప్రజల పెండింగ్ కేసుల విచారణకు ఆదేశాలు జారీ చేయాలని, పారదర్శకత పాటించాలని మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడ డిమాండ్ చేశారు. విధాన పరిషత్ ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో సీబీఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసు విచారణలో ఉన్నప్పుడు అధికారంలో ఉన్నవారు ముక్తకంఠంతో మాట్లాడితే విచారణను అడ్డుకున్నట్లేనన్నారు. విచారణ దశలో సీఎం, డీసీఎం, హోంమంత్రి స్టేట్‌మెంట్ ఇస్తే దిక్కుతోచని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయన్నారు. నెలరోజుల్లో ఏడెనిమిది హత్యలు జరిగాయన్నారు. తన కుటుంబ సభ్యులపై కేసు పెట్టినా దేవెగౌడే ఒక్క మాట కూడా మాట్లాడకుండా శిక్షించాల్సిందేనన్నారన్నారు. ప్రజ్వల్ ఎక్కడ ఉన్నా విచారణకు కేంద్రం సహకరించడం లేదన్న ప్రశ్నకు బదులిస్తూ వెంటనే విచారణకు సహకరించాలని, లేకుంటే అనుమానాలు వస్తాయని, అతని కుటుంబం కూడా ఇబ్బంది పడుతుందన్న విషయాన్ని మర్చిపోవద్దని ప్రజ్వల్‌కు సమాదానమిచ్చారు. నివేదిక సమర్పించిన తర్వాత ప్రశ్నించే పటిష్టమైన న్యాయవ్యవస్థ మనదేశంలో ఉందన్నారు. విచారణకు సహకరిచకుంటే అది మరింత అనుమానాలకు తావిస్తుందని ఆయన అన్నారు. రాహుల్ గాంధీకి ఒకే ఒక ఓటు ఉందని, దేశంలో 85 కోట్ల మంది ఓటర్లు ఉండగా ఎన్ని స్థానాల్లో పోటీ చేశారో తెలిసినా మోదీ అధికారంలోకి రాలేడని రాహుల్ చెప్పడం చిన్నపిల్లాడి మనస్తత్వంలా ఉందన్నారు. కర్ణాటకలో 20 నుంచి 24కు పైగా సీట్లలో గెలుస్తామని, కేరళలో కూడా 2 నుంచి 3 సీట్లు గెలుస్తామని ఆయన చెప్పారు.

ధార్మిక కార్యక్రమాలతో ఆత్మసంతృప్తి


శిరస్సు జాతరలో పాల్గొన్న మోహనకృష్ణ

కేజీఎఫ్: ధార్మిక కార్యక్రమాలతో ఆత్మసంతృప్తి కలుగుతుందని సమాజ సేవకుడు మోహనకృష్ణ తెలిపారు. ఆయన మంగళవారం నగరంలోని రాబర్ట్‌సన్‌పేట గణేషపురం వార్డులోని శక్తి దేవతల్లో ఒకరైన గంగై అమన్ దుర్గ ఆలయంలో 24వ వార్షిక శిరస్సు జాతర మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మంలో ఆచరిస్తున్న జాతరలు, సమారంభాలు, సనాతన ధర్మ ఆచార విచార సంస్కృతులను నేటి తరం ముందుకు కొనసాగించాల్సి ఉందన్నారు. రాజకీయ ఒత్తిడుల నడుమ ఇలాంటి ధార్మిక కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా మనసుకు ఎంతో శాంతి, నెమ్మది లభిస్తుందన్నారు. నేడు సనాతన ధర్మాన్ని రక్షించడానికి ఇలాంటి జాతర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడం అనివార్యమన్నారు. దీని వల్ల భావితరాలకు మన పూర్వీకులు ఆచరించుకుని వచ్చిన ఆచార విచారాల గురించి తెలుస్తుందన్నారు. ఈసందర్భంగా నగరంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంట్లో కోళ్లు, గొర్రెలను బలి ఇచ్చి దేవతకు మొక్కులు తీర్చుకున్నారు. జాతర ఊరేగింపు నగరంలోని ప్రముఖ వీధుల్లో సంచరించి తిరిగి ఆలయానికి చేరుకుంది.

పరీక్షా ఫలితాల వెల్లడి

శివాజీనగర: ద్వితీయ పీయూసీ పరీక్ష-2 ఫలితాలు మంగళవారం ప్రకటించారు. హాజరైన విద్యార్థుల్లో 52,505 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈసారి కూడా బాలికలదే పైచేయి. ఏప్రిల్ 29 నుండి మే 16 వరకు మొత్తం 301 పరీక్షా కేంద్రాల్లో ద్వితీయ పీయూసీ పరీక్ష-2 జరిగింది.

క్లుప్తంగా

వృద్ధులకు వైద్య శిబిరం


శిబిరంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్లు

రాయచూరు రూరల్: నగరంలో సీనియర్ సిటిజన్లకు వైద్య శిబిరాలను నిర్వహించారు. మంగళవారం ఆశాపూర్ రోడ్డులోని లలిత సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ ఆఫ్ పీపుల్ విత్ డిసేబిలిటీ సంస్థ సహకారంతో 35 మంది దివ్యాంగులకు చికిత్సలు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్, వైద్యులు చంద్రకళ, అమీనా, లలిత, మారెప్ప నాయక్‌లున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాయచూరు రూరల్ : నగరంలో మంగళవారం బెట్టదూరు ఆస్పత్రి వద్ద గుర్తు తెలియని శవం మృతదేహం లభించింది. సుమారు 50 ఏళ్ల వయస్సుగల వృద్ధుడి మృతదేహాన్ని నేతాజీ నగర్ పోలీసులు స్వాధీనపరచుకుని శవపరీక్ష నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు ఎవరైనా ఉంటే నేతాజీనగర్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఫసల్‌బీమా పరిహారం ఇవ్వండి


మాట్లాడుతున్న నరసింహ నాయక్

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకం కింద రైతులకు పరిహారం అందించాలని కర్ణాటక రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించిందన్నారు. రైతులకు ఫసల్‌బీమా పథకం కింద పరిహారం అందించాలన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు రోగులకు సరైన సేవలు అందించడం లేదని ఆరోపించారు.

గ్రామంలోకి పోటెత్తిన మూగజీవాలు

దొడ్డబళ్లాపురం: గ్రామంలోకి ఒకేసారి 2వేలపైగా మూగజీవాలు ప్రవేశించడంతో గ్రామస్తులు కాసేపు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా మెడ్లేరి గ్రామంలో చోటుచేసుకుంది. కొప్పళ తాలూకాలో మేత కొరత ఏర్పడడంతో రైతులు ఆవులు, మేకలు, గొర్రెలను తోలుకొని వచ్చారు. ఈక్రమంలో జీవాలు మంగళవారం మెడ్లేరిలోకి ప్రవేశిండంతో గ్రామస్తులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. మేత కోసం వచ్చినట్లు తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు అనన్యం


చిత్రపటానికి పూలమాల వేస్తున్న నేతలు

రాయచూరు రూరల్ : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు అనన్యమని నగర కాంగ్రెస్ అధ్యక్షులు బసవరాజ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. అత్యంత ప్రభావశాలి ప్రధానమంత్రిగా ఉండి దేశంలో విజ్ఞాన, సాంకేతిక రంగంలో సామాజిక దృష్టితో అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేంత స్థాయికి వివిధ రంగాలను తీర్చిదిద్దారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు చట్ట ప్రకారం రిజర్వేషన్లు, దళితులకు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలకు పదవులు దక్కే మార్గం లభించిందన్నారు. రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ పాల్గొన్నారు.

కుండపోత వర్షం.. భారీగా నష్టం

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన కుండపోత వర్షానికి భారీగా నష్టం వాటిల్లింది. టి.కల్లహళ్లి గొల్లరహట్టిలో 8 గొర్రెలు పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాయి. అలాగే కానాహొసహళ్లి గ్రామం ఎస్.అనుదాపూర్ ప్రాంతంలో నివాసముంటున్న కాటమ్మ బాలప్ప, కురిహట్టి గ్రామంలో ఉన్న హెచ్.బసవరాజు, అమలమాన తిరుమలేష్‌లకు చెందిన ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. రెవెన్యూ అధికారులు సందర్శించి పరిశీలించారు. తాలూకాలోని పూజారహళ్లి, కన్నబోరయ్యనహట్టిల మధ్య ప్రవహించే వాగులో వర్షం నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

లింక్ కెనాల్ ద్వారా నీటి విడుదలకు అంగీకరించం


జేసీబీలను అడ్డుకుంటున్న మాజీ మంత్రి సొగడు శివణ్ణ

తుమకూరు: రామనగర జిల్లా మాగడి శ్రీరంగ ఎత్తిపోతల ప్రాజెక్టుకు అదనపు నీటిని పంపిణీ చేసేందుకు కాలువను తీసుకెళ్లేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే లింక్ కెనాల్ ద్వారా పైప్‌లైన్‌ను ఉపయోగించి నీరు విడుదల చేయడాన్ని ఒప్పుకోబోమని మాజీ మంత్రి సొగడు శివణ్ణ తెలిపారు. హేమావతి నీటిని రామనగర జిల్లాకు తరలించేందుకు తురువెకెరె తాలూకా సీఎస్‌పుర హోబళి చెన్నేనహళ్లి గ్రామంలో జరుగుతున్న పైప్ లైన్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన అడ్డుకుని మాట్లాడారు. తుమకూరు జిల్లా రైతులు, ప్రజలు, ప్రాణులు, పక్షుల సంక్షేమాన్ని కాపాడడం జిల్లా పౌరుడిగా తన బాధ్యత అని, అందుకే ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించడం కోసం లింక్ కెనాల్‌ను నిర్మించడం తాను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దొడ్డబళ్లాపురం: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన చిక్కమగళూరు తాలూకా గాంజాల గోడులో చోటుచేసుకుంది. గ్రామంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఈక్రమంలో విద్యుత్ స్తంభం నుంచి ఒక వైరు కిందకు వేలాడుతుండడంతో గ్రామ నివాసి జీవిత్(23) గమనించి దాన్ని సరిచేస్తుండగా కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. చిక్కమగళూరు గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్యే, అధికారుల నిర్లక్ష్యం వల్లనే కలుషిత నీరు సరఫరా


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మరిగౌడ

మైసూరు: చాముండేశ్వరి నియోజకవర్గం కె.సాలుండి గ్రామంలో కలుషిత నీరు సేవించి ఒకరు మృతి చెంది అనేక మంది ఆస్పత్రి పాలయ్యేందుకు ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ, ముడా సాంకేతిక అధికారులు, టీపీ ముఖ్య అధికారి నిర్లక్ష్యమే కారణమని ముడా అధ్యక్షుడు కె.మరిగౌడ ఆరోపించారు. కలుషిత నీరు తాగి మృతి చెందిన కనకరాజు అంత్యక్రియల్లో ఆయన పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం లక్ష పరిహారం పంపిణీ చేశారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా జీటీ దేవెగౌడ చాముండేశ్వరి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నారన్నారు. అయినా నీటి సరఫరాకు సరైన చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామంలో సెప్టిక్ ట్యాంక్ లేకపోవడం వల్ల నీరు కాలువల్లోకి ప్రవహిస్తోందని, ఈ నీరు బోరుబావి పక్కనే ఉండడంతో తాగునీరు కలుషితమైందన్నారు.

ముగ్గురు క్రికెట్ బుక్కీల అరెస్టు

కోలారు: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొన్న ముగ్గురు బుక్కీలను కోలారు నగర పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని షహీన్‌షా నగర్‌కు చెందిన ఖదీర్ పాషా, వసీం బేగ్, ముజాహిద్ పాషా పోలీసులు అరెస్టు చేసిన నిందితులు. వారి వద్ద నుంచి రూ.4600 నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఎం.నారాయణ, ఏఎస్పీలు సీఆర్ రవిశంకర్, జగదీష్, డీఎస్పీ హెచ్ ఎం నాగేష్ మార్గదర్శనంలో నగర సీఐ సదానంద, సిబ్బంది కార్యాచరణ జరిపి క్రికెట్ బుక్కీలను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకున్నారు.

సస్పెన్షన్‌పై ఆందోళన

కోలారు: అంజలి అంబిగేరా హత్య కేసులో హుబ్లీ డీసీపీ రాజీవ్‌ను సస్పెండు చేయడాన్ని ఖండించి బుధవారం ప్రముఖ సాహితీవేత్త కోటిగానహళ్లి రామయ్య నేతృత్వంలో అంబేడ్కర్ విగ్రహం ముందు ధర్నా చేశారు. రాష్ట్రంలో దళిత సముదాయం కాంగ్రెస్ కబంద హస్తాలలో చిక్కుకుని పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దళిత అధికారిని సస్పెండు చేశారు, అదే డీసీపీ రాజీవ్ ఇతర కులానికి చెందిన వాడై ఉంటే అతనిని వెనకేసుకు వచ్చి ఉండేవారన్నారు. మంత్రులు పరమేశ్వర్, మహదేవప్ప, ఖర్గేలు దీనికి సమాధానం చెప్పాలన్నారు. ఈ ధర్నాలో నేత్రావతి, కె సి రాజణ్ణ, హారోహళ్లి వేణు, మేడిహాళ చంద్రశేఖర్, కురుగల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచండి

చిక్కబళ్లాపురం: ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం అనిల్ సూచించారు. చిక్కబళ్లాపురం టీపీ సభాంగణంలో వ్యవసాయ పనిముట్లు, ఎరువుల దుకాణదారులతో మంగళవారం ఆయన సమావేశమై మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు, కీట పురుగు మందుల ధరల జాబితాలను దుకాణాల వద్ద ప్రదర్శించాలన్నారు. రైతులకు బిల్లులు తప్పనిసరిగా అందజేయాలన్నారు. సహయక కృషి నిర్దేశకులు కేశవరెడ్డి, వ్యవసాయశాఖ తాలూకా అధికారులు గంగాధర రెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

ఉగ్రవాద వ్యతిరేక ప్రతిజ్ఞ

బనశంకరి: ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరపోలీస్ కమిషనర్ బీ.దయానంద్ పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉగ్రవాద కార్యకలాపాలను కూకటి వేళ్లతో అణచివేయాలని ప్రతిన పూనారు. ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమిషనర్లు రమణ్‌గుప్తా, చంద్రగుప్తా, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నరసింహ జయంతి



నరసింహస్వామికి విశేషాలంకరణ

గౌరిబిదనూరు: నరసింహ జయంతి ఉత్సవాలను కల్లూడి సమీపంలోని కంబద నరసింహ దేవాలయంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త దేవరాజగౌడ నేతృత్వంలో గణపతి హోమం, నరసింహస్వామి హోమం, అభిషేకాలు నిర్వహించారు. యోగీశ శర్మ, బసవరాజేగౌడ, మంజునాథ, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మలేరియా నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ మంజునాథ్

తుమకూరు: తుమకూరును మలేరియా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని జిల్లా వైద్యారోగ్య సంక్షేమాధికారి డాక్టర్ మంజునాథ్ అన్నారు. నగరంలోని డీహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాలేదన్నారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చిన నలుగురిలో ఈ రోగ లక్షణాలు కనిపించాయని చెప్పారు. 2022లో మలేరియా కేసులు రికార్డులు కాలేదని, 2023లో 14కేసులు నమదు అయ్యాయని తెలిపారు. ఈ కేసులు కూడా జిల్లాకు వలస వచ్చిన ఇతర రాష్ట్రాల ప్రజల్లో మలేరియా సోకినట్లు గుర్తించినట్లు తెలిపారు.

కలుషిత జలాలను కాలువల్లోకి వదిలితే చర్యలు



రాజకాలువలను పరిశీలిస్తున్న కలెక్టర్ శుభకళ్యాణ్

తుమకూరు: నగర శివార్లలోని అంతరసహళ్లి పారిశ్రామిక వాడలో కలుషిత నీటిని రాజకాలువలో విడుదల చేసినట్లు ఫిర్యాదు అందిన నేపథ్యంలో జిల్లాధికారి శుభకల్యాణ్ సోమవారం మధ్యాహ్నం అక్కడికి చేరుకుని పరిశీలించారు. పారిశ్రామిక వ్యర్థాలను కాలువలోకి విడుదల చేయకూడదని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని సూచించారు. విష వ్యర్థాలను కాలువలో కలుపుతున్న వారిపై నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బసవేశ్వరుని బోధనలు ఆచరించాలి



బసవజయంతి కార్యక్రమంలో పాల్గొన్న జానపద కళాకారులు

గౌరిబిదనూరు: జగద్గురు బసవేశ్వరుడు గొప్ప సంఘ సంస్కర్త అని, 12వ శతాబ్దంలో అనుభవ మంటపం ద్వారా ప్రజలకు సుపరిపాలన అందించారని వీరశైవ వర్గం నేత ద్వారకీశ్ తెలిపారు. కడబూరు గ్రామంలో వీరశైవ క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బసవ జయంతిని నిర్వహించారు. ద్వారకీశ్ మాట్లాడుతూ యువత బసవేశ్వరుడి బోధనలను అలవర్చుకోవాలన్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ ధర్నా



ఉప తహసీల్దార్ ఆశాకు వినతిపత్రం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు

గౌరిబిదనూరు: ఫొటో గ్రాఫర్‌పై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం తాలూకా కార్యాలయం ముందు తాలూకా ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు ధర్నా చేశారు. అధ్యక్షుడు ఫణిల్ మాట్లాడుతూ బెంగుళూరు నగరం శివాజీ నగర్‌లో ఉన్న కల్యాణ మంటపంలో శనివారం రాత్రి జరిగిన పెళ్లి కార్యక్రమంలో చిన్న విషయానికే ఫొటో గ్రాఫర్‌పై పెళ్లి నిర్వాహకులు దాడి చేశారన్నారు. దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపతహసీల్దార్ ఆశాకు వినతిపత్రం అందజేశారు. దేవీ మంజునాథ్, ప్రదీప్, బాబు, శ్రీకంఠ, శ్రీనివాస్, జగదీశ్, మంజునాథ్, రవి కుమార్, కిరణ్‌రాజ్ పాల్గొన్నారు.

సిలికాన్ సిటీలో చెలరేగిన సైబర్ కేటుగాళ్లు

- ఆర్‌బీఐ అధికారికి రూ.24.50 లక్షలు టోకరా
- కస్టమ్స్ అధికారినంటూ రూ.కోటీ 34 లక్షలు వంచన
- షేర్ మార్కెట్‌లో లాభాలంటూ రూ.కోటీ 50 లక్షలు దోచేసిన వంచకులు





బనశంకరి: దేశంలో ఎక్కడెక్కడో తిష్టవేసిన సైబర్ కేటుగాళ్లు ఐటీసిటీ బెంగళూరుపై కన్నేశారు. విభిన్న పంథాలో బ్యాంకు ఉద్యోగులు, ఐటీబీటీ ఉద్యోగులు, విద్యావంతులు, ఉద్యోగస్తులు, యువతీయువకులను టార్గెట్ చేసి వారి బ్యాంకు ఖాతాలకు చిల్లు పెడుతున్నారు. సైబర్ నేరాలపై అధికారులు అప్రమత్తం చేసినా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. అత్యాశాకు పోయి కొందరు సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కుతున్నారు. సైబర్ వంచకులకు చిక్కి ఆర్‌బీఐ అధికారి రూ.24.50 లక్షలు, మరో ఇద్దరు వ్యక్తులు దాదాపు రూ.2.5కోట్లు పోగొట్టుకున్నారు.

ఉగ్రవాదులతో చేతులు కలిపారంటూ..

వసంతనగరలో స్థిరపడిన ఆర్‌బీఐ అధికారికి సైబర్ వంచకులు ఈనెల 6న ఫోన్ చేశారు. ముంబై పోలీస్ అని పరిచయం చేసుకున్నారు. మీ పేరుతో విదేశాలకు పార్శిల్ రవాణా అయ్యింది. అందులో 5 పాస్ పోర్టులు, 200 గ్రాములు ఎండీఎంఏ లభించిందని, ఉగ్రవాది ఎండీ.మల్లిక్ అనే వ్యక్తితో చేతులు కలిసి ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ఆధారాలున్నాయని, మీ ఆధార్, సెల్‌నంబర్ ద్వారా బ్లాక్‌మనీ రవాణా సైతం జరిగినట్లు వెలుగులోకి వచ్చిందని, దీనిపై దర్యాప్తు చేపట్టాలని చెప్పారు. మీ బ్యాంకు అకౌంట్‌లో నగదు ఉంటే తక్షణం ఆర్‌బీఐకు జమ చేయాలని సూచించారు. ఇలా దశలవారీగా రూ.24.50 లక్షలు తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీబీఐ, ఈడీ పేరుతో నకిలీ నోటీసులు పంపి...

రామమూర్తినగరలో నివాసం ఉంటున్న 40 ఏళ్ల వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేశాడు. ముంబై కస్టమ్స్ అధికారినంటూ పరిచయం చేసుకున్నాడు. తైవాన్‌కు మీ పేరుతో పార్శిల్ వెళుతుంది. అందులో 200 గ్రాములు డ్రగ్స్ ఉందని బెదిరించాడు. వర్చువల్ విచారణ చేపట్టాలని వాట్సాప్‌లో వీడియోకాల్ చేశారు. ఎవరికీ చెప్పరాదని సూచిస్తూ విచారణపేరుతో ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ల వివరాలు తీసుకున్న అనంతరం మనీల్యాండరింగ్ కేసు నమోదు చేస్తున్నామని తెలిపారు. సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ పేరుతో నకిలీ నోటీసులు వాట్సాప్‌కు పంపించి అన్ని బ్యాంకు అకౌంట్లు జప్తు చేయాలని తెలిపారు. బ్యాంకు అకౌంట్లులో ఉన్న నగదు ఆర్‌బీఐ అకౌంట్‌కు జమచేయాలని విచారణ అనంతరం వెనక్కి ఇస్తామని నమ్మించి దశలవారీగా రూ.కోటీ 34 వేలు తమ బ్యాంకు ఖాతాకు మళ్లించుకున్నారు.

అధిక లాభాలంటూ టోకరా

జయనగర ఫస్ట్‌బ్లాక్ నివాసికి ఓ మహిళ ఫోన్ చేసి తనపేరు దీప్తికిరణ్ అని పరిచయం చేసుకుంది. షేర్ మార్కెట్‌లో నగదు పెట్టుబడిగా పెడితే మంచి లాభాలు వస్తాయని నమ్మించి టెలిగ్రామ్ గ్రూప్‌లో చేర్చుకుంది. ఒక కంపెనీ పేరు చెప్పి వివిధ బ్యాంకు అకౌంట్లుకు దశలవారీగా రూ.1.50 కోట్ల నగదు జమచేయించింది. ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడికి లాభం ఇవ్వాలని కోరగా మరింత నగదు పెట్టుబడిపెట్టాలని ఒత్తిడి చేసింది. తన డబ్బు వెనక్కి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేయడంతో వంచకురాలు అందుబాటులోకి రాలేదు. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైద్యుడికి రూ.3.5 కోట్లు టోకరా

శివాజీనగర: సీబీఐ అధికారి పేరుతో వంచకుడు ప్రముఖ సీనియర్ వైద్యుడిని బెదిరించి సుమారు మూడున్నర కోట్ల రూపాయలు దోచుకున్నాడు. రాణిబెన్నూరులోని సంజీవిని నర్సింగ్ హోం వైద్యుడు డాక్టర్ భీమసేన్ కర్జిగికి ఈనెల 17న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాను సీబీఐ ఆఫీసర్ దీక్షిత్ గడా అని పరిచయం చేసుకున్నాడు. వైద్యుడిని బెదిరించి అతని బ్యాంక్ ఖాతానుంచి రూ.3.5కోట్లు తన ఖాతాకు మళ్లించుకున్నాడు. ఘటనపై సీఈఎన్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

సెల్‌ఫోన్ చోరీ ముఠాల పట్టివేత

- రూ.లక్షల విలువైన సెల్‌ఫోన్లు స్వాధీనం



సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న నగరపోలీస్ కమిషనర్ బీ.దయానంద్

బనశంకరి: సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న రెండు ముఠాలు పట్టుబడ్డాయి. ఏపీలోని నాగనూరి కుమార్, పురుషోత్తమ అనే ఇద్దరు, కర్ణాటకకు చెందిన ఐదుగురిని ఉప్పారపేటే పోలీసులు అరెస్టుచేశారు. ఏపీకి చెందిన నిందితులనుంచి రూ.22.40 లక్షల విలువచేసే వివిధ కంపెనీలకు చెందిన 176 సెల్‌ఫోన్లు, బెంగళూరుకు చెందిన నిందితులనుంచి రూ.6.31లక్షల విలువైన 32 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నగర పోలీస్‌కమిషనర్ బీ.దయానంద్ మంగళవారం చోరీసొత్తును పరిశీలించి విలేకరులకు వివరాలు వెల్లడించారు. గతనెల 22 తేదీన శివమొగ్గ నుంచి రైలులో బెంగళూరుకు వచ్చి బీఎంటీసీ బస్సులో ప్రయాణించిన వ్యక్తి సెల్‌ఫోన్ చోరీ చేశాడు. ఉప్పారపేటే సీఐ మారుతి ఆధ్వర్యంలో పోలీసులు పలుకోణాల్లో దర్యాప్తు చేపట్టి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అతను ఇచ్చిన సమాచారంతో మే 5 తేదీన బాగలూరు గోపాలపురలో ఏపీకి చెందిన నాగనూరి కుమార్, పురుషోత్తమను అరెస్ట్ చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా బెంగళూరులో సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్న ఐదుగురిని చంద్రాలేఔట్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ.6.31 లక్షల విలువచేసే 32 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. నాగరబావి సువర్ణలేఔట్ రోడ్డులో ఓ వ్యక్తి కాలినడకన వెళ్తుండగా నిందితులు అతని నుంచి ఐఫోన్‌ను చోరీ చేశారని ఫిర్యాదు అందింది.

నిబంధనల ఉల్లంఘనతోనే ముంపు సమస్యలు



రాజకాలువను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, అధికారులు

దొడ్డబళ్లాపురం: మౌలిక సదుపాయాలు కల్పించని ప్రైవేటు లే ఔట్ల డెవలపర్‌లకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధికారులను ఆదేశించారు. రాచేనహళ్లి చెరువు వద్ద రాజకాలువను, ముంపు ప్రాంతాలను ఆయన మంగళవారం పరిశీలించారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించి లేఔట్లు నిర్మించడం వల్ల వర్షం నీరు ఇళ్లల్లోకి చేరుతోందన్నారు. వర్షం నీరు, మురుగు నీరు కలిపి వదలడం వల్ల సమస్య తలెత్తుతోందన్నారు. డెవలపర్‌లు అత్యాశకు పోయి సదుపాయాలు కల్పించకపోవడం వల్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బెంగళూరులో ఎక్కడెక్కడ వర్షం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయో గుర్తించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రాజకాలువలు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

యశవంతపుర: మంగళూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద స్నేహితుడిపై దాడి చేసిన అనివాష్ అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బంట్వాళ తాలూకా పుణచకు చెందిన సచిన్(31) తన ముగ్గురు స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ భోజనం చేసి నిద్రపోయారు. సెల్‌ఫోన్, వెయ్యి రూపాయిల నగదు చోరీకి గురైందని చెబుతూ అవినాష్... సచిన్‌పై చాకుతో పోడిచి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకోని నిందితుడిని అరెస్ట్ చేశారు.

జైలునుంచి వచ్చి చోరీలు



నిందితుడు నాగరాజు

తుమకూరు: జైలుపాలైన దొంగ కారాగారం నుంచి విడుదలైన నెల రోజుల్లోనే మళ్లీ చోరీల బాట పట్టి మళ్లీ పోలీసులకు చిక్కాడు. తుమకూరు గ్రామీణ జిల్లా హెబ్బూరు హోబళి హరియూరు గ్రామానికి చెందిన సిద్దింగప్పన కుమారుడు నాగరాజు (37) గతంలో రెండు బైక్‌లు చోరీ చేశాడు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి జైలుకు పంపాడు.నెల రోజుల క్రితం బెయిల్‌పై బయటకు వచ్చి కొరటగెరె పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక బైక్, తుమకూరు తిలక్‌పార్కులో మరో బైక్‌ను దొంగతనం చేశాడు. పోలీసులు గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు.

బ్లేడ్‌తో భార్య చెంపలు, చేతులు కోసి పరారీ

యశవంతపుర: తనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తావా? అంటూ బ్లేడ్‌తో భార్య చెంపలు, చేతులు కోసి పరారైన భర్త ఉదంతం హాసన జిల్లా సకలేశపుర తాలూకాలో చోటు చేసుకొంది. సుకలేశపుర పట్టణం అగ్రహార లేఔట్‌లో శరత్, అనూష దంపతులు నివాసం ఉంటున్నారు. దంపతుల మధ్య గొడవ చోటుచేసుకొని ఓ దశలో భార్యపై దాడి చేశాడు. బాధితురాలు ఆస్పత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు శరత్‌పై కేసు నమోదు చేశారు. తనపై ఫిర్యాదు చేస్తావా అంటూ శరత్..ఆఆస్పత్రికి వెళ్లి బ్లేడ్‌తో భార్య చెంపలు, చేతులు కోసి ఉడాయించాడు.

ఎరువులు, విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి



మాట్లాడుతున్న నంజావధూత స్వామీజీ

తుమకూరు: అష్టలక్ష్ములు మన పక్షాన ఉండాలంటే మనుషులు నిష్టతో ప్రామాణికంగా ఉండాలని స్ఫటికపురి మహాసంస్థాన మఠాధిపతి శ్రీ నంజావధూత స్వామిజీ తెలిపారు. శిరా తాలూకా బందకుంటే గ్రామంలో మంగళవారం జరిగిన శ్రీ లక్ష్మిదేవీ ఆలయ నూతన కలశ ప్రతిష్టాపన మహోత్సవంలో స్వామిజీ పాల్గొన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలతో రైతుల ముఖాల్లో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఎరువులు, విత్తనాలను సబ్సిడీ ధరలో ఇవ్వాలని, వీలయితే ఉచితంగా ఇవ్వాలన్నారు.

టీసీ ఇవ్వలేదని విద్యార్థి బలవన్మరణం



ఆచారి(ఫైల్)

దొడ్డబళ్లాపురం: టీసీ ఇవ్వలేదనే మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉడుపి జిల్లా బైందూరులో చోటుచేసుకుంది. నితిన్ ఆచారి(16) అనే బాలుడు బైందూరు ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుతూ ఇటీవల ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడు. పీయూసీలో చేరడానికి టీసీ ఇవ్వాలని ముఖ్యోపాధ్యాయుడు సురేశ్ భట్‌ను కోరగా ఆయన తిట్టి అవమానించాడని, ఎంత వేడుకున్నా టీసీ ఇవ్వలేదని డెత్‌నోట్ రాసి నితిన్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనతో ఆగ్రహించిన విద్యార్థి కుటుంబ సభ్యులు, స్థానికులు ముఖ్యోపాధ్యాయుడిని అరెస్టు చేయాలని పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. కేసు నమోదు చేసుకున్న బైందూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్‌రాష్ట్ర ల్యాప్‌టాప్‌ల దొంగ అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ బీ.దయానంద్

బనశంకరి: ల్యాప్‌టాప్ చోరీలకు పాల్పడుతున్న ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన కుమార్ అనే అంతర్ రాష్ట్ర దొంగను కుమారస్వామి లేఔట్ పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు. ఇతడి వద్ద నుంచి 25 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులోని దయానందసాగర్ కాలేజీకి చెందిన ముగ్గురు విద్యార్థులు కాలేజీ సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. ఈనెల 5వ తేదీ రాత్రంతా ల్యాప్‌టాప్‌లపై పనిచేశారు. ఉదయం పనిమనిషి వస్తుందని, అప్పుడు నిద్ర లేవడం కష్టమని భావించి తలుపులు వేయకుండా నిద్రించారు. 6వ తేదీ ఉదయం 9.30 గంటల సమయంలో నిద్రలేచి చూడగా రూ.2.30 లక్షల విలువచేసే మూడు ల్యాప్‌టాప్‌లు కనిపించలేదు.దీంతో కుమారస్వామి లేఔట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీకెమెరాల ఆధారంగా నిందితుడు కాటన్‌పేటేలో ఉన్న పీజీలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడకు పోలీసులు వెళ్లగా నిందితుడు కనిపించలేదు. ఇందిరానగర మెట్రోపిల్లర్ కింద కుమార్ తన బంధువుతో కలిసి ఉన్నట్లు తెలుసుకొని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. చోరీ చేసిన ల్యాప్‌టాప్‌లను తమిళనాడులోని శంకరపురంలో విక్రయించినట్లు నోరు విప్పాడు. పోలీసులు అక్కడకు వెళ్లి 25 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

హోసూరు వార్తలు..

పంటలపై ఏనుగుల దాడి

కెలమంగలం: అంచెట్టి ప్రాంతంలో ఏనుగు దాడులతో కొబ్బరి చెట్లు, పూలతోటలు ధ్వంసమయ్యాయి. దట్టమైన అటవీ ప్రాంతమైన అంచెట్టి ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో ఏనుగులు నివశిస్తున్నాయి. ఉరిగం పంచాయతీ కోవళ్లి గ్రామానికి చెందిన రైతులు బసవణ్ణ, రాజేంద్రన్‌ల పంటపొలాలపై సోమవారం రాత్రి దాడి చేసి కొబ్బరి చెట్లు, ఇతర పంటలను తిని ధ్వంసం చేశాయి. మంగళవారం ఉదయం పొలాల వద్దకెళ్లిన రైతులు పాడైన పొలాలను చూసి గొల్లుమన్నారు. అటవీ శాఖ సిబ్బంది పరిశీలించి నష్ట పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు గ్రామాల వైపు రాకుండా కంచె వేయాలని ప్రజలు డిమాండ్ చేశారు.

విద్యార్థిని ఆత్మహత్య

క్రిష్ణగిరి: పబ్లిక్ పరీక్షల్లో మార్కులు తగ్గాయని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఊత్తంగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని కీశకుప్పం గ్రామానికి చెందిన రైతు కాళియప్ప కూతురు తిరుమల (17) అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్టూ చదువుతోంది. ఇటీవల పరీక్షా ఫలితాల్లో తక్కువ మార్కులు రావడంతో విరక్తి చెందిన బాలిక గత రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు చికిత్స కోసం ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందింది. ఊత్తంగేరి పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి కిడ్నాప్‌పై ఫిర్యాదు

కెలమంగలం: తన కూతురిని ఓ యువకుడు కిడ్నాప్ చేశాడని ఆమె తండ్రి కెలమంగలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు కెలమంగలం సమీపంలోని అంచెట్టిదుర్గం గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి అదే ప్రాంతంలోని ప్రైవేట్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తోంది. గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ లేదు. స్థానికుల సమాచారం మేరకు కెలమంగలం సమీపంలోని కొత్తూరు గ్రామానికి చెందిన అమరీష్ కిడ్నాప్ చేసినట్లు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెన్నాను వీడని కాలుష్య నురుగు



నురుగుతో ప్రవహిస్తున్న దక్షిణ పెన్నానది

హోసూరు: దక్షిణ పెన్నానదిలో రసాయ వ్యర్థాలతో కాలుష్య నురుగు పేరుకుపోయింది. గత పది రోజులుగా సమస్యపై అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత రైతులు వాపోయారు. వర్షాలు రావడంతో కెలవరపల్లి రిజర్వాయర్ నుంచి నదిలోకి వరదనీటిని విడుదల చేశారు. నీటితో పాటు పరిశ్రమల వ్యర్థాలు కలవడంతో నరుగు ఏర్పడుతోంది. దీంతో నది నీటిని వాడుకోవాలంటే ప్రజలు భయపడుతున్నారు. అధికారులు రసాయన వ్యర్థాలను నదిలో కలిపేవారిని కట్టడి చేయాలని ప్రజలు, రైతులు కోరారు.

సొరంగమార్గంలో సతమతం



రద్దీ, వాననీటి వల్ల ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


హోసూరు: హోసూరు- డెంకణీకోట మార్గంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సొరంగ మార్గంలో వాననీరు నిండిపోవడంతో వాహనదారులు అగచాట్లు పడుతున్నారు. రైల్వే రోడ్డు విస్తరణలో భాగంగా హోసూరు- డెంకణీకోట మార్గంలో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నందున ఆ మార్గాన్ని మూసివేశారు. ప్రస్తుతం డెంకణీకోట, కెలమంగలం తదితర ప్రాంతాల నుంచి హోసూరు వైపు వచ్చే వాహనదారులు సొరంగ మార్గం ద్వారానే వచ్చివెళుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సొరంగ మార్గంలో మోకాలి లోతు వాననీరు నిండిపోయింది. వాహనదారులు అటు రద్దీ, ఇటు వాననీటిలో నడపలేక అవస్థలు పడుతున్నారు. నీరు చేరి ద్విచక్ర వాహనాలు చెడిపోవడంతో తోసుకుని వెళ్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ అధికారులు తక్షణం ఇతర మార్గాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

బీజేపీలోకి చేరికలు



హోసూరు: వివిధ పార్టీలకు చెందినవారు బీజేపీలో చేరారు. సూళగిరి సమీపంలోని కామనదొడ్డి గ్రామానికి చెందిన శివ నేతృత్వంలో 50 మందికి పైగా కార్యకర్తలు హోసూరులో క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు ఎం. నాగరాజ్ అధ్యక్షతన పార్టీలో చేరారు. బీజేపీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

శివమొగ్గను వణికించిన వరుణుడు



శివమొగ్గ నగరంలో జలమయమైన రోడ్డు



శివమొగ్గ: శివమొగ్గ నగరంలో వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం కూడా నగరంతో పాటు శివార్లలో ఎడతెరిపి లేకుండా గంటకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడింది. జనజీవనం అస్తవ్యస్తమైంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఇద్దరి అరెస్ట్, పిస్తోలు స్వాధీనం



పట్టుబడ్డ నిందితులు,స్వాధీనం చేసుకున్న పిస్తోలు

దొడ్డబళ్లాపురం: అక్రమంగా పిస్తోలు కలిగి ఉన్న ఇద్దరిని మంగళూరు సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. కేరళ రాష్ట్రం కాసరగోడు జిల్లా కు చెందిన మొహమ్మద్ అస్గర్(26),అబ్దుల్ నిసార్(29)లు ఉళ్లాల తాలూకా తలపాడి గ్రామంలో పిస్తోలుతో బెదిరించి నేరానికి పాల్పడుతున్నారని సమాచారం అందడంతో మంగళూరు సీసీబీ పోలీసులు దాడి చేసి నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రివాల్వర్, రెండు బుల్లెట్లు, రెండు మొబైళ్లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. మహమ్మద్ అస్గర్‌పై కేరళలోని మంజేశ్వర పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం, కిడ్నాప్, దాడి కేసులు నమోదయ్యాయి.

యువతకు పెద్దపీట వేసిన రాజీవ్



రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పించిన దృశ్యం

తుమకూరు: యువతే దేశ భవిష్యత్తు అని నమ్మిన వ్యక్తి మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ అని జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు కెంచమారయ్య అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు వయసును 21 నుంచి 18కి తగ్గించడం ద్వారా రాజీవ్‌గాంధీ దేశ యువతకు అన్ని రకాల అవకాశాలను ఆయన కల్పించారన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాల గురించి సరైన అవగాహన లేకుండా యువత మోదీ మాయలోపడి ఉద్యోగాలు లేకుండా ఇబ్బందికర పరిస్థితుల్లో జీవితం సాగిస్తోందని తెలిపారు.

బాయిలర్ పేలి ఇద్దరి మృతి

యశవంతపుర: బాయిలర్ పేలి ఇద్దరు మహిళా కార్మికులు మృతి చెందారు. ఈ ప్రమాదం బెళగావి జిల్లా అథణి తాలూకా చిక్కట్టి గ్రామంలో జరిగింది. గ్రామానికి సమీపంలో ప్రియా ఎక్స్‌పోర్ట్ పరిశ్రమ నడుస్తుంది. మంగళవారం ఫ్యాక్టరీలోని బాయిలర్ పేలడంతో సునంద అనే కార్మికురాలు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. వీరిని అథణి, మహారాష్ట్ర మీరజ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో శోభా అనే కార్మికురాలు మృతి చెందింది. అథణి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి నాయకుడిగా సీఎం కాన్వాయ్‌ను అడ్డుకున్నందుకు జైలు శిక్ష అనుభవించారు. ఏడేళ్ల తరువాత ఆయన మీదే పోటీ చేస్తున్నారు. ఆ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ కాగా నాటి విద్యార్థి దివ్యాంశు బుధిరాజా. వీరిద్దరి ఆసక్తికర పోరుకు హరియాణాలోని కర్నాల్ లోక్‌సభ స్థానం వేదికగా మారింది. మాజీ సీఎం ఖట్టర్ బీజేపీ నుంచి, బుధిరాజా కాంగ్రెస్ టికెట్‌పై అమీతుమీ తేల్చుకోనున్నారు. ఆరితేరిన నాయకుడు, విద్యార్థి ఉద్యమ కెరటం.. వీరిలో గెలుపెవరిదన్నది ఆసక్తిగా మారింది. కర్నాల్‌లో 25న ఆరో విడతలో పోలింగ్ జరగనుంది...

– సాక్షి, నేషనల్ డెస్క్

కర్నాల్ లోక్‌సభ స్థానంలో 1952 నుంచి 2009 దాకా కాంగ్రెస్ ఏకంగా 11 సార్లు గెలుపొందింది. 1996, 99 మాత్రమే మినహాయింపు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో 9 అసెంబ్లీ సెగ్మెంట్లున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కర్నాల్‌లో 68.31 శాతం ఓటింగ్ నమోదైంది. బీజేపీ అభ్యర్థి సంజయ్ భాటియా ఏకంగా ఆరు లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.



నాడు అడ్డుకుని అరెస్టయ్యాడు.. నేడు ప్రత్యర్థిగా తొడగొడుతున్నాడు!

మాజీ సీఎం వర్సెస్ మాజీ ఖైదీ

- కర్నాల్ లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోరు
- అభివృద్ధి ధీమాతో మనోహర్‌లాల్ ఖట్టర్
- పోరాటాలు గెలిపిస్తాయంటున్న దివ్యాంశు
- బీజేపీకి తాకుతున్న రైతు ఉద్యమ సెగ

వివాదాల సీఎం...

ఆరెస్సెస్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దాకా ఎదిగిన ఖట్టర్‌కు ఇవి తొలి లోక్‌సభ ఎన్నికలు. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో కర్నాల్ నుంచే గెలిచారాయన. తొమ్మిదేళ్లు సీఎంగా చేశారు. అత్యాచారాలు, మహిళల సమస్యలపై ఖట్టర్ వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. ''మహిళలపై అత్యాచారాలు, ఈవ్ టీజింగ్‌గా చెబుతున్న ఉదంతాల్లో 90 శాతం వారి సమ్మతితో జరుగుతున్నవే. విభేదాలొచ్చి విడిపోయాక అమ్మాయిలు కేసులు పెడుతున్నారు. ఈ ధోరణికి కోర్టులే అడ్డుకట్ట వేయాలి'' అనే వ్యాఖ్యలతో 2018లో వివాదాస్పదమయ్యారు. 2014 ఎన్నికలప్పుడూ మహిళలపై ఇలాంటి వ్యాఖ్యలే చేసి విమర్శలకు గురయ్యారు. ఈ లోక్‌సభ ఎన్నికలకు ముందు సీట్ల పంపకంపై విభేదాలతో బీజేపీకి జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) గుడ్‌బై చెప్పింది. అధికార సంకీర్ణం నుంచీ బయటికొచ్చింది. దాంతో మార్చిలో ఖట్టర్ రాజీనామా చేశారు. 2014, 2019లో ఉన్న సానుకూలత ఆయనకు ఇప్పుడు కనిపించడం లేదు.

పోరాటాల పిడికిలి...

30 ఏళ్ల బుధిరాజా సోనిపట్ జిల్లా గోహనాలో పంజాబీ కుటుంబంలో జన్మించారు. తండ్రి క్లర్క్. తల్లి స్కూల్ టీచర్. 2017లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షునిగా ఉండగా పంచకుల ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల బృంద సారథిగా ఖట్టర్ కాన్వాయ్‌ను అడ్డుకుని అరెస్టయ్యారు. అంతకుముందు 2014లో పంజాబ్ యూనివర్సిటీ స్టూడెంట్స్ కౌన్సిల్ అధ్యక్షునిగా ఉన్నారు. 2021లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ చీఫ్ అయ్యారు. ఎనిమిదేళ్లుగా విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ఉద్యమిస్తున్నారు. కాంగ్రెస్ అనూహ్యంగా కర్నాల్ టికెటివ్వడంతో ఖట్టర్‌ను ఢీకొంటున్నారు. ''మా కుటుంబంలో ఎవరూ ఇంతవరకు కనీసం సర్పంచ్ ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదు. ఒక సాధారణ యువకుడికి ఇలాంటి అవకాశం లభించినందుకు యువత సంతోషంగా ఉంది'' అంటున్నారు. కర్నాల్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఇప్పటికే కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయవాదులూ బుధిరాజాకు మద్దతు తెలిపారు. మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా, ఎంపీ దీపేందర్ హుడా ఆశీర్వాదం, ఓటు బ్యాంకు మరింత కలిసొచ్చేవే. మోదీ సర్కారుపై రైతుల ఆగ్రహం తనను విజయతీరాలకు చేరుస్తుందని బుధిరాజా చెబుతున్నారు.

ఇవీ సమస్యలు...!

కర్నాల్, పానిపట్ జిల్లాలు జాతీయ రాజధాని ప్రాంత పరిధిలో ఉన్నాయి. దాంతో వాటిపై వాయు నాణ్యత ఆంక్షలున్నాయి. ఇది అభివృద్ధికి ఆటంకంగా ఉందని, రెండు జిల్లాలను ఎన్సీఆర్ పరిధి నుంచి తప్పించాలని స్థానిక పారిశ్రామికవేత్తలు కోరుతున్నారు. స్టార్టప్ ప్రాజెక్టులు, స్మార్ట్ సిటీ వంటి పలు సమస్యలూ ముందున్నాయి.

పంజాబ్ ప్రచారంలో... కనిపించని దిగ్గజాలు

సాక్షి, న్యూఢిల్లీ: పంజాబ్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నా పలువురు ప్రముఖ నాయకులు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. పోటీకీ కూడా దూరంగానే ఉన్నారు. మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్ సింగ్, పీసీసీ మాజీ చీఫ్, స్టార్ క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ వంటివారు ఈ జాబితాలో ముఖ్యులు. అమరీందర్ సింగ్ 2021లో సీఎం పదవి వీడాక పంజాబ్ రాజకీయాల్లో పెద్దగా చురుగ్గా లేరు. కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. అయినా ప్రచారానికి మాత్రం దూరంగా ఉన్నారు. ఆయన భార్య ప్రణీత్ కౌర్ పటియాలా నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. ఆమె తరఫున కూడా ప్రచారం చేయడం లేదు. ప్రణీత్ నామినేషన్ దాఖలు రోజు కూడా కనిపించలేదు. అమృత్‌సర్ ఎంపీ సిద్ధూ కూడా ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో వ్యాఖ్యాతగా బిజీగా ఉన్నారు. భార్య నవజోత్ కౌర్ క్యాన్సర్‌తో పోరాడుతుండటంతో సమయమంతా ఆమెకే కేటాయిస్తున్నారు. అకాలీదళ్‌ను వీడి ఇటీవల మళ్లీ అదే పార్టీలో చేరిన అగ్ర నేత సుఖ్‌దేవ్ సింగ్ ధిండ్సా కూడా అలకబూని ప్రచారానికి దూరంగానే ఉన్నారు. కుమారుడు పర్మీందర్‌కు పార్టీ టికెటివ్వకపోవడమే ఇందుకు కారణం. ప్రముఖ నటుడు, ఆప్ నాయకుడు గురుప్రీత్ సింగ్ ఘుగ్గీ కూడా రాజకీయ జీవితానికి దూరం జరిగి మళ్లీ తెరపై కనిపిస్తున్నారు. బీజేపీలో చేరిన మాజీ మంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్ కూడా ఆపరేషన్ నేపథ్యంలో ప్రచారానికి దూరంగానే ఉన్నారు. ఒకప్పుడు రాష్ట్ర కాంగ్రెస్‌లో కీలకనేత అయిన జగ్మీత్ సింగ్ బ్రార్ కూడా ప్రచారంలో ఎక్కడా కన్పించడం లేదు.



అమరీందర్, సిద్ధూ

హస్తినలో తెలుగు ఓటర్ల చుట్టూ నేతల ప్రదక్షిణం

ఢిల్లీలో 5.5 శాతం తెలుగు ఓటర్లు

- పలుచోట్ల గెలుపోటములపై ప్రభావం
- దాంతో తెలుగు నేతల ముమ్మర ప్రచారం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో పార్టీల నాయకులు, అభ్యర్థులు తెలుగు ఓటర్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఢిల్లీలో తెలుగు ఓటర్లు ఐదున్నర శాతం దాకా ఉన్నారు. కనీసం 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయగల స్థాయిలో ఉన్నారు. దాంతో తెలుగు ప్రజలను ఆకర్షించి వారి ఓట్లను రాబట్టుకునేందుకు ప్రధాన పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి. ఒకవైపు అభ్యర్థులు తెలుగు ప్రజలతో ముఖాముఖి మాట్లాడుతుంటే మరోవైపు తెలుగు రాష్ట్రాల నేతలు కూడా హస్తినలో తమ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాలకు మే 25న ఆరో విడతలో ఎన్నికలు జరగనున్నాయి.

1.46 కోట్ల మంది

ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాల పరిధిలో 1.46 కోట్ల మంది ఓటర్లున్నారు. వారిలో తెలుగు ఓటర్లు 5.5 శాతం దాకా (సుమారు 8 లక్షలు) ఉంటారు. కేంద్ర ప్రభుత్వోద్యోగాలతో పాటు ఇతర ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ పలు రంగాల్లో స్థిరపడ్డారు. మయూర్ విహార్ (మూడు ఫేజ్‌లు), దిల్షాద్ గార్డెన్, ఆర్కేపురం, మెహ్రౌలీ, షాహదరా, లజ్‌పత్‌నగర్, సరితా విహార్, ద్వారక, వికాస్‌పురి, కేశవపురం, రోహిణీ, కాల్కాజీ, మునిర్కా, ఉత్తమ్‌నగర్, వికాస్‌పురి, వసంత్ విహార్ తదితర ప్రాంతాల్లో తెలుగు వారి జనాభా ఎక్కువ. ఈ నేపథ్యంలో తెలంగాణ మంత్రి సీతక్క ఈశాన్య ఢిల్లీలో కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్‌కు మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలను ఓటర్లకు వివరించారు.

త్వరలో మరికొందరు నేతలు

ఢిల్లీలో మూడు రోజుల్లో లోక్‌సభ ఎన్నికలుండటంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలకు చెందిన పలువురు నేతలు ప్రచారానికి రానున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన విషయం తెలిసిందే.



తెలుగువారితో బాసురీ మీట్ అండ్ గ్రీట్

బీజేపీ దివంగత నేత సుష్మాస్వరాజ్ కూతురు బాసురీ స్వరాజ్ ఇటీవల తెలుగు ప్రజలతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. తనను గెలిపిస్తే పార్లమెంటులో తెలుగు ప్రజల గొంతుక అవుతానన్నారు. తెలుగు వంటకాలంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. తన తల్లిని ఆదరించినట్టుగానే తనను కూడా ఆదరించి ఆశీర్వదించాలని తెలుగు ప్రజలను కోరారు. కార్యక్రమంలో పలువురు తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాసురీ న్యూఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కూడా సోమవారం ఢిల్లీలో తెలుగు ప్రాబల్య ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంపై కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్న విషయాన్ని గమనించాలని వారికి సూచించారు. ఈ కేసులో కవిత అరెస్టును సమర్థించిన కాంగ్రెస్ ఢిల్లీలో మాత్రం కేజ్రీవాల్ పార్టీకి మద్దతిస్తోందని విమర్శించారు.

పేరు మరిచిన మహిళలు!

తొలి సార్వత్రిక ఎన్నికల్లో వింత

- ఓటర్ల జాబితాలో పేర్లు లేని వైనం
- వైఫాఫ్, డాటరాఫ్ అంటూ నమోదు

ఈగ ఇల్లలుకుతూ తన పేరు మరిచిపోయిన కథ అందరికీ తెలుసు. 1951-52లో మన దేశంలో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లోనూ మహిళల విషయంలో ఇలాంటి 'ఈగ' తరహా కథే జరిగింది...

మొదటి సార్వత్రిక ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను సిద్ధం చేసే పనిలో పడ్డ కేంద్ర ఎన్నికల సంఘానికి చిత్రమైన సమస్య ఎదురైంది. చాలా రాష్ట్రాల్లో మహిళా ఓటర్లు తమ సొంత పేర్లు నమోదు చేసుకోలేదు! బదులుగా తమ కుటుంబంలోని పురుష సభ్యులతో తమ సంబంధాన్ని బట్టి ఫలానా వారి భార్యను, ఫలానా ఆయన కూతురును అని నమోదు చేసుకున్నారు. ఒకరూ ఇద్దరూ కాదు.. నాడు దేశవ్యాప్తంగా నమోదైన 8 కోట్ల మంది మహిళా ఓటర్లలో ఏకంగా 2.8 కోట్ల మంది ఇలా వైఫాఫ్, డాటరాఫ్ అని మాత్రమే నమోదు చేసుకున్నారు. ఇలాంటి కేసులు ఎక్కువగా బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యభారత్, రాజస్తాన్, వింధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చాయి. దాంతో ఎన్నికల సంఘానికి పెద్ద చిక్కు వచ్చిపడింది. అలాంటి మహిళా ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. సొంత పేర్లతో తిరిగి నమోదు చేసుకునేందుకు గడువు పొడిగించారు. పురుష ఓటర్లతో ఉన్న సంబంధపరంగా కాకుండా విధిగా మహిళా ఓటర్ల పేరుతోనే నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పేరు చెప్పడానికి నిరాకరించిన మహిళను ఓటరుగా నమోదు చేయొద్దని స్పష్టం చేశారు. ఇందుకోసం బిహార్‌కు ఒక నెల ప్రత్యేక గడువిచ్చారు. ఈ పొడిగింపు బాగా ఉపయోగపడింది. ఆ గడువులో రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు. రాజస్తాన్‌లో మాత్రం పొడిగింపు ఇచ్చినా అంతంత స్పందనే వచ్చింది. దాంతో అక్కడ చాలామంది మహిళా ఓటర్లను తొలగించాల్సి వచ్చింది!

తొలి ఎన్నికల్లో 17.3 కోట్ల పై చిలుకు ఓటర్లలో మహిళలు దాదాపు 45 శాతమున్నారు. వారికోసం ప్రత్యేక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 27,527 పింక్ బూత్‌లను మహిళా ఓటర్లకు రిజర్వ్ చేశారు. ఓటింగ్ శాతాన్ని పెంచడానికి దేశ తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ రేడియోలో వరుస ప్రసంగాలు, చర్చలు చేశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల ఓటర్ల జాబితాలో మొత్తం 47.1 కోట్ల మంది మహిళలున్నారు. 12 రాష్ట్రాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువ!

– సాక్షి, నేషనల్ డెస్క్

ధర 'నిమ్మ'లం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా 2వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిమ్మ సాగు

- బస్తా నిమ్మకాయల ధర రూ.2 వేలకు పైమాటే
- ఖర్చులన్నీ పోనూ రూ.1,500 మిగులు
- పెరిగిన ఎగుమతులు



యాడికి: నిమ్మ పంటకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు నెమ్మదిగా కోలుకుంటున్నారు. అంతేకాక నిమ్మ ఎగుమతులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సహిస్తోంది. దీంతో అనంతపురంజిల్లా యాడికి మండలంలోని ఐదు నిమ్మ మార్కెట్లు క్రయ విక్రయదారులతో కిటకిటలాడుతున్నాయి. గిట్టుబాటుధర ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి సైతం రైతులు నిమ్మకాయలను రాయలచెరువులోని మార్కెట్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కరోనా నేపథ్యంలో మూడేళ్లుగా నిమ్మకాయలకు గిట్టుబాటు ధర లేక రైతులు కాయలు కోసి రోడ్డు పక్కనే పడేశారు. చాలా మంది కోత ఖర్చులు దండగని చెట్ల పైనే వదిలేశారు. మూడు నెలల క్రితం వరకూ ఓ బస్తా కేవలం రూ.300ల నుంచి రూ.500 చొప్పున అమ్ముడుపోయింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో నిమ్మ రైతులు భారీ నష్టాలు మూటగట్టుకున్నారు. ప్రస్తుతం ఈ పరిస్థితులు లేవు. ధర ఆశాజనకంగా ఉండడంతో అప్పుల ఊబి నుంచి రైతులు బయట పడుతున్నారు.

పెరిగిన ఎగుమతులు

యాడికి మండలంలోని రాయలచెరువులోని 5 నిమ్మకాయల మండీల నుంచి అనంతపురం, ఆదోని, నంద్యాల, డోన్ ప్రాంతాలతో పాటు కర్ణాటకలోని హుబ్లీ, బళ్లారి, బెంగళూరు, మైసూరు, తెలంగాణలోని హైదరాబాద్, జడ్చెర్ల తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది వాహనాల్లో ఎగుమతి చేస్తున్నారు. యాడికి మండలం కోనుప్పలపాడు, ఓబుళాపురం, కత్తిమానుపల్లి, రెడ్డిగుడిసెలు, రామన్నగుడిసెలు, చంద్రాయునిపల్లి, లక్ష్ముంపల్లి, కేశవరాయుని పేట, దైవాలమడుగు, చందన, రాయలచెరువు, నగరూరు, వెంగన్నపల్లె, పుప్పాల, వేములపాడు, కొట్టాలపల్లి, నిట్టూరు, చింతలాయపల్లి గ్రామాల్లో దాదాపు 2వేలకు పైగా ఎకరాల్లో నిమ్మ సాగులో ఉంది. రోజూ 7,340 టన్నుల నిమ్మకాయలు రాయలచెరువులోని మార్కెట్‌లకు వస్తున్నాయి. జిల్లాలోని తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, పుట్లూరు మండలాలతో పాటు పలు గ్రామాల నుంచి 2,061 టన్నుల నిమ్మకాయలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి.

నాణ్యతను బట్టి ధర

జిల్లా వ్యాప్తంగా 2వేల ఎకరాలకు పైగా నిమ్మ పంట సాగులో ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. యాడికి మండలంలో కేశవరాయుని పేట, లక్ష్ముంపల్లి, చందన, రాయలచెరువు, పచ్చారుమేకలపల్లి, తూట్రాళ్లపల్లి, వేములపాడు, యాడికి, కత్తిమానుపల్లి, కోనుప్పలపాడు, ఓబుళాపురం గ్రామాల్లో 1,500 ఎకరాల్లో నిమ్మ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పండించిన నిమ్మ పంట నాణ్యతలో రాష్ట్రంలోనే మేటిగా ఉంటోంది. యాడికి మండలంలో అత్యధికంగా కోనుప్పలపాడు గ్రామంలో నిమ్మపంటను సాగు చేస్తున్నారు. రైతులు పండించిన నిమ్మకాయలను మండలంలోని రాయలచెరువులో ఉన్న ఐదు మార్కెట్‌లకు ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్నారు. 1,100 కాయల బస్తా ధర నాణ్యతను బట్టి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ అమ్ముడు పోతోంది.

బస్తాపై రూ.1,500 మిగులు

నిమ్మ తోటలో కాయలు కోసినందుకు కూలీలకు, దిగుబడిని మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు పోనూ ఓ బస్తాకు రూ.1,500 చొప్పున మిగులుతోంది. కాగా, మూడేళ్ల క్రితం కరోనా కారణంగా ధర లేక రైతులు సతమతమయ్యారు. కాయలను చెట్లపైనే వదిలేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ధర కూడా నిలకడగా ఉండడంతో ఆర్థిక ఇబ్బందుల నుంచి రైతులు బయటపడుతున్నారు.

ఎకరాకు రూ.80 వేల పెట్టుబడి

ఎకరా విస్తీర్ణంలో నిమ్మ సాగుకు రూ.80 వేలు పెట్టుబడు అవుతుంది. ఏడాదికి మూడు కాపులు వస్తాయి. ఈ క్రమంలోనే దశల వారీగా తోటలు పూతకు రావడంతో దిగుబడులు కూడా పెరుగుతాయి. మూడు కాపుల్లోనూ ధర ఆశాజనకంగా ఉన్నప్పుడే రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

అప్పులు తీరాయి



నాకు 450 నిమ్మ చెట్లు ఉన్నాయి. మూడేళ్ల క్రితం కరోనా కారణంగా నిమ్మకాయల ధరలు లేక తోటల్లోనే వదిలేశాం. అప్పుడు కోత ఖర్చులు కూడా చేతికి అందలేదు. గత నెల నుంచి మంచి ధర పలుకుతోంది. దీంతో అప్పులు తీరుతున్నాయి.

– రామకేశవ రెడ్డి, కోనుప్పలపాడు గ్రామం, యాడికి మండలం

కష్టాలు తీరుతాయి




గత నెల రోజులుగా నిమ్మ ధరలు నిలకడగా ఉన్నాయి. పంట సాగుకు చేసిన అప్పులు దాదాపు తీరిపోయాయి. గతంలో ఎన్నడూ ఈ ధర లభ్యం కాలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతుల కష్టాలు తీరుతాయి. పంట ఎగుమతులకు ప్రభుత్వ సహకారం చాలా బాగుంది.

– కేశవ రెడ్డి, రెడ్డి గుడిసెలు గ్రామం, యాడికి మండలం

కనుమరుగైన కథా శిఖరం

నేడు ఆచార్యకేతు విశ్వనాథరెడ్డి తొలి వర్ధంతి

అభ్యుదయ కథకు అసలైన చిరునామా
సీమ సాహిత్య చరిత్రకు వీలునామా
నిన్నటి, నేటి కథకు బలమైన సేతువు
తెలుగు కథా కేతనం...కడప కథా
శాసనం... ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి



కడప కల్చరల్ : సుప్రసిద్ధ తెలుగు కథకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి శాశ్వతంగా ×పెన్ను×మూసి నేటికి ఏడాది గడిచింది. కరుణ లేని కాలం ఆయన కలానికి శాశ్వతంగా విశ్రాంతి ఇచ్చినా ఆయన జ్ఞాపకాలు ఇంకా తడిగానే ఉన్నాయి. తెలుగు కథకు పెద్దదిక్కు లేని లోటు మాత్రం పచ్చి గాయం లాగా సలుపుతోంది.

'కేతు' జీవిత విశేషాలు

ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం రంగసాయిపురంలో 1939 జులై 10న జన్మించారు. ఎర్రగుంట్ల, కడప తదితర ప్రాంతాలలో విద్యాభ్యాసం చేశారు. కడప, శ్రీకాళహస్తి, కందుకూరు ప్రభుత్వ కళాశాలల్లో, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, సార్వత్రిక విశ్వవిద్యాలయంలలో సేవలు అందించారు. పత్రికా రచయితగా, పాత్రికేయ పాఠశాల అధ్యాపకుడిగా, పత్రికా రంగానికి సేవలు అందించారు. అధ్యాపకులుగా తెలుగు పాఠ్య ప్రణాళిక, పాఠ్యాంశాల రూపకల్పన చేశారు. ఉత్తమ కథ, నవలా రచయితగా.. మన భూమి, ఈ భూమి పత్రికల సంపాదకులుగానే కాకుండా వివిధ రంగాలలో రాణించారు. రైతు కుటుంబానికి చెందిన ఆయన నాటి కుల వ్యవస్థను, ఆర్థిక అసమానతలను సమీపం నుంచి చూడటం వల్ల.. స్నేహితులు, సహచరుల ప్రభావంతో మార్కిస్టు దృక్పథాన్ని అలవర్చుకున్నారు. రాయలసీమ స్థితిగతులు, జీవన విధానం, భౌతిక స్థితి, పారిశ్రామీకరణ, రాజకీయాలు, అస్థిత్వ పోరాటాలు ఆయనను కలం పట్టేలా చేశాయి.

సాహిత్యం వైపు

కేతు విశ్వనాథరెడ్డికి బాల్యం నుంచే బాగా చదివే అలవాటు అబ్బింది. విద్యార్థిగా ఉన్నప్పుడు మార్కిస్టు భావాలు గల సహచరులు ఆయనకు ప్రపంచ సాహిత్యాన్ని పరిశీలించే అలవాటు చేయడంతో ఆ ప్రేరణతో ఆయన కలం పట్టారు. కొడవటిగంటి కుటుంబరావు అంటే ఆయనకు ఎంతో ఇష్టం. నల్లపాటి రామప్పనాయుడు, వజీర్ రెహ్మాన్, ఆచంట జానకిరాం, శారదాదేవి, గొల్లపూడి మారుతిరావు తదితరుల ప్రోత్సాహంతో పాటు చిత్తూరు జిల్లా రచయితలు మధురాంతకం రాజారాం, సభా తదితరుల పరిచయాలు ఆయన సాహిత్య ఒరవడికి మరింత ప్రోత్సాహం కల్పించాయి. నాటి నుంచి ఆయన వ్యాసాలు, కథలు రాశారు. రాచమల్లు రామచంద్రారెడ్డి ఆయనలోని ప్రతిభను గమనించి తన సవ్యసాచి పత్రిక ద్వారా ప్రోత్సహించారు. విమర్శతో ఆయన సాహిత్యానికి మెరుగులు దిద్దారు. బాల్య మిత్రుడు సొదుం జయరాంతో కలిసి కథా రచనపై చర్చలు చేసేవారు. కడపజిల్లా గ్రామ నామాలు అనే అంశంపై పరిశోధన చేసిన ఆయన ఆ పేర్ల వెనుకగల ఎన్నో ఆసక్తికరమైన కథనాలను సమాజానికి తెలిపారు. తన రచనల్లో సగటు మనిషి ఆవేదన, ఆర్తి, సామాజిక చింతన కలగలిపి ఉండటం ఆయన ప్రత్యేకత.

తనదైన ముద్ర

అనాదివాళ్లు ఆయన తొలి కథ కాగా, అనంతరం ఆయన కథా రచనలో తనదైన ముద్ర వేశారు. తెలుగు కథకు మట్టి పరిమళాలు అద్దారు. కేతు విశ్వనాథరెడ్డి కథలు, జప్తు, ఇచ్ఛాగ్ని కథా సంకలనాలు ప్రచురించారు. ఇందులో కేతు విశ్వనాథరెడ్డి కథలు సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమి బహుమతి లభించింది. కొడవటిగంటి కుటుంబరావు కథలను సంపుటంగా తన సంపాదకత్వంలో ప్రచురించారు. దృష్టి, దీపధారులు, పరిచయం, సంగమం, పాత్రికేయం, మన కొడవటిగంటితో పాటు తెలుగు, ఆంగ్లంలో వ్యాస సంకలనాలు, వేర్లు, బోధి తదితర నవలలు రాశారు. ఆయన రచనలు హిందీ, మళయాళం, కన్నడ తదితర ప్రాంతీయ భాషలతో పాటు ఇంగ్లీష్, రష్యన్ భాషల్లో కూడా అనువాదం అయ్యాయి. తన కృషికి గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు, భారతీయ భాషా పరిషత్తు అవార్డులు, తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు, రావి శాస్త్రి అవార్డుతో పాటు ఇంకా పలు ప్రతిష్టాత్మక అవార్డులు, వేలాది సత్కారాలు పొందారు.

నిత్యం సాహిత్య రంగంలోనే

ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి చివరి వరకు నిత్యం సాహిత్య రంగంలోనే ఉన్నారు. చివరి పది సంవత్సరాలపాటు జన్మభూమిపై అభిమానంతో కడప నగరంలోనే నివసించారు. బ్రౌన్ గ్రంథాలయం సలహా మండలి సభ్యుడిగా సేవలు అందించారు. అక్కడ జరిగిన వందలాది సాహితీ సభల్లో ప్రధాన పాత్ర వహించారు. ఆయన ప్రసంగాలంటే సాహిత్యం గురించిన అవగాహన అన్న భావన శ్రోతల్లో ఉండేది. వేలాది సాహితీ ప్రసంగాలు చేశారు. వందలాది పుస్తకాలకు ముందుమాటలు, సమీక్షలు రాశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే ఎంతో ఇష్టపడే ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, ఆయన పేరిట ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకుని ఎంతో సంతోషపడ్డారు. తన జీవితంలో ఈ పురస్కారాన్ని మరువలేమని ఎప్పుడూ చెబుతుండేవారు. 2023 మే 22న ఆయన కన్నుమూశారు.

ఏపీఈఆర్సీ భవనం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా కేంద్రం కర్నూలు నగరంలో మరో రాష్ట్ర స్థాయి కార్యాలయం రూపుదిద్దుకుంది. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ కర్నూలులో ఏర్పాటు కావడం విశేషం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా న్యాయశాఖకు సంబంధించిన మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త వంటి రాష్ట్ర స్థాయి కార్యాలయాలు ఇప్పటికే కర్నూలులో ఏర్పాటు అయ్యాయి. తాజాగా న్యాయశాఖకు సంబంధించిన ఏపీఈఆర్సీ రాష్ట్రస్థాయి కార్యాలయం కూడా కర్నూలులో ఏర్పాటు అయింది. ఏపీఈఆర్సీ కార్యాలయాన్ని ఈ నెల 23న చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ప్రారంభించనున్నారు. కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ సమీపంలోని ఏపీ ట్రాన్స్‌కోకు సంబంధించిన స్థలంలో ఏపీఈఆర్సీకి జీ+1 భవనాన్ని నిర్మించారు. 5000 చదరపు అడుగుల విస్తీర్ణంలో గెస్ట్‌హౌస్ కూడా నిర్మించారు. చిన్న, చిన్న పనులు మినహా పనులన్నీ పూర్తి అయ్యాయి. కోర్టు హాల్, కాన్ఫరెన్స్ హాల్, చైర్మన్‌తో పాటు సభ్యుల చాంబర్లు తదితరవన్నీ సిద్ధమయ్యాయి. దాదాపు రూ. 25 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. విద్యుత్ శాఖకు సంబంధించిన కీలక నిర్ణయాలు ఏపీఈఆర్సీ మీదనే ఆధారపడి ఉంటాయి. ఈ నెల 23న ప్రారంభించేందుకు ముహూర్తం నిర్ణయించడంతో ఫినిషింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పనులను విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈలు పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి రాజధాని గడువు జూన్ 2తో ముగియనుండటంతో అదే రోజు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయం కర్నూలుకు తరలించనున్నారు. విశాఖలో యథావిధిగా క్యాంపు కార్యాలయం కొనసాగుతుంది. జూన్ 2 నుంచి ఏపీఈఆర్సీ సేవలు కర్నూలు కేంద్రంగా అందించడానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

భక్తజన సంద్రంగా మహానంది

మహానంది: క్షేత్రం భక్తుల సందడి కొనసాగుతోం. సెలవు రోజులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. సాధారణ, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనం క్యూలైన్ల ద్వారా భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అభిషేకం, మహదాశీర్వచనం ఆర్జిత సేవల ద్వారా భక్తులు వేచి ఉండి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా దర్శనం కొనసాగింది. సాధారణ, ఉచిత దర్శనానికి సుమారు రెండు గంటల పాటు సమయం పట్టింది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓలు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు.



కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



బకుళాబెన్



స్ఫూర్తి

డేరింగ్ దాది

బకుళాబెన్ పటేల్‌ను సూరత్‌లో అందరూ 'డేరింగ్ దాదీ' అని పిలుస్తారు. 80 ఏళ్ల వయసులో నదుల్లో, సముద్రంలో ఆమె చేపలా ఈదడమే కాదు ఈత పోటీల్లో వందల మెడల్స్ సాధించడమే కారణం. 57 ఏళ్ల వయసులో మొదలెట్టిన ఈత తనకు ఆరోగ్యాన్ని, ఉత్సాహాన్ని ఇస్తున్నాయని అంటోంది బకుళాబెన్. పెద్ద వయసు వారికి పెద్ద స్ఫూర్తి ఆమె.

సూరత్‌లోని తాపి నది ఒడ్డున ఏ ఉదయాన ఐదు, ఆరు గంటల మధ్యన వెళ్లినా డేరింగ్ దాది అని ఆ ఊళ్లో పిలుచుకునే బకుళా బెన్ కనిపిస్తుంది. 80 ఏళ్ల వయసులో ఆమె దినచర్య గమనించదగ్గది. తెల్లవారు జామున 4 గంటలకు లేస్తుంది. ఒక గంటసేపు ఇంట్లో తేలికపాటి యోగా చేస్తుంది. ఆ తర్వాత జాగింగ్‌కు వీలైన దుస్తుల్లోకి మారి సూరత్ దారుల గుండా కనీసం గంటసేపు జాగింగ్ చేస్తుంది. ఆ తర్వాత తాపి ఒడ్డున ఈత దుస్తుల్లోకి మారి నదిలోకి దూరి దాదాపు రెండు గంటల సేపు ఈత కొడుతుంది. ఆ తర్వాతే ఆమె ఇంటికి చేరుతుంది. 'నేను రోజులో ఒక పూట భోజనం అయినా లేకుండా ఉంటాను కాని ఏ రోజూ ఈత కొట్టకుండా ఉండలేను' అంటుంది బకుళా బెన్.

కొత్త జీవితం

బకుళా బెన్‌ది అందరు సగటు ఆడవాళ్ల జీవితం వంటిదే. పెళ్లి, పిల్లలు... ఆమెకు నలుగురు సంతానం. వారిని పెంచి పెద్ద చేయడంలో జీవితం గడిచిపోయింది. ఆమెకు 50 ఏళ్లు ఉండగా భర్త మరణించాడు. కొన్నాళ్లకు ఆమెకు జీవితం బోరు కొట్టింది. 'ఏదో ఒకటి చేయాలి' అని క్రీడల వైపు ఆసక్తి కనపరిచింది. 'నాకు చిన్నప్పుడు నీళ్లంటే భయం. ఈత నేర్చుకోలేదు. కాని ఎన్నాళ్లు నీళ్లకు దూరంగా జరుగుతాను. ఈత నేర్చుకుందాం అనుకున్నాను. ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు నా వయసు 58' అని తెలిపింది బకుళా బెన్. కాని ఆమె ఈత నేర్చుకోవడం అంత సులువు కాలేదు. బంధువులు, ఇరుగు పొరుగు వారు 'హవ్వ' అని నోరు నొక్కుకున్నారు. హేళన చేస్తూ వెనుక మాట్లాడుకున్నారు.

'అవన్నీ నా చెవిన పడుతున్నా ఈత నేర్చుకోవడం మానలేదు' అంటుంది బకుళ. ఇలా నవ్విన వారే తాపీనదిలో చేపలా ఈదుతున్న బకుళను చూసి ఆశ్చర్యపోయారు. హేళన స్థానంలో గౌరవం వచ్చింది.



500 మెడల్స్

'నన్ను చూసి అందరూ స్ఫూర్తి పొందాలని ఇన్ని పనులు చేస్తున్నాను. సమాజంలో మహిళల పట్ల వివక్ష ఉంది. ఆ వివక్షను ఎదిరించాలంటే ఇలాంటి కృషి చేయాలి. నేను జాతీయ అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ ఈత పోటీల్లో ఇప్పటివరకు 500 మెడల్స్ గెలుచుకున్నాను. అట్లాంటిక్, పసిఫిక్, బంగాళాఖాతాల్లో ఈత కొట్టాను. అమెరికా, ఆస్ట్రేలియా, కెనెడా, మలేసియా దేశాల్లో ఈతపోటీల్లో పాల్గొన్నాను. ఇంగ్లిష్ చానల్ ఈది గిన్నెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చేరాలని నా కోరిక. ఇప్పటికి 400 మందికి ఈత నేర్పాను. ఈతలో ఉన్న ఆరోగ్యం, ఆనందం అంతా ఇంతా కాదు' అంటుంది బకుళా బెన్.

అన్నీ భిన్నమే

పిల్లలు సెటిల్ కావడం వల్ల దొరికిన తీరుబడిని బకుళ సంపూర్ణంగా జీవించదలుచుకుంది. 'నేను నా 60వ ఏట బి.ఎ. కట్టాను. పాఠాలు చదవడం గుర్తు పెట్టుకోవడం కష్టమైంది. రోజుకు 10 గంటలు చదివేదాన్ని. అలాగే ఎప్పుడో వదిలేసిన రాత కూడా ప్రాక్టీసు చేసి పరీక్షలు రాసి డిగ్రీ పొందాను. అలాగే యోగా నేర్చుకున్నాను. 80 ఏళ్ల వయసులో శీర్షాసనం వేయగలను. 75 ఏళ్ల వయసులో నాకు భరతనాట్యం నేర్చుకోవాలనిపించింది. మన దేశంలో ఆ వయసులో భరతనాట్యం చేసి అరంగేట్రం చేసింది నేనొక్కదాన్నే. ఆ అరంగేట్రం చూసి చాలామంది మెచ్చుకున్నారు' అంటుంది బకుళ.

ట్రైనీ నుంచి డైరెక్టర్ దాకా...

నేడు చాలా మంది యువత చేస్తున్న ఉద్యోగాలను వదిలిపెట్టి సొంతంగా వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. అనుకున్న రంగంలో విజయం సాధించాలని కలలు కంటున్నారు. అయితే తమ కలల లక్ష్య సాధనలో అడుగులు వేయడం కోసం ఏదైనా ఒక స్ఫూర్తి ఉండాలి కదా... పుణేలో ఉంటున్న 33 ఏళ్ల అక్షాలీ షా సాధిస్తున్న విజయం నవతరానికి స్ఫూర్తిదాయకం. . ఎంబీయే చేసి, పద్నాలుగేళ్ల క్రితం తండ్రి ప్రారంభించిన చిన్న డెయిరీ యూనిట్‌లో ట్రైనీగా చేరింది అక్షాలీ షా. మిల్క్ ప్రొడక్ట్స్ వ్యాపారంలో కీలక పాత్ర పోషిస్తూ నేడు కంపెనీ రూ.2,556 కోట్ల మార్కెట్‌ని సాధించేంతగా కృషి చేసింది. బిజినెస్‌లో రాణించాలనుకునేవారికి పరాగ్ మిల్క్ ఫుడ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఆమె చేసిన ప్రయాణం ఓ పాఠం అవుతుంది.



* అక్షాలీ షా

"నేను ఎంబీయేలో చేరేనాటికి మా నాన్న దేవేంద్ర షా పుణే సమీపంలోని మంచార్‌లో ఒక చిన్న డెయిరీ యూనిట్‌ను ప్రారంభించాడు. ఎంబీయే పూర్తవుతూనే ఏదైనా బిజినెస్ ప్రారంభించాలనుకున్నప్పుడు మా నాన్న తన యూనిట్‌లోనే జాబ్‌లో చేరి, వ్యాపారాన్ని డెవలప్ చేయమన్నాడు. దానిని సవాల్‌గా తీసుకున్నాను. పరాగ్ పేరుతో రకరకాల పాల ఉత్పత్తులను తయారుచేయడం మొదలుపెట్టాను. ముందుగా దేశవ్యాప్తంగా ఉన్న మిల్క్ ప్రొడక్ట్స్‌కు సంబంధించిన అధ్యయనంతో మొదలుపెట్టాను. ఏ బిజినెస్ అయినా అంచెలంచెలుగా ఎదగాలంటే ముందు మార్కెట్‌ను అర్థం చేసుకోవాలి. నాణ్యత పైన దృష్టి పెట్టాలి. పుణే ప్రాంతంలో సహకార సంఘాల వాళ్లు మిల్క్ లీవ్ ప్రకటించినప్పుడు మా నాన్న రైతుల నుండి పాలను సేకరించి, మిల్క్ ఫుడ్స్ తయారీకి పునాది వేశారు. అక్కణ్ణుంచి కంపెనీ పాడి పరిశ్రమంలో ఇదొక విప్లవాత్మకమైన ప్రయాణానికి నాంది పలికినట్లయింది. ఆ విధంగా నాన్న ఆలోచనలనూ అందుకుంటూ నా ప్రయత్నాలు మొదలుపెట్టాను.

శ్రేష్ఠమైన ఉత్పత్తులు..

చాలారకాల ఆహారపదార్థాల నుంచి ప్రొటీన్స్ లభిస్తాయన్నది తెలిసిందే. పాలలో ప్రొటీన్ మోతాదు ఎక్కువ. అందుకే వినియోగదారుల అవసరాల మేరకు ప్రొటీన్ మిల్క్ ప్రొడక్ట్‌లను తయారుచేసి విక్రయిస్తున్నాం. 'పరాగ్' అని ప్రారంభించిన మా సంస్థ నుంచి నెయ్యి, చీజ్, ఫ్లేవర్డ్ మిల్క్, పెరుగు.. ఈ అన్ని ఉత్పత్తుల్లో మంచి అమ్మకాలు సాధిస్తుంది. ఇప్పుడు చీజ్ తయారీ, అమ్మకంలో దేశంలోనే మా సంస్థ రెండవదిగా నిలిచింది. ఫార్మ్ టు హోమ్ బిజినెస్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ బ్రాండ్, పానీయాల వృద్ధి.. వంటి ఉత్పత్తిలో నా మార్క్‌ను చూపించగలిగాను.



తండ్రి దేవేంద్ర షాతో అక్షాలి షా

గడపగడపకూ..

ఆవు పాల శ్రేష్ఠత గురించి తెలిసిందే. అందుకే, మన దేశంలో వీటి వాడకమూ ఎక్కువే ఉంటుంది. ఖరీదు ఎక్కువైనా శ్రేష్ఠమైన ఆవుపాల గురించి చాలా మంది అన్వేషిస్తారు. మొదట్లో ఆవుపాలు పితికి, అవి అవసరం ఉన్న కొద్దిమంది ఖాతాదారులకే అందించేవాళ్లం. ఆ తర్వాత ఆవు పాల గురించి దేశీయంగా ఉన్న మార్కెటింగ్ వైపు దృష్టి పెట్టాను. శ్రేష్ఠమైన ఆవుపాల కోసం దేశంలో కోట్లమంది ఖాతాదారులు ప్రయత్నిస్తున్నారని అర్థం చేసుకున్నాను. దీంతో 'ప్రైడ్ ఆఫ్ కౌస్' పేరుతో దేశవ్యాప్తంగా ఆవుపాలను కోరుకున్న ఖాతాదారుల గడప దగ్గరకు చేర్చేలా ప్రణాళికలు రూపొందించాం. ఢిల్లీ, ముంబై, పుణే, సూరత్‌లలో ఆవుపాలు విశేషంగా అమ్ముడుపోతున్నాయి.

వ్యాపారవేత్తగా ఎన్నో అవార్డులను పొందుతూనే ఉన్నాను. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిల్క్ ప్రొడక్ట్స్ మార్కెట్ పై ఒక అంచనాతో అడుగులు వేస్తున్నాం'' అని వివరిస్తుంది అక్షాలీ.

అమ్మమ్మ చేతి వంట



జానకి పాటి

నిన్నటి తరం పిల్లలకు అమ్మమ్మ నాన్నమ్మ వంటకాల రుచి గురించి చెబితే చాలు నగర వాసపు జీవితాల్లో ఆ రుచిని మిస్ అవుతున్న విధానాన్ని తలుచుకొని మరీ బాధపడిపోతారు. ఆనంద్ భరద్వాజ్ అతని భార్య నళిని పార్థిబన్‌లు చెన్నైలో ఉంటున్న తమ అమ్మమ్మ జానకి పాటి వంటకాలను పండగల సమయాల్లో ఎంతగా కోల్పోతున్నామో గ్రహించారు. చేస్తున్న ఉద్యోగాలను వదిలేసి, అమ్మమ్మ వద్దకు పరిగెత్తుకు వెళ్లారు. 82 ఏళ్ల అమ్మమ్మ చేత వ్యాపారాన్ని ప్రారంభించారు. నేడు 32 దేశాలకు ఆ రుచులను అందిస్తూ ఈ వయసులో అమ్మమ్మను వ్యాపారవేత్తగా మార్చేశారు.

దేశంలో దక్షిణ భారతీయ వంటకాలకు ప్రత్యేకమైన రుచి ఉంటుంది. ముఖ్యంగా పండగల సమయాల్లో బామ్మలు వండే పిండివంటల రుచి మనుమలను నగరవాసం నుంచి లాక్కుని వచ్చేలా చేస్తుంది. అచ్చం ఇదే విధంగా 2015లో దీపావళి సమయంలో కుటుంబ సభ్యులు బామ్మ జానకి పాటి స్పెషల్ వంటకాలను మిస్ అయ్యారు. బామ్మ చేతి వంట రుచి గొప్పతనాన్ని ఆమె మనవడు ఆనంద్ భరద్వాజ్ అతని భార్య నళిని పార్థిబన్ మరీ మరీ గుర్తు చేసుకున్నారు. 'దీపావళికి మా అమ్మమ్మ జాంగ్రీలు, మురుకులు, మైసూర్ పాక్‌లను చాలా జాగ్రత్తగా తయారు చేసేది. ఆమె వంట చేస్తున్నప్పుడు మనవళ్లైన మాకు కథలు కూడా చెబుతుండేది. ఆ జ్ఞాపకం నేడు ఎస్‌కెకె (స్వీట్ కారం కేఫ్)ను ప్రారంభించేలా చేసింది' అని చెబుతుంది నళిని పార్థిబన్.

రూ.2000 ల పెట్టుబడి



ఆనంద్, నళిని తమ అమ్మమ్మ చేతి వంట రుచిని ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నారు. సంప్రదాయ దక్షిణ భారత స్నాక్స్‌కు ఆధునిక ట్విస్ట్ ఇవ్వడానికి వారు చాలా ప్రయత్నాలే చేశారు. అయితే, ఈ ప్రయాణం కష్టమైందని త్వరలోనే గ్రహించారు. చాలా బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరించాయి. దీంతో ఇంటిలోని ఒక చిన్న గదిలో రూ.2000 పెట్టుబడితో ప్రారంభించారు. మొదట కస్టమర్లను సంపాదించడానికి వార్తాపత్రికల మధ్యలో కరపత్రాలను ఉంచి, పంపిణీ చేసింది. దీంతో ఆర్డర్లు వెల్లువెత్తడం ప్రారంభించాయి. జనం కొద్ది రోజుల్లోనే అమ్మమ్మ స్నాక్స్‌ని బాగా ఇష్టపడ్డారు.

ప్రతి దశలోనూ కొత్త ఉత్సాహం

'వంటకాలన్నీ అమ్మమ్మవే. ఆమె చెప్పినట్టే చేస్తాం. కానీ, వంటను దగ్గరగా ఉండి పర్యవేక్షిస్తుంటాం. ఎక్కడా రాజీ పడకుండా చూసుకుంటాం' అని నళిని చెబితే, 'నాణ్యమైన దినుసులతో పాటు ప్రేమ, శ్రద్ధతో మా కుటుంబం కోసం చేసే విధంగా తయారుచేస్తాం' అని జానకి పాటి చెబుతుంది.

పాటీ ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కూడా తయారుచేస్తుంది. తన ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా ఈ బామ్మ ఉత్సాహాన్ని ఎవరైనా పొందవచ్చు. క్రికెటర్ ఎంఎస్ ధోని పట్ల తన ప్రేమను సోషల్‌మీడియా ద్వారా పంచుకొని ఆనందిస్తుంటుంది. జీవితంలోని ఈ దశనూ ఆనందంగా గడపడం కోసం ఉత్సాహంగా పనిచేస్తుంది. 'ఇది నాకు పునర్జన్మ లాంటిది. మీరు ప్రయత్నించేవరకు మీకూ తెలియదు మీలోని శక్తి ఎంతో' అని అందరికీ చెబుతుంది. 'మా బామ్మలోని శక్తి మాకూ ప్రేరణగా పనిచేస్తుంది. ఆమె తన అభిమాన క్రికెటర్‌నీ ఉత్సాహపరుస్తుంది. అలాగే, సరికొత్త మొబైల్ యాప్స్ గురించి నేర్చుకుంటుంది. ఆమెకు జీవితం పట్ల ఉన్న అభిరుచి అసమానమైనది' అంటూ తమ అమ్మమ్మ గురించి ఆనందంగా వివరిస్తుంది నళిని.

నేడు ఎస్‌కెకె (స్వీట్ కారమ్ కేఫ్) స్టార్టప్ భారతదేశం మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా 32 దేశాలకు విస్తరించి, అమ్మమ్మ చేతి వంట సూపర్ అంటోంది.

యూత్ పల్స్



యువతరం ఎకో-యాంగ్జయిటీ

'ఈ నెట్‌ఫ్లిక్స్, ఐపీఎల్ మ్యాచ్‌ల కాలంలో వాతావరణ మార్పులపై యూత్ దృష్టి పెడుతుందా?' అనే ప్రశ్నకు 'అవును' అని చెబుతుంది డెలాయిట్ తాజా నివేదిక. 'డెలాయిట్ 2024 జెన్ జెడ్, మిలీనియల్స్ సర్వే' ప్రకారం వీరిలో ఎక్కువమంది 'క్లైమెట్ ఛేంజ్'పై ఆందోళన చెందుతున్నారు. పర్యావరణ సంరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యత మాట ఎలా ఉన్నా ఎకో-యాంగ్జయిటీ అనేది వారిలో కనిపించే మరో కోణం.

ఢిల్లీలో ఒకరోజు...

'ఇల్లుదాటి బయటికి వెళ్లవద్దు అని పేరెంట్స్ చాలా స్ట్రిక్ట్‌గా చెప్పారు. అయినా సరే వారి కనుగప్పి ఇంటి నుంచి బయటికి వచ్చి అనుకున్నట్లుగానే అక్కడికి వెళ్లాను' అంటుంది యశ్న ధృరియా. ఇంతకీ ఇరవై సంవత్సరాల యశ్న వెళ్లింది ఎక్కడికి?

ఆరోజే విడుదలైన సినిమాకు కాదు. క్రికెట్ మ్యాచ్ చూడడానికి కాదు. మహానగరంలో జరుగుతున్న గ్లోబల్ క్లైమెట్ స్ట్రైక్‌లో పాల్గొనడానికి. 'వాట్స్ గోయింగ్ టు హ్యాపెన్' అంటూ పర్యావరణ సంక్షోభం గురించి యశ్న కన్నీళ్లు పెట్టుకున్నప్పుడు తల్లిదండ్రులు, స్నేహితులకు ఆశ్చర్యంగా అనిపించింది. 'పరీక్షల్లో ఫెయిలైనట్లు ఏడుస్తున్నావేమిటి?' అని అడిగారు ఒకరు.

కానీ ఆ ఒకరికి తెలియనిదేమిటంటే వాతావరణానికి సంబంధించిన కీలకమైన పరీక్షను మనం నిర్లక్ష్యం చేస్తున్నాం. ఈ సంక్షోభ నేపథ్యంలో యశ్నలాంటి వాళ్లు ఆశాదీపాలై వెలుగుతున్నారు. తాము వెలుగు దారిలో పయనిస్తూ ఎంతోమందిని తమతోపాటు తీసుకువెళుతున్నారు.

'తెలిసో తెలియకో, ఏమీ చేయలేకో పర్యావరణ సంక్షోభంలో భాగం అవుతున్నాం' అనే బాధ. పశ్చాత్తాపం బెంగళూరుకు చెందిన శ్రీరంజనిలో కనిపిస్తుంది. గ్లోబల్ స్ట్రైక్ మూమెంట్ 'ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్(ఎఫ్‌ఎఫ్‌ఎఫ్) ఇండియా'లో భాగంగా ఎన్నో కార్యక్రమాల్లో శ్రీరంజని పాల్గొంది.

పర్యావరణ సంక్షోభం తాలూకు ఆందోళన తట్టుకోలేక యూత్ క్లైమెట్ యాక్టివిస్ట్‌లలో కొందరు ట్రీట్‌మెంట్‌కు కూడా వెళుతున్నారు. ఎన్విరాన్‌మెంట్ యాక్షన్ గ్రూప్ 'దేర్ ఈజ్ నో ఎర్త్ బి'తో కలిసి పనిచేసిన ఢిల్లీకి చెందిన సైకోథెరపిస్ట్ అగ్రిమ ఛటర్జీ పర్యావరణ సంక్షోభంపై యూత్ ఆందోళనను దగ్గరి నుంచి గమనించింది.

'తమ పరిధిలో వారు చేయగలిగింది చేస్తున్నారు. మరోవైపు సమస్య పెద్దగా ఉంది. కొన్నిసార్లు తాము చేస్తున్న ప్రయత్నం అర్థరహితంగా అనిపించి ఆందోళనకు గురవుతున్నారు. నిస్సహాయ స్థితిలోకి వెళుతున్నారు' అంటుంది అగ్రిమ.

బెంగళూరుకు చెందిన సైకోథెరపిస్ట్ మోహినీ సింగ్ ఎంతోమంది యువ క్లైమెట్ యాక్టివిస్ట్‌లతో కలిసి పనిచేసింది. 'పరీక్షల్లో ఫెయిల్ కావడం, లవ్ ఫెయిల్యూర్స్, బ్రేకప్స్ సందర్భంగా ఇతరుల నుంచి సానుభూతి, ఓదార్పు దొరికినట్లు క్లైమెట్ యాంగ్జయిటీ విషయంలో దొరకదు. ఎందుకంటే అది చాలామందికి అనుభవం లేని విషయం' అంటుంది మోహిని.

శివానీ గోయల్ తన స్వరాష్ట్రం అస్సాంలో వాతావరణ విధ్వంసంపై పరిశోధన చేస్తోంది. పత్రికలకు వ్యాసాలు రాస్తుంది. సోషల్ మీడియాలో కంటెంట్‌ను క్రియేట్ చేస్తుంటుంది. 'నా ప్రయత్నం ఏ కొంచమైనా ఫలితాన్ని ఇస్తుందా?' అనేది తనకు తరచుగా వచ్చే సందేహం.

'చేయాల్సింది చాలా ఉంది' అంటున్న గోయల్ 'ఇక ఏమీ చేయలేం' అనే నిస్సహాయ స్థితిలోకి వెళ్లి ఆందోళన బారిన పడి ఉండవచ్చుగానీ దాని నుంచి బయటపడడానికి క్లైమెట్ యాక్టివిస్ట్‌గా తిరిగి క్రియాశీలం కావడానికి ఎంతో సమయం పట్టదు.

అలా తొందరగా ఆందోళన నుంచి బయటపడడమే వారి బలం. సమాజానికి వరం.



నయన ప్రేమ్‌నాథ్

ఐడియాలు ఉండగా ఆందోళన ఏలనోయి!

'పర్యావరణంపై మన ప్రేమ ఇంటి నుంచే మొదలు కావాలి' అంటున్న నయన ప్రేమ్‌నాథ్ డే-టు-డే సస్టెయినబుల్ లైఫ్‌స్టైల్ ప్రాక్టీసెస్‌కు సంబంధించిన వీడియోలు, రీల్స్‌ను యువతరం ఇష్టపడుతోంది. ఆచరిస్తోంది. 'ధరించకుండా మీరు మూలకు పడేసిన దుస్తులతో ఏంచేయాలి?' 'పీసీఆర్ ప్లాస్టిక్ గురించి తెలుసుకుందాం' 'జీరో-వేస్ట్ లైఫ్ స్టైల్'... మొదలైన వాటి గురించి బెంగళూరు చెందిన నయన ప్రేమ్‌నాథ్ చేసిన వీడియోలు సోషల్ మీడియాలో పాపులరయ్యాయి. 'పర్యావరణ పరిరక్షణకు నా వంతుగా కొంత' అనే భావనకు మద్దతును, బలాన్నీ ఇస్తున్నాయి.

పశ్చిమ కనుమల పరిమళం



నా మూలాలు పశ్చిమ కనుమలలో ఉన్నాయి. ఇల్లు బెంగళూరులో ఉంది. ప్రకృతి అంటే ఇష్టం. 'ఇండియన్ యూత్ క్లైమెట్ మూవ్‌మెంట్'లో కమ్యూనిటీ ఆర్గనైజర్‌ని. 'ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్'తో నా ప్రయాణం మొదలైంది. 'నేచర్ అండ్ ప్లూరివర్సిటీ'కి ఫౌండర్‌ని. అధిక జీతం, పెద్ద సంస్థ అనే దృష్టితో కాకుండా విలువలతో కూడిన ఉద్యోగాలు చేయడం వల్ల ఎకో యాంగ్జయిటీ తగ్గుతుంది. ఎక్కువ జీతం వచ్చే సంస్థలో పనిచేయడం కంటే, పర్యావరణ సంరక్షణకు ఉపయోగపడే సంస్థలో పనిచేస్తున్నందుకు నాకు తృప్తిగా ఉంది.

పర్యావరణ సంక్షోభాన్ని గురించి ఒక్క మాటలో చెప్పాలంటే... తుఫాను ఒక్కటే. అయితే మనం వేరు వేరు పడవల్లో ఉన్నాం. పర్యావరణ సంక్షోభాన్ని నివారించడానికి ప్రతి ఒక్కరూ తమవంతుగా చేయాల్సింది ఎంతో ఉంది.

– శ్రీరంజని రమణ్, క్లైమెట్ యాక్టివిస్ట్



నిష్క్రమించేదెవరో..? నేడు ఎలిమినేటర్ మ్యాచ్‌లో బెంగళూరుతో రాజస్తాన్ 'ఢీ'

ఐపీఎల్ టైటిల్ రేసులో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో... నేడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, రాజస్తాన్ రాయల్స్ జట్లు ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. అహ్మదాబాద్‌లో రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టుకు ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉంటాయి. ఓడిపోయిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేత జట్టు క్వాలిఫయర్–1లో ఓడిపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో శుక్రవారం చెన్నైలో జరిగే క్వాలిఫయర్–2 మ్యాచ్‌లో ఫైనల్ బెర్త్ కోసం పోటీపడు తుంది. తాజా సీజన్‌లో బెంగళూరు లీగ్ దశలోనే నిష్క్రమించే దశ నుంచి ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించి అబ్బురపరిచింది. డు ప్లెసిస్ నాయకత్వంలోని బెంగ ళూరు జట్టు తమ చివరి 6 లీగ్ మ్యాచ్‌ల్లో నెగ్గి ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మరోవైపు సంజూ సామ్సన్ సారథ్యంలోని రాజస్తాన్ రాయల్స్ జట్టు తమ చివరి నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోగా, ఐదో మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ జోడీగా...

సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ఘనత



న్యూఢిల్లీ: నెల రోజుల తర్వాత భారత బ్యాడ్మింటన్ స్టార్స్ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి మళ్లీ వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం రెండు స్థానాలు మెరుగు పర్చుకొని మూడో ర్యాంక్ నుంచి టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. గత ఆదివారం థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో సాత్విక్–చిరాగ్ జంట విజేతగా నిలవడంతో వారి ర్యాంక్‌లో మార్పు వచ్చింది. గత ఏడాది అక్టోబర్‌లో తొలిసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్న భారత జోడీ రెండు వారాలపాటు అగ్రస్థానంలో కొనసాగి ఆ తర్వాత ఐదో ర్యాంక్‌కు పడిపోయింది. మళ్లీ ఈ ఏడాది జనవరి 23న నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకొని ఏప్రిల్ 15వ తేదీ వరకు టాప్ ర్యాంక్‌లో కొనసాగి మూడో ర్యాంక్‌కు పడిపోయింది.

ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా ద్వయం 21–14, 21–10తో హువాంగ్ యు సున్–లియాంగ్ టింగ్ యు (చైనీస్ తైపీ) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో నలుగురు భారత ప్లేయర్లు సతీశ్ కుమార్, ఆయూశ్ శెట్టి, శంకర్ ముత్తుస్వామి, కార్తికేయ గుల్షన్ కుమార్ పోటీపడ్డా ఒక్కరు కూడా మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు. నేడు జరిగే మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్ మ్యాచ్‌లో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)తో పీవీ సింధు తలపడుతుంది.

కోల్‌కతాకే 'ఫైనల్' సత్తా

ఈ సీజన్‌లో 7 సార్లు ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నాలుగు సార్లు 200 పైచిలుకు స్కోర్లను అవలీలగా చేసింది. ఎనిమిదోసారి మాత్రం 'సన్' బృందం రైజింగ్ కాలేదు. కీలకమైన ప్లే ఆఫ్స్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ పూర్తి ఓవర్లు ఆడకుండానే 159 పరుగులకే కుప్పకూలింది. రెండో క్వాలిఫయర్ ఉందన్న ధీమానో లేదంటే ఓడినా పోయేదేం లేదన్న అలసత్వమో గానీ హైదరాబాద్ బ్యాటర్లు పేలవ ప్రదర్శనతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు సులువుగా ఫైనల్ దారి చూపారు. ఆద్యంతం పక్కా ప్రణాళికతో ఆడిన కోల్‌కతా ముందుగా బంతితో సన్‌రైజర్స్‌ను కట్టడి చేసి... ఆ తర్వాత బ్యాట్‌తో మెరిపించి 160 పరుగుల లక్ష్యాన్ని 13.4 ఓవర్లలోనే ఛేదించేసి దర్జాగా నాలుగోసారి ఐపీఎల్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లింది.



క్వాలిఫయర్–1లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘనవిజయం

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టార్క్

- నాలుగోసారి ఐపీఎల్ టైటిల్ పోరుకు అర్హత
- 160 పరుగుల లక్ష్యాన్ని 13.4 ఓవర్లలోనే ఛేదించిన కోల్‌కతా నైట్‌రైడర్స్
- బంతితో హడలెత్తించిన స్టార్క్
- దంచేసిన వెంకటేశ్, శ్రేయస్ అయ్యర్
- ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్–2లో తలపడనున్న సన్‌రైజర్స్

అహ్మదాబాద్: 'ప్లే ఆఫ్స్' దశ వరకు తగిన ప్రదర్శన చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఇంకో అవకాశం కోసం ఎదురుచూడకుండా ఐపీఎల్ 17వ సీజన్‌లో నేరుగా ఫైనల్‌కు అర్హత సంపాదించింది. మంగళవారం జరిగిన తొలి క్వాలిఫయర్‌లో కేకేఆర్ 8 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తుగా ఓడించింది. లీగ్ దశలో భీకరమైన ఫామ్ కనబరిచిన సన్‌రైజర్స్ మాత్రం కీలకమైన దశలో నిర్లక్ష్యంగా ఆడి ఓడింది. ఫైనల్ బెర్త్ కోసం ఆ జట్టు రెండో క్వాలిఫయర్ కోసం నిరీక్షించనుంది. టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 19.3 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌటైంది. రాహుల్ త్రిపాఠి (35 బంతుల్లో 55; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, హెన్రిచ్ క్లాసెన్ (21 బంతుల్లో 32; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ స్టార్క్ 3 వికెట్లు, వరుణ్ చక్రవర్తి 2 వికెట్లు తీశారు. అనంతరం కోల్‌కతా 13.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (24 బంతుల్లో 58 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), వెంకటేశ్ అయ్యర్ (28 బంతుల్లో 51 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) సన్‌రైజర్స్ బౌలర్ల భరతం పట్టి మూడో వికెట్‌కు కేవలం 44 బంతుల్లో 97 పరుగుల భాగస్వామ్యం జోడించడం విశేషం. గతంలో కోల్‌కతా జట్టు 2012, 2014లలో టైటిల్ సాధించి, 2021లో రన్నరప్‌గా నిలిచింది.

ఆది నుంచే కష్టాల్లో...

అసలైన మ్యాచ్‌లో స్టార్క్ బంతితో నిప్పులు చెరిగాడు. రెండో బంతికే ట్రవిస్ హెడ్ (0)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. అభిషేక్ శర్మ (3)ను కూడా సింగిల్ డిజిట్‌కే వైభవ్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత ఫామ్‌లో ఉన్న నితీశ్ కుమార్ రెడ్డి (9), షహబాజ్ (0)లను స్టార్క్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. దాంతో సన్‌రైజర్స్ 39 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఏడో ఓవర్లో జట్టు స్కోరు 50కి చేరింది. మెల్లిగా ఈ కష్టాల నుంచి గట్టెక్కుతున్న సమయంలో 8, 9, 10 ఓవర్లు సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌కు ఊరటనిచ్చాయి. హర్షిత్ వేసిన 8వ ఓవర్లో రాహుల్ త్రిపాఠి సిక్సర్‌తో 12 పరుగులొచ్చాయి. నరైన్ తొమ్మిదో ఓవర్లో త్రిపాఠి బౌండరీ బాదితే... క్లాసెన్ 6, 4 కొట్టడంతో 18 పరుగుల్ని రాబట్టుకుంది. రసెల్ పదో ఓవర్లో ఇద్దరు చెరో ఫోర్ కొట్టడంతో మరో 12 పరుగులు రావడంతో సగం ఓవర్లు ముగిసేసరికి సన్‌రైజర్స్ 92/4 స్కోరు చేసింది.



హెడ్ బౌల్డ్



రాహుల్ త్రిపాఠి

వరుణ్ దెబ్బతో....

ఇంకేం ఓవర్‌కు 9.2 రన్‌రేట్‌తో గాడిలో పడుతోందనుకుంటున్న తరుణంలో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి దెబ్బకొట్టాడు. అతను వేసిన 11వ ఓవర్లో త్రిపాఠి బౌండరీతో జట్టు స్కోరు 100కు చేరింది. కానీ ఆఖరి బంతికి క్లాసెన్ అవుటయ్యాడు. దీంతో ఐదో వికెట్‌కు 62 పరుగుల విలువైన భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత కాసేపటికే 5 పరుగుల వ్యవధిలోనే త్రిపాఠి, సన్వీర్ (0), సమద్ (16), భువనేశ్వర్ (0) ఇలా నాలుగు వికెట్లను కోల్పోయిన సన్‌రైజర్స్ 126/9 స్కోరు వద్ద ఆలౌట్‌కు సిద్ధమైపోయింది. ఈ దశలో కెప్టెన్ కమిన్స్ (24 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో 150 పైచిలుకు స్కోరు చేయగలిగింది.

అదరగొట్టిన 'అయ్యర్'లు

బౌలింగ్‌లోనూ హైదరాబాద్ తేలిపోవడం, ఫీల్డర్లు క్యాచ్‌లు నేలపాలు చేయడంతో నైట్‌రైడర్స్‌కు లక్ష్య ఛేదన మరింత సులువైంది. ఓపెనర్లు గుర్బాజ్ (14 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సునీల్ నరైన్ (16 బంతుల్లో 21; 4 ఫోర్లు) వేగంగా ఆడే క్రమంలో అవుటయ్యారు. 67 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత ఒక్క వికెట్టు పడలేదు. వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్ వచ్చిన లైఫ్‌లను సద్వినియోగం చేసుకొని హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. దీంతో 9.4 ఓవర్లలోనే కోల్‌కతా స్కోరు వందకు చేరింది. లక్ష్యంవైపు చకచకా పరుగులు తీసింది. వెంకటేశ్ 28 బంతుల్లో, శ్రేయస్ 23 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. వెంకటేశ్, శ్రేయస్ ధాటికి కోల్‌కతా 38 బంతులు మిగిలుండగానే విజయతీరానికి చేరింది.



వెంకటేశ్, శ్రేయస్

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (బి) స్టార్క్ 0; అభిషేక్ శర్మ (సి) రసెల్ (బి) వైభవ్ 3; త్రిపాఠి (రనౌట్) 55; నితీశ్ కుమార్ రెడ్డి (సి) గుర్బాజ్ (బి) స్టార్క్ 9; షహబాజ్ (బి) స్టార్క్ 0; క్లాసెన్ (సి) రింకూ సింగ్ (బి) వరుణ్ 32; సమద్ (సి) శ్రేయస్ (బి) హర్షిత్ 16; సన్వీర్ (బి) నరైన్ 0; కమిన్స్ (సి) గుర్బాజ్ (బి) రసెల్ 30; భువనేశ్వర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వరుణ్ 0; విజయకాంత్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.3 ఓవర్లలో ఆలౌట్) 159. వికెట్ల పతనం:** 1–0, 2–13, 3–39, 4–39, 5–101, 6–121, 7–121, 8–125, 9–126, 10–159. **బౌలింగ్:** స్టార్క్ 4–0–34–3, వైభవ్ 2–0–17–1, హర్షిత్ 4–0–27–1, నరైన్ 4–0–40–1, రసెల్ 1.3–0–15–1, వరుణ్ చక్రవర్తి 4–0–26–2.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) విజయకాంత్ (బి) నటరాజన్ 23; నరైన్ (సి) విజయకాంత్ (బి) కమిన్స్ 21; వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 51; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 58; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (13.4 ఓవర్లలో 2 వికెట్లకు) 164. వికెట్ల పతనం:** 1–44, 2–67. **బౌలింగ్:** భువనేశ్వర్ 3–0–28–0, కమిన్స్ 3–0–38–1, నటరాజన్ 3–0–22–1, విజయకాంత్ 2–0–22–0, హెడ్ 1.4–0–32–0, నితీశ్ రెడ్డి 1–0–13–0.

సినిమా



డి. రామానాయుడు

షష్టి పూర్తి

తెలుగు అగ్ర నిర్మాణ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ షష్టి పూర్తి (60 ఏళ్లు) ప్రయాణం పూర్తి చేసుకుంది. పద్మభూషణ్, దివంగత నిర్మాత డా. డి. రామానాయుడు 1964లో స్థాపించిన సురేష్ ప్రొడక్షన్స్ భారతీయ చిత్ర పరిశ్రమలో అగ్రశ్రేణి నిర్మాణ సంస్థగా పేరు పొందడంతో పాటు ప్రేక్షకుల మన్ననలను పొందింది. ప్రకాశం జిల్లా కారంచేడులో రైతు కుటుంబంలో పుట్టారు రామానాయుడు. రైసు మిల్లు వ్యాపారం చేస్తున్న సమయంలో ఆయన మద్రాసు వెళ్లారు. అక్కడ కొందరు సినీ ప్రముఖుల పరిచయం ఆయన్ను సినిమాల్లోకి వచ్చేలా చేసింది. భాగస్వామ్యంతో 'అనురాగం' చిత్రం నిర్మించారు రామానాయుడు. ఆ చిత్రం విజయవంతం అయింది. ఆ తర్వాత తన పెద్ద కుమారుడు సురేష్‌బాబు పేరుతో సురేష్ ప్రొడక్షన్స్ స్థాపించి, ఎన్టీఆర్‌తో 'రాముడు–భీముడు' (1964) సినిమా నిర్మించారు. ఆ చిత్రం ఘనవిజయం సాధించింది. అప్పట్నుంచి పలు భాషల్లో సినిమాలు నిర్మిస్తూ వస్తోంది సురేష్ ప్రొడక్షన్స్. శతాధిక చిత్రాల నిర్మాతగా రామానాయుడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానం సంపాదించుకున్నారు. అలాగే అన్ని భారతీయ భాషల్లో సినిమాలు నిర్మించాలన్న తన సంకల్పాన్ని నెరవేర్చుకుని, చరిత్ర సృష్టించారు రామానాయుడు. 2015 ఫిబ్రవరి 18న ఈ మూవీ మొఘల్ తుది శ్వాస విడిచారు. అప్పటికే తమ నిర్మాణ సంస్థ బాధ్యతలను నిర్వర్తిస్తున్న సురేష్‌బాబు తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. రెండో కుమారుడు వెంకటేష్ హీరోగా కొనసాగుతున్నారు. మనవడు రానా నటుడిగా, నిర్మాతగా కొనసాగుతున్నారు. రానా సోదరుడు అభిరామ్ కూడా హీరో ('అహింస' చిత్రంతో హీరోగా పరిచయం అయ్యారు)గా చేసిన విషయం తెలిసిందే. ఇక సురేష్ ప్రొడక్షన్స్ 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రయాణంలో భాగమైన అందరికీ నిర్మాణ సంస్థ కృతజ్ఞతలు తెలియజేసింది.

ఖురేషీగా ఎందుకు మారాడు?

ఖురేషి అబ్రమ్‌గా స్టీఫెన్ నెడుంపల్లి ఎందుకు మారాడు? 'లూసిఫర్' సినిమా చూసిన ప్రేక్షకులకు ఈ సందేహం కలగడం సహజం. ఈ సందేహానికి 'లూసిఫర్ 2'లో సమాధానం దొరకనుంది. స్టీఫెన్ నెడుంపల్లి అలియాస్ ఖురేషి అబ్రమ్‌గా మోహన్‌లాల్ హీరోగా రూపొందిన బ్లాక్ బస్టర్ మూవీ 'లూసిఫర్' (2019). హీరో, డైరెక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఈ కాంబినేషన్‌లోనే 'లూసిఫర్'కి సీక్వెల్‌గా 'ఎల్2 ఎంపురాన్' రూపొందుతోంది. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్, ఆశీర్వాద్ సినిమాస్ ఆంటోని పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. మంగళవారం (మే 21) మోహన్‌లాల్ బర్త్ డే సందర్భంగా 'ఎల్ 2 ఎంపురాన్'లో ఖురేషి అబ్రమ్‌గా మోహన్‌లాల్ లుక్‌ను విడుదల చేశారు. స్టీఫెన్ నెడుంపల్లి అసలు ఖురేషి అబ్రమ్‌గా ఎలా మారాడు? అనే విషయాన్ని ఈ సినిమాలో చూపించనున్నారు. 2025లో మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.



మోహన్‌లాల్

జూన్‌లో హరోం హర



సుధీర్ బాబు

సుధీర్‌బాబు హీరోగా నటించిన 'హరోం హర' సినిమా విడుదల తేదీ మారింది. ముందుగా ఈ నెల 31న సినిమా విడుదలకు యూనిట్ ప్లాన్ చేసింది. అయితే జూన్ 14న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, సుధీర్ కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన 'హరోం హర'లో మాళవికా శర్మ కథానాయిక. సుమంత్ జి. నాయుడు నిర్మించారు. ''ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రం 'హరోం హర'. చిత్తూరు జిల్లా కుప్పం నేపథ్యంలో 1989లో జరిగే పీరియాడికల్ ఫిల్మ్ ఇది'' అన్నారు మేకర్స్.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



హరీష్, మాన్య

హరీష్ బొంపెల్లి, మాన్య సలాడి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'ఓసీ'. విష్ణు బొంపెల్లి దర్శకత్వంలో కౌండిన్య ప్రొడక్షన్స్‌పై బీవీఎస్ నిర్మించారు. ఈ చిత్రాన్ని జూన్ 7న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'ఓసీ'. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ కథ ఉంటుంది. మంచి నిర్మాణ విలువలతో, భారీ బడ్జెట్‌తో రాజీపడకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. శరవేగంగా నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. రోయల్ శ్రీ, లక్ష్మీ కిరణ్ నటించిన ఈ చిత్రానికి కెమెరా: సాయిరాం తుమ్మలపల్లి, సంగీతం: భోలే శావలి.

డాన్ వస్తున్నాడు



దీపిక, శాంతి చంద్ర, నికిష, సిమ్రితి

ఇండియన్ నేవీలో పని చేసిన సోల్జర్ శాంతి చంద్ర హీరోగా నటించిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితీ బతీజా, నికిషా రంగ్‌వాలా హీరోయిన్లు. గుడూరు భద్రకాళీ సమర్పణలో జి. శాంతి బాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న రిలీజ్ అవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీర శంకర్, హీరో సంపూర్ణేష్ బాబు అతిథులుగా పాల్గొని, సినిమా హిట్టవ్వా లన్నారు. ''ఒకప్పుడు మన సినిమాలకు శతదినోత్సవాలు జరుపుకునేవాళ్లం. ఇప్పుడు రెండు రోజులకే సినిమా లైఫ్ ఫినిష్ అవుతూ జత దినోత్సవాలు జరుపుకునే పరిస్థితి వచ్చింది. ఎవరికి వారు ఇంటినే హోమ్ థియేటర్‌లా భావిస్తున్నారు. సినిమాను థియేటర్‌లోనే చూడండి. చిన్న చిత్రాలను బతికించండి'' అన్నారు మూర్తి సాయి. ''డర్టీ ఫెలో' డాన్ మూవీ. అయితే మా సినిమాలో ఫ్యామిలీ డ్రామా, ఎమోషన్, యాక్షన్, రొమాన్స్.. ఇలా అన్నీ ఉంటాయి'' అన్నారు శాంతి చంద్ర.

ఆనందం.. ఉద్వేగం...

- కాన్స్‌లో 'కన్నప్ప' టీజర్ ప్రదర్శన
- 35 ఏళ్లుగా నిర్మాణంలో 'హరిజన్: యాన్ అమెరికన్ సాగ'

30న హైదరాబాద్‌లో 'కన్నప్ప' టీజర్... శివభక్తుడు కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'కన్నప్ప'. విష్ణు మంచు టైటిల్ రోల్‌లో ముఖేష్ కుమార్ దర్శకత్వంలో మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. కాన్స్ చిత్రోత్సవాల్లో 'కన్నప్ప' ప్రీమియర్ టీజర్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విష్ణు మంచు, మోహన్‌బాబు, ప్రభుదేవా పాల్గొన్నారు. ''కన్నప్ప' టీజర్‌ను కాన్స్‌లో చూపించాం. అందరూ ప్రశంసించారు. అంతర్జాతీయ డిస్ట్రిబ్యూటర్స్ కూడా 'కన్నప్ప' టీజర్ చూసి ముగ్ధులయ్యారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో తెలుగు వెర్షన్ 'కన్నప్ప' టీజర్‌ను ప్రదర్శించనున్నాం. జూన్ 13న ఈ టీజర్‌ను ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నాం'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు విష్ణు మంచు.

కాన్స్‌లో తొలిసారి... కాన్స్ చిత్రోత్సవాల్లో ప్రతిష్టాత్మక 'పామ్ డి ఓర్' అవార్డు సినీ పరిశ్రమకు సుదీర్ఘ కాలంగా సేవలు అందించినవారికి ఇస్తుంటారు. ఈ ఏడాది 77వ ఫిల్మ్ ఫెస్టివల్‌లోని 'పామ్ డి ఓర్' అవార్డుకు మెరిల్ స్ట్రీప్, జార్జ్ లూకాస్‌లను ఎంపిక చేశారు. కాగా కాన్స్ చరిత్రలోనే తొలిసారి ఓ స్టూడియోకు ఈ అవార్డు దక్కింది. జపాన్‌లోని యానిమేటెడ్ స్టూడియో 'ఘిబ్లీ'కి పామ్ డి ఓర్ అవార్డును ప్రదానం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ స్టూడియో యానిమేషన్ రంగంలో ఉంది. ఇక హాలీవుడ్ నటి మెరిల్ స్ట్రీప్ ఆల్రెడీ ఈ అవార్డు స్వీకరించారు. హాలీవుడ్ దర్శక–నిర్మాత జార్జ్ లూకాస్ చిత్రోత్సవాల చివరి రోజున ఈ అవార్డు అందుకోనున్నారు.

కన్నీళ్లు పెట్టుకున్న కెవిన్... కెవిన్ కాస్ట్నర్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'హరిజన్: యాన్ అమెరికన్ సాగ'. అమెరికన్ సివిల్ వార్‌కు ముందు ఉన్న పరిస్థితులు, వార్ తర్వాత ఏర్పడ్డ పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. మూడు చాప్టర్స్‌గా ఈ చిత్రం విడుదల కానుంది. తొలి చాప్టర్ 'హరిజన్: యాన్ అమెరికన్ సాగ'ను కాన్స్ చిత్రోత్సవాల్లో ప్రీమియర్‌గా ప్రదర్శించగా, మంచి స్పందన లభించింది. దాదాపు పది నిమిషాల స్టాండింగ్ ఒవేషన్ దక్కడంతో కెవిన్ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సినిమా నిర్మాణానికి 35 ఏళ్లుగా కెవిన్ కష్టపడుతున్నారని హాలీవుడ్ టాక్.

ట్రంప్ బయోపిక్... అమెరికా మాజీ అధ్యక్షుడు, వ్యాపారవేత్త డోనాల్డ్ ట్రంప్ జీవితం ఆధారంగా 'ది అప్రెంటిస్' సినిమా తీశారు దర్శకుడు అలీ అబ్బాసి. ఈ సినిమాను తొలిసారిగా కాన్స్ ఫెస్టివల్‌లో ప్రదర్శించగా, స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. సెబాస్టియన్ స్టాన్ ఈ చిత్రంలో డోనాల్డ్ ట్రంప్ పాత్ర పోషించారు. ఫిల్మ్ మేకర్స్ పొలిటికల్ మూవీస్ మరిన్ని చేయాలని కాన్స్ వేదికగా అలీ అబ్బాసి పేర్కొన్నారు.



విష్ణు మంచు, ముఖేష్ కుమార్, మోహన్‌బాబు, ప్రభుదేవా



సంధ్యా సూరి, సునీతా రజ్వార్, సహానా గోస్వామి, సంజయ్ బిష్ణోయ్



కెవిన్



మరియ, అలీ అబ్బాస్



శునకంతో లాటిటియా సందడి

శునకం సందడి... లాటిటియా డెస్చ్ నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'డాగ్ ఆన్ ట్రయిల్'. ఫ్రాన్స్‌లో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఓ కుక్క కొంతమందిని కరుస్తుంది. అప్పుడు ఆ శునకాన్ని ఓ లాయర్ ఏ విధంగా కోర్టు కేసు నుంచి రక్షించారు? అన్నదే ఈ చిత్రకథ. ఈ సినిమాను కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. లాటిటియాతో పాటు ఈ సినిమాలో నటించిన శునకం చిత్రోత్సవాలకు హాజరైంది.

కాన్స్‌లో భారతీయం... కాన్స్‌లో ఈ ఏడాది మన దేశీ తారలు ఐశ్వర్యా రాయ్, ఊర్వశీ రౌతేలా, కియారా అద్వానీ, శోభితా ధూళిపాళ వంటి వారు సందడి చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అదితీ రావ్ హైదరి ఈ చిత్రోత్సవాల్లో సందడి చేయడానికి ఫ్రాన్స్ వెళ్లారు. ఇక కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో దాదాపు 35 ఏళ్ల తర్వాత పామ్ డి ఓర్ విభాగంలో పోటీకి భారతీయ చిత్రం 'ఆల్ వీ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' నిలిచిన సంగతి తెలిసిందే. భారతీయ ఫిల్మ్ మేకర్ పాయల్ కపాడియా ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ప్రస్తుతం కపాడియా ఫ్రాన్స్‌లోనే ఉన్నారు. అలాగే 'అన్ సర్టైన్ రిగార్డ్' విభాగంలో భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఫిల్మ్‌మేకర్ సంధ్యా సూరి తీసిన 'సంతోష్' చిత్రం ఉంది. ఈ చిత్రంలో నటించిన సహానా గోస్వామి, సంజయ్ బిష్ణోయ్‌లతో పాటు సంధ్యా సూరి ఫ్రాన్స్ చేరుకున్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	53	73,953
నిఫ్టీ △	27	22,529

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,805	△ 10
డోజోన్స్	39,840	△ 32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,416	▽ 8
డాక్స్	18,727	▽ 42
షాంఘై	3,158	▽ 13
నికాయ్	38,947	▽ 123

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	72,640
బంగారం (22 క్యారెట్)	69,180
వెండి (కేజీ)	99,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.10	84.12
£	బ్రిటన్ పౌండ్		104.57	107.12
€	యూరో		89.63	91.99
¥	జపాన్ ఎన్ (100)		53.06	54.23
AUS	ఆస్ట్రేలియా డాలర్		54.76	56.70
S$	సింగపూర్ డాలర్		59.54	64.19
SAR	సౌదీ రియాల్		21.33	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.08	23.59
¥	చైనా యువాన్		10.41	12.48

ట్రిలియన్ డాలర్లకు డిజిటల్ ఎకానమీ

2027–28 నాటికి కార్యరూపం ● కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



న్యూఢిల్లీ: భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఏటా 2.8 శాతం వృద్ధి చెందుతోంది. 2027–28 నాటికి ఇది ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ అధికారిక నివాసంలో సోమవారం సాయంత్రం జరిగిన విశేష సంపర్క్ అభియాన్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300 ఐటీ, స్టార్టప్‌లు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. '2026–27 నాటికి భారత డిజిటల్ ఎకానమీ 1 ట్రిలియన్ డాలర్ల మార్కును చేరుకుంటుందని ప్రభుత్వం ముందుగా అంచనా వేసింది. అయితే కోవిడ్–19 మహమ్మారితో సహా వివిధ కారణాల వల్ల లక్ష్యం ఆ తర్వాతి సంవత్సరానికి మార్చారు' అని తెలిపారు.

ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ వినూత్న ప్రచారం

హైదరాబాద్: 'మీరు సరైనదే కొంటున్నారా?' అంటూ ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ సరికొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టింది. వినియోగదారులు వంటనూనె కొనే ముందు పరిమాణాన్ని తనిఖీ చేయడమే ఈ ప్రచార ఉద్దేశమని తెలిపింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక లీటరు సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్ 910 గ్రాముల నూనె కలిగి ఉండాలి. అయితే కొన్ని బ్రాండులు ఒక లీటరు ప్యాకెట్‌లా కనిపించే ప్యాకెట్‌ను తక్కువ పరిమాణంతో విక్రయిస్తున్నాయి. ఇలాంటి మోసపూరిత ప్రక్రియల పట్ల జాగ్రత వహించాలంటూ కస్టమర్లను కోరింది. ఈ సందర్భంగా ''ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్‌కు చెందిన ప్రతి ఒక లీటరు ప్యాకెటులో 910 గ్రాముల ఎడిబుల్ ఆయిల్ ఉంటుందని హామీ ఇస్తున్నాము'' అని జెమినీ ఎడిబుల్స్–ఫ్యాట్స్ ఇండియా సేల్స్–మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర రెడ్డి తెలిపారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-5-2024	
విశాఖ	550–00
చిత్తూరు	628–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10

బీఎస్‌ఈ కంపెనీల సరికొత్త రికార్డ్

5 లక్షల కోట్ల డాలర్లు

6 నెలల్లోనే లక్ష కోట్ల డాలర్లు జమ

దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్‌ఈ తాజాగా 5 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)ను సాధించింది. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. ఈ ఏడాది ప్రారంభం నుంచి 633 బిలియన్ డాలర్లకుపైగా జమ చేసుకుంది. నిజానికి మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ చరిత్రాత్మక గరిష్టానికి 1.7 శాతం దూరంలో ఉన్నప్పటికీ బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ తొలిసారి 5 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించడం విశేషం!

ముంబై: బీఎస్‌ఈ తొలిసారి 5 లక్షల కోట్ల డాలర్ల విలువను అందుకుంది. ఓవైపు బ్లూచిప్స్ పరుగుతీస్తుంటే.. మరోపక్క మధ్య, చిన్నతరహా కంపెనీల ఇండెక్సులు సైతం సరికొత్త గరిష్టాలకు చేరాయి. దీంతో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రికార్డ్ నెలకొల్పింది. వెరసి బీఎస్‌ఈ విలువ తొలిసారి రూ. 415 లక్షల కోట్లకు చేరింది. 2023 నవంబర్‌లో తొలిసారి బీఎస్‌ఈ విలువ 4 ట్రిలియన్ డాలర్లను తాకింది. ఆపై ఆరు నెలల్లోనే 5 లక్షల కోట్లకు చేరింది. ఇప్పటివరకూ ప్రపంచంలో 5 ట్రిలియన్ డాలర్ల క్లబ్‌లో యూఎస్‌ఏ, చైనా, జపాన్, హాంకాంగ్ మాత్రమే ఉన్నాయి. మిడ్, స్మాల్ క్యాప్స్ భారీగా సహకరించడం ఈ సందర్భంగా గమనార్హం. ఇటీవల మార్కెట్లు ఆటుపోట్లను చవిచూస్తున్నప్పటికీ.. 2024 జనవరి మొదలు సెన్సెక్స్ 2.3 శాతం బలపడగా.. మిడ్ క్యాప్ 16.3 శాతం, స్మాల్ క్యాప్ 11.5 శాతం ఎగశాయి.



జర్నీ తీరిలా

2007 మే నెలలో ట్రిలియన్ డాలర్ల విలువను సాధించిన బీఎస్‌ఈ ఆపై దశాబ్దం తదుపరి అంటే 2017 జులైలో 2 ట్రిలియన్ డాలర్లను చేరింది. ఈ బాటలో 2021 మే నెలకల్లా 3 లక్షల కోట్ల డాలర్లను తాకింది. 5 లక్షల కోట్ల డాలర్ల జాబితాలో 55.65 ట్రిలియన్ డాలర్లతో యూఎస్‌ఏ టాప్ ర్యాంకులో ఉంది. 9.4 ట్రిలియన్లతో చైనా, 6.4 ట్రిలియన్లతో జపాన్, 5.47 ట్రిలియన్లతో హాంకాంగ్ తదుపరి నిలుస్తున్నాయి.

స్వల్ప నష్టాలతో సరి..



అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందడంతో స్టాక్ సూచీలు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. సార్వత్రిక ఎన్నికల వేళ అప్రమత్తత, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 53 పాయింట్లు నష్టపోయి 73,953 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27 పాయింట్లు పెరిగి 22,529 వద్ద నిలిచింది. మెటల్, ఇంధన షేర్లు రాణించగా, బ్యాంకులు, ఐటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు.., మిడ్ సెషన్‌లో కాసేపు లాభాల్లో ట్రేడయ్యాయి. తదుపరి అమ్మకాలు తలెత్తడంతో స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఫెడరల్ రిజర్వ్ సమావేశ వివరాలు వెల్లడికి ముందు(బుధవారం రాత్రి) అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. మరికొన్ని రోజుల్లో (జూన్ 4న) ఎన్నికల ఫలితాల వెలువడనున్న నేపథ్యంలో మార్కెట్లో అస్థిరతను సూచించే వీఐఎక్స్ సూచీ 7% పెరిగి 23 నెలల గరిష్టస్థాయి 22.3 స్థాయిని తాకింది.

మార్కెట్ విలువ మదింపులో మార్పులు

లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)ను మదింపు చేయడంలో సెబీ తాజాగా నిబంధనలను పునర్వ్యవస్థీకరించింది. దీంతో ఇకపై రోజువారీ మార్కెట్ విలువ మదింపునకు బదులుగా ఆరు నెలల సగటును ప్రాతిపదికగా తీసుకోనున్నారు. దీని వలన సరైన విలువ మదింపునకు వీలుంటుందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఓఎన్‌జీసీ లాభం 'హై'జంప్



న్యూఢిల్లీ: ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. స్టాండెలోన్ నికర లాభం 19 రెట్లు ఎగసి రూ. 9,869 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో కేవలం రూ. 528 కోట్లు ఆర్జించింది. అయితే 2016–22 మధ్య పన్ను వివాదాలకు రూ. 9,235 కోట్లు కేటాయించడం(ప్రొవిజన్లు) 2022–23 క్యూ4లో లాభాలను దెబ్బతీసింది. కాగా.. ప్రస్తుత సమీక్షా కాలంలో చమురు ఉత్పత్తి 4 శాతం పుంజుకుని 4.71 మిలియన్ టన్నులకు చేరింది. ఇక గ్యాస్ ఉత్పత్తి 2 శాతంపైగా నీరసించి 4.95 బిలియన్ ఘనపు మీటర్లకు పరిమితంకాగా.. ఒక్కో ఎంబీటీయూకి 6.5 డాలర్లు చొప్పున విక్రయించింది. ఇక మొత్తం ఆదాయం 5 శాతం క్షీణించి రూ. 34,637 కోట్లను తాకింది. కాగా కంపెనీ షేరుకి రూ. 2.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇప్పటికే రూ. 9.75 డివిడెండ్ చెల్లించింది.

కొత్త రికార్డ్: చరిత్రలోనే అత్యధికంకాగా గతేడాది ఓఎన్‌జీసీ రూ. 40,526 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022–23లో రూ. 40,097 కోట్ల లాభం అందుకోగా.. తాజాగా మొత్తం ఆదాయం రూ. 1.38 లక్షల కోట్లకు చేరింది. విదేశీ అనుబంధ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్ 7.178 ఎంటీ చమురు, 3.34 బీసీఎం గ్యాస్‌ను ఉత్పత్తి చేసింది.

ఓఎన్‌జీసీ షేరు స్వల్ప లాభంతో రూ. 280 వద్ద ముగిసింది.

రుణాల్లో ముత్తూట్ ఫిన్‌కార్ప్ జోరు

న్యూఢిల్లీ: బ్యాంకింగేతర రుణ సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ రుణాల మంజూరులో కొత్త రికార్డు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ రుణాలు అంత క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023–24లో 18.6 శాతం ఎగసి రూ.61,703 కోట్లు నమోదయ్యాయి. నిర్వహణలో ఉన్న ఆస్తులు రూ.33,359 కోట్లుగా ఉన్నాయి. కన్సాలిడేటెడ్ నికరలాభం 62 శాతం దూసుకెళ్లి రూ.1,048 కోట్లకు చేరుకుంది. మార్చి త్రైమాసికంలో ఆదాయం 25.6% అధికమై రూ.1,197 కోట్లను తాకింది. మార్చి 31 నాటికి కస్టమర్ల సంఖ్య 14% పెరిగి 42.98 లక్షలు ఉంది. 81% మంది వినియోగదార్లు రూ.1 లక్ష లోపు రుణాలను తీసుకున్నారని సీఈవో షాజీ వర్గీస్ వెల్లడించారు. ముత్తూట్ ఫిన్‌కార్ప్‌ను 137 ఏళ్ల చరిత్ర కలిగిన ముత్తూట్ పప్పాచన్ గ్రూప్ ప్రమోట్ చేస్తోంది.

బీహెచ్‌ఈఎల్ నేలచూపు

క్యూ4లో నికర లాభం 25 శాతం క్షీణత


న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్(బీహెచ్‌ఈఎల్) గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం క్షీణించి రూ. 490 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా వ్యయాలు పెరగడం ప్రభావం చూపింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 658 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 8,339 కోట్ల నుంచి రూ. 8,417 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 7,412 కోట్ల నుంచి రూ. 7,794 కోట్లకు పెరిగాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 0.25 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి బీహెచ్‌ఈఎల్ నికర లాభం భారీగా క్షీణించి రూ. 282 కోట్లకు పరిమితమైంది. 2022–23లో రూ. 654 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 23,854 కోట్ల నుంచి రూ. 24,439 కోట్లకు ఎగసింది.

బీహెచ్‌ఈఎల్ షేరు బీఎస్‌ఈలో 3 % జంప్‌చేసి రూ. 319 వద్ద ముగిసింది.

జేఎస్‌డబ్ల్యు సిమెంట్ రూ.3,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: సిమెంట్ తయారీలో ఉన్న జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రాజస్తాన్‌లో నూతన ప్లాంటు నెలకొల్పనున్నట్టు మంగళవారం ప్రకటించింది. ఇందుకోసం రూ.3,000 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు వెల్లడించింది. ఈ నిధుల కోసం సొంత వనరులతోపాటు రుణం సమకూర్చుకుంటామని తెలిపింది. నాగౌర్ జిల్లాలో రానున్న ఈ కేంద్రంలో 3.3 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో క్లింకర్ యూనిట్, 2.5 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తారు. సిమెంట్ తయారీలో భాగంగా జనించే ఉష్ణం నుంచి విద్యుత్ తయారీకై 18 మెగావాట్ల పవర్ ప్లాంట్ సైతం నిర్మిస్తారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,000 మందికిపైగా ఉపాధి అవకాశాలు ఉంటాయని జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఎండీ పార్థ్ జిందాల్ తెలిపారు. రాజస్తాన్, హరియాణ, పంజాబ్, ఎన్‌సీఆర్ ప్రాంతంలోని కస్టమర్లకు చేరువ అయ్యేందుకు నూతన ప్లాంటు దోహదం చేస్తుందని చెప్పారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ కంపెనీ అయిన జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 19 మిలియన్ టన్నులు. దీనిని 60 మిలియన్ టన్నులకు చేర్చాలన్నది సంస్థ లక్ష్యం.

మైక్రోసాఫ్ట్‌తో కోఫోర్జ్ జోడీ



న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ కోఫోర్జ్ తాజాగా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపింది. ఇందులో భాగంగా వివిధ పరిశ్రమల కోసం జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిష్కారాలను అభివృద్ధి చేసేందుకు ఇన్నోవేషన్ హబ్‌ను స్థాపించనుంది. ఉత్పాదకత పెంపునకు, పరివర్తనను నడిపించేందుకు మైక్రోసాఫ్ట్ ప్లాట్‌ఫామ్‌పై పరిష్కారాలను రూపొందిస్తామని కోఫోర్జ్ మంగళవారం తెలిపింది.

చంద్రబాబు, లోకేశ్ పర్యటనల్లో గోప్యమెందుకు?

వారు ఏ దేశంలో ఉన్నారో ఎల్లో మీడియాలోనైనా చెప్పొచ్చు కదా?

- ఏ కోర్టు అనుమతితో బాబు విదేశాలకు వెళ్లాడు?
- అమెరికా రాలేదని ఆయన సొంత సామాజికవర్గమే చెబుతోంది
- ప్రజా జీవితంలో ఉన్న వారికి రహస్యాలు ఉండకూడదు
- విద్యా సంస్కరణలు, విద్యార్థుల సంఖ్యపై ఎల్లో మీడియా ఇంకా తప్పుడు రాతలు
- ఓటమి భయంతోనే పారిపోయారని వారిలాగా మేమనలేం
- జగన్ ఐదేళ్ల పాలనకు ప్రజలు ఆశీర్వదించి ఓట్లేశారు
- జూన్ 9న వైఎస్ జగన్ విశాఖలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారు
- ఫలితాల వరకు అందరూ సంయమనం పాటించాలి
- మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఎక్కడున్నారో ఎవరికీ తెలీడంలేదని.. ఆయనకంటే ముందే ఆయన కొడుకు లోకేశ్ మాయమైపోయాడని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. ప్రజా జీవితంలో ఉన్నవారు ఇలా రహస్యంగా వెళ్లిపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. వచ్చేనెల 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 175 స్థానాల్లోను ఘన విజయం సాధిస్తుందని బొత్స ధీమా వ్యక్తంచేశారు. తొమ్మిదో తేదీన తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నంలోనే సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని స్పష్టంచేశారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రి బొత్స మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ఎల్లో మీడియా కళ్లు మూసుకుని తప్పుడు రాతలు రాస్తోంది. నిన్న విద్యాశాఖ గురించి మళ్లీ అవే తప్పులు అచ్చోశారు. విద్య, వైద్య రంగాల్లో మా ప్రభుత్వం అమలుచేసిన సంస్కరణలను ఇంకా కొనసాగిస్తామని మా మేనిఫెస్టోలోనే పెట్టాం. త్వరలో అధికారంలోకి రాగానే ఎప్పటిలాగే పథకాలు కొనసాగిస్తాం. మేం అమలుచేసిన ఈ సంస్కరణలు బాగోలేనప్పుడు వాటిని రద్దుచేస్తామని ప్రతిపక్ష కూటమి వారి మేనిఫెస్టోలో ఎందుకు పెట్టలేదు? 2018–19 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారంటూ పచ్చమీడియా విషం కక్కుతోంది. నిజానికి, 2024–25 విద్యా సంవత్సరంలో మొత్తం 38,61,198 మంది విద్యార్థులతో క్లాసులు ప్రారంభం కానున్నాయి. కానీ, విద్యార్థులను తక్కువగా చూపి వాస్తవ విరుద్ధమైన కథనాలు రాయడం సిగ్గుచేటు.

ఎక్కడాలేనట్లుగా విద్యా సంస్కరణలు..

దేశంలోనే గొప్ప విద్యా సంస్కరణలు ఏపీలో కొనసాగుతున్నాయని అంతర్జాతీయ సంస్థల నివేదికలే చెబుతున్నాయి. ఏపీ విద్యార్థులను గ్లోబల్‌స్థాయిలో నిలపాలనే తపనతో ప్రభుత్వం నూతన విధానాలతో ముందుకెళ్తోంది. దేశంలో ఏ పోటీపరీక్ష జరిగినా.. ర్యాంకుల సాధనలో అధిక భాగస్వామ్యం మన విద్యార్థులకే దక్కాలనే దిశగా విద్యావ్యవస్థను నడిపిస్తున్నాం. వైఎస్ జగన్ సీఎం అయ్యాక రాష్ట్ర విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు తెచ్చారు. ఇంగ్లిష్ మీడియం బోధన, టోఫెల్ శిక్షణ, సీబీఎస్‌ఈ సిలబస్, బైజ్యూస్ కరిక్యులమ్, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం, వచ్చే ఏడాది నుంచి ఐబీ విధానం.. ఇలా ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టాం. అలాగే.. అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక వంటి పథకాలతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పించాం. విదేశాల్లో చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1.25 కోట్ల వరకు వెచ్చించడం దేశంలో ఎక్కడాలేదు. రానున్న కాలంలోనూ వీటిని మరింత మెరుగ్గా అమలుచేస్తాం.

అందరూ సంయమనం పాటించండి..

రాష్ట్ర రాజకీయాల్లో ఇంతకుముందెన్నడూ లేని విచిత్రమైన పరిస్థితులను చూస్తున్నాం. రాజకీయాల్లోకొచ్చాక నేను చాలా ఎన్నికలు చూశాను గానీ.. ఇప్పుడు జరుగుతున్న దాడులు, అల్లర్ల పరిస్థితిని ఏనాడూ చూడలేదు. ప్రధాన పార్టీల నేతలంతా విశ్రాంతి కోసం విదేశాలకు వెళ్లారు. ఆయా పార్టీల కేడర్ కూడా ఎన్నికల ఫలితాలొచ్చే దాకా సంయమనం పాటించాలి. ఇకనైనా ఈ దాడులు, అల్లర్లు ఆపాలి. సోషల్ మీడియాలో కూడా అనవసరంగా ట్రోలింగ్‌లు చెయ్యొద్దు.

మా పరిపాలనను ప్రజలు ఆశీర్వదించారు..

మేం ఎన్నికల మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంలా చూసుకుంటామనేది ప్రజలందరికీ నమ్మకం. గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో హామీలను ఎలా అమలుచేశాం, వచ్చే ఐదేళ్లకూ మా పని తీరు ఏంటనేది ఇప్పటికే ప్రజలకు అర్థమైంది. ప్రజల జీవన విధానంలో ఎలాంటి మార్పులు తెచ్చామో వారు కళ్లారా చూశారు. వారికి మంచి జరిగినందువల్లే సీఎం జగన్ కోరినట్లు ప్రజలంతా వారి ఓటును వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వేశారు. ఇక మా ప్రభుత్వ సంస్కరణలతో గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. కొనుగోలు శక్తి పెరిగింది. జూన్ 4 ఫలితాలతో జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా విశాఖలో ప్రమాణ స్వీకారం చేస్తారు.

పీకే ఏమీ బ్రహ్మ కాదు..

ప్రశాంత్ కిశోర్ ఏమీ సృష్టికర్త బ్రహ్మ కాదు. ఆయనది వ్యాపార ధోరణి. మేం చేస్తున్న ప్రజాభివృద్ధి విధానాలకు విరుద్ధంగా ఉండడంతో ఆయన్ను దూరం పెట్టాం. మాకెలాంటి ఎన్నికల వ్యూహకర్తలతో పనిలేదు. ఇలాంటివన్నీ ఎన్నికలకు చిట్కాలే తప్ప శాశ్వతం కాదు. మా అధినేత ప్రజలకు ఏం చేయాలో అదే చేశారు. ఇలాంటి ప్రగతి మాత్రమే శాశ్వతం.

ఎవరికీ చెప్పకుండా బాబు ఎక్కడికి వెళ్లారు?

ఇక ఎన్నికలు ముగిసి, ఫలితాల వెల్లడికి సమయం ఉన్నందున అన్ని పార్టీల అధినేతల్లాగే మా అధినేత వైఎస్ జగన్ కూడా కుటుంబ సమేతంగా లండన్ వెళ్లారు. కానీ, ఆయన్ను ఎయిర్‌పోర్టులో అడ్డుకోవాలని టీడీపీ ఎన్‌ఆర్‌ఐ లోకేశ్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో మెసేజ్‌లు పంపి.. అక్కడ హడావిడి చేయడమేంటో ఎవరికీ అర్థంకాని విషయం. పైగా, జగన్ టూర్ మీద రకరకాల ట్రోలింగ్‌లు నడిపారు. మా నేత అందరికీ తెలిసేలా లండన్‌కు వెళ్లారు. మరి, చంద్రబాబు ఎక్కడికెళ్లారు? ఆయన విదేశీ పర్యటనకు కోర్టు అనుమతి తీసుకుని వెళ్లాలి కదా? ఎవరికీ చెప్పాపెట్టకుండా వెళ్లడమేంటి? అసలింతకు ఆయన ఏ దేశం వెళ్లాడో ఎవరికీ తెలీడంలేదు. టీడీపీకి అనుబంధంగా నడిచే తానా సంస్థ చంద్రబాబు అమెరికా రాలేదంటోంది. ఇటు లండన్ వాళ్లు తమ వద్దకు రాలేదని చెబుతుంటే.. మరి, చంద్రబాబు ఏ దేశం వెళ్లినట్లు? చంద్రబాబు పరిస్థితి ఇలా ఉంటే.. ఆయన కొడుకు లోకేశ్ తండ్రి కంటే మూడ్రోజులు ముందే విదేశాలకెళ్లాడంట. ఇక, సెలబ్రిటీ నాయకుడు కూడా ఏదో దేశానికి అవార్డు కోసం పోతున్నాడని తెలిసింది. ఎన్నికలయ్యాక ఇప్పుడు ఓటమి భయంతో చంద్రబాబు శాశ్వతంగా ఆంధ్రాను వదిలి అమెరికానో.. మరే దేశానికో పారిపోయాడని వాళ్ల మాదిరిగా మేం అనలేం. అది మా విధానం కాదు.

అంతకు మించి అరాచకం!

▶ మొదటి పేజీ తరువాయి

కుట్రలకు అద్దంపడుతోంది. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అలజడులు రేకెత్తించడం, జూన్ 4న ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద బీభత్సం సృష్టించేందుకు భారీ కుట్రలకు తెర తీశాయి. పచ్చ ముఠాలు, అల్లరి మూకలు విసురుతున్న సవాల్‌ను సమర్థంగా తిప్పికొట్టేందుకు పోలీసు శాఖ అప్రమత్తమైంది. పోలింగ్ సందర్భంగా పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో టీడీపీ గూండాలు అరాచకాలకు తెగబడి భయానక వాతావరణాన్ని సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ మూడు జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆయా చోట్ల విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు కార్డన్ – సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ పటిష్ట నిఘా ఏర్పాట్లు చేశారు. ముఖ్యమైన కూడళ్లు, గ్రామ శివారు ప్రాంతాలు, అనుమానిత ప్రదేశాల్లో పోలీసు శాఖసోదాలు నిర్వహిస్తోంది. నేర చరితులను అదుపులోకి తీసుకుంటోంది. అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలను, రికార్డులు లేని వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేపట్టింది.

బదిలీలతో అల్లరి మూకల అరాచకం..

రాష్ట్రంలో పోలింగ్ రోజు, అనంతరం టీడీపీ రౌడీమూకలు యథేచ్ఛగా విధ్వంస కాండకు తెగబడ్డాయి. చంద్రబాబు, పురందేశ్వరిఈసీపై ఒత్తిడి తెచ్చి పల్నాడు, ప్రకాశం, ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పోలీసు అధికారులను బదిలీ చేయించి తమకు అనుకూలమైన వారిని నియమించుకుని పన్నాగాన్ని అమలు చేశారు. ప్రధానంగా పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో టీడీపీ రౌడీమూకలు కర్రలు, కత్తులు, రాడ్లతో విరుచుకుపడటంతోపాటు బాంబు దాడులకు కూడా తెగబడి బీభత్సం సృష్టించాయి.

గూండాగిరీ అంతా పచ్చముఠాదే

పోలింగ్‌కు ముందు, అనంతరం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడినవారిని గుర్తించి పోలీసు శాఖ కఠిన చర్యలు చేపడుతోంది. ఎన్నికల ముందు నమోదైన కేసులతో ప్రమేయం ఉన్న 1,522 మందిని గుర్తించి కొందరిని అరెస్ట్ చేసింది. మిగిలిన వారికి 41 సీఆర్‌పీసీ నోటీసులు జారీ చేసింది. వీరిలో దాదాపు 1,300 మంది టీడీపీ వర్గీయులే కావడం గమనార్హం. ఇక పోలింగ్ రోజు దాడులు, ఘర్షణల కేసుల్లో ప్రమేయం ఉన్న 2,790 మందిని గుర్తించగా కొందరిని అరెస్టు చేశారు. మిగిలిన వారికి 41 సీఆర్‌పీసీ కింద నోటీసులిచ్చారు. పోలింగ్ రోజున అరాచకాలకు తెగబడ్డ వారిలో దాదాపు 2,400 మంది టీడీపీకి చెందిన వారే కావడం ఆ పార్టీ కుట్రలను బట్టబయలు చేస్తోంది. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 85 మందిపై హిస్టరీ షీట్లను తెరవగా వీరిలో 58 మంది టీడీపీ వర్గీయులే ఉన్నారు. టీడీపీకి చెందిన ముగ్గురిపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించగా మరో ఇద్దరిని జిల్లాల నుంచి బహిష్కరించారు. పోలీసుశాఖ గత మూడు రోజులుగా 301 సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ – సెర్చ్ ఆపరేషన్ల ద్వారా విస్తృతంగా సోదాలు నిర్వహించింది. ఎటువంటి పత్రాలు లేని 1,104 వాహనాలను జప్తు చేసింది. 482 లీటర్ల సారాయి, 3,332 లీటర్ల అక్రమ మద్యం, 436 లీటర్ల ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా రవాణా చేసిన మద్యాన్ని స్వాధీనం చేసుకుంది.

అమలులో నిషేధాజ్ఞలు

స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలున్న నగరాలు, పట్టణాల్లో ఓట్ల లెక్కింపు ముగిసేవరకూ పోలీసు శాఖ నిషేధాజ్ఞలను విధించింది. 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 144 అమలులో ఉంటాయని ప్రకటించింది. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించకూడదని స్పష్టం చేసింది. కర్రలు, కత్తులు, రాడ్లు, ఇతర ఆయుధాలతో సంచరించకూడదని హెచ్చరించింది. పెట్రోల్ బంకుల్లో విడిగా పెట్రోల్, డీజిల్ విక్రయించకూడదని ఆదేశించింది. అసత్య వార్తలు, ఫేక్ న్యూస్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేయకూడదని పేర్కొంది.

ప్రజలు సహకరించాలి: డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

అసాంఘిక శక్తులను కఠినంగా అణచివేస్తాం. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. అందుకు ప్రజలు కూడా సహకరించాలి. ఎలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దు. సంయమనం పాటించాలి. చట్టవ్యతిరేక, అసాంఘిక శక్తుల కదలికల గురించి టోల్ ఫ్రీ నంబర్లు 100, 112లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారమివ్వాలి.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత

ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద టీడీపీ మూకలు అరాచకాలకు తెగబడే ప్రమాదం ఉన్నందున పటిష్ట బందోబస్తు కల్పించారు. 350 స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిన ఈవీఎంలకు కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు 24/7 మూడంచెల భద్రతతో పహారా కాస్తున్నారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులకు బాడీ వార్న్ కెమెరాలను సమకూర్చారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద వెయ్యికి పైగా అధునాతన ఫేస్ రికగ్నైజేషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేసి జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్), ఎస్పీ/ పోలీస్ కమిషనర్లు పాసులు జారీ చేసిన వ్యక్తులను మాత్రమే అనుమతిస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలనకు వచ్చిన అధికారులు, సిబ్బంది వివరాలను సమోదు చేస్తున్నారు. వీడియోగ్రఫీ ద్వారానే లోపలికి అనుమతిస్తున్నారు. అన్ని స్ట్రాంగ్‌రూమ్‌లను అనుసంధానిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో పటిష్ట నిఘా కోసం స్ట్రాంగ్ రూమ్‌ల చుట్టూ ఫ్లడ్ లైట్లను అమర్చారు. స్ట్రాంగ్‌రూమ్‌లు ఉన్న ప్రదేశానికి 2 కి.మీ. పరిధిని రెడ్ జోన్‌గా ప్రకటించి డ్రోన్లు, బెలూన్లను ఎగురవేయడాన్ని నిషేధించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల నుంచి ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాలకు సురక్షితంగా తరలించే ప్రక్రియను ఖరారు చేశారు.

క్లుప్తంగా...

రేపు పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్

సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి వెల్లడి



సాక్షి, అమరావతి: పాలిసెట్–2024 ప్రవేశాల ప్రక్రియను ఈనెల 23 నుంచి ప్రారంభించనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళగిరిలోని సాంకేతిక విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం పాలిసెట్ ప్రవేశాలకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు ప్రక్రియకు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు పది రోజుల పాటు అవకాశం కల్పిస్తామన్నారు. 27 నుంచి జూన్ 3 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 31 నుంచి జూన్ 5 వరకు ఆప్షన్ల నమోదు, జూన్ 5న ఆప్షన్లు మార్పు చేసుకోవచ్చునన్నారు. జూన్ 7న తుది సీట్ల కేటాయింపును పూర్తి చేస్తామని వివరించారు. జూన్ 10 నుంచే తరగతులు ప్రారంభం అవుతాయని, సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 14లోగా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు. విద్యార్థులు అన్ని ధ్రువపత్రాలతో ప్రవేశాల కౌన్సెలింగ్‌కు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ ఏడాది పాలిసెట్‌కు 1,42,035 మంది విద్యార్థులు హాజరుకాగా 1,24,430 (87.61 శాతం) అర్హత సాధించారన్నారు. సమావేశంలో సాంకేతిక విద్య శాఖ జేడీ వెలగా పద్మారావు, అదనపు కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు పాల్గొన్నారు.

సీబీఎస్‌ఈ బోధనపై ముగిసిన శిక్షణ

సాక్షి, అమరావతి: రానున్న విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రభుత్వ సీబీఎస్‌ఈ పాఠశాలల్లో విద్యా బోధనను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీబీఎస్‌ఈ సిలబస్‌ను బోధించే 8,224 మంది ఉపాధ్యాయులకు రెండు విడతల్లో శిక్షణనిచ్చింది. అన్ని జిల్లా కేంద్రాల్లో ఈనెల 17 నుంచి మంగళవారం వరకు సబ్జెక్టుల వారీగా నిపుణులతో నిర్మాణాత్మక బోధనపై శిక్షణనిచ్చారు. పేద విద్యార్థులకు సీబీఎస్‌ఈ విద్యను ఉచితంగా అందించాలన్న లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 1,000 ప్రభుత్వ పాఠశాలలను సీబీఎస్‌ఈకి అనుబంధంగా మార్చింది. దీంతో 2024–25 విద్యా సంవత్సరంలో 86 వేల మంది విద్యార్థులు సీబీఎస్‌ఈ బోర్డు పరీక్షలకు హాజరు కానున్నారు. బోధనలో సమర్థ విధానాలు పాటించేందుకు వీలుగా ఉపాధ్యాయులకు నైపుణ్య శిక్షణనిచ్చారు. ఇంగ్లిష్, బయాలజీ, సోషల్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై జరిగిన ఈ శిక్షణలో రాష్ట్ర వ్యాప్తంగా 8,224 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి కన్నూ
పోస్టల్ బ్యాలెట్ ఓట్లపైనే..

2019 ఎన్నికల్లో మొత్తం పోలైన ఈ ఓట్లలో ఐదో వంతు చెల్లనివే

- అప్పట్లో 2.95 లక్షల పోస్టల్ ఓట్లు నమోదైతే అందులో 56,545 చెల్లని ఓట్లు
- ఈసారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా 4.44 లక్షల మంది ఓటు
- అందులో చాలాచోట్ల గెజిటెడ్ అధికారి సంతకం లేకుండా ఓట్లు వేసినట్లు అనుమానాలు
- దీంతో చెల్లని ఖాతాలోకి ఎన్ని వెళ్తాయోనని రాజకీయ వర్గాల్లో చర్చ



సాక్షి, అమరావతి : గతవారం రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన ఈ ఓట్లలో అత్యధికం చెల్లని ఓట్లుగా మిగిలిపోవడంతో ఈసారీ అలాంటి పరిస్థితి ఉంటుందా.. ఒకవేళ ఉంటే ఎంతమేర ఉంటుందనే దానిపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం.. గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 2,95,003 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ రూపంలో తమ ఓటు హక్కును వినియోగించుకోగా, అందులో ఏకంగా 56,545 ఓట్లు చెల్లని ఓట్లుగా గుర్తించారు. అంటే.. ఆ ఎన్నికల్లో మొత్తం పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో 19.17 శాతం (దాదాపు ఐదో వంతు) ఓట్లు చెల్లనవిగా మిగిలిపోయాయి. ఇప్పుడు జరిగిన ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ప్రకటించిన వివరాల ప్రకారం 4,44,218 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కానీ, గత ఐదేళ్ల కాలంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులతో పాటు వివిధ శాఖల్లో ఉద్యోగ నియామకాలు పెద్ద సంఖ్యలో జరిగాయి. ఇలా కొత్తగా ఉద్యోగాల్లో చేరిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో అత్యధికులు బీఎల్వోలుగానో లేదంటే ఇతర రూపంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. దీంతో 2019 ఎన్నికలంటే దాదాపు 50 శాతం అధిక సంఖ్యలో ఈసారి పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో పెరుగుదల కనిపించింది. అయితే, ఇటీవల కొన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై అందజేసిన వినతిపత్రాలతో ఈసారీ అధిక సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లని పరిస్థితే ఉంటుందా అన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే.. నిబంధనల ప్రకారం బ్యాలెట్ పత్రంపై గెజిటెడ్ అధికారి సంతకం లేకపోయినా ఆ ఓటును చెల్లని ఓటుగా కాకుండా లెక్కింపులోకి తీసుకోవాలంటూ ఆయా పార్టీలు తమ వినతిపత్రంలో విజ్ఞప్తి చేశాయి. దీంతో నమోదైన 4.44 లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో నిబంధనల ప్రకారం గెజిటెడ్ అధికారి సంతకంతో ఎన్ని నమోదయ్యాయి.. ఎన్నింటిపై సంతకంలేకుండా ఉన్నాయనే దానిపై ఇప్పుడు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతుంది.

పవన్ ఏ దేశానికి వెళ్లారు?

- పవన్ పర్యటనపైనా రాజకీయ వర్గాల్లో చర్చ
- 14న ప్రధాని మోదీ నామినేషన్‌కు పవన్ హాజరు
- అక్కడి నుంచి హైదరాబాద్ రాక
- ఆ తర్వాత ఎవరికీ అందుబాటులో లేని పవన్
- రష్యా లేదా దుబాయ్ వెళ్లి ఉంటారంటున్న పార్టీ వర్గాలు



సాక్షి, అమరావతి : ఎన్నికల పోలింగ్ అనంతరం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు విదేశాలకు వెళ్లిపోయారు. ఆయన ఎక్కడకు వెళ్లారన్నది స్పష్టత లేకపోవడంతో రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగింది. తాజాగా చంద్రబాబుకు దత్తపుత్రుడిగా పేరుపడ్డ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా రాష్ట్రంలో, హైదరాబాద్‌లో ఎక్కడా కనిపించకపోవడం ప్రజలతోపాటు సొంత పార్టీలోనూ చర్చకు దారితీసింది. ఆయన ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్నారంటూ పార్టీ వర్గాలు చెబుతున్నప్పటికీ, ఎక్కడకు వెళ్లారన్నదీ వారికీ తెలియక సతమతమవుతున్నారు. ఈ నెల 13న మంగళగిరిలోని ఓటు వేసిన పవన్ మరుసటి రోజు 14వ తేదీన ఉత్తరప్రదేశ్‌లో వారణాసి లోక్‌సభ నియోజకవర్గానికి ప్రధాని నరేంద్ర మోదీ నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ తర్వాత వారణాసి నుంచి నేరుగా హైదరాబాద్ వచ్చారు. అప్పటి నుంచి మంగళగిరి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గానీ, హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గానీ పార్టీ నాయకులెవరికీ అందుబాటులోకి రాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన రష్యా లేదా దుబాయ్ వెళ్లి ఉంటారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. చంద్రబాబు తరహాలోనే పవన్ కూడా తన విదేశీ పర్యటనపై గోప్యత పాటించడంతో రాజకీయవర్గాల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నాగబాబు 'ఎక్స్' ట్వీట్ పెను దుమారం రేపినా..

పోలింగ్ అనంతరం పవన్ సోదరుడు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు సోషల్ మీడియా 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఓ ట్వీట్ మెగా కుటుంబంలో, జనసేన పార్టీలో పెద్ద దుమారాన్నే రేపింది. దీనిపైనా పవన్ నుంచి ఎటువంటి స్పందన లేదు. పోలింగ్ ముగిసిన వెంటనే నాగబాబు ఎక్స్‌లో 'మాతో ఉంటూ ప్రత్యర్థులకి పని చేసేవాడు మా వాడైనా పరాయి వాడే. మాతో నిలబడే వాడు పరాయివాడైనా మా వాడే..' అంటూ ట్వీట్ చేశారు. మెగా – అల్లు ఉమ్మడి కుటుంబానికి చెందిన హీరో అల్లు అర్జున్ నంద్యాల వెళ్లి తన మిత్రుడు, అక్కడి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా రవికిషోర్‌రెడ్డికి మద్దతు ప్రకటించడంతో ఆయన్ని ఉద్దేశించి నాగబాబు ఈ ట్వీట్ చేశారంటూ పెద్ద దుమారం రేగింది. ఆ ట్వీట్‌పై అల్లు అర్జున్ అభిమానులు సోషల్ మీడియా వేదికగానే నాగబాబుపై తీవ్రంగా ప్రతిస్పందించారు. దీంతో నాగబాబు తన ఎక్స్ అకౌంట్‌ను ఒక రోజు బ్లాక్ చేసి, రెండో రోజు ఆ ట్వీట్‌ను డిలీట్ (తొలగించానంటూ) చేశానంటూ ప్రకటించారు. ఈ వ్యవహారంపై పవన్ స్పందించకపోవడంపై పార్టీలో పెద్ద చర్చే జరిగింది.

దారి మళ్లనున్న తుపాను!

▶ మొదటి పేజీ తరువాయి

బంగాళాఖాతం సుమారు వెయ్యి కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంటుంది. అంటే రాష్ట్రానికి వెయ్యి కిలోమీటర్ల దూరంలోనే వాయుగుండం/తుపాను బంగ్లాదేశ్ వైపు మళ్లుతుండడం వల్ల దాని ప్రభావం ఏపీపై ఉండదు. అదే మధ్య బంగాళాఖాతంలో కాకుండా వాయవ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి ఉంటే రాష్ట్రంలో భారీ వర్షాలకు ఆస్కారం ఉండేదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

మళ్లీ కొన్నాళ్లు అధిక ఉష్ణోగ్రతలు..

రాష్ట్రంలో వారం రోజులుగా ఉపరితల ఆవర్తనాలు, ద్రోణుల ప్రభావంతో పలుచోట్ల మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. వడగాడ్పులు కూడా తగ్గాయి. తాజా అంచనాల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను గాలిలో తేమను బంగ్లాదేశ్ వైపు లాక్కుపోతుంది. దీనివల్ల మళ్లీ పగటి ఉష్ణోగ్రతలు 3 – 4 డిగ్రీల వరకు పెరుగుతాయని, కొన్ని ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

మూడు రోజులు తేలికపాటి వానలు

ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతం మీదుగా సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. బుధవారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. శుక్రవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గంటకు 30 – 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

'రాయదుర్గం'లో ఎన్‌ఐఏ సోదాలు!

- రిటైర్డ్ హెచ్‌ఎం అబ్దుల్ సాహెబ్ కుమారుడు సుహేల్ విచారణ
- ఉగ్రవాదులతో సంబంధాలే కారణం?
- అరెస్ట్.. బెంగళూరుకు తరలింపు



రాయదుర్గం: రాయదుర్గం పట్టణంలోని ఉర్దూ (ఏఏఐ) పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ సాహెబ్ నివాసంలో మంగళవారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) సోదాలు నిర్వహించడం అనంతపురం జిల్లాలో కలకలం సృష్టించింది. మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటలకే రాయదుర్గంలోని నాగులబావివీధిలో ఉన్న అబ్దుల్ సాహెబ్ ఇంటికి చేరుకున్న ఎన్‌ఐఏ అధికారులు ఉదయం తొమ్మిది గంటల వరకూ ఇంట్లోనే విచారణ చేశారు. అనంతరం అబ్దుల్ సాహెబ్ కుమారుడు సుహేల్‌ను అదుపులోకి తీసుకుని పటిష్ట పోలీసు భద్రత నడుమ రాయదుర్గం అర్బన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ అతని వాట్సాప్ చాటింగ్, ల్యాప్‌ట్యాప్‌లో ఫైళ్లు, ఆన్‌లైన్ లావాదేవీలపై మరో మూడు గంటలపాటు క్షుణ్ణంగా విచారించారు. అనంతరం సుహేల్ను అరెస్టు చేసి బెంగళూరు ఎన్‌ఐఏ కార్యాలయానికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా అబ్దుల్ సాహెబ్ ఇంట్లో విచారణ సమయంలో ఆ వీధిలోకి ఎవరూ రాకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ..

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ సాహెబ్‌కు సుహేల్, మాతిన్ సంతానం. పెద్ద కుమారుడు సుహేల్ బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. మాతిన్ స్థానికంగా బిస్కెట్ల వ్యాపారం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితమే తన మకాంను హైదరాబాద్‌కు మార్చిన సుహేల్ తరచూ బెంగళూరు వెళ్లి వచ్చేవాడు. నెలరోజుల క్రితమే బళ్లారికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్న సుహేల్ అప్పటి నుంచి రాయదుర్గంలోని తన స్వగృహంలోనే ఉంటున్నాడు.

కేఫ్‌లో బాంబు పేలుడుపై అనుమానాలు..

కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో ఇటీవల రద్దీగా ఉండే రామేశ్వరం కేఫ్‌లో బాంబు బ్లాస్ట్ కలకలం రేపింది. ఈ ఘటనతో ఆ రాష్ట్రం మొత్తం ఉలిక్కిపడింది. సీసీ ఫుటేజీ ఆధారంగా 30 ఏళ్ల వయసు కలిగిన యువకుడు కేఫ్‌లోని హ్యాండ్‌వాష్ వద్ద ఉన్న చెత్తబుట్టలో ఒక బ్యాగు పడేసి వెళ్లినట్లు ఎన్‌ఐఏ అధికారులు గుర్తించారు. అది పేలడంతోనే ప్రమాదం జరిగినట్లు తేల్చారు. దీనికి ఐఈడీ బాంబే కారణమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ప్రధాన నిందితుడితో రాయదుర్గం పట్టణానికి చెందిన సుహేల్ వాట్సాప్ చాటింగ్ చేసినట్లు ఎన్‌ఐఏ అధికారులు గుర్తించారు. ఇరువురి సంబంధాలపై మరింత లోతుగా విచారణ చేసేందుకే సుహేల్‌ను అరెస్టు చేసి బెంగళూరుకు తరలించినట్లు తెలిసింది. అయితే నిందితుడు ఎక్కడా మీడియా కంటపడకుండా పోలీసులు జాగ్రత్త వహించారు.

ఎన్‌ఐఏ అదుపులో వికారాబాద్ పండ్ల వ్యాపారి?

వికారాబాద్: బెంగళూరు రామేశ్వరం కేఫ్‌లో ఈ ఏడాది మార్చి 1న జరిగిన పేలుడు కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఐఏ అధికారులు మంగళవారం తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. వికారాబాద్‌లో ఒక పండ్ల వ్యాపారిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఇతని స్వస్థలం పూణే అని, నాందేడ్‌లోనూ పండ్ల వ్యాపారం చేస్తున్నట్టు తెలిసింది. అతడిపై కర్ణాటకలో పలు కేసులు నమోదయ్యాయని, ఒక కేసులో శిక్ష సైతం పడినట్టు ఎన్‌ఐఏ అధికార వర్గాల తెలిపాయి.

పలు రైళ్లు రద్దు



సాక్షి, హైదరాబాద్: ట్రాక్ నిర్వహణ కారణాల దృష్ట్యా పలురైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. ఈ మేరకు కాచిగూడ–రాయ్‌చూర్ (07477/07478), సికింద్రాబాద్–గుంటూరు (17202) ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు రద్దు కానున్నాయి. దౌండ్–నిజామాబాద్ (11409), నిజామాబాద్–పండరీపూర్ (01413) రైళ్లు నిజామాబాద్–ముద్ఖేడ్ మధ్య పాక్షికంగా రద్దు కానున్నాయి.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి సౌరభ్‌గౌర్

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి సౌరభ్‌గౌర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 861 పరీక్ష కేంద్రాల్లో 5,03,459 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. మొదటి సంవత్సరం జనరల్ ఇంటర్‌లో 3,46,393 మంది, ఒకేషనల్‌లో 19,479 మంది, రెండో సంవత్సరం జనరల్ ఇంటర్‌లో 1,21,545 మంది, ఒకేషనల్‌లో 16,042 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇతర వివరాల కోసం 08645–277702, 18004251531 నంబర్లను సంప్రదించాలని సూచించారు. పరీక్షల షెడ్యూల్ వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

కొండెక్కిన కోడి

చికెన్ ధరలు ప్రియం • కిలో రూ.240 నుంచి రూ.280
డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడమే కారణం



హిందూపురం/ హిందూపురం అర్బన్: ఈ వేసవిలో కనీవినీ ఎరుగని రీతిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు కోళ్ల పెంపకంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో కోడి ధర కొండెక్కి కూర్చుంది. అంతకంతకూ పెరుగుతూ రెండు వారాల వ్యవధిలోనే వంద రూపాయల మేర ధర పెరిగిపోయింది. రూ.160 ఉన్న చికెన్ ప్రస్తుతం ప్రాంతాన్ని బట్టి.. పోటీని బట్టి రూ.240 నుంచి రూ.280కి చేరింది. పెరిగిన ధరల నేపథ్యంలో పలు కంపెనీలు సీడ్ ఇచ్చి ఫాం నిర్వాహకుల ద్వారా కోళ్ల పెంపకం చేపట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ఇప్పుడు సీడ్ (కోడి పిల్లలు) తీసుకుని పెంచితే అవి 45 రోజులకు చేతికొస్తాయి.

చికెన్‌కు డిమాండ్ ఎందుకంటే..

అందరికీ అందుబాటు ధరలో లభించే చికెన్ వైపే మాంసాహారులు మొగ్గు చూపుతున్నారు. మేక, గొర్రె, పొట్టేళ్లు కిలో రూ.800 దాకా ఉంటోంది. దీంతో చాలామంది అటువైపు వెళ్లలేక చికెన్‌నే తీసుకుంటున్నారు. జిల్లాలో 150 కోళ్ల ఫాంలు ఉన్నాయి. హిందూపురం, పెనుకొండ, కదిరి, మడకశిర, గోరంట్ల తదితర ప్రధాన పట్టణాల్లో 2,200, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో మరో 1,100 చొప్పున జిల్లా అంతటా 3,300 దాకా చికెన్ సెంటర్లు నడుస్తున్నాయి. రోజూ 30 టన్నులకు పైగా కోళ్లు అమ్ముడుపోతున్నాయి. ఇక ఆదివారాలు, పండుగ రోజుల్లో 40 టన్నుల వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

▶ కిలో లైవ్ కోడి రూ.150కి కొన్న వ్యాపారి రిటైలర్‌కు రూ.165–170 మధ్య అమ్ముతున్నారు. రిటైలర్ కోడిశుభ్రం చేసి కిలో రూ. 250 నుంచి రూ.280 మధ్య వినియోగదారులకు విక్రయిస్తున్నారు. దుకాణాల బాడుగ, గ్యాస్, క్లీనింగ్, కూలీల ఖర్చు పోను కిలోపై రూ.20–30 మిగులుతోందని చికెన్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు.

కొత్త బ్యాచ్ వస్తేనే తగ్గేది

కోళ్ల ఫాంలలో 45 రోజుల పాటు పెంచిన కోళ్లు ఇప్పుడు 2 కిలోల వరకు బరువు తూగుతున్నాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలకు కోళ్లు చనిపోతుంటాయి. అందుకే ఈ సీజన్‌లో ధరలు కాస్త ఎక్కువగానే ఉంటాయి. ధరల పెరుగుదలతో వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి. ప్రతి కిలోపై ధరలు పెరిగినా, తగ్గినా మాకు రూ.20–30 ఆదాయం వస్తుంది.

– బాబాజాన్, చికెన్ వ్యాపారి, హిందూపురం

దిగుమతి తగ్గింది



ప్రస్తుత వేసవిలో డిమాండ్‌కు సరిపడే విధంగా కోళ్ల దిగుమతి కావడంలేదు. కంపెనీ వారు కూడా ఫారాల్లో ముందస్తుగా బుక్ చేసుకుంటే గానీ అవసరమైనన్ని కోళ్లు అందించలేకపోతున్నారు. అధికశాతం ఫారాలన్నీ కంపెనీ ఆధీనంలోనే ఉండటం, కొత్తబ్యాచ్‌ల పెంపకం, సప్లయ్, ధర పెరుగుదల అన్నీ వారి నిర్ణయం మేరకే ఉంటాయి. మార్చి నుంచి కొత్త బ్యాచ్ కోడి పిల్లలు వేస్తుంటారు. అవిపెరిగి మార్కెట్‌లో వచ్చేసరికి రెండు నెలలవుతుంది. దీనివల్ల మే, జూన్ మాసంలో చికెన్ ధరలు కిలో రూ.300కు చేరే అవకాశాలు లేకపోలేదు. జూలై నుంచి కొత్త బ్యాచ్ (కోళ్లు) మార్కెట్‌కు వస్తే ధరలు తగ్గుముఖం పడుతాయి.

– రవికుమార్, చికెన్ వ్యాపారి, హిందూపురం

వినియోగం పెరిగింది

చికెన్ వినియోగం బాగా పెరిగింది. గొర్రె మాంసం ధరలు పెరిగాయని చాలామంది చికెన్‌నే ఇష్టపడుతున్నారు. చిన్న పిల్లలు కూడా చికెన్ తినడానికే ఆసక్తి చూపుతున్నారు. అయితే డిమాండ్‌కు తగిన మేర కోళ్ల సప్లయ్ లేకపోవడంతో ధరలు పెరిగిపోతున్నాయి. మరోనెల రోజులపాటు ఇలాగే ఉంటుంది.

– యుసూఫ్, హిందూపురం

తాటి ముంజెలు... లాభాలు బోలెడు

వేసవి వచ్చిదంటే ప్రతి ఒక్కరూ ఇష్టపడి తినే వాటిలో తాటి ముంజలు ఒక్కటి. శరీరాన్ని చల్లబరిచే గుణం ఉండడంతో పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టపడతారు. ఎండలు తీవ్రంగా ఉన్నపుడు ఇవి తీసుకుంటే శరీరాన్ని డీ హైడ్రేషన్ బారి నుండి కాపాడుతుందని వారి నమ్మకం. ఓ మోస్తరు వర్షం కురుస్తున్నా.. వేడి తగ్గకపోవడంతో తాటి ముంజలు కొనేందుకు జనం ఎగబడుతున్నారు. ఇది ఆసరాగా పల్లెల నుంచి పెద్ద ఎత్తున తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నారు.



కడప అగ్రికల్చర్–కడప కోటిరెడ్డి సర్కిల్: జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నప్పటికీ.. వేడి సెగలు తగ్గడం లేదు. జనం ఇంకా ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. వేసవి తాపం నుంచి సేద తీరేందుకు తాటి ముంజలు కొనుగోలు చేస్తున్నారు. తాటి బోదను కలపగా, ఆకులను ఇళ్ల పైకప్పు, విసనకర్రలుగా వినియోగిస్తారు. అయితే గత కొద్ది రోజులుగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోలో తాటికాయలు తీసుకువచ్చి కడప నగరంలోని ప్రధాన కూడళ్లలో విక్రయిస్తున్నారు. పైగా వీటితో అనేక లాభాలున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. డజన్ తాటి ముంజల ధర రూ.100 పలుకుతోంది. రోజుకు 50–70 డజన్ల వరకు అమ్ముతున్నట్లు విక్రయదారులు చెబుతున్నారు.

తాటిముంజెలతో లాభాలివే..

- తాటి ముంజల్లో అధిక శాతం తేమ ఉండడంతో శరీర ఉష్ణోగ్రత తగ్గిస్తుంది.
- తక్కువ క్యాలరీలు, ఎక్కువ కాల్షియం, ప్రొటీన్లు, ఐరన్, ఇతర విటమిన్లు ఉంటాయి.
- వేడిమితో బాధపడేవారంతా ఇవి తీసుకుంటే డీ హైడ్రేషన్ నుంచి రక్షిస్తుంది.
- ఎసిడిటి, మలబద్ధకం, అల్సర్ సమస్యలను నివారిస్తూనే జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.
- వేసవిలో దద్దుర్లు, అలర్జీ వస్తుంటుంది. ముంజెలు తిన్నా, గుజ్జును రాసుకున్నా చర్మం పొడిబారే సమస్యను నివారిస్తాయి.

వంద గ్రాములు తాటిముంజెల నుంచి అందే పోషకాలివి...

నీరు	- 87.6 గ్రాములు
శక్తి	- 43 క్యాలరీలు
పీచు	- 1 గ్రాము
పిండి పదార్థాలు	- 10.9 గ్రాములు
కొవ్వులు	- 0.1 గ్రాము
ఐరన్	- 1 గ్రాము
ప్రొటీన్లు	- 0.8 గ్రాములు
కాల్షియం	- 27 మిల్లీగ్రాములు
ఫాస్పరస్	- 30 మిల్లీగ్రాములు
మెగ్నీషియం	- 10 మిల్లీగ్రాములు
సోడియం	- 20 మిల్లీగ్రాములు
ఫోటాషియం	- 150 మిల్లీగ్రాములు
విటమిన్ - సి	- 5 మిల్లీగ్రాములు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

వృద్ధులకు వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్లు

రాయచూరు రూరల్: నగరంలో సీనియర్ సిటిజన్లకు వైద్య శిబిరాలను నిర్వహించారు. మంగళవారం ఆశాపూర్ రోడ్డులోని లలిత సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ ఆఫ్ పీపుల్ విత్ డిసేబిలిటీ సంస్థ సహకారంతో 35 మంది దివ్యాంగులకు చికిత్సలు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్, వైద్యులు చంద్రకళ, అమీనా, లలిత, మారెప్ప నాయక్‌లున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాయచూరు రూరల్ : నగరంలో మంగళవారం బెట్టదూరు ఆస్పత్రి వద్ద గుర్తు తెలియని శవం మృతదేహం లభించింది. సుమారు 50 ఏళ్ల వయస్సుగల వృద్ధుడి మృతదేహాన్ని నేతాజీ నగర్ పోలీసులు స్వాధీనపరచుకుని శవపరీక్ష నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు ఎవరైనా ఉంటే నేతాజీనగర్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఫసల్‌బీమా పరిహారం ఇవ్వండి



మాట్లాడుతున్న నరసింహా నాయక్

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకం కింద రైతులకు పరిహారం అందించాలని కర్ణాటక రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు 2023–24లో రాష్ట్ర ప్రభుత్వం కరువు ప్రాంతంగా ప్రకటించిందన్నారు. రైతులకు ఫసల్‌బీమా పథకం కింద పరిహారం అందించాలన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు రోగులకు సరైన సేవలు అందించడం లేదని ఆయన ఆరోపించారు.

మంత్రి ఘెరావ్



జిల్లాధికారి కార్యాలయం ముందు బైటాయించిన దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్ర వైద్యవిద్యా శాఖా మంత్రి శరణు ప్రకాష్ పాటిల్‌ను ఆందోళనకారులు అడ్డగించారు. మంగళవారం రాయచూరుకు వచ్చిన మంత్రిని జిల్లాధికారి కార్యాలయం వద్ద సమస్యలపై వినతిపత్రాలను అందుకోకుండా వెళ్లిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న శరణు ప్రకాష్ పాటిల్ జనవరి 26న జిల్లాకు వచ్చినా ఎన్నికల సమయంలో రాయచూరుకు రాకుండా ప్రజల కష్టాలను పట్టించుకోకుండా ఉండటాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ప్రజా సమస్యలు పట్టని వారికి మంత్రి పదవులు ఎందుకు? అని ఘాటుగా విమర్శించారు.

రాజీవ్‌గాంధీ సేవలు అనన్యం



చిత్రపటానికి పూలమాల వేస్తున్న నేతలు

రాయచూరు రూరల్ : దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు అనన్యమని నగర కాంగ్రెస్ అధ్యక్షులు బసవరాజ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. అత్యంత ప్రభావశీల ప్రధానమంత్రిగా ఉండి దేశంలో విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో సామాజిక దృష్టితో అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేంత స్థాయికి వివిధ రంగాలను తీర్చిదిద్దారన్నారు. దేశ భద్రతను పటిష్ట పరిచే ప్రక్రియలో రాజీవ్‌గాంధీ చేసిన ప్రయత్నం మరువలేనిదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు చట్ట ప్రకారం రిజర్వేషన్లు, దళితులు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలకు పదవులు దక్కే వెసులుబాటు లభించిందన్నారు. రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, నాయకులు పారసమల్ సుఖాణి, శరణప్ప మేటి, అమరేగౌడ, రుద్రప్ప, మంజుల, అంజనేయ, జయంత్‌రావ్‌లున్నారు.

కోటి ఆశలతో ఖరీఫ్‌కు సన్నద్ధం



గోదాములో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు



ట్రాక్టర్ సాయంతో దుక్కి దున్నుతున్న దృశ్యం



పొలంలో పేడ ఎరువు చల్లుతున్న రైతు

- తొలకరి ముందస్తు వర్షాలతో అన్నదాతలకు ఉపశమనం
- ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉంటాయంటున్న వాతావరణ నివేదిక

సాక్షి,బళ్లారి: గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు వల్ల రైతన్నలకు పెట్టిన పెట్టుబడులు రాక లక్షలాది రూపాయలు అప్పులు పాలు కావడంతో కోలుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి.వర్షాధారిత పంటలు కూడా పూర్తిగా నష్టపోయారు. తుంగభద్ర ఆయకట్టు కింద కూడా రైతులు తీవ్రంగా నష్టపోయారు. డ్యాంలోకి తగినంత నీరు రాకపోవడంతో వరి మినహా మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా నష్టాన్ని అందించాయి. వర్షాధారిత భూముల్లో జిల్లాలో వేలాది ఎకరాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో గత ఏడాది రైతన్నలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో ఈ ఏడాదైనా ఖరీఫ్‌లో గట్టెక్కుదామని కోటి ఆశలతో రైతులు ఆశల పల్లకీలో ఊరేగుతున్న నేపథ్యంలో వరుణుడు కనికరించాడు. మే రెండో వారం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి.

ఊపందుకున్న వర్షాలు

జూన్ నెలలో తొలకరి పలకరిస్తుందని ఊహిస్తున్న నేపథ్యంలో మే నెలలోనే వరుణుడు కరుణించడంతో వర్షాలు ఊపందుకున్నాయి. ఆది, సోమ, మంగళవారాల్లో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. నగరంతో పాటు జిల్లాలోని అన్ని తాలూకాల్లో వర్షం పడటంతో రైతన్నలు దుక్కులు దున్నేందుకు సిద్ధం అవుతున్నారు. ముందుగానే వ్యవసాయ పనిముట్లను సిద్ధం చేసుకున్న రైతన్నలు తమ తమ పొలాల్లో ఎద్దులు, ట్రాక్టర్లతో పొలం పనుల్లో నిమగ్నమవుతున్నారు. జిల్లాలో వర్షాధారిత భూములతో పాటు తుంగభద్ర ఆయకట్టు భూములు కూడా విస్తారంగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పంట సాగు చేసేందుకు రైతన్నలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో తుంగభద్ర ఆయకట్టు పరిధిలో బళ్లారి, కంప్లి, సిరుగుప్ప తాలూకాల్లో విస్తారంగా భూములు ఉన్నాయి.

తుంగభద్ర ఆయకట్టు సిద్ధం

వర్షాధారిత భూముల్లో సజ్జలు, వేరుశనగ, రాగి, జొన్న, కంది తదితర పంటలు సాగు చేస్తుండగా, తుంగభద్ర ఆయకట్టు కింద ప్రధానంగా వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ముందుగానే వరుణుడు కనికరించడంతో రైతన్నలు పంట పొలాలు సిద్ధం చేసుకోవాలని, అన్ని రకాల విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా సిద్ధం చేశామని వ్యవసాయాధికారి తిరుమలేశ్ సాక్షికి తెలిపారు. ముంగారు ఆశాజనంగా ఉంటుందని, రైతులు ధైర్యంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు. ముందస్తు వర్షాలతో ముందుగా దుక్కులు దున్నుకునేందుకు వీలవుతుందన్నారు. దాదాపు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ దిశగా రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

మేలైన విత్తనాలనే వాడాలి

మేలైన విత్తనాలను సాగు చేసుకోవాలని, నాసిరకం విత్తనాలు కాని, మందులు కాని వాడకూడదన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల నుంచి విత్తనాలు తీసుకోవాలన్నారు. రైతు కేంద్రాల్లో రైతులకు విత్తనాలను సిద్ధం చేశామన్నారు. ఎరువులను ఆయా ప్రైవేటు గుర్తింపు పొందిన డీలర్లతో కేంద్ర ప్రభుత్వం అందజేసిన సబ్సిడీ ధరలతో అందజేస్తారన్నారు. ప్రస్తుతానికి ఇటీవల కురిసిన వర్షాలతో దుక్కులు దున్నుకునేందుకు అనువుగా ఉంటుందన్నారు. ముందుగానే దుక్కులు దున్నితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కొన్ని ప్రైవేటు కంపెనీల నుంచి మోసపూరిత మందులు, విత్తనాలను రైతులు కొనుగోలు చేసి నష్టపోకూడదన్నారు.

రద్దీగా లింక్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు



ప్రవేశద్వారం వద్ద మరుగుదొడ్డి సమీపంలో కూడా కింద కూర్చొన్న ప్రయాణికులు



అడుగు తీసి అడుగేయడానికి కూడా దారి లేని విధంగా బోగీలో కింద కూర్చొన్న ప్రయాణికులు

- రిజర్వ్‌డ్ బెర్త్‌లను ఆక్రమించుకుంటున్న వైనం
- టికెట్ రిజర్వ్ చేసుకున్న ప్రయాణికుల పాట్లు

రాయచూరు రూరల్: రాయచూరులో సోమవారం రాత్రి రైలు ప్రయాణికులు లింక్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నానా పాట్లు పడ్డారు. రాయచూరు మీదుగా బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకున్న బోగీల్లోని బెర్త్‌ల్లో కూడా సాధారణ ప్రయాణికులు కూర్చోవడంతో రిజర్వేషన్ పొందిన ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు. కలబుర్గి, వాడి, యాదగిరి, సైదాపుర, రాయచూరు, మంత్రాలయం, ఆదోనిల నుంచి బెంగళూరుకు వ్యవసాయ, కూలీ కార్మికులు జీవనోపాధి పనుల కోసం వెళ్లే వారు అధికం కావడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. రిజర్వ్‌డ్ సీట్లలో కూడా సాధారణ ప్రయాణికులు ఎక్కి ఎక్కడపడితే అక్కడ కూర్చొన్నారు. ఈ నేపథ్యంలో లింక్, ఉద్యాన, బసవ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు జనరల్ బోగీలను అమర్చాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రికి, రాయచూరు లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్‌లకు పలువురు విన్నవిస్తున్నారు.

పారిశ్రామిక విధానాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి

బళ్లారిఅర్బన్: కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా వాణిజ్య, పరిశ్రమల యూనిట్ల ఆస్తి పన్నులు, ఏపీఎంసీ సెస్, ప్రత్యేక పారిశ్రామిక విధివిధానాలు తదితర అంశాల గురించి ప్రభుత్వంతో నిరంతరంగా చర్చించడానికి ఏడుగురు సభ్యుల ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. రాయచూరు జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ మీటింగ్ హాల్‌లో జరిగిన కళ్యాణ కర్ణాటక ప్రాంత చాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థల రెండో సమావేశంలో ఈ విషయంపై నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు బళ్లారి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు యశ్వంతరాజ్ నాగిరెడ్డి కమిటీ అధ్యక్షులుగా, రామచంద్ర ప్రభు, మస్కి నాగరాజ్, వెంకటరెడ్డి, అశోక్‌స్వామి హేరూరు, దీపక్ గాళ, అశ్విన్ కోతంబరిలు కమిటీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ చట్టపరమైన పోరాటం గురించి తీర్మానం చేసే అధికారాన్ని కలిగి ఉంది. ఈ మేరకు సదరు కమిటీ అధ్యక్షుడు యశ్వంతరాజ్ నాగిరెడ్డి ఆ వివరాలు మీడియాకు తెలియజేశారు. కాగా బళ్లారిలో జరిగే కమిటీ సమావేశ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. రాయచూరులో జరిగిన తృతీయ అంతర్ జిల్లా వాణిజ్య, పరిశ్రమల సంస్థ ప్రతినిధుల సమావేశంలో బీదర్, కలబుర్గి, రాయచూరు, యాదగిరి, బళ్లారి, విజయనగర, కొప్పళ, జిల్లాల వాణిజ్య, పరిశ్రమల సంస్థ అధ్యక్షులు, సభ్యులతో పాటు అదనంగా రాయచూరు రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా పాల్గొన్నారని ఆయన వివరించారు.

భారీగా గంజాయి స్వాధీనం

- ఇద్దరు యువకుల అరెస్ట్



గంజాయి స్వాధీనంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బళ్లారిఅర్బన్: నగరంలోని కౌల్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకొన్న పోలీసులు వారి వద్ద నుంచి భారీగా సుమారు 55 కేజీల గంజాయిని స్వాధీనపరచుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులను ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆదోని తాలూకా సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన బోయ చంద్ర, రవిలుగా గుర్తించారు. వారి నుంచి స్వాధీనపరచుకున్న గంజాయిని బళ్లారి పోలీసులు రెండు వాహనాల్లో స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

భారీ వర్షం..రైతన్నకు హర్షం



రోడ్డుపై వర్షపు నీటిలో వెళుతున్న విద్యార్థినులు



హగరి సమీపంలో రోడ్డు వంతెనపై నిలిచిన వాన నీరు

బళ్లారిఅర్బన్: నగరంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు గంట పాటు భారీ వర్షం కురవడంతో రోడ్లపై నీరు ప్రవహించి లోతట్టు ప్రాంతాల్లో నిల్వ చేరింది. ఈ వర్షంతో రైతన్నలకు ఊరట కలిగింది. పంట పొలాల్లోకి భారీగా నీరు చేరడంతో ఖరీఫ్ విత్తన సాగుకు పొలాలను పదును చేసుకునేందుకు ఎంతో అనుకూలం అయిందని రైతులు పేర్కొన్నారు.

సమర్థుడికే పట్టం కట్టండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి తదితరులు

సాక్షి,బళ్లారి: పరిషత్‌లో పట్టభద్రుల సమస్యలను ప్రస్తావించి పరిష్కరించే వరకు పోరాటం చేసే బీజేపీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం నగరంలోని రావ్‌బహదూర్ మహాబలేశ్వరప్ప ఇంజినీరింగ్ కళాశాలలో ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్ తరఫున పట్టభద్రులను ఉద్దేశించి ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల 3వ తేదీన జరిగే విధానపరిషత్ ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి తమ ఓటును సమర్థుడైన అభ్యర్థికే వేయాలని సూచించారు. అనంతరం బీజేపీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్ మాట్లాడుతూ సేవా మనోభావం ఉన్న వారిని గెలిపించి చట్టసభలకు పంపించాలన్నారు. తాను నిస్వార్థంతో ప్రజాక్షేత్రంలో ప్రజలకు సేవ చేస్తున్నానన్నారు. గతంలోనూ గెలుపొందిన తాను అప్పట్లో నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చొరవను గుర్తుంచుకోవాలన్నారు. చట్టసభలకు ప్రజా సమస్యలపై గళం విప్పే నాయకులను గెలిపించి పంపాలని ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గ బీజేపీ కన్వీనర్, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం నగరంలోని వాజ్‌పాయ్ కాలనీలో ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి తరఫున ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కళ్యాణ కర్ణాటకలోని ఏడు జిల్లాల్లోని పట్టభద్రులు ఈసారి విజ్ఞతతో నిర్ణయం తీసుకోవాలన్నారు. బీజేపీ జిల్లాధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్ జవాన్‌కు అశ్రునివాళి



పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే హంపయ్య నాయక్

(ఇన్‌సెట్‌లో) రవికిరణ్(ఫైల్)

రాయచూరు రూరల్: చెన్నై సమీపంలోని కల్పాక్కం అణు పరిశోధన కేంద్రంలో విధులు నిర్వర్తిస్తూ ఆదివారం రాత్రి తుపాకీ పేలి మరణించిన జిల్లాలోని మాన్వి పట్టణానికి చెందిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్) జవాన్ రవికిరణ్(37) భౌతికకాయానికి ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అశ్రునివాళి ఘటించారు. కల్పాకం పరమాణు పరిశోధన కేంద్రంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న రవికిరణ్ ఆదివారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా తుపాకీ పేలి తూటా తగలడంతో కన్నుమూశారు. ఈనేపథ్యంలో పోస్టుమార్టం అనంతరం ఆయన భౌతికకాయాన్ని మంగళవారం స్వస్థలం మాన్వికి తీసుకొచ్చారు. రవికిరణ్ భౌతికకాయానికి శాసనసభ్యుడు హంపయ్య నాయక్ తదితరులు పుష్పాంజలి సమర్పించిన అనంతరం అంత్యక్రియలు నెరవేర్చారు.

పిడుగుపాటుకు గడ్డివాములు దగ్ధం



నిప్పంటుకుని కాలిపోతున్న గడ్డివాములు



మంటలను అదుపు చేస్తున్న ఫైర్‌సిబ్బంది, రైతులు

- రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం

బళ్లారిఅర్బన్: బళ్లారి–అనంతపురం రోడ్డులో ఆర్‌టీఓ చెక్‌పోస్టు ఎదురుగా గోడేహాళ్ గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి అనే రైతు మూడు గడ్డివాములను నిల్వ చేసి ఉంచగా మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం సమయంలో పిడుగు పడి గడ్డివాముకు నిప్పంటుకుంది. మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేందుకు సుమారు గంటకు పైగా ప్రయత్నించినా నిప్పంటుకొని మూడు గడ్డివాములు కాలిపోయాయి. జేసీబీ సహాయంతో కూడా ప్రయత్నించి అదనంగా ట్యాంకర్ లారీతో నీటిని తెప్పించుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సంబంధిత అధికారులు పరిశీలించగా రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు మృగ్యం

- మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడ



మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడను సన్మానిస్తున్న దృశ్యం

కోలారు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా నిబద్ధత ఉంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ప్రజల పెండింగ్ కేసుల విచారణకు ఆదేశాలు జారీ చేయాలని, పారదర్శకత పాటించాలని మాజీ ముఖ్యమంత్రి సదానందగౌడ డిమాండ్ చేశారు. విధాన పరిషత్ ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో సీబీఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసు విచారణలో ఉన్నప్పుడు అధికారంలో ఉన్నవారు ముక్తకంఠంతో మాట్లాడితే విచారణను అడ్డుకున్నట్లేనన్నారు. విచారణ దశలో సీఎం, డీసీఎం, హోంమంత్రి స్టేట్‌మెంట్ ఇస్తే దిక్కుతోచని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయన్నారు. నెలరోజుల్లో ఏడెనిమిది హత్యలు జరిగాయన్నారు. తన కుటుంబ సభ్యులపై కేసు పెట్టినా దేవెగౌడే ఒక్క మాట కూడా మాట్లాడకుండా శిక్షించాల్సిందేనని అన్నారన్నారు. ప్రజ్వల్ ఎక్కడ ఉన్నా విచారణకు కేంద్రం సహకరించడం లేదన్న ప్రశ్నకు బదులిస్తూ వెంటనే విచారణకు సహకరించాలని, లేకుంటే అనుమానాలు వస్తాయని, అతని కుటుంబం కూడా ఇబ్బంది పడుతుందన్న విషయాన్ని మర్చిపోవద్దని ప్రజ్వల్‌కు సలహానిచ్చారు. కర్ణాటకలో 20 నుంచి 24కు పైగా సీట్లలో గెలుస్తామని, కేరళలో కూడా 2 నుంచి 3 సీట్లు గెలుస్తామని ఆయన చెప్పారు.

అంజలి కుటుంబానికి చేయూత

హుబ్లీ: హతురాలు అంజలి కుటుంబ సభ్యులకు బెళగావి జిల్లా హుక్కేరి హిరేమఠం చంద్రశేఖర శివాచార్య స్వామి రూ.50 వేల చెక్‌ను మంగళవారం అందజేశారు. ఆ మఠం గురుశాంతేశ్వర జాతర మహోత్సవ శుభవేళ నిర్వహించిన శివదీక్ష కార్యక్రమంలో జంగముల జోలెలో వచ్చిన కానుకలు, నగదును అంజలి కుటుంబానికి ఇవ్వాలని స్వామి నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరశైవ ధర్మ మఠాలు కేవలం పూజలు, పునస్కారాలకు పరిమితం కాకుండా కష్టంలో ఉన్న కుటుంబానికి సాయం అందించాలన్న సంకల్పంతో ఈ మేరకు నిధిని సేకరించామన్నారు. ప్రభుత్వం తక్షణమే నేహా హిరేమఠ, అంజలి అంబిగేర హంతకులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నేహా హిరేమఠ తండ్రి నిరంజనయ్య కూడా పాల్గొన్నారు.

మరో అధికారిపై సస్పెన్షన్ వేటు

హుబ్లీ: అంజలి అంబిగేర హత్య కేసులో ఉదాసీనంగా వ్యవహరించినందుకు మరో అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. హుబ్లీ ధార్వాడ ఏసీపీ విజయ్‌కుమార్ తళవారను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలను ఇచ్చింది. దీంతో ఇంతవరకు డీసీపీ, ఏసీపీతో పాటు నలుగురు సస్పెండ్‌కు గురయ్యారు. అంజలి అంబిగేర, నేహా హిరేమఠ కేసులకు సంబంధించి దక్షిణ ఉప విభాగంలో జరిగిన వివిధ కేసుల విధుల నిర్వహణ లోపం ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలను వెల్లడించిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ జీ.పరమేశ్వర్ హుబ్లీకి వచ్చి ఆ రెండు కేసుల్లో ఇద్దరు యువతుల నివాసాలకు వెళ్లి ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ తర్వాత విలేకరుల సమావేశం నిర్వహించి మరో అధికారి సస్పెండ్‌కు ఆదేశాలు వెల్లడించడం గమనార్హం.

నేడు ముక్తిముని శివాచార్య వర్ధంతి

బళ్లారి రూరల్ : జగద్గురు శివాచార్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నగర శివారులోని అల్లీపుర శివాచార్యుల ఆశ్రమంలో బుధవారం వీరగంగాధర ముక్తిముని శివాచార్య మహాముని తృతీయ ఏడాది పుణ్యారాధన జరుగనున్నట్లు ట్రస్ట్ ప్రముఖులు తెలిపారు. మహోత్సవంలో భాగంగా మహాముని శివాచార్యుల ప్రతిమకు కుంభాభిషేకం, ఆశ్రమం నుంచి అల్లీపురం వరకు పల్లకీ సేవ, పూజలు, ఆరాధనలు, అర్చనలు, నామార్చనలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ముత్తైదువులకు ఒడి బియ్యం నింపే కార్యక్రమం, అనంతరం భక్తులకు అన్నసంతర్పణ జరుగనున్నాయి. మహోత్సవంలో బళ్లారి, కొప్పళ, రాయచూరుతో పాటు సరిహద్దు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొననున్నట్లు తెలిపారు.

జూన్ 3న మద్యం అమ్మకాలు నిషేధం



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్, జిల్లాధికారి దివాకర్

హొసపేటె: కర్ణాటక ఈశాన్య గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జూన్ 3న విజయనగర జిల్లాలో మద్యం అమ్మకాలు, వినియోగాన్ని నిషేధిస్తూ జిల్లా మేజిస్ట్రేట్, జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సంఘం సూచన మేరకు కలబుర్గి డివిజన్ రీజనల్ కమిషనర్ ఆరోజును డ్రైడేగా ప్రకటిస్తూ ఆదేశాలిచ్చారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నియోజకవర్గాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఆ ప్రకారం పోలింగ్ శాంతియుతంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా నిర్వహించడం కోసం, శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఆరోజు ఉదయం 4 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు విజయనగర జిల్లా పరిధిలో అన్ని రకాల మద్యం అమ్మకాలు, నిల్వ, వినియోగం చేయరాదని సూచించారు.

కుండపోత వర్షం.. భారీగా నష్టం



రోడ్డుపై భారీగా నిలిచిన వాన నీరు

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన కుండపోత వర్షానికి భారీగా నష్టం వాటిల్లింది. తాలూకా సరిహద్దు గ్రామమైన టి.కల్లహళ్లి గొల్లరహట్టిలో 8 గొర్రెలు పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాయి. అలాగే కానాహొసహళ్లి గ్రామం ఎస్.అనుదాపూర్ ప్రాంతంలో నివాసముంటున్న కాటమ్మ బాలప్ప, కురిహట్టి గ్రామంలో ఉన్న హెచ్.బసవరాజు, అమలమాన తిరుమలేష్‌లకు చెందిన ఇళ్లు పాక్షికంగా కూలి పోయాయి. రెవెన్యూ అధికారులు సందర్శించి పరిశీలించారు. తాలూకాలోని పూజారహళ్లి, కన్నబోరయ్యనహట్టిల మధ్య ప్రవహించే వాగులో వర్షం నీరు పొంగిప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ముగ్గురు క్రికెట్ బుక్కీల అరెస్టు

కోలారు: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొన్న ముగ్గురు బుక్కీలను కోలారు నగర పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని షహీన్‌షా నగర్‌కు చెందిన ఖదీర్ పాషా, వసీం బేగ్, ముజాహిద్ పాషా పోలీసులు అరెస్టు చేసిన నిందితులు. వారి వద్ద నుంచి రూ.4600 నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఎం.నారాయణ, ఏఎస్పీలు సీఆర్ రవిశంకర్, జగదీష్, డీఎస్పీ హెచ్‌ఎం నాగేష్ మార్గదర్శనంలో నగర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సదానంద తమ సిబ్బందితో కార్యాచరణ జరిపి క్రికెట్ బుక్కీలను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకున్నారు.